
'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 93

మంగళవారం 24-6-2025



విజయంపై గురి..
రాహుల్, పంత్ సెంచరీలు.
ఇంగ్లండ్ లక్ష్యం 371 పరుగులు - 14లో



ఆన్‌లైన్ ఫార్మసీలకు చెక్
నిబంధనలను కఠినతరం చేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం - 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

ఏవీ.. డ్రైవర్ లేకుండానే!



అమెరికాలోని ఆస్టిన్ నగర వీధుల్లో ఒక ఎర్ర కారు.. దానిమీద 'రోబో ట్యాక్సీ' అని రాసి ఉంది. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ లేదా డ్రైవర్ రహిత కారు. ప్రపంచ ప్రసిద్ధ టీస్లా కంపెనీ ఈ రోబో ట్యాక్సీ సేవలను ఆదివారం ప్రారంభించింది.

- వివరాలు 2లో

ప్రతిపక్షాల నగదు రవాణాపైనా దృష్టి



ఎస్ఐబీ కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో సిట్ అధికారులు మరిన్ని కీలక విషయాలు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభాకర్‌రావు అండ్ టీమ్ ప్రతిపక్షాలకు చెందిన నగదు రవాణా పైనా దృష్టి పెట్టింది.

- వివరాలు 2లో

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్!



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు మార్గం సుగమమైంది. మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు ఉన్నత విద్యా మండలి సన్నాహాలు చేస్తోంది. షెడ్యూల్ విడుదలకు నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇంజనీరింగ్ ఫీజులపై ఇప్పటికీ స్పష్టత రాలేదు.

- వివరాలు 16లో

2047కి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ

ఇదీ మా 'విజన్'

తెలంగాణ రైజింగ్ పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం

- డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణ
- రూపకల్పన, ప్రణాళికల తయారీకి జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో త్వరలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు
- నాలెడ్జ్ పార్ట్‌నర్లుగా నీతి అయోగ్, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్
- విజన్ రూపకల్పనలో అన్ని ప్రభుత్వ శాఖలకు భాగస్వామ్యం
- మంత్రివర్గ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌కు ఓకే
- 'బనకచర్ల'పై చట్టపరంగా, న్యాయపరంగా పోరాటం చేయాలని తీర్మానించిన మంత్రివర్గం
- కాళేశ్వరం కమిషన్‌కు అప్పటి కేబినెట్ భేటీల మినిట్స్ ఇవ్వాలని నిర్ణయం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సుదీర్ఘ భేటీ



మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ' డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఈ మేరకు విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయనుంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఉండనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3.40 గంటల నుంచి

మిగతా 2వ పేజీలో ▶



ఖతార్‌లోని యూఎస్ ఎయిర్‌బేస్‌పైకి దూసుకెళ్తున్న ఇరాన్ క్షిపణి

అమెరికాపై ఇరాన్ ప్రతీకారం

ఖతార్‌లోని అమెరికా స్థావరంపై బాలిస్టిక్ క్షిపణి దాడులు


కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని యూఎస్ బేస్‌లపైనా..

ఆపరేషన్ బేషరత్ ఫతాహ్ పేరిట మిస్సైళ్లతో మెరుపుదాడి

- వైట్‌హౌస్ సిచ్యుయేషన్ రూమ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న ట్రంప్
- ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ దాడుల పర్వం కొనసాగింపు
- 6 ఇరాన్ సైనిక విమానాశ్రయాలపై ఇజ్రాయెల్ బాంబుల వాన
- ఉద్రిక్తతలు తగ్గేందుకు కృషి చేస్తానంటూ ఇరాన్‌కు పుతిన్ భరోసా
- ఇరాన్‌ను గొప్పగా మార్చలేని ప్రస్తుత ప్రభుత్వం అవసరమా? అని ప్రశ్నించిన ట్రంప్ - 6లో

మార్కెట్‌ను వెంటాడుతున్న యుద్ధం
సెన్సెక్స్ 511 పాయింట్లు డౌన్.. నిఫ్టీకి 141 పాయింట్లు నష్టం 15లో

స్థానిక ఎన్నికలెప్పుడు నిర్వహిస్తారు?



రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నిర్వహిస్తామన్నారు కదా?
- చర్యలెందుకు తీసుకోలేదన్న ఉన్నత న్యాయస్థానం
- రిజర్వేషన్ల ఖరారుకు మరో నెల పడుతుందన్న ఏఏజీ
- ఆ తర్వాత 60 రోజులు సమయం కావాలి: ఎస్ఈసీ
- తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి, ఎందుకు చర్యలు చేపట్టలేదని అడిగింది. దీనిపై స్పష్టత ఇచ్చేందుకు 25 రోజులు సమయం కావాలని సర్కార్ బదులిచ్చింది. అక్కడి నుంచి తమకు దాదాపు రెండు నెలల సమయం పడుతుందని ఎస్ఈసీ పేర్కొంది. అనంతరం పిటిషనపై తీర్పును న్యాయస్థానం రిజర్వు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ

మిగతా 5వ పేజీలో ▶

రైతు భరోసా 'సంబురాలు'

- నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో కార్యక్రమాలు
- సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద విజయోత్సవ సభ
- హాజరుకానున్న సీఎం రేవంత్.. ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తుమ్మల
- నేటితో భరోసా పూర్తి.. సాయంత్రం 4 గంటలకు సంబురాలు చేయండి: డిప్యూటీ సీఎం భట్టి
- ప్రధాన కూడళ్లలో రైతులతో కలిసి సంబురాలు నిర్వహించాలి: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

- వివరాలు 3లో





సాగు అంతంతే

- గత ఏడాదితో పోలిస్తే.. ప్రస్తుతానికి తగ్గిన వివిధ పంటల సాగు
- తేలికపాటి వానల కోసం రైతుల ఎదురుచూపు
- నిరుడు ఈపాటికి 20 లక్షల ఎకరాల్లో పత్తి.. ఇప్పుడు 16 లక్షల్లోపే..
- మక్క, జొన్న, సోయాబీన్ పంటలు కూడా అదే దారిలో...
- వరి కేవలం 33 వేల ఎకరాల్లోనే సాగు

సాక్షి, హైదరాబాద్: వానాకాలం సాగు ఇంకా పుంజుకోలేదు. వాస్తవానికి మే నెలలోనే ముందస్తు నైరుతి రుతుపవనాల రాకతో మురిసిపోయిన రైతులు.. అప్పుడు కురిసిన వర్షాలకు పత్తి, మక్కలు, జొన్నలు సాగు చేశారు. ఆపై వరుణుడి జాడ లేకపోవడంతో కొన్నిచోట్ల విత్తనాలు మొలకెత్తక, మరికొన్ని చోట్ల ఎండిపోయాయి. రెండురోజులుగా

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఏవీ.. డ్రైవర్ లేకుండానే!

స్వయం చోదక వాహనాల పరుగులు



అమెరికాలోని ఆస్టిన్ నగర వీధుల్లో ఒక ఎర్ర కారు.. దాని మీద 'రోబో ట్యాక్సీ' అని రాసి ఉంది. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ లేదా డ్రైవర్ రహిత కారు. ప్రపంచ ప్రసిద్ధ టెస్లా కంపెనీ ఈ రోబో ట్యాక్సీ సేవలను ఆదివారం ప్రారంభించింది. దీంతో ఇప్పుడు స్వయం చోదక వాహనాల (అటానమస్ వెహికల్ -ఏవీ) మీద చర్చ మరోసారి మొదలైంది. యూఎస్ఏలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని బీజింగ్ నగరంలో ఇప్పటికే ఏవీలు పరుగులు తీస్తున్నాయి. సరుకు రవాణా కోసం అటానమస్ ట్రక్స్ దూసుకెళుతున్నాయి. ప్రపంచంలో వాహనాల తయారీలో నాలుగో స్థానంలో ఉన్న భారత్‌లో.. ఏవీలు సాకారం అయ్యే అవకాశాలు ఎప్పుడెప్పుడా అని వాహన ప్రియులు ఎదురుచూస్తున్నారు. అసలు ఏవీలు ఎక్కడెక్కడ ఏయే స్థాయిల్లో ఉన్నాయి.. ఏవీ ఎలా పనిచేస్తుంది.. డ్రైవర్ లేకుండా ఇది ఎలా నడుస్తుంది?

సాక్షి, స్పెషల్ డెస్క్

- రోబో ట్యాక్సీని ప్రారంభించిన టెస్లా
- భారత్‌లో ప్రారంభ దశలో ఏవీల అభివృద్ధి
- యూఎస్, చైనాలో ఇప్పటికే పరుగులు
- దారి చూపుతూ, దిశానిర్దేశం చేస్తున్న ఏఐ

అమెరికాలోని ఆస్టిన్ నగరంలో టెస్లా కంపెనీకి చెందిన రోబో ట్యాక్సీలను లాంఛనంగా ప్రారంభించారు. దశాబ్దాల కఠోర శ్రమకు ఇది ఫలితమని, అయితే ఇది పైలట్ ప్రాజెక్టేనని టెస్లా కంపెనీ అధినేత ఎలన్ మస్క్ తెలిపారు. ప్రస్తుతం ట్రిప్పునకు 4.20 డాలర్లు (సుమారు రూ.364) వసూలు చేస్తున్నారు. ఈ క్యాబ్స్ పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో మస్క్ ఇంకా ప్రకటించలేదు. మనదేశం విషయానికొస్తే.. టాటా మోటార్స్ ఇటీవల వైయు అనే పూర్తి స్థాయి అటానమస్ వాణిజ్య వాహనానికి పేటెంట్ పొందింది. దీనికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది వస్తువులు, ప్రయాణికుల రవాణాకు అనుకూలమైనది.

విదేశాల్లో ఇలా..

సాధారణ క్యాబ్స్‌తో పోలిస్తే పలు దేశాల్లో అటానమస్ వెహికల్స్ ఆధారిత క్యాబ్స్ సగం చార్జీలనే వసూలు చేస్తున్నాయి. ఒక్క యూఎస్‌లోనే ఒక ట్రిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు ఉన్నాయని ఊబర్ సీఈవో దారా కాస్రోసాహీ ఇటీవల వెల్లడించారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు చెందిన వేమో ఇప్పటికే యూఎస్, చైనాలో అటానమస్ వెహికల్స్‌తో రైడ్ హెయిలింగ్ సేవలు ఆఫర్ చేస్తోంది. యూఎస్‌కు చెందిన పోనీ.ఏఐ అటానమస్ క్యాబ్స్ సర్వీసులు అందిస్తోంది. అలాగే అటానమస్ ట్రక్స్ ద్వారా సరుకు రవాణా రంగంలోనూ ఉంది. భారత్‌కు చెందిన గౌతమ్ నారంగ్, అర్జున్ నారంగ్, అపేక్ష కుమావత్ కలిసి అమెరికాలో ఏర్పాటుచేసిన 'గతిక్.ఏఐ' అనే కంపెనీ అటానమస్ ట్రక్స్ ద్వారా వాల్‌మార్ట్ వంటి కంపెనీలకు సేవలందిస్తోంది. న్యూరో అనే కంపెనీ చిన్న అటానమస్ వ్యాన్స్ ద్వారా యూఎస్‌లో సరుకు రవాణా చేస్తోంది. చైనాలో డీప్‌రూట్.ఏఐ ఈ రంగంలో ఉంది. వీరైడ్, వాబి, మోషనల్, అరోరా తదితర కంపెనీలు సైతం అటానమస్ వెహికల్స్‌తో పోటీపడుతున్నాయి.

5 లెవెల్స్‌లో..

వాహనాల నియంత్రణ, నిర్వహణ విషయంలో ఆటో మేషన్ స్థాయిని బట్టి లెవెల్-0 నుంచి పూర్తి అటానమస్ లెవెల్-5 వరకు.. ఏవీలను 6 స్థాయిలుగా వర్గీకరించారు. లెవెల్ – 0 అంటే పూర్తిగా డ్రైవర్‌పైనే ఆధారపడి ఉంటుంది. లెవెల్ – 1లో అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ ఉంటుంది. ముందున్న వాహనం వేగాన్ని బట్టి ఏవీ దానంతట అదే వేగాన్ని నియంత్రించుకుంటుంది. లెవెల్ – 2లో సాంకేతికత స్టీరింగ్‌ను, వేగాన్ని నియంత్రిస్తుంది. లెవెల్ 1, 2లలో కచ్చితంగా డ్రైవర్ ఉండాల్సిందే. లెవెల్ -3లో ప్రత్యేక పరిస్థితుల్లో వాహనం దానంతట అదే నియంత్రించుకుంటుంది. కానీ, కొన్ని సందర్భాల్లో కారు ఇచ్చే అలర్ట్స్‌ను బట్టి డ్రైవర్ స్టీరింగ్‌ను తన చేతుల్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. లెవెల్ -4 అంటే.. చాలా అరుదుగా తప్ప, దాదాపుగా డ్రైవర్ అవసరం లేకుండానే కారు నడుస్తుంది. వీటిని ఎక్కడ పడితే అక్కడ నడపడం సాధ్యం కాదు. ప్రత్యేకమైన ప్రాంతంలోనే (జియో ఫెన్సింగ్ సాయంతో) నడుపుతారు. అంటే ఆ ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలే ఫీడ్ చేస్తారన్నమాట. ఆ పరిస్థితుల్లోనే కారు నడవగలదు. లెవెల్ – 5.. అసలు డ్రైవర్ అవసరమే ఉండదు. పూర్తిగా కారు తనంతట తానే నడుస్తుంది. ప్రపంచంలో లెవెల్ – 5 స్థాయి వాహనాలను ఎవరూ తయారుచేయలేదు.

సెన్సార్స్, కెమెరాలతో..


అటానమస్ వెహికల్స్ వాటి పరిసరాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రూట్ మ్యాప్‌ను నిర్మించడానికి, నవీకరించడానికి పలు సెన్సార్లపై ఆధారపడతాయి.

- రాడార్ సెన్సార్లు సమీపంలోని వాహనాలను ట్రాక్ చేస్తాయి. కెమెరాలు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గుర్తిస్తాయి. అలాగే రహదారి సంకేతాలను అర్థం చేసుకుంటాయి. పాదచారులు, ఇతర వాహనాల కదలికలను గమనిస్తుంటాయి.
- లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సాంకేతికత దూరాలను కొలవడానికి; లేన్ గుర్తులను, రహదారి సరిహద్దులను గుర్తించడానికి లేజర్ పల్స్‌లను ఉపయోగిస్తుంది. వాహనం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాన్ని అధిక రిజొల్యూషన్ 3డీ మ్యాప్‌గా సృష్టిస్తుంది. అడ్డంకులు, పాదచారులు, ఇతర వాహనాలను గుర్తించడంలో సహాయపడుతుంది.
- వాహనాలను నిలిపేందుకు నిర్దేశించిన గీతలను, చుట్టూ ఉన్న కార్లను గుర్తించేందుకు చక్రాల దగ్గర పొందుపరిచిన అల్ట్రాసోనిక్ సెన్సార్లు సహాయపడతాయి.
- ట్రాఫిక్ సంకేతాలు, పాదచారుల సమాచారాన్ని ఇతర కెమెరాలు అందిస్తాయి.
ఏవీల్లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్), ఇనెర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) కూడా ఉన్నాయి. లోకేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని జీపీఎస్ అందిస్తుంది. వాహన వేగం, దిశలో వచ్చే మార్పును ఐఎంయూ ట్రాక్ చేస్తుంది.
- సెన్సార్స్ అందించిన డేటాను అత్యంత సామర్థ్యం గల సాఫ్ట్‌వేర్ ప్రాసెస్ చేస్తుంది. ఇది సరైన మార్గాన్ని నిర్ణయించడంతోపాటు వాహన వేగం, దిశ, బ్రేకింగ్, స్టీరింగ్‌ను నియంత్రిస్తుంది. ముందే పొందుపరిచిన ట్రాఫిక్ నియమాలు, అడ్డంకులను గుర్తించే విధానాలు, పరిసరాల అధ్యయనం, మనుషులు, యంత్రాల గుర్తింపు ద్వారా ఈ సాంకేతిక వ్యవస్థ సురక్షిత, సమర్థవంత ప్రయాణాన్ని అందిస్తుంది.



మన దేశంలో ప్రారంభ దశలోనే..

అటానమస్ వెహికల్స్ రాకతో ఆటోమొబైల్ పరిశ్రమలో సాంకేతికంగా పెద్ద ముందడుగు పడిందని చెప్పవచ్చు. భారత్‌లో అటానమస్ వెహికల్స్ అభివృద్ధి ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పాలి. పూర్తిగా అటానమస్ అంటే డ్రైవర్ అవసరమే లేకుండా నడిచే వాహనాలు (లెవెల్-5) ఇంకా వాణిజ్యపరంగా అందుబాటులో లేనప్పటికీ.. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఏడీఏఎస్) అభివృద్ధి, అటానమస్ దిశగా సాంకేతికతల పరీక్షల్లో పురోగతి ఉంది. భారత్‌లో మైనస్ జీరో, స్వాయత్ రోబోస్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా ఈలిక్సీ, ఫ్లక్స్ ఆటో, ఫ్లో మొబిలిటీ తదితర కంపెనీలు ఏవీల అభివృద్ధిపై దృష్టి సారించాయి. ఇదిలా ఉంటే.. డ్రైవర్‌లెస్ కార్లను భారత్‌లో అనుమతించేది లేదని పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెబుతూ వచ్చారు.



క్లుప్తంగా...

ఇరాన్, ఇజ్రాయెల్‌ల నుంచి సురక్షితంగా భారత్‌కు

ఆరుగురు తెలంగాణ వాసుల రాక

సాక్షి, న్యూఢిల్లీ: ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ రెండు దేశాల నుంచి ఆరుగురు తెలంగాణ వాసులు సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. వారికి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆశ్రయం కల్పించినట్లు సోమవారం తెలంగాణ భవన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు ఇరాన్ నుంచి, ఇద్దరు ఇజ్రాయెల్ నుంచి ఆదివారం అర్ధరాత్రి ఢిల్లీకి చేరుకోగా.. సోమవారం వారిని హైదరాబాద్‌కు పంపించామన్నారు. తెలంగాణకు చెందిన మరో ఏడుగురు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్‌లోని అమ్మాన్‌కు సురక్షితంగా చేరుకున్నారని, వారిని ఢిల్లీకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతోందని వారు తెలిపారు.

పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలనలో తెలంగాణ పోలీస్ 'వెరీఫాస్ట్'

నేడు ఢిల్లీలో అవార్డు అందుకోనున్న ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలనలో తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచారు. పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలన కోసం వినియోగిస్తున్న 'వెరీఫాస్ట్'యాప్‌తో వేగంగా స్పందిస్తున్నారు. రోజుకు సరాసరిన 2 వేలకుపైగా పాస్‌పోర్టు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సరాసరిన ఏడాదికి ఎనిమిది లక్షల దరఖాస్తులను పరిశీలించి సంబంధిత పాస్‌పోర్టు జారీ అధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. వెరీఫాస్ట్ యాప్‌తో అత్యంత వేగంగా పాస్‌పోర్ట్ ధ్రువీకరణను పూర్తి చేస్తూ, తక్కువగా మూడు పని దినాల్లోనే ఎక్కువశాతం కేసులను పరిష్కరిస్తున్నారు. ఇంటెలిజెన్స్ డేటా ఆధారంగా మోసపూరిత దరఖాస్తులను, పాత నేరస్తులను గుర్తిస్తున్నారు. పాస్‌పోర్టు దరఖాస్తుల ప్రక్రియలో జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో నిలవడంతో కేంద్ర ప్రభుత్వ ఉత్తమ సేవా ధ్రువీకరణ అవార్డుకు తెలంగాణ ఎంపికైంది. పాస్‌పోర్టు సేవా దివస్ సందర్భంగా మంగళవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ చేతుల మీదుగా తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి ఈ ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు.

ఇదీ మా 'విజన్'

▶ మొదటి పేజీ తరువాయి

రాత్రి 9.20 గంటల వరకు సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యం

విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని శాఖలు, అన్ని విభాగాలు భాగస్వామ్యం పంచుకునేలా చూడాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆశిస్తున్న వృద్ధి లక్ష్యంగా ఎంచుకునే కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి ఆయోగ్‌తో పాటు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి. కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధితో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పదో వంతు సంపదను అందించే రాష్ట్రంగా తెలంగాణ వృద్ధి సాధించాలనే భారీ లక్ష్యంతో ఈ విజన్‌కు రూపకల్పన చేయాలని అధికారులకు కేబినెట్ దిశా నిర్దేశం చేసింది.

రైతుల సమక్షంలో సంబరాలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాను విజయవంతంగా, రికార్డు వేగంతో అందించింది. సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన రూ.400 కోట్లను మంగళవారం జమ చేయనుంది. కోటీ 49 లక్షల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. అతి తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని దాదాపు 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించింది. ఈ ఘనత సాధించిన శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

సచివాలయం ఎదురుగా రాజీవ్ విగ్రహం వద్ద..

మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. సీఎం రేవంత్‌తో పాటు మంత్రివర్గం ఈ కార్యక్రమంలో పాల్గొననుంది. ఇక అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, సంబరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆదేశించింది.

ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం

రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ 9న ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌కు ఓకే

హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ ప్రతిపాదనలకు కేబినెట్ తుది ఆమోదం తెలిపింది. అంతకుముందు ఆర్ అండ్ బీ విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను పరిశీలించింది. అనంతరం చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కి.మీ.ల పొడవు ఉండే ఈ అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపింది.

జూలై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం

తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏపీ తలపెట్టిన గోదావరి -బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చట్టపరంగా, న్యాయపరంగా అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ఒక చుక్క గోదావరి జలాలను కూడా నష్టపోకుండా చిత్తశుద్ధితో పోరాడాలని నిర్ణయించింది. 2016లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 400 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించగా, దాని ఆధారంగానే బనకచర్ల ప్రాజెక్టును ఏపీ రూపొందించిందని మంత్రివర్గం పేర్కొంది. ఈ విషయాన్ని మరిచిపోయిన బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై అబద్ధాలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారంటూ ధ్వజమెత్తింది. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను సిద్ధంచేసేందుకు జూలై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం నిర్వహించనుంది. ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది.

విభజన వివాదాలపై మళ్లీ చర్చలు

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయిన అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీల ఆధ్వర్యంలో మళ్లీ సమావేశాలను పునరుద్ధరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీకి లేఖ రాయనుంది.

తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం

రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడా ప్రమాణాలను పెంపొందించి 2036 ఒలంపిక్స్‌లో తెలంగాణ సత్తాను చాటాలనే ఉద్దేశంతో రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది.

మంత్రివర్గ నిర్ణయాలపై త్రైమాసిక సమీక్ష

పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతినెలా రెండు సార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించనుంది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో పురోగతిని సమీక్షించడానికి త్రైమాసిక సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

మున్సిపాలిటీలుగా ఇంద్రేశం, జిన్నారం

సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారంను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నోరి దత్తాత్రేయుడు

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ క్యాన్సర్ చికిత్స నిపుణులు నోరి దత్తాత్రేయుడిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి అభివృద్ధితో పాటు, క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఆయన సేవలను వాడుకోనుంది. ఎంఎన్‌జే ఆస్పత్రి అప్‌గ్రేడేషన్, సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపింది.

బాసర ట్రిపుల్ ఐటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కాలేజీ

ఈ విద్యా సంవత్సరంలో బాసర ట్రిపుల్ ఐటీ కింద మహబూబ్‌నగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి ఏటా 180 మంది విద్యార్థులు చొప్పున 6 ఏళ్లలో 1080 మందికి అడ్మిషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతమైన హుస్నాబాద్‌లో శాతవాహన వర్సిటీ కింద ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి 240 మందికి అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించింది. శాతవాహన వర్సిటీలో ఈ ఏడాది నుంచి చెరో 60 సీట్లతో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించింది.

'స్థానిక'ఎన్నికలపై చర్చ లేదు!

స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్‌లో ఎలాంటి చర్చ జరగలేదని తెలిసింది. ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున కోర్టు కేసు తేలిన తర్వాత మరోమారు చర్చించి నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం అభిప్రాయపడినట్లు సమాచారం.

'కాళేశ్వరం' సమాచారాన్ని కమిషన్‌కు ఇవ్వనున్న సర్కార్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా తెలియజేయాలనుకున్నా, సమాచారం ఇవ్వాలనుకున్నా ఈ నెల 30 లోగా ఇవ్వాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ రాసిన లేఖపై మంత్రివర్గం చర్చించింది. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని గడువులోగా కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించింది. సీఎస్ ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యత అప్పగించింది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు కమిషన్ ఎదుట విచారణకు హాజరైన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల రాజేందర్ వాంగ్మూలం ఇచ్చారు. నాటి మంత్రి హరీశ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బరాజ్‌ల నిర్మాణంపై నిపుణుల కమిటీ సిఫారసులను ఆమోదించిన తర్వాతే మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఈటల, హరీశ్‌రావు కమిషన్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు మంత్రివర్గ సమావేశాల్లో అలాంటి నిర్ణయాలు ఏమీ జరగలేదని రుజువు చేసేందుకు గాను వాటికి సంబంధించిన మినిట్స్ కాపీలను కమిషన్‌కు ప్రభుత్వం అందించనుంది. కాగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆ శాఖ అధికారులు కేబినెట్‌కు వివరించారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి కూడా వివరణ ఇచ్చారు.



జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలకు హాజరుకావాల్సిందిగా కోరుతూ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ అర్చకులు. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు

29న నిజామాబాద్‌కు అమిత్ షా

ఎంపీ అర్వింద్ వెల్లడి



సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఈనెల 29న నిజామాబాద్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని ఎంపీ అర్వింద్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కంఠేశ్వర్ బైపాస్‌లో డీఎస్ కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పాలిటెక్నిక్ మైదానంలో రైతు సమ్మేళన కార్యక్రమం ఉంటుందని, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని అర్వింద్ కోరారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 3 సీట్లు కూడా రావని, ఆ నలుగురిలో హరీశ్‌రావు ఒక్కడే గెలుస్తారని అర్వింద్ జోస్యం చెప్పారు. కేసీఆర్ ఎన్నికల్లో పోటీ చేయబోరని, కేటీఆర్‌ను సిరిసిల్లలో ప్రజలు ఓడిస్తారన్నారు. కాళేశ్వరంలో కేసీఆర్, లిక్కర్ స్కామ్‌లో కవిత, ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్, విద్యుత్ స్కామ్‌లో హరీశ్‌రావు ఉన్నారని, వారందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పగలు అరెస్ట్ అవుతారని ప్రకటిస్తూ, రాత్రికి డబ్బు సంచులు తీసుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు.

కేబినెట్‌లో కబుర్లతోనే కాలక్షేపం

- గత ఆరునెలల్లో ప్రజాసమస్యలపై చర్చ జరగలేదు
- కాళేశ్వరంలో అవినీతిపై సీబీఐ విచారణ ఏమైంది?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేబినెట్ సమావేశాల్లో కేవలం కబుర్లతోనే కాలయాపన చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, గడిచిన ఆరునెలల్లో పలుమార్లు మంత్రివర్గ సమావేశం నిర్వహించినప్పటికీ ప్రజా సమస్యలపై చర్చ జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ వాటి అమలు గురించి మంత్రివర్గ సమావేశంలో చర్చించకపోవడం దారుణమని అన్నారు. దీని గురించి బీజేపీ పలుమార్లు మాట్లాడిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు దిశగా కసరత్తు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు, బీసీ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మహాలక్ష్మి స్కీం కింద ప్రతి మహిళకు రూ. 2,500, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్... ఇలా అనేక అంశాలపై కేబినెట్ సమావేశాల్లో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల అమలుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాట్లాడారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని ఎందుకు పట్టించుకోవడంలేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల నగదు రవాణాపైనా దృష్టి

- ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వెలుగులోకి..
- సమాచారం టాస్క్‌ఫోర్స్‌కు అందించి దాడులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో సిట్ అధికారులు మరిన్ని కీలక విషయాలు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభాకర్‌రావు అండ్ టీమ్ ప్రతిపక్షాలకు చెందిన నగదు రవాణా పైనా దృష్టి పెట్టింది. దీనికోసం 2018 నుంచి ఫోన్ల అక్రమ ట్యాపింగ్ మొదలుపెట్టింది. ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబీకులు, సంబంధీకులు, మద్దతు ఇచ్చే వ్యాపారులతో పాటు అప్పటి అధికార పార్టీని విమర్శించేవారిపైనా ప్రభాకర్‌రావు బృందం నిఘా ఉంచింది.

ప్యారడైజ్ వద్ద రూ.70 లక్షలు స్వాధీనం

ఆ ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున భవ్య సిమెంట్ కంపెనీకి చెందిన ఆనంద్ ప్రసాద్ పోటీ చేశారు. ఆ సమయంలో ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు ఈయన సంబంధీకుల నగదు రవాణాపై నిఘా ఉంచి ఆ వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధాకిషన్‌రావుకు అందించారు. ఈయన ఆదేశాలతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు రామ్‌గోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్యారడైజ్ వద్ద రూ.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

సిద్దిపేటలో, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరుల నుంచి..


2020లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ప్రణీత్‌రావు బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావు సంబంధీకులపై నిఘా ఉంచారు. ఇలా గుర్తించిన అంశాలను రాధాకిషన్‌రావుకు చేరవేశారు. ఫలితంగానే సిద్దిపేటలో చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించే రఘునందర్‌రావు బంధువు నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.కోటి స్వాధీనం చేసుకున్నారు. 2022 అక్టోబర్ రెండో వారంలో మునుగోడు ఉప ఎన్నిక జరిగింది. అప్పట్లో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధీకులపై ప్రణీత్‌రావు సాంకేతిక నిఘా ఉంచారు. ఫలితంగా గుర్తించిన అంశాన్ని రాధాకిషన్‌రావుకు తెలిపారు. ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ బృందానికి జి.సాయికుమార్ రెడ్డి, ఎం.మహేందర్, ఎ.అనూష్‌రెడ్డి, వి.భరత్‌లు చిక్కారు. కోమటిరెడ్డి అనుచరులైన వీరి నుంచి రూ.3.5 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇలావుండగా..అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులతో పాటు నాయకులపైనా ఈ బృందం నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించినట్లు తెలిసింది.

నేడు ఈటల వాంగ్మూలం

ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ మంగళవారం సిట్‌కు వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2023 ఎన్నికల సమయంలో ఈయన ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించిన సిట్ ఆ మేరకు సమాచారం ఇచ్చింది. ఈ కేసులో సాక్షిగా హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా కోరింది. దీంతో ఆయన మంగళవారం సిట్ కార్యాలయం ఉన్న జూబ్లీహిల్స్ ఠాణాకు రానున్నారు.

అవయవ దానానికి భాగస్వామి అనుమతి అక్కర్లేదు

హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: అవయవ దానం చేయాలనుకొనే భర్త లేదా భార్యకు వారి జీవిత భాగస్వామి అనుమతి అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో అనుమతి కోసం పట్టుబట్టొద్దని ఓ కార్పొరేట్ ఆస్పత్రిని ఆదేశించింది. తండ్రికి అవయవ దానం చేసేందుకు ముందుకొచ్చిన కుమార్తెను అనుమతించాలని తేల్చిచెప్పింది. అనారోగ్యంతో ఉన్న తండ్రికి తన కాలేయంలో కొంత భాగాన్ని దానం చేసేందుకు సిద్ధపడినా భర్త అనుమతి లేనందున ఆస్పత్రి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఓ మహిళ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ నుంచి విడిపోయిన భర్త ఆమె కాలేయ దానానికి అనుమతి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. జీవిత భాగస్వామి అనుమతి కోసం పట్టుబట్టడానికి అవయవ మార్పిడి చట్టం కింద ఎటువంటి నిబంధన లేదని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి అనుమతి అవసరమంటూ ఆస్పత్రి జారీ చేసిన లేఖను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ పోలీస్ ఒలింపిక్ రన్

డీజీపీ కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వరకు పరుగు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీ (క్రీడలు) ఎం.రమేశ్ నేతృత్వం వహించారు. పోలీసు శాఖకు చెందిన అన్ని పోలీసు క్రీడా జట్లతో పాటు అంతర్జాతీయ క్రికెటర్ గొంగిడి త్రిష ఈ పరుగులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఒలింపిక్ క్రీడల స్ఫూర్తిని, ఫిట్‌నెస్, ఐక్యత పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పరుగులో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. రన్‌లో డీఎస్పీలు రామారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవంలో ఐజీ రమేశ్, క్రికెటర్ గొంగిడి త్రిష

క్లుప్తంగా...

అడవి మీదకూ బుల్డోజర్లు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలు అంటే ప్రేమ లేదని, ఆడబిడ్డలు అనే ఇంగిత జ్ఞానంకూడా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'హైదరాబాద్ మీదకే కాదు, అడవి మీదకూ బుల్డోజర్లు పంపుతూ పోడు భూముల్లో వ్యవసాయం చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీల మీద దాడి చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న ఆదివాసీల మీద అమానుష దాడులకు పాల్పడుతున్నారు. 420 హామీలను అమలు చేయలేక హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూల్చారు. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూసేకరణ పేరిట లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాల్లోకి ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపిన కాంగ్రెస్ సర్కారు పట్నం, పల్లెలను దాటుకుని అడవులు, ఆదివాసీల పైనా ప్రతాపం చూపుతోంది. ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించి నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులుపెట్టి జైలు పాలు చేస్తున్నారు. 420 హామీల అమలును పక్కన పెట్టి కూల్చే, కాల్చే పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది' అని కేటీఆర్ విమర్శించారు.

సాయంత్రంలోపు చంపేస్తాం

ఎంపీ రఘునందన్‌రావుకు మావోల పేరుతో బెదిరింపు కాల్



కీసర: బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మావోయిస్టుల పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం ఆయన దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోగల క్రాంతికీస్ స్కూల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతుండగా ఆయన ఫోన్‌కు 9121433529 74 నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆయన పీఏ వంశీ ఫోన్ ఎత్తి మాట్లాడారు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునని, రఘునందన్‌రావును ఈ రోజు సాయంత్రంలోపు చంపేస్తామని, ఇందుకోసం మధ్యప్రదేశ్‌నుంచి మావోయిస్టు దళం ఒకటి బయలుదేరిందని ఫోన్ చేసిన వ్యక్తి బెదిరించాడు. వంశీ వెంటనే ఈ విషయాన్ని రఘునందన్‌రావుకు తెలియజేశారు. అనంతరం ఆయన స్కూల్ యాజమాన్యంతో కలసి భోజనం చేస్తుండగా మరోసారి గుర్తుతెలియని వ్యక్తి అదే ఫోన్‌నంబర్ నుంచి కాల్ చేశాడు. ఈసారి రఘునందన్‌రావు ఫోన్ ఎత్తగా.. ఈ రోజు రాత్రి 12 గంటలలోపు ఆయనను చంపేస్తామని మరో మారు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆయన రాష్ట్ర డీజీపీ, మెదక్ ఎస్పీలకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి బెదిరింపులకు తాను గానీ, ఇతర బీజేపీ నేతలుగానీ భయపడరన్నారు.

విత్తనోత్పత్తి రైతులకు పరిహారం చెల్లించండి

- సీడ్ కంపెనీలకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు జరిగిన నష్టాన్ని పరిహారం రూపంలో వెంటనే చెల్లించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సీడ్ కంపెనీలకు సూచించారు. గద్వాల జిల్లాలో విత్తనోత్పత్తి చేసే రైతులను జీవోటీ పేరుతో సీడ్ కంపెనీలు మోసం చేస్తున్నాయని ఇటీవల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. దాంతో చైర్మన్ కోదండరెడ్డి స్పందించి ఈనెల 13న గద్వాల జిల్లాలో పర్యటించి వివరాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో గద్వాల రైతుల సమస్యపై సీడ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ సీడ్ కంపెనీలురైతుల కోణంలో ఆలోచించి నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. విత్తనోత్పత్తికి తెలంగాణ అనువైన ప్రాంతమని, ఇక్కడి రైతుల ద్వారా సీడ్ కంపెనీలు లాభాలు ఆర్జిస్తున్నాయని గుర్తు చేశారు. రైతులు నష్టపోతే స్పందించాల్సిన బాధ్యత కూడా సీడ్ కంపెనీలపై ఉందన్నారు. కాగా, సీడ్ కంపెనీలు నష్టపరిహారం చెల్లించేందుకు సుముఖత చూపినట్లు రైతు కమిషన్ సభ్యులు తెలిపారు.

కవితపై మంత్రి పొన్నం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- యూపీఎఫ్, జాగృతి నాయకులు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమిస్తోన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై యునైటెడ్ ఫూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు మండిపడ్డారు. మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ యూపీఎఫ్, తెలంగాణ జాగృతి వేర్వేరు వీడియో సందేశాలు విడుదల చేశారు. తెలంగాణ జాగృతి యువజన విభాగం కన్వీనర్ సంపత్ గౌడ్, నాయకుడు నరేశ్ ప్రజాపతి, యూపీఎఫ్ నాయకులు స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం కవిత ఏడాదిన్నరగా వివిధ ప్రజాస్వామిక రూపాల్లో ఉద్యమిస్తున్నారని గుర్తుచేశారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ మంత్రిగా పొన్నం ప్రభాకర్ చేసిన ప్రయత్నాలు ఏంటో చెప్పాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కవిత జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చారని చెప్పారు.

ప్రభుత్వం కన్నా పార్టీనే ప్రధానం

- గుజరాత్ మోడల్‌ను తీసుకుని తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలి
- పార్టీ బలంగా ఉంటేనే ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలం
- సంస్థాగత నిర్మాణం చాలా కీలకం... 30వ తేదీలోపు కమిటీల ఏర్పాటు పూర్తి కావాలి
- జిల్లా పరిశీలకులతో భేటీలో మీనాక్షి, మహేశ్‌గౌడ్ దిశానిర్దేశం



మహేశ్‌గౌడ్‌తో మాట్లాడుతున్న మీనాక్షి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాల్లో పార్టీ అధికారంలో ఉండటం కంటే పార్టీ బలంగా ఉండటమే ప్రధానమని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉద్ఘాటించారు. పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని, సంస్థాగత నిర్మాణం చాలా కీలకమన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ మోడల్‌ను ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం గాంధీభవన్‌లో క్షేత్రస్థాయి కమిటీల ఏర్పాటు కోసం జిల్లాల వారీగా నియమించిన పరిశీలకులతో వారు విడివిడిగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ కూడా పాల్గొన్నారు. కొన్ని కమిటీలు పెండింగ్‌లో ఉండటంతో వాటిని కూడా ఈనెల 30లోపు పూర్తి చేయాలని మీనాక్షి, మహేశ్‌గౌడ్ సూచించారు. ఈ కమిటీలు పూర్తయిన తర్వాత డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రారంభమవుతుందని, ఈ నియామకాల కోసం గుజరాత్, మధ్యప్రదేశ్ నుంచి ఏఐసీసీ పరిశీలకులు వస్తారని చెప్పినట్లు తెలిసింది. పలువురు పరిశీలకులు మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులను వివరించారు. కొన్నిచోట్ల కార్యకర్తల అసంతృప్తిని వారి దృష్టికి తెచ్చారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారితో కొన్ని నియోజకవర్గాల్లో సమస్యలున్నాయని, కొన్నిచోట్ల ఆధిపత్య పోరు, సమన్వయ లోపం ఉన్న అంశాన్ని వివరించారు.

అన్యాయం చేయం

గ్రామస్థాయి నుంచి కార్యకర్తలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పీసీసీ నియమించిన పరిశీలకులదేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చెప్పారు. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో 80 శాతం పాత కాంగ్రెస్ వారికే ఇచ్చామని, 30 ఏళ్లుగా పార్టీలో ఉన్న వారికి కూడా ప్రాధాన్యతనిచ్చామన్నారు. 2017 కంటే ముందు పార్టీలో ఉన్న వారికే పదవులు ఇవ్వాలనే ప్రాతిపదికను కూడా పరిగణనలోకి తీసుకున్నామని, కొన్ని సమీకరణలు, పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఇచ్చామని చెప్పారు. పార్టీ మరింత బలోపేతం కావాలంటే కొంత రాజీపడక తప్పదని వివరించారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అన్యాయం చేసే ప్రసక్తే లేదని, అటు ప్రభుత్వ, ఇటు పార్టీ పదవుల్లో వారికి తప్పకుండా అవకాశమిస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారం కోసం రోజూ గాంధీభవన్‌లో పార్టీ, ప్రభుత్వ ప్రతినిధులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మంత్రి, కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శుల్లో ఎవరో ఒకరు కచ్చితంగా గాంధీభవన్‌లో అందుబాటులో ఉండాలన్నారు. పదేళ్లు ఎక్కడో కూర్చుని ఇప్పుడు గ్రామాలకు వెళ్లి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేస్తామంటే కుదరదని, ప్రజాదరణ ఉన్నవారికే స్థానిక ఎన్నికల టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని మీనాక్షి, మహేశ్‌గౌడ్ స్పష్టం చేసినట్టు సమాచారం. అంతకుముందు టీపీసీసీ డీలిమిటేషన్ కమిటీ సమావేశం సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, పవన్ మల్లాది తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీభవన్‌కు సీఎం రేవంత్

గాంధీభవన్‌లో మంగళవారం కూడా కీలక సమావేశాలు జరగనున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరగనుంది. తర్వాత పార్టీ సలహా కమిటీ భేటీ కానుంది. అనంతరం టీపీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించి వారికి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ సమావేశాలకు మీనాక్షి నటరాజన్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు, డీసీసీ అధ్యక్షులు హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు చెప్పాయి.

రైతుభరోసా 'సంబురాలు'

- నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో కార్యక్రమాలు
- సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద విజయోత్సవ సభ
- హాజరుకానున్న సీఎం రేవంత్... ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తుమ్మల
- నేటితో భరోసా పూర్తి... సాయంత్రం 4 గంటలకు సంబురాలు చేయండి: డిప్యూటీ సీఎం భట్టి
- ప్రధాన కూడళ్లలో రైతులతో కలిసి సంబురాలు నిర్వహించాలి: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా నిధుల పంపిణీ పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ఈ సంబురాలు నిర్వహించాలని టీపీసీసీ పిలుపునిచ్చింది. అదే సమయానికి సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద విజయోత్సవ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆయన అక్కడి నుంచే రాష్ట్రంలోని పలువురు రైతులతో కూడా మాట్లాడే అవకాశముంది.

డిప్యూటీ సీఎం, టీపీసీసీ చీఫ్ భేటీ

సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. మంగళవారం నిర్వహించాల్సిన రైతుభరోసా సంబురాలపై చర్చించారు. అనంతరం మహేశ్‌గౌడ్ రైతుభరోసా సంబురాలపై అధికారిక ప్రకటన చేశారు. ఆ తర్వాత జైభీం, జైబాపూ, జై సంవిధాన్ సమన్వయకర్తల సమావేశంలో పాల్గొన్న భట్టి కూడా రైతు భరోసా గురించి మాట్లాడారు. 9 రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుభరోసా కింద పంపిణీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి అని, ఇది ప్రజా ప్రభుత్వం సాధించిన ఘనత అని చెప్పారు. ఈనెల 16న భరోసా నిధుల పంపిణీ మొదలుపెట్టామని, 24వ తేదీతో పూర్తి చేస్తున్నామని చెప్పారు. రైతుభరోసా పంపిణీ పూర్తి కాగానే రైతు వేదికల వద్ద రైతులను సమావేశపరుస్తామని, సీఎం సహా మంత్రులంతా సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నుంచి రైతులతో మాట్లాడతారని తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని భట్టి పిలుపునిచ్చారు.

పెద్దఎత్తున చేయండి: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

రైతుభరోసా సంబురాలను రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని, రైతులతో కలిసి మండల ప్రధాన కూడళ్లలో వేడుకలు నిర్వహించాలని డీసీసీ అధ్యక్షులు, పార్టీ బాధ్యులను ఆదేశించారు.

ఏర్పాట్లను పరిశీలించిన తుమ్మల

రైతుభరోసా విజయోత్సవ సభ నిర్వహణ ఏర్పాట్లను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. సోమవారం సీఎస్ కె. రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రంలో ఎన్డీఏ సర్కార్ నడుస్తోందా?

కాళేశ్వరంపై బండి సంజయ్ అసత్యాలు : గంగుల



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారం చూస్తే రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే నడుస్తున్నదనే అనుమానాలు వస్తున్నాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. రూ.లక్ష కోట్లు కంటే తక్కువ ఖర్చు అయిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందనే రేవంత్ ఆరోపణల తరహాలో బండి సంజయ్ విమర్శలు చేస్తున్నాడని చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యతపైనా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గంగుల సోమవారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరగలేదని ఓ వైపు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్తే బండి సంజయ్ మాత్రం అవినీతి జరిగిందంటూ ప్రచారం చేస్తున్నారన్నారు.

- కేసీఆర్‌ను తిట్టేందుకు పుట్టినట్లుగా బండి సంజయ్ వైఖరి ఉందని మాజీ ఎంపీ బి.వినోద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల మట్టంతో ప్రాజెక్టు నిర్మాణానికి రేవంత్‌తో కలిసి బండి సంజయ్ అనుమతులు తీసుకురావాలని సవాల్ చేశారు.
- సీఎం రేవంత్ చేతిలో బండి సంజయ్ కీలుబొమ్మలా మారాడని, ఈటల రాజేందర్‌కు బీజేపీ అధ్యక్ష పదవి దక్కకూడదనే ఉద్దేశంతోనే కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాడని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు.
- రేవంత్ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను బండి సంజయ్ చదువుతున్నాడని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు.
- సీడబ్ల్యూసీ నివేదికను వక్రీకరించిన బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవిలో కొనసాగే హక్కు లేదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు.

ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ నివేదికలను తప్పపడతారా?

- కాళేశ్వరంపై కేంద్రమంత్రి బండి సంజయ్ వాస్తవాలు మాట్లాడారు : ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన నివేదికను బీఆర్ఎస్ నేతలు నాయకులు తప్పుపట్టడం హాస్యాస్పదమని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వాస్తవాలు మాట్లాడారని చెప్పారు. తుమ్మిడిహెట్టి నీటి నిల్వపై సీడబ్ల్యూసీ వాస్తవాలతో రిపోర్ట్ ఇచ్చిందని, ఆ రిపోర్టును కూడా బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ఎందుకు కప్పిపుచ్చుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కాళేశ్వరం అవినీతి సొమ్ములో కేసీఆర్ కాంగ్రెస్ నేతలకు వాటా ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు.

విచారణను నీరుగార్చే కుట్ర : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ విచారణను నీరుగార్చే కుట్ర జరుగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం అవినీతి నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ నేతలు ఆపసోపాలు పడుతున్నారని, ఆ ప్రాజెక్టు ఎంత డొల్లతనంతో ఉందో ఎన్డీఎస్ఏ నివేదికను చదివితే అర్థమవుతుందన్నారు.

రుణమాఫీ ఇప్పటికీ పూర్తి కాలేదు

- చాలా బ్యాంకుల్లో రైతులు నిరీక్షిస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంట రుణమాఫీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, కానీ చాలాచోట్ల రుణమాఫీ పూర్తికాకపోవడంతో ఆయా రైతులు నిరీక్షిస్తున్నారన్నారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించిన పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల చొప్పున రైతు రుణమాఫీ ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సుమారు 15,000 మంది అర్హులైన రైతులు ఉన్నా, వారి ఖాతాల్లో నిధులు జమ కాలేదన్నారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని చెప్పారు. ఇంకా లక్షలాది మంది రైతులు రూ.లక్ష లోపు వ్యవసాయ రుణాలు తీసుకున్నా, ఇప్పటికీ వారికి రుణమాఫీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే మాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో బ్యాంకింగ్ సేవల విస్తరణ వేగవంతమైందని, 2014లో 6 వేల బ్యాంకు శాఖలుంటే..ఇప్పుడు 6,600కు పెరిగాయని తెలిపారు. ఎడ్యుకేషన్ లోన్లు, హౌసింగ్ లోన్లు, కిసాన్ క్రెడిట్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు రుణ మంజూరులో ఆలస్యం జరిగితే ఎలా ఫిర్యాదు చేయాలనే అంశాలపైనా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగంలో ఉన్న చిన్న వ్యాపారవేత్తలకు బ్యాంకులు అందించే రుణ సదుపాయాలపై అవగాహన పెంచాలని చెప్పారు. విశ్వకర్మ యోజన, ముద్రా యోజన, స్ట్రీట్ వెండర్ రుణ సౌకర్యాల వంటి పథకాలను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని బ్యాంకులకు ఆదేశించినట్టు చెప్పారు. 2013–14లో రాష్ట్రంలో పంటరుణాలు రూ.27,676 కోట్లు ఉంటే... 2024–25 నాటికి రూ.1,37,346 కోట్లకు పెరిగిందన్నారు. పదకొండేళ్లలో దాదాపు ఐదు రెట్లు పెరిగిన రుణాల ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులను ఎలా వెన్నుదన్నుగా నిలుస్తుందో ఈ డేటా స్పష్టం చేస్తుందని చెప్పారు.

బనకచర్లపై పోరుబాట

బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం

- ఏపీ జల దోపిడీ, రాష్ట్రానికి జరిగే అన్యాయంపై ప్రజలకు వివరణ
- చంద్రబాబు, రేవంత్‌ల లోపాయికారీ ఒప్పందాన్ని బయటపెట్టేలా ప్రణాళిక
- కేసీఆర్‌తో హరీశ్ సుదీర్ఘ చర్చలు.. ముఖ్య నేతలతో భేటీ
- ఉద్యమ కార్యాచరణపై త్వరలో కేసీఆర్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్, దీన్ని వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టాలని నిర్ణయించింది. బనకచర్ల పేరిట తెలంగాణతో సంబంధం లేకుండా గోదావరి జలాల తరలింపుతో ఏపీ చేస్తున్న జల దోపిడీని, రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని భావిస్తోంది. నిధులు, నీళ్లు, నియామకాలు అనే తెలంగాణ ఉద్యమ నినాదానికి బనకచర్ల ప్రాజెక్టు విరుద్ధమని చెబుతూ, మరోమారు ఉద్యమ స్థాయిలో ప్రజలను సమీకరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రజల్లోకి బనకచర్ల అంశాన్ని ఎలా తీసుకెళ్లాలనే అంశంపై బీఆర్ ఎస్ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్‌తో మాజీమంత్రి హరీశ్‌రావు ఆదివారం రాత్రి ఎర్రవల్లి నివాసంలో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మీడియాలో పార్టీ విధానాలను చురుగ్గా వినిపిస్తున్న నేతలు ఈ భేటీలో పాల్గొన్నట్లు సమాచారం.

కాళేశ్వరంపై నిర్లక్ష్యం..బనకచర్లకు సహకారం


బనకచర్ల ప్రాజెక్టు వెనుక ఏపీ ప్రభుత్వ ఉద్దేశాలు, లక్ష్యాలు, కుట్రలను హరీశ్‌రావు పార్టీ నేతలకు వివరించారు. ఇందుకు సంబంధించి నేతలు వ్యక్తం చేసిన పలు సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా ఎండబెట్టి బనకచర్లకు సహకరిస్తున్న తీరును తెలియజేశారు. ప్రజలకు అర్థమయ్యే తీరులో బనకచర్ల అంశాన్ని వివరించడంపై నేతలకు పలు సూచనలు చేశారు. బనకచర్లపై ప్రజల్లోకి వెళ్లడంతో పాటు మరోవైపు న్యాయ పోరాటానికి కూడా పార్టీ సన్నద్ధమవుతోందని తెలిపారు. బనకచర్లపై చేపట్టాల్సిన ఉద్యమ రూపాలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. చంద్రబాబుకు రేవంత్‌రెడ్డికి నడుమ లోపాయికారీ ఒప్పందం జరిగిందంటూ, ఆ విషయాన్ని జనానికి విడమర్చి చెప్పేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సమాచారం.

న్యాయపోరాటంపై కేసీఆర్ చర్చలు

బనకచర్లపై చేపట్టాల్సిన కార్యాచరణను కేసీఆర్ త్వరలో స్వయంగా ప్రకటించనున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరవుతారని సమాచారం. న్యాయపోరాటానికి సంబంధించి నిపుణులు, న్యాయవాదులతో కేసీఆర్ చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ కాంగ్రెస్

- పథకాలను అటకెక్కించారు.. హామీలను గాలికి వదిలేశారు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రజలను నమ్మించి నయవంచనకు గురి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా కాలు గడపదాటడం లేదన్నారు. బీఆర్ఎస్ పథకాలను అటకెక్కించి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలును కాంగ్రెస్ గాలికి వదిలేసిందని హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాల మీద కక్ష తీర్చుకోవడమే పాలన అన్నట్లుగా రేవంత్ పనితీరు ఉందని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొర్రెల పంపిణీ చేస్తామని అభయ హస్తం మేనిఫెస్టోలో ఊదరగొట్టి కనీసం డీడీలు కూడా తిరిగి ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

సుంకిశాలకు మరమ్మతులు

మేడిగడ్డకు కొద్దిపాటి మరమ్మతులతో గోదావరి జలాలను ఎత్తిపోసే అవకాశమున్నా బీఆర్ఎస్‌ను బదనాం చేయాలనే కుట్రతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కానీ సుంకిశాల ప్రాజెక్టులో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలు బయట పడతాయనే ఉద్దేశంతో గుట్టు చప్పుడు కాకుండా మరమ్మతులు మొదలుపెట్టారన్నారు. ప్రాజెక్టు కూలడంపై ఏ విచారణ లేకుండానే మరమ్మతులు చేస్తున్నారన్నారు.

ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకోండి.. అందరం కలిసి వెళ్దాం

బీసీ రిజర్వేషన్లపై ఎంపీ ఆర్.కృష్ణయ్యకు మంత్రి పొన్నం విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశానికి రాజకీయ రంగు పులమడం సరికాదని, తెలంగాణలోని బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. 'రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య అంటే మాకు గౌరవం. ఒక తమ్ముడిగా విజ్ఞప్తి చేస్తున్నా. మీరు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకోండి. బీసీ రిజర్వేషన్ల కోసం అందరం వెళ్లి కలుద్దాం' అని కోరారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయికుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వరరావు, కేతూరి వెంకటేశ్, ప్రమోద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి బీసీల గురించి మాట్లాడని కవితకు ఇప్పుడు ఆ వర్గాలు గుర్తుకు రావడం విడ్డూరమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి పట్టించుకోని బీఆర్ఎస్ నాయకురాలు కవితతో కూర్చుని కృష్ణయ్య మాట్లాడటం, మద్దతు ప్రకటించడం సబబు కాదని, పదేళ్ల కాలంలో ఆమె బీసీల గురించి గొంతెత్తి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని అన్నారు. బీసీల విషయంలో రాహుల్‌గాంధీ మార్గదర్శకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చాలా స్పష్టతతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పొన్నం చెప్పారు.

18 నెలలు ఆగిన ప్రభుత్వం.. ఇంకో 18 రోజులు ఆగలేదా?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం 18 నెలలు ఆగిన ప్రభుత్వం.. ఇంకో 18 రోజులు ఆగలేదా? అని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం ప్రశ్నించింది. సోమవారం సచివాలయం మీడియా పాయింట్ బయట బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు కలిసి మీడియాతో మాట్లాడారు. కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకోవడం వాయిదా వేయాలని, 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై యూపీఏ పార్టీలు బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడేలా కాంగ్రెస్ కృషి చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే హైదరాబాద్‌లో అడుగుపెట్టాలన్నారు. కులగణనలో బీసీ రిజర్వేషన్లు కల్పించడంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్ అన్న కాంగ్రెస్ ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే దేశంలో మళ్లీ ఓల్డ్ మోడల్ అవుతుందని ఎద్దేవాచేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిందేనని, బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.



అవసరమైన దాని కంటే ఎక్కువ బాధపడకు.
అనవసరంగా ముందే బాధపడకు.
– సెనెకా

సాక్షి
మంగళవారం, 24 జూన్ 2025

ఎవరి కోసం ఈ యుద్ధం?

అకారణ యుద్ధాలతో నిండా మునిగి, ఆర్థికంగా పతనావస్థకు చేరుకున్న అమెరికా, మరోసారి పశ్చిమాసియా రణరంగంలో దూకి తన మూర్ఖత్వాన్ని చాటుకుంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'నాకెందుకో నోబెల్ బహుమతి రావటం లేద'ని వగచి 48 గంటలు కాలేదు... తన యుద్ధోన్మాదాన్ని ప్రదర్శించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఇంటా బయటా 'వద్దుగాక వద్ద'ని మొత్తుకుంటున్నా, ఆంక్షలతో బక్కచిక్కిన ఇరాన్‌పై తన ప్రతాపాన్ని చూపారు. 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్ కొండప్రాంతాల్లోని భూగర్భంలో వున్న ఫోర్డో, నతాంజ్, ఇసాఫన్ అణుస్థావరాలపై బంకర్ బస్టర్ బాంబులతో దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో అమెరికా చెబుతున్నట్టు ఆ స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయా లేదా అన్నది ఇంకా తెలియాల్సివుంది. కానీ ఫోర్డో కేంద్రంపై సోమవారం ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు మరోసారి దాడి చేశాయన్నది గమనిస్తే తీవ్ర నష్టం కలిగివుండొచ్చనిపిస్తోంది. ఇందుకు ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్ నగరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఎన్నడూలేని విధంగా హోర్ముజ్ జలసంధిని మూసేయాలని ఇరాన్ కేబినెట్ నిర్ణయించటం ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పిడుగుపాటే.

ఇరాన్‌పై అమెరికా పగ ఈనాటిది కాదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం అనంతరం అమెరికా రాయబార కార్యాలయంపై దాడిచేసి 52 మంది దౌత్యవేత్తలనూ, పౌరులనూ 444 రోజుల పాటు బందీలుగా చేసిన వైనాన్ని ఆ దేశం మరిచిపోలేకపోతోంది. బందీలను విడిపించటానికి అప్పటి అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ 'ఆపరేషన్ ఈగిల్ క్లా' సైతం విఫలమైంది. ఆ పరాభవం నుంచి కోలుకోలేక ఏదో సాకుతో ఆంక్షలు విధిస్తూనేవుంది. ఆ తర్వాత 1980లో అప్పటి ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను ఇరాన్‌పైకి ఉసిగొల్పింది. ఎనిమిదేళ్ల ఆ యుద్ధం రెండు దేశాలనూ దెబ్బతీయగా, అమెరికా ఆయుధ విక్రయంతో బాగుపడింది. అటుపై అడపా దడపా ఇజ్రాయెల్‌తో దాడులు చేయిస్తూనే ఉంది. కొత్త కొత్త ఆంక్షలతో ఇరాన్‌ను దెబ్బతీస్తూనే ఉంది.

తీరికూర్చుని వేరే దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం, వనరుల కైంకర్యానికి ప్రయత్నించటం అమెరికా విదేశాంగ విధానంలో భాగం. ఇరాన్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన జాతీయవాది ప్రధాని మహమ్మద్ మొసాదిని 1953లో బ్రిటన్‌తో చేతులు కలిపి సైనికకుట్రతో కూల్చిన పాపం అమెరికాదే. అప్పట్లో బ్రిటన్ చేతుల్లోవున్న ఇరాన్ చమురు కంపెనీని జాతీయం చేయటంతో రెండు దేశాలూ ఈ దుస్సాహసానికి ఒడిగట్టాయి. అటుపై తమ కీలు బొమ్మ మహమ్మద్ రెజా పెహ్లావీని అందలమెక్కించాయి. రెండు దశాబ్దాలు గడవకుండానే అతగాడు పదవీభ్రష్టుడయ్యాడు. ఇస్లామిక్ దేశాల్లో అమెరికా జోక్యంతో ఛాందసవాదుల ప్రాబల్యం పెరగటం 1953 నాటి ఇరాన్‌తో మొదలుపెట్టి ఇటీవలి బంగ్లాదేశ్ వరకూ కనబడుతూనే ఉంది. అఫ్గానిస్తాన్, ఇరాక్, లిబియా, లెబనాన్, సోమాలియా, సిరియా వగైరాలన్నీ ఇందుకుదాహరణ. అఫ్గాన్‌లో తాలిబన్‌లు మొదలుకొని సిరియాలో ఐఎస్ వరకూ అన్ని ఉగ్రవాద సంస్థల పుట్టుకకూ అమెరికాయే కారణం.

డెమాక్రాట్లు మళ్లీ నెగ్గితే అమెరికాను సర్వనాశనం చేస్తారని, మూడో ప్రపంచయుద్ధానికి కారకులవుతారని అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం చేసిన పెద్ద మనిషి ఇప్పుడు తానే ఆ పెను ముప్పు వైపు అడుగులేశారు. అమెరికన్ కాంగ్రెస్‌కు మాట మాత్రమైనా చెప్పలేదు. అంతర్జాతీయ చట్టాల్ని లేశమాత్రమైనా గౌరవించలేదు. చివరకు ఏమవుతుందోనన్న చింత అసలే లేదు. యుద్ధాల్ని ప్రారంభించటం తేలిక. వాటి ముగింపు ఎవరి వల్లా కాదు. వ్యక్తుల ఇష్టానిష్టాలకు అది లోబడి ఉండదు. అసలే పశ్చిమాసియా వైరుధ్యాల పుట్ట. పరస్పరం కలహించుకునే దేశాలు అక్కడ డజనుకు పైగా ఉంటాయి. అలాంటిచోట 'తగుదునమ్మా...' అంటూ ట్రంప్ వేలెట్టి పెద్ద తప్పు చేశారు. కానీ దీనికి మూల్యం చెల్లించుకోవాల్సింది... అమెరికన్ పౌరులూ, ప్రపంచ ప్రజానీకం.

మూడున్నర దశాబ్దాల ఏలుబడిలో అలీ ఖమేనీకి ఇది పరీక్షా సమయం. దాడులకు లొంగి ట్రంప్‌తో దౌత్యానికి సిద్ధపడతారా లేక ఇజ్రాయెల్ అంతు చూసేదాకా వదలరా అన్నది తేలటానికి సమయం పడుతుంది. కానీ శక్తిమంతమైన అమెరికాపై ప్రతీకార దాడులకు దిగి భారీ నష్టానికి సిద్ధపడకపోవచ్చు. అకారణ దాడులపై రౌద్రంగా ప్రకటనలిస్తున్నా ఆచరణ రూపం దాల్చక పోవచ్చు. అటు అమెరికా సైతం ఇరాన్ అణ్వాయుధ ప్రయత్నాలపై యుద్ధమే తప్ప ఆ దేశంపై యుద్ధం తమ ఉద్దేశం కాదంటోంది. కానీ ఇజ్రాయెల్, అమెరికాల ఉమ్మడి దురాలోచన ఇరాన్‌లో నాయకత్వ మార్పు... అమెరికా ప్రాపకంతో నడిచే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి ఆర్థిక సంస్థల ప్రమేయం లేకుండా సర్వస్వతంత్రంగా, నిటారుగా నిలబడగల్గిన ఇరాన్‌ను 'ప్రధాన స్రవంతి'కి మళ్లించటం.

ఆ రెండూ మాత్రం నెరవేరే అవకాశం లేనే లేదు. ఇరాన్‌లో పెట్టుబడులు లేవు గనుక అమెరికా ఎంతకైనా తెగిస్తుంది. కానీ మనకు ఆ దేశంతో ఆర్థికబంధం ఉంది. పాకిస్తాన్ ప్రమేయం లేకుండా మధ్య ఆసియా దేశాలతో, అఫ్గాన్‌తో నేరుగా, చౌకగా వాణిజ్యాన్ని నెరపగలిగే చాబహార్ పోర్టు ఇరాన్‌లో నిర్మించింది మనమే. కానీ ఆంక్షల కారణంగా అది అరకొరగా ఉంది. ఇరాన్ చౌకగా ఇచ్చే చమురును కూడా ఆ ఆంక్షల పర్యవసానంగానే కాలదన్నుకున్నాం. ఈ యుద్ధం ఉగ్రరూపం దాలిస్తే ఆర్థికంగా మరింత నష్టపోతాం. చైనా, రష్యాల పరిస్థితి కూడా ఇదే. అటు నాటో కూటమి సైతం అయోమయంలో పడింది. అందుకే ఈ మతిమాలిన యుద్ధం చాలించమని ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలన్నిటిపైనా ఉంది.

ట్రంప్ ఏకధ్రువ ప్రపంచ కలలు

సందర్భం



టంకశాల అశోక్

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంలో అమెరికా ప్రత్యక్ష జోక్యానికి కారణం ఏమై ఉంటుందని విశ్లేషిస్తూ పోతే అంతిమంగా తోస్తున్నది ఒకటే. అది – క్రమంగా బలహీనపడుతున్న ఏకధ్రువ ప్రపంచాన్ని తిరిగి స్థిరపరచుకోవాలన్న అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నం. ఇరాన్ అణ్వస్త్రాల ఉత్పత్తికి సమీపంలో ఉందా దూరంగానా, శాంతి చర్చలకు సిద్ధమా కాదా, అమెరికా మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ప్రమాదం ఏర్పడిందా లేదా అనేవన్నీ పైకి కనిపించే మిథ్యా సంవాదాలు. ఇంతవరకు దౌత్య చర్చల తెర వెనుక దాగి తన యుద్ధ మంత్రాంగాన్ని సాగించిన ట్రంప్, ఇరాన్‌ను ఇజ్రాయెల్ ఓడించటం తేలిక కాదని అర్థమవుతుండటంతో, నిజ స్వరూపంతో తెర ముందుకు వచ్చారు. తాము, ఇజ్రాయెల్ 'ఒక టీమ్‌గా పని చేస్తూ వస్తున్నా'మని ఎటువంటి దాపరికం లేకుండా, జూన్ 21 నాటి దాడుల తర్వాత 22న ప్రకటించారు.

బిట్వీన్ ద లైన్స్

ఎదుటిపక్షంతో చర్చలు జరుగుతుండగానే మధ్యలో వారిపై బాంబు దాడులు జరిపిన ఉదంతాలను ప్రపంచ దౌత్య చరిత్రలోనే ఎపుడైనా విన్నామా? ఇరాన్ అణుశక్తి కార్యక్రమంపై వారికి, అమెరికాకు అయిదు విడతల చర్చలు జరిగి ఆరవది ఈ నెల 15న జరగనుండగా రెండు రోజుల ముందు 13న ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాకు చెప్పి మరీ దాడి చేసింది. ఈసారి నేరుగా అమెరికాయే దాడి జరిపింది. తమ దాడికి సరిగా ఒకరోజు ముందు స్వయంగా ట్రంప్ మాట్లాడుతూ, చర్చల కోసం వచ్చేందుకు ఇరాన్‌కు 15 రోజుల సమయం ఇస్తున్నామన్నారు. అయినా మరునాడే దాడి చేశారు. ఇదే ఒక ద్వంద్వ నీతి కాదా?

ఇంతకూ గత అమెరికన్ ప్రభుత్వాలు సాగించిన యుద్ధాలను తీవ్రంగా ఖండించి, తన హయాంలో ఆ పని జరగబోదని తన ఎన్నికల ప్రచార సమయం నుంచే పదేపదే హామీ ఇస్తూ వచ్చిన ట్రంప్, ఇపుడీ విధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారన్నది అసలు ప్రశ్న. పశ్చిమాసియాలో అమెరికాతో పాటు పాశ్చాత్య సామ్రాజ్యవాదపు ప్రయోజనాల కోసం ఇజ్రాయెల్ అవసరం ఎటువంటిదనే చర్చలు తరచూ జరిగేవే గనుక ఇపుడు తిరిగి చెప్పుకోనక్కర లేదు. కానీ అంతకుమించిన కారణాలు కూడా కనిపిస్తున్నాయి. అవి స్వయంగా ట్రంప్ మాటలు, చేతల ద్వారా రూపుదిద్దుకుంటున్నవే. తన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదానికి, అమెరికా తన ఏకధ్రువ ప్రపంచాధిపత్య స్థాయిని కోల్పోతుండటానికి, ప్రస్తుతం ఇరాన్‌తో ఘర్షణకు ప్రత్యక్ష సంబంధం ఉంది. ఇది కేవలం ఇజ్రాయెల్, ఇరాన్, అణు పరిశోధనలు, పశ్చిమాసియా, చమురు నిల్వలు, ఆ ప్రాంతపు భౌగోళికతలకు పరిమితమైనది కాదు. 21 నాటి తమ సైనిక శక్తి ప్రదర్శనతో అమెరికా మొత్తం ప్రపంచానికి హెచ్చరికల సందేశం పంపదలచింది. తన ఏకధ్రువ ఆధిపత్యాన్ని సైనిక బలంతో నిలబెట్టుకోగలమని చెప్పటమే ఆ సందేశం.

ఈ మాటపై సందేహం గలవారు 21 నాటి దాడుల తర్వాత మొదట ట్రంప్ చేసిన ప్రసంగాన్ని, తర్వాత అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ అధిపతి జనరల్ కురిల్లాతో కలిసి రక్షణమంత్రి పీట్ హెగ్‌సెట్ మీడియా సమావేశంలో అన్న మాటలను జాగ్రత్తగా గమనించండి. ఇంగ్లిష్‌లో 'రీడింగ్ బిట్వీన్ ద లైన్స్' అనే మాట ఉంది. పైకి చెప్పే మాటల అర్థాన్నే గాక వాటి అంతరార్థాన్ని కూడా చూడటమన్నమాట. వారు ఇరాన్ అణు కేంద్రాల విధ్వంసం, శాంతి చర్చల రూపంలో ఇరాన్ తమకు బేషరతుగా లొంగటం, కాదని దాడులు జరిపితే సర్వనాశనానికి ఇరాన్ సిద్ధపడటం అని చెప్పేందుకే పరిమితం కాలేదు. ఆ తరహా దాడులు ఎంత ఘనమైనవో, తమ వంటి సైనిక శక్తి యావత్ ప్రపంచంలో మరే దేశానికి ఎట్లా లేదో, అటువంటి దాడులు మరెవరు ఎట్లా చేయలేరో ఒకటికి నాలుగుసార్లు కఠిన స్వరంతో, తీక్షణమైన ముఖ కవళికలతో చెప్తూ పోయారు. గత యుద్ధాల చరిత్రను గమనిస్తే సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోదలచిన ప్రతిసారీ, లేదా అటువంటి ఆధిపత్యానికి సవాళ్లు ఎదురైన ప్రతిసారీ, అంతర్జాతీయ చట్టాలూ రూల్ ఆఫ్ లా అని తామే సృష్టించి జపించేవాటిని బాహాటంగా ఉల్లంఘిస్తూ, కేవలం సైనిక బలంతో ఆధిపత్యం కోసం సరిగా ఇటువంటి మాటలే చెప్తూ వచ్చారు. గత 10–15 సంవత్సరాలుగా తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోతూ మథనపడుతున్న అమెరికాకు, ఆ స్థాయిని తిరిగి చతురోపాయాలతో నిలబెట్టుకోవటం అన్నింటికీ మించిన పరమ లక్ష్యంగా మారింది.



◆ ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదానికి, అమెరికా తన ఏకధ్రువ ప్రపంచాధిపత్య స్థాయిని కోల్పోతుండటానికి, ప్రస్తుతం ఇరాన్‌తో ఘర్షణకు ప్రత్యక్ష సంబంధం ఉంది. జూన్ 21 నాటి తమ సైనిక శక్తి ప్రదర్శనతో అమెరికా మొత్తం ప్రపంచానికి హెచ్చరికల సందేశం పంపదలచింది. తన ఏకధ్రువ ఆధిపత్యాన్ని సైనిక బలంతో నిలబెట్టుకోగలమని చెప్పటమే ఆ సందేశం.

సామ్రాజ్యవాద డైనమిక్స్

ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదాన్ని ప్రపంచం కేవలం ఆర్థిక సంబంధమైనదిగా చూస్తూ వస్తున్నది. తాను యుద్ధాలు ఆపానని, ఇంకా ఆపుతానని, శాంతి దూతనని చెప్పే మాటలను చాలామంది అమాయకంగా విశ్వసించారు. కానీ అర్థం చేసుకోని విషయాలు రెండున్నాయి. ఒకటి–తాము కోల్పోతున్నట్లు ట్రంప్ సరిగానే భావిస్తున్న గొప్పతనం చాలా వరకు సైనిక బలం ఆధారంగా సంపాదించినదే. రెండు – అట్లా కోల్పోవటం చారిత్రక పరిణామాల వల్ల ఏర్పడుతున్న సహజ స్థితి అని గుర్తించి అందుకు అనుగుణంగా సర్దుబాట్లు చేసుకోవటానికి బదులు, పూర్వ వైభవాన్ని సాధించాలనుకుంటే అందుకు చివరి ఆధారం తిరిగి సైనిక శక్తే అవుతుంది. అంతర్జాతీయ చట్టాలకు, నాగరికమైన ప్రజాస్వామ్య వ్యవహరణకు కట్టుబడే డైనమిక్స్ ఒక విధంగా ఉంటే, అన్నింటినీ ఒకవైపు వల్లిస్తూనే యథేచ్ఛగా ఉల్లంఘించే సామ్రాజ్యవాదపు డైనమిక్స్ ప్రస్తుతం మనం చూస్తున్న విధంగానే ఉంటాయి. అది 'సామ్రాజ్యవాదం' అనే వ్యవస్థలోనే అంతర్నిహితమై భూత భవిష్యత్ వర్తమాన కాలాలన్నిటా దర్శనమిస్తుంది.

ప్రపంచంలోకెల్లా అతిగొప్ప ప్రజాస్వామ్యాలని చెప్పుకునే అమెరికా, బ్రిటన్‌లు, పశ్చిమాసియాలో ఏకైక ప్రజాస్వామ్యమని చాటుకునే ఇజ్రాయెల్‌ల అప్రజాస్వామిక చర్యల చరిత్ర ఒక ఉద్గ్రంథ మవుతుంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు తమ సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఎన్నెన్నో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను సీఐఏ, ఎంఐ–6ల ద్వారా కూలదోసి నియంతలను అధికారానికి తెచ్చాయి. అందుకు ఇరానే ఒక ముఖ్య ఉదాహరణ. అక్కడ ఎన్నికైన ప్రధాని మహమ్మద్ మొసాది చమురు బావులను జాతీయం చేయగా, తనపై 1953లో సైనిక కుట్ర జరిపించి షా పెహ్లావీ నియంతృత్వాన్ని తెచ్చారు. ఇపుడు 'రెజీమ్ ఛేంజ్' (ప్రభుత్వ మార్పిడి) పేరిట మరొక పెహ్లావీ వంశ వారసుడిని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

నిజానికి ట్రంప్ 'మాగా' నినాదంలోనే, పదవీ బాధ్యతలు స్వీకరించి తొలినాళ్ల నుంచి తీసుకుంటున్న చర్యలలోనే ఇదంతా తార్కికంగా కనిపిస్తుంది. వలసదారుల నిరోధానికి, పంపివేతకు సైన్యాన్ని నియోగించటం వరకు వెళ్లారు. ట్యారిఫ్‌ల యుద్ధంతో యావత్ ప్రపంచం ఒకేసారి తమకు పాదాక్రాంతం కావాలనుకున్నారు. రష్యా, చైనాల వద్ద అణ్వస్త్రాలతో కూడిన సైనిక బలం లేనట్లయితే గత కాలపు సామ్రాజ్యవాద పద్ధతులలోనే వనరులు, మార్కెట్ల కోసం దాడులు జరిపే వారే! టారిఫ్‌లకు సంబంధించి కాకున్నా, వనరులూ, మార్కెట్ల విషయమై ఆ రెండు దేశాలతో కాకున్నా, ఇతరత్రా సైనిక బలాన్ని ట్రంప్ మార్కు సామ్రాజ్యవాదం వినియోగిస్తూనే ఉంది.

ప్రభుత్వాన్ని కూలదోస్తాం, మొత్తం దేశాన్నే రాతియుగపు పరిస్థితికి నిర్ధూమధామం చేస్తాం అనే హెచ్చరికలన్నీ కేవలం అమెరికా సైనిక శక్తిని కేంద్రం చేసుకున్నవి కావా? ఆఫ్రికాలోని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్‌ను కొనసాగిస్తామనటం అక్కడి అపారమైన వనరుల కోసం కాదా? బహుళ ధ్రువ ప్రపంచం కోసం ఆర్థిక ప్రత్యామ్నాయాలుగా ఎదుగుతున్న బ్రిక్స్, డీ–డాలరైజేషన్‌లను బాహాటంగా బెదిరిస్తూ చిన్న దేశాలపై సైనికమైన ఒత్తిడి తేవటంలో కనిపించేది సైనిక శక్తి కాదా? అందువల్ల ట్రంప్ 'మాగా' నినాదాన్ని ప్రపంచం కొత్త దృష్టితో చూడటం అవసరం. ఈ జూన్ 21 నాటి బంకర్ బస్టర్ల సైనిక బల సందేశం, క్రమంగా బలపడుతున్న బహుళ ధ్రువ ప్రపంచానికి సామ్రాజ్యవాదపు 'బిట్వీన్ ద లైన్స్' సందేశం!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

బ్లాక్‌మెయిల్



హోర్ముజ్ జలసంధిని మూస్తానంటున్న ఇరాన్ బెదిరింపులు... అణ్వాయుధం వాడతానన్న రష్యా బెదిరింపుల్లాంటివే! అవి వట్టి బ్లాక్‌మెయిల్స్. దౌత్యం, నిర్ణాయక స్థానాల్లో ఉన్నవారి మీద మానసికమైన ప్రభావాన్ని చూపడమే వీటి నిజమైన ప్రయోజనం. – వెలీనా త్చకరోవా, వ్యూహాత్మక అంశాల నిపుణురాలు

నమ్మాలా?



యూఎస్, ఇరాన్ మధ్య కుదిరే అవకాశమున్న అణు ఒప్పందాన్ని ఇరాన్ మీద బాంబు వేయడం ద్వారా ఇజ్రాయెల్ చెడగొట్టింది. ఇక ఏ కారణం లేకుండానే యూఎస్ కూడా బాంబులు వేసింది. మనమేమో ట్రంప్ శాంతి కోసం నిలబడతారనీ, ఇజ్రాయెల్ దుష్టదేశం కాదనీ నమ్మాలి. – అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

అండగా ఉండాలి!



ఆయుధాలు అమ్ముకోవడానికి అమెరికాకు యుద్ధం కావాలి. ఆయుధాలు తప్ప దానిదగ్గర ఇంకేమీ లేవు. అందుకే ఇరాన్ ప్రజలకు మనం బాసటగా నిలవాలి. కానీ ఇస్లామిక్ ర్యాడికల్ ప్రభుత్వానికి కాదు. శాంతి యత్నాల కోసం ఇండియా ప్రయత్నించాలి. – సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

'స్మార్ట్' లక్షణం



పెద్ద గూఢచారులు, పెద్ద ఉగ్రవాదులు స్మార్ట్‌ఫోన్లను వాడరు. ఆసక్తికరమైన ఒకే గుణం.
– అమ్రుల్లా సలేహ్, అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

ఎంత మార్పు?



వర్తమాన సందర్భంలో నాకు కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నది: ఇరాక్ యుద్ధ సమయంలో 'ఇరాక్ మీద బాంబులు వేయొద్దు' అన్న ప్లకార్డులతో మనం నిరసనలు తెలిపాం. మన ప్రభుత్వాన్ని ఆ మూర్ఖపు పని చేయొద్దని కోరాం. కానీ ఇప్పుడు మన శత్రువుల ఫొటోలు, జెండాలను మన వీధుల్లో, రాజధాని నగరాల్లో జనం మోయడం చూస్తున్నాం.
– కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యాఖ్యాత

ఎప్పటికీ గుణపాఠమే!

సందర్భం



తెలకపల్లి రవి

ఎమర్జెన్సీ యాభయ్యేళ్ల పూర్తిని గుర్తు చేసుకోవడానికి రెండు బలమైన కారణాలు. మొదటిది–స్వతంత్ర భారత చరిత్రలో ప్రజాస్వామ్యంపై తొలి అతి పెద్ద దాడి జరిగి యాభయ్యేళ్లు కావడం. రెండవది–ఎమర్జెన్సీ విధించిన ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత అతి శక్తిమంతుడుగా, అంతకంటే బలిష్ఠుడుగా కీర్తనలందుకునే మోదీ ప్రస్తుత ప్రధానిగా ఉండడం.

కాంగ్రెస్ విధానాలు, అంతర్గత వ్యవస్థ 1947–67 మధ్య బలహీనమవుతున్నాయి. ఎన్నికలలో 8 రాష్ట్రాల్లో ప్రతిపక్ష కూటములు కాంగ్రెస్‌ను ఓడించాయి. పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం వరుసగా ఏకైక పెద్దపార్టీగా రాగలిగింది. ఇంటాబయటా సవాళ్లను ఎదుర్కొన్న ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి ప్రగతిశీల భంగిమలతో పాత నేతలను పక్కనపెట్టడం ప్రారంభించారు. బంగ్లాదేశ్ యుద్ధ విజయం ఆమె ప్రతిష్ఠను తారస్థాయికి చేర్చింది. దీంతో 1971లో ఆమె మధ్యంతర ఎన్నికలకు వెళ్లి బెంగాల్‌లో తప్ప అంతటా అఖండ విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బెంగాల్‌నూ చేజిక్కించుకోవాలని 1972లో సైన్యం సహాయంతో ప్రత్యక్షంగా ఎన్నికల రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడే ఎమర్జెన్సీకి పునాది పడింది. అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి పురాణాల వంటి కారణాలతో ప్రజల్లో నిరసనలు రాజుకున్నాయి. 1974 రైల్వే సమ్మె, బీహార్‌లో జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమం కుదిపేశాయి. పాతకాంగ్రెస్, జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్, సోషలిస్టులు కలసి జేపీ నాయకత్వంలో వేదికగా ఏర్పడితే సీపీఎం సమాంతరంగా ఉద్యమాలు చేస్తూ వచ్చింది. సీపీఐ అప్పటికి ఇందిరతోనే ఉంది. ఈ సమయంలోనే అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ సిన్హా రాయ్‌బరేలీ నుంచి ఆమె ఎన్నిక చెల్లదని తీర్పునివ్వడం సంక్షోభాన్ని పరాకాష్ఠకు చేర్చి, 1975 జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీకి దారి తీసింది. అదే రాత్రి ప్రతిపక్ష నేతల అరెస్టులూ జరిగిపోయాయి.

అప్పుడు కర్నూలు ఉస్మానియా కాలేజీలో డిగ్రీ చదువుతున్నాను. అప్పటికే మిత్రుడూ, మాజీ ఎమ్మెల్యే గఫూర్‌తో సహా చాలామంది అరెస్టులు జరిగిపోయాయి. ఏదో పర్యటనకు వెళ్లిన నాన్న నరసింహయ్య అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రాథమిక హక్కులు సస్పెండ్ అయిపోయాయి. జూలై 21న పార్లమెంట్‌లో ఎమర్జెన్సీ ఆమోదానికై చట్ట బద్ధ తీర్మానం చర్చకు పెట్టినప్పుడు సీపీఎం నాయకుడు ఏకే గోపాలన్ నిప్పులు చెరిగారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో సహా అనేక రకాల ప్రతీప శక్తులనూ అతివాద దుస్సాహసికులనూ అణచివేసేందుకే ఎమర్జెన్సీ అనే అవాస్తవ కథనాలను తిరస్కరించారు. 'ఇందిరే ఇండియా' అంటూ నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు బారువా చెలరేగిపోతున్నా... ఎమర్జెన్సీ బలహీనతే తప్ప బలం కాదన్నారు గోపాలన్.

జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షునిగా నేను, మిత్రులు కలిసి విద్యాగోష్ఠి నిర్వహించాము. రాజకీయాలకు అవకాశం లేదు గనక ప్రజానాట్యమండలి పునరుద్ధరణ కోసం విజయవాడలో జరిగిన సదస్సుకు వెళ్ళాను. 'అసత్యాల అరణ్యాల్లో/ అతిశయాల అంధకారంలో/ వాస్తవాల కాంతి కిరణాలు సోకేందుకు/ కళారూ పాలే కాంతి దీపాలని' కవిత చదివి వినిపించాను. కర్నూలు పోలీసులు ఏవో ఫిర్యాదులు వచ్చాయని సిటీ బస్సుల నుంచి విద్యార్థులను దింపేసి ఇష్టానుసారం కొట్టేస్తున్నారని నిరసనగా సంతకాలు సేకరించి కలెక్టర్, ఎస్పీలను కలిసి ఆపు చేయించాం. అమ్మ లక్ష్మమ్మ మునిసిపల్ కార్మికుల్లో మహిళా సంఘంలో పని కొనసాగించింది.



◆ కాంగ్రెస్ ప్రభుత్వం బెంగాల్‌నూ చేజిక్కించుకోవాలని 1972లో సైన్యం సహాయంతో ప్రత్యక్షంగా ఎన్నికల రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడే ఎమర్జెన్సీకి పునాది పడింది.

ఎంఎల్ గ్రూపులు, ఆరెస్సెస్‌లో ఉండే బంధుమిత్రులు ఆ దశలో కలసి వచ్చేవారు (ఆర్‌ఎస్‌ఎస్ అధినేత దేవరస్ కూడా ఇందిరాగాంధీకి మద్దతు నిస్తామంటూ లేఖ రాసిన వివరాలు తర్వాత బయటకు వచ్చాయి). పాలకపక్షం ప్రజాస్వామ్యాన్ని వమ్ము చేస్తున్నప్పుడు దాన్ని కాపాడటం కీలకమనే సూత్రం అప్పుడు ప్రధానంగా పనిచేసింది. 'ప్రజాశక్తి' వారపత్రికగా అప్పట్లో నిర్వహించిన రాజకీయ పాత్ర అమోఘమైంది, ప్రభుత్వాన్ని పొగిడేందుకై వచ్చే కథనాలనే వ్యంగ్య శీర్షికలతో ఇచ్చేది. సెన్సార్‌కూ అందేది కాదు.

1977 మొదట్లో హఠాత్తుగా ఎన్నికల సందడి మొదలైంది. జనసంఘ్‌తో సహా చాలా ప్రతి పక్షాలు జనతా పార్టీగా ఏర్పడగా సీపీఎం, ప్రాంతీయ పార్టీలు బలపరిచాయి. నంద్యాలలో పోటీ చేసిన నీలం సంజీవరెడ్డికి మద్దతుగా సుందరయ్య గారి సభ ఏర్పాటైతే పదిహేను రోజులు అక్కడే ఉండి కారులో చుట్టుపక్కల పల్లెలన్నీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేశాను. మొత్తం మీద ఇందిరా, సంజయ్‌లతో సహా కాంగ్రెస్ ఓడి, ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడింది. టెలిఫోన్ ఎక్స్ఛేంజిల దగ్గర బోర్డుపై ఫలితాలు ప్రకటిస్తుంటే ప్రజలు కేరింతలు కొట్టడం గుర్తుంది. ఎమర్జెన్సీ చివరలో ఉద్యమావసరాల రీత్యా మా నాన్న 'ప్రజాశక్తి'కి వెళ్లి ఫలితాల వరకూ పనిచేశారు. అనుకోకుండా 1977 జూలైలో నేను వెళ్లి చేరా.

జనతా హయాంలో 42వ రాజ్యాంగ సవరణ ఉపసంహరించబడింది. సీపీఐ ఆత్మ విమర్శ చేసుకుని వామపక్ష ఐక్యతలో భాగస్వామి అయింది. అప్పటి పరిణామాలు, పార్టీల శక్తుల పాత్ర ఒక్క చోట చర్చించడం కష్టం గానీ నిరంకుశ పోకడలు ఎల్లకాలం సాగ వనేది కీలక పాఠం. ఇప్పుడు విశ్వగురు మోదీ పాలన 'అప్రకటిత ఎమర్జెన్సీ'లా ఉందనే మాట తరచూ వింటుంటాం కానీ అదీ పాక్షిక సత్యమే. ఎమర్జెన్సీ తీవ్రమైన తాత్కాలిక అపశ్రుతి లాటిదైతే... ఇది వ్యవస్థీకృతమైన ఏకపక్ష ధోరణి, హిందుత్వ మత రాజకీయం, కార్పొరేట్ శక్తుల కలయికకు తోడు అంతర్జాతీయంగానూ ద్రవ్యపెట్టుబడి ప్రాబల్యం, మిత వాద జాతి దురభిమాన శక్తుల పెరుగుదల నేపథ్యం. అందుకే ఇప్పుడు మరింత అప్రమత్తత అవసరం, ఎమర్జెన్సీని ఓడించిన విశ్వాసం ఎప్పటికీ స్ఫూర్తి.

వ్యాసకర్త సీనియర్ పత్రికా సంపాదకులు

నిర్బంధంలోనూ...

జ్ఞాపకం



పి. వేణుగోపాల్ రెడ్డి

ఎమర్జెన్సీకి యాభై ఏళ్ళు సందర్భంగా నాటి పరిస్థితులను గుర్తు చేసుకోవడం అవసరం. ఆ సమయంలో నేను ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేస్తున్నాను. అరెస్టు నుంచి తప్పించుకున్నాను. 1976–77 లలో మా సంస్థ నాకు ఒక బాధ్యత అప్పగించింది. కాంగ్రెసేతర నేతలు ఎవరైనా సరే, అరెస్టును తప్పించుకున్న వారు, లేదా అరెస్టయ్యి విడుదలైన వారినందరినీ కలుపుకొంటూ తెలుగు ప్రాంతాలలో 'లోక్ సంఘర్ష్ సమితి' ఉద్యమాన్ని నిలబెట్టడం. మా సీనియర్ ప్రచారక్ సోమేపల్లి సోమయ్య గారితో, 'నావల్ల కాదని' అనేశాను. 'నువ్వే మిగిలావు బయట; చేయక తప్పదు' అన్నారు. నా ప్రయత్నం ఆరంభమైంది.



1975 జూన్ 25న ఎమర్జెన్సీ వచ్చింది. జూలై 4న ఇందిరాగాంధీ ప్రభుత్వం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహా 26 సంస్థలను నిషేధించింది. చాలామంది స్వయంసేవకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అనేకమందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. అరెస్టయిన వారిని ఎక్కడికి తరలించారో తెలిసేది కాదు. సెన్సార్‌షిప్ వల్ల పోలీసులు ఇచ్చిన ప్రకటనలే పత్రికలలో వార్తలుగా వెలువడేవి. ఆ స్థితిలో దేశ ప్రజానీకానికి వాస్తవాలు అందించేందుకు స్వయం సేవకుల ఇళ్లే ప్రింటింగ్ ప్రెస్‌లుగా మారాయి. సైక్లోస్టయిల్ మిషన్లతోనే కర పత్రాలు విడుదల చేసేవారు. నాటి రహస్య పత్రికలలో ఒకటి ఢిల్లీ నుంచి వెలువరించిన 'సత్య సమాచార్'. రహస్య పత్రికలకు, కరపత్రాలకు న్యూస్ వీక్, న్యూయార్క్ టైమ్స్ వంటి పత్రికలే ఆధారం. శకుంతలా హెగ్డే ఇచ్చిన పాకెట్ రేడియో సాయంతో వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఆస్ట్రేలియాల నుంచి వార్తలు విని అద్వాణీ రాసినదే 'ఎ ప్రిజనర్స్ స్క్రాప్ బుక్.'

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నా ప్రయత్నం మొదలుపెట్టాను. నేను కలిసినవారిలో స్వాతంత్ర్యోద్యమంలో పనిచేసినవారు, తెలంగాణ సాయుధ పోరాటాన్ని దగ్గరగా చూసినవారు, ఆంధ్రోద్యమంలో పాల్గొన్నవారు ఉన్నారు. నీలం సంజీవరెడ్డి, తెన్నేటి విశ్వనాథం (పాత కాంగ్రెస్), ఎన్జీ రంగా (స్వతంత్ర పార్టీ), తుమ్మల చౌదరి, వద్దే శోభ నాద్రీశ్వరరావు (సోషలిస్టులు), ఎంవీ రామమూర్తి, (ర్యాడికల్ హ్యూమనిస్ట్), మాకినేని బసవపున్నయ్య, కొరటాల సత్యనారాయణ (సీపీఎం) ఇలా ఎందరినో కలిశాను. వీరిలో కొందరి ధోరణి గమనించిన తరువాత నేను సోమయ్య గారి దగ్గర వ్యక్తం చేసిన సంశయం అర్థం లేనిది కాదనిపించింది. కానీ వారి పరిస్థితినీ అర్థం చేసుకున్నాను. వద్దే శోభనాద్రీశ్వరరావు రహస్య కార్యక్రమాలకు చాలా సాయం చేశారు. 'ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఎలాంటి ఉద్యమం వద్దు, ఇది సముద్రంలో అల కాదు, ఉప్పెన. తలవంచుకోవడం కాదు, అణిగి ఉండడమే ఉత్తమం అన్నారొకాయన. ఎన్నికలు ప్రకటించే అవకాశం ఉంది అంటే, మనకి అభ్యర్థులు ఎక్కడ దొరుకుతారు? 'ఆమె' భయంతో రారు. ఎవరికి ఓటేశారో నాకు తెలిసి పోతుందని ఆమె అంటుంది. ఈ జనం హడలిపోతారు. మీ వాళ్లకి శక్తి ఉన్నా, దానిని గుప్పెట్లో భద్రంగా దాచుకోమను. అంతే తప్ప పోటీ చేయవద్దు'– ఇవీ నాకు ఎదురైన స్పందనలు. కానీ ఇచ్చిన బాధ్యతను స్వీకరించిన తరువాత వెనక్కి తగ్గడం నావల్ల కాదు. ప్రముఖ సోషలిస్ట్, లోక్‌సంఘర్ష సమితి నేత సురేంద్ర మోహన్ ఆంధ్ర పర్యటనకు వచ్చారు. అది రహస్య పర్యటన. ఆ సమావేశంలో నా పాత్ర ఉంది.

◆ శకుంతలా హెగ్డే ఇచ్చిన పాకెట్ రేడియో సాయంతో వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఆస్ట్రేలియాల నుంచి వార్తలు విని అద్వాణీ రాసినదే... 'ఎ ప్రిజనర్స్ స్క్రాప్ బుక్.'

ప్రముఖ సోషలిస్ట్, స్వాతంత్ర్య సమర యోధుడు అచ్యుత్ పట్వర్ధన్ 'ప్రతిఘటన విషయంలో మిగిలిన సంస్థల వారి కంటే స్వయం సేవకుల నుంచే నేర్చుకోవలసినది ఎక్కువ. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడే ఎవరికైనా వారు తమ మద్దతు ఇచ్చారు' అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు ఏకే గోపాలన్, 'అంతటి సాహసం, త్యాగాలు చేయడానికి వారి సిద్ధాంతం అత్యున్నత స్ఫూర్తిని వారికి ఇచ్చింది' అన్నారు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, జూన్ 9, 1979).

ఎమర్జెన్సీ ఉదంతానికి యాభయ్ ఏళ్లు నిండాయి. అప్పటి నుంచి ఆ ఘటన మీద సమాచారం, విశ్లేషణలు వస్తూనే ఉన్నాయి. జూన్ 25 2024న 'న్యూస్ 18' చానల్ ఇచ్చిన ఒక కథనం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఎమర్జెన్సీలో నరేంద్ర మోదీ పాత్రకు సంబంధించినది. ఆయన అరెస్టు నుంచి తప్పించుకోగలిగారు. ఆర్‌ఎస్‌ఎస్ యువ ప్రచారక్‌గా మోదీ గుజరాత్‌లో రాజ్యాంగాన్ని బహిరంగంగా చదివే ఉద్యమం నిర్వహించారు. ఎమర్జెన్సీ వ్యతిరేక సాహిత్యం పంచి పెట్టారు. ఎమర్జెన్సీ వ్యతిరేకోద్యమంతో ఉన్న సాన్నిహిత్యాన్ని బట్టి 'సంఘర్ష్ మా గుజరాత్' అన్న పుస్తకం రాశారు. మరొక పుస్తకం 'ఆపత్కాల్ కె సేనాని: నరేంద్ర మోదీ' ఆయన పాత్రను చెప్పేది.

ఇంత నిర్బంధంలోనూ దక్షిణాది రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించిందని నాటి కేంద్ర మంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రకటనను 'ది గార్డియన్' ఉటంకించింది. సంఘ పరివార్ మీద కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పేవన్నీ అసత్యాలేనని భారత జాతి మనస్ఫూర్తిగా విశ్వసించింది. ఆ నమ్మకమే కొనసాగుతున్నది.

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' ఛైర్మన్
pvg2020@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.చతుర్దశి సా.6.33 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** రోహిణి ప.12.49 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.6.07 నుండి 7.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.50 నుండి 11.20 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

మాకు న్యాయం చేయాలి

- గాంధీ భవన్‌లో గొర్రెలతో గొల్ల, కుర్మల నిరసన
- యాదవ సంఘం ప్రతినిధులతో మహేశ్‌గౌడ్, ఎంపీ అనిల్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ యాదవ హక్కుల పోరాట సమితి నేతలు సోమవారం గాంధీ భవన్‌లో నిరసన తెలిపారు. సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ నేతృత్వంలో పలువురు గొల్ల కుర్మలు డీసీఎం వాహనంలో గొర్రెలను తీసుకొచ్చి కాసేపు గాంధీ భవన్‌లో ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో గొల్లకుర్మల ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన గొర్రెల పంపిణీని తిరిగి ప్రారంభించాలన్నారు. అలాగే యాదవ సామాజిక వర్గానికి కేబినెట్‌లో స్థానం కల్పించాలని.. కనీసం ఆరు కార్పొరేషన్ చైర్మన్లు, ఏడు లేదా ఎనిమిది జిల్లాలకు పార్టీ అధ్యక్షులుగా నియమించాలని, పార్టీలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లలో 60 శాతం మంది గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని జాతీయ సర్వేలు చెబుతున్నాయని.. అందువల్ల తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ చీఫ్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వారిని చర్చలకు ఆహ్వానించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ సైతం వారితో చర్చించారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో మాట్లాడి గొల్ల కుర్మలకు న్యాయం చేస్తానని మహేశ్‌గౌడ్ హామీ ఇచ్చారు.

యాదవ, కురుమలకు రూ.2 లక్షల హామీ ఏమైంది?

- మేకలు, గొర్రెల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యాదవ, కురుమ సోదరులకు రూ.2 లక్షలు అకౌంట్లలో వేస్తామన్న హామీ ఏమైందని మేకలు, గొర్రెల కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ ప్రశ్నించారు. న్యాయం చేయాలంటూ గాంధీభవన్‌కు గొర్రెలు తీసుకొచ్చి నిరసన చేసిన యాదవులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. యాదవ, కురుమలకు మంత్రి పదవులు ఎందుకు రాలేదో ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లలో యాదవ, కురుమలు లేని తొలి కేబినెట్ రేవంత్‌రెడ్డిదేనని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాదవ, కురుమలకు ఎక్స్‌గ్రేషియాను ఇవ్వడంలేదని, మంత్రివర్గంలో ఒక్క యాదవులకు అవకాశం ఇవ్వలేదని అన్నారు.

నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య ప్రవేశ పరీక్ష (నీట్–2026)కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఈనెల 26 నుంచి 28 వరకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్ శ్రీకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పరీక్షల్లో వస్తున్న మార్పులు, నోట్స్ ప్రిపరేషన్, మెంటార్‌షిప్ వంటి అంశాలపై నిపుణులు సూచనలిస్తారని వెల్లడించారు. మొదటిగా వచ్చే వందమందికి ఉచిత వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 8977759277 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

ములుగు రూరల్: కుటుంబ కలహాలతో వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శివతండాలో సోమవారం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శివతండాకు చెందిన సభావట్ పంతులు (70), సుగుణ (60) దంపతులు గ్రామంలో ఇంటి స్థలం విక్రయించే విషయంలో గొడవ పడ్డారు. దీంతో భార్యాభర్తలు పురుగు మందు తాగి ఇంటి ముందు పడిపోయారు. ఇది గమనించిన గ్రామస్తులు పంతులు సోదరుడు రావూజీకి సమాచారం ఇవ్వగా అతను వచ్చి చూసే సరికి ఇద్దరూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య



శంకరయ్య

గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి శంకరయ్య సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం శంకరయ్యకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శంకరయ్యతో పాటు లక్ష్మి కూడా బీబీరాజ్‌పల్లి సర్పంచ్‌గా పనిచేసింది. శంకరయ్య గతంలో కాంట్రాక్టర్‌గా గ్రామంలో రూ. 10 లక్షల వరకు పనులు చేశాడు. ఆ పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదు. మరోవైపు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన కుమారుడు అక్కడ ఓ ఏజెంట్ చేతిలో రూ. 7 లక్షలు మోసపోవడంతో అప్పట్నుంచి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న శంకరయ్య సోమవారం సాయంత్రం తన మామిడి తోటకు వెళ్లి గడ్డిమందు తాగాడు. చీకటిపడినా శంకరయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మామిడి తోట వద్దకు వెళ్లి చూడగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

జీపీఎస్ ట్రాకర్‌తో తేజేశ్వర్‌పై నిఘా

- భార్య సహస్ర పథకం ప్రకారమే హత్యోదంతం!
- మర్డర్ కేసులో విచారణ వేగవంతం
- పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తులు

గద్వాల క్రైం: మేఘాలయ హనీమూన్ మర్డర్ తరహాలో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వివాహం జరిగినప్పటి నుంచి భర్త తేజేశ్వర్ రాకపోకలపై నిఘా పెట్టి దారుణహత్యకు భార్య సహస్రనే పూర్తి పథకం రచించినట్టు తెలుస్తోంది. కర్నూలుకు చెందిన ఓ బ్యాంకు అధికారితో ఉన్న సన్నిహిత సంబంధం పెళ్లయిన రెండురోజులకే తెలియగా, సహస్రను తేజేశ్వర్ మందలించినట్టు తెలిసింది. దీంతో తమ బాగోతం ఎక్కడ బయట పడుతుందోనని బ్యాంకు ఉద్యోగికి జరిగిన విషయం చేరవేసింది. ఆయన సూచన మేరకు భర్త బైక్‌కు జీపీఎస్ ట్రాకర్‌ను తన దూరపు బంధువుతో అమర్చేలా చేసింది. సుపారీ తీసుకున్న ముఠా సభ్యులు గద్వాలలో ఉన్న ఇన్‌ఫార్మర్ ద్వారా తేజేశ్వర్‌పై నిఘా పెట్టారు. జీపీఎస్ ద్వారా ఎక్కడ ఉంటున్నాడో గుర్తించి మూడు దఫాలుగా గద్వాల శివారులో హత్య చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో సహస్ర, ఆ బ్యాంకు ఉద్యోగి ముఠా సభ్యులను ఎగతాళి చేసి, హేళనగా మాట్లాడారు. దీంతో ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న సుపారీ గ్యాంగ్ ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం ఈ నెల 17వ తేదీన ఉదయం వారి కారులో తేజేశ్వర్‌ను ఎక్కించుకొని జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వ్యవసాయేతర భూములు చూసేందుకు వెళ్లారు. ఆ కారులోనే కత్తితో పొడిచి హత్య చేసి నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం శివారులో మృతదేహాన్ని పడేశారు.

కేసు విచారణ వేగవంతం

తేజేశ్వర్ హత్య కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. హత్యకు సుపారీ ఇచ్చిందెవరు..ఎంతమంది వచ్చారు.. వారు వెళ్లేందుకు వినియోగించిన వాహనం.. అసలు తేజేశ్వర్‌ను వారికి పరిచయం చేసిందెవరు.. ఇలా అనేక అంశాలపై విచారణ అధికారులు పలు బృందాలుగా విడిపోయి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సీన్ రీ కన్‌స్ట్రక్షన్



తేజేశ్వర్, సహస్ర (ఫైల్)

తేజేశ్వర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లిన ఘటన, ప్రయాణించిన ప్రదేశాల్లో గుర్తుతెలియని వ్యక్తుల సమాచారం మేరకు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియను సోమవారం సీఐ శ్రీను, ఎస్‌ఐలు కల్యాణ్ కుమార్, మల్లేశ్, శ్రీకాంత్ పరిశీలించారు. గద్వాల నుంచి సంగాల ఔటర్ రింగ్ రోడ్డు అక్కడి నుంచి పూడూరు, ఇటిక్యాల, మొగిలిరావుల చెరువు శివారు, పెబ్బేర్, బీచుపల్లి ఫ్లై ఓవర్, తుంగభద్ర ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. గద్వాల మండలం పూడూరు శివారులోనే తేజేశ్వర్‌ను హత్య చేసినట్టు తెలుస్తోంది. అయితే మృతదేహాన్ని ఓ గోనెసంచిలో చుట్టి కారు డిక్కీలో పెట్టి ఎవరూ లేనిచోట పడేయాలని భావించినట్టు తెలిసింది. అయితే అలా సాధ్యం కాకపోవడంతో నంద్యాల జిల్లాలోని పాణ్యం మండలం పిన్నాపురం శివారులో అర్ధరాత్రి పడేసి కారులోంచి తప్పించుకున్నట్టు అనుమానిస్తున్నారు.

హత్యకు ముందే పరిచయం..

తేజేశ్వర్ భార్య సహస్ర తల్లి సుజాత పుట్టినిల్లు గద్వాలలోని జమిచేడ్ కాగా, కర్నూలుకు చెందిన రామకృష్ణతో వివాహం అనంతరం కల్లూరుకు వెళ్లారు. సుజాత భర్త రామకృష్ణ చనిపోవడంతో కర్నూలు జిల్లా కేంద్రంలో ఓ బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తోంది. అక్కడే బ్యాంకు ఉద్యోగితో పరిచయం పెరిగి, చనువుగా ఉండేది. కూతురు సహస్ర సైతం సదరు ఉద్యోగితో చనువుగా ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వివిధ సందర్భాల్లో సహస్ర తన తల్లితో కలిసి జమిచేడ్‌కు వచ్చిన క్రమంలో దూరపు బంధువు ద్వారా తేజేశ్వర్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులతో వివాహానికి సిద్ధమయ్యారు. అయితే బ్యాంకు ఉద్యోగికి ఈ విషయం తెలిసి వ్యతిరేకించడంతో తేజేశ్వర్‌తో నిశ్చితార్థం రద్దు చేసుకుంది. మరోవైపు బ్యాంకు ఉద్యోగికి ముందే మరో మహిళతో వివాహం కావడం, బ్యాంకు ఉద్యోగి భార్య కట్టడి చేయడంతో సమస్య అక్కడితో ఆగిపోయిందని తెలిసింది. ఆ తర్వాత సహస్ర.. తేజేశ్వర్‌ను మళ్లీ కలిసి పెళ్లికి డబ్బులు లేకపోవడంతో నిరాకరించినట్టు నమ్మించి పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో గత నెల 18న ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం జరిగినట్టు పోలీసులు గుర్తించారు.



కర్నూలు జిల్లా నన్నూర్ టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుల కారు

పోలీసుల అదుపులో అనుమానితులు?

పోలీసులు ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇందులో సహస్ర, సుజాత, బ్యాంకు ఉద్యోగి, హత్యకు పాల్పడిన ముగ్గురు, ఒక ఇన్‌ఫార్మర్ ఉన్నారు. ఈ ఘటనపై గద్వాల సీఐ శ్రీనుతో మాట్లాడగా.. కేసుకు సంబంధించిన అన్ని విషయాలను ఇప్పటికే గుర్తించామన్నారు. హత్యకు పాల్పడిన నిందితుల వివరాలు తెలియాల్సి ఉందని.. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించామని వివరించారు. తాజాగా రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లో పరిశీలించి గద్వాల మండల శివారులోనే తేజేశ్వర్‌ను హత్య చేసినట్టు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుల కోసం ఓ బృందం కర్నూలు జిల్లాలో గాలిస్తున్నట్టు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న వెంటనే పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

చదువుకోవాలని ఉంది.. కానీ పేదరికం అడ్డొచ్చింది!

బాలికకు సాయం చేసిన ట్రాఫిక్ కానిస్టేబుల్

యాదగిరిగుట్ట: ఆ బాలికకు చదువుకోవాలని ఉంది.. కానీ పేదరికం అడ్డొచ్చింది. కుటుంబ పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో అమ్మమ్మతో కలసి భిక్షాటన చేస్తోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో భిక్షాటన చేస్తున్న ఆ బాలికను యాదగిరిగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ పలకరించి, చదివించేందుకు ప్రయత్నం చేశారు. మెదక్ జిల్లా అమీన్‌పూర్‌లోని టైలర్ కాలనీకి చెందిన పార్వతమ్మ, ఆమె 12 సంవత్సరాల మనుమరాలు శిరీషలు పేదరికంతో ఇబ్బంది పడుతున్నారు. శిరీషకు చదువుకోవాలని ఉన్నా పేదరికంతో చదువుకు దూరమైంది. పొట్టకూటికోసం కొంత కాలంగా తన అమ్మమ్మ పార్వతమ్మతో కలసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వైకుంఠద్వారం వద్ద భిక్షాటన చేస్తోంది. ఈ క్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి సోమవారం అటుగా వెళ్తూ బాలికను గమనించి ఆమె వద్దకు వెళ్లారు. చదువుకోకుండా భిక్షాటన ఎందుకు చేస్తున్నావని శిరీషను అడిగారు. దీంతో శిరీష ఏడుస్తూ.. తనకు చదువుకోవాలని ఉన్నా డబ్బులు లేవని, పూటగడవడం కోసం అమ్మమ్మతో కలసి భిక్షాటన చేసేందుకు వచ్చానని చెప్పింది. దీంతో చలించిపోయిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి.. భువనగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన అధికారులు.. శిరీషకు, ఆమె అమ్మమ్మకు కౌన్సెలింగ్ చేసి భువనగిరి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లారు. బాలికకు సాయం చేసిన కానిస్టేబుల్ కోటిని ట్రాఫిక్ సీఐ కృష్ణ అభినందించారు.



యాదగిరిగుట్ట పట్టణంలో భిక్షాటన చేస్తున్న పార్వతమ్మకు, బాలిక శిరీషకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

కొత్త ఆలోచనలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి

- మానేజ్ డీజీ సాగర్ హనుమాన్ సింగ్

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి వ్యవసాయ రంగంలో ఎదగాలంటే క్రమశిక్షణ, సమయపాలనతోపాటు కొత్త ఆలోచనలను అందిపుచ్చుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మానేజ్) డైరెక్టర్ జనరల్ సాగర్ హనుమాన్ సింగ్ సూచించారు. హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక మానేజ్ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్–అగ్రి–బిజినెస్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం–ఏబీఎం) 30వ బ్యాచ్‌ను సోమవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అగ్రి–బిజినెస్ రంగంలో విజయం సాధించడానికి కఠిన శ్రమ, అంకితభావం, నిరంతర అభ్యాసం, వ్యక్తిగత అభివృద్ధి ముఖ్యమని పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ అగ్రి–బిజినెస్ మేనేజ్‌మెంట్ హెడ్ కృష్ణారెడ్డి కొత్త బ్యాచ్‌కు స్వాగతం పలుకుతూ, పీజీడీఎం–ఏబీఎం కార్యక్రమ నిర్మాణం, అకడమిక్ భాగాలు, శిక్షణా విధానాల గురించి వివరించారు. అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఏబీఎం) కార్యక్రమ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ శాస్త్రాల గ్రాడ్యుయేట్‌లను సమర్థవంతమైన అగ్రి–బిజినెస్ నాయకులుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడంలో మానేజ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పీజీడీఎం–ఏబీఎం 30వ బ్యాచ్‌లో దేశంలోని 17 విభిన్న రాష్ట్రాల నుంచి 120 మంది విద్యార్థులు చేరారు. మానేజ్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలెప్పుడు నిర్వహిస్తారు?

▶ మొదటి పేజీ తరువాయి

నల్లగొండ జిల్లా మల్లెపల్లి సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వేద సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల సర్పంచ్ వేణు గోపాల్, నిజాయితీగూడెం సర్పంచ్ మురళీధర్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ టి మాధవీదేవి సోమవారం విచారణ చేపట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లను ఖరారు చేసి, వార్డు సభ్యులు, సర్పంచ్‌ల సీట్లను కులాల వర్గాల వారీగా ప్రకటించడానికి ప్రభుత్వానికి దాదాపు నెల రోజులు అవసరమని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ తెలియజేశారు. ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని, అప్పటి నుంచి రెండు నెలల సమయం పడుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ చెప్పారు.

ఏడాదిన్నర పూర్తయినా ఎన్నికలు లేవు

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్, జి.భాస్కర్‌రెడ్డి, సీహెచ్.నరేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని గత అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చి.. నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మౌన ప్రేక్షకుడిలా వ్యవహరిస్తోందని, ఎన్నికల ఆలస్యంపై రాష్ట్రాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కిషన్‌సింగ్ తోమర్ వర్సెస్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. పరిపాలన ప్రక్రియలు, విధానపరమైన అవసరాలతో కలిగే జాప్యాలను కారణాలుగా చూపుతూ ఎస్ఈసీ ఆ తీర్పును ఉల్లంఘించజాలదని చెప్పారు. సకాలంలో ఎన్నికలు జరిగేలా చూడటంలో ఎస్ఈసీ స్వతంత్రత, విధి అని నొక్కి చెప్పారు. విపత్తులు లాంటి అసాధారణ పరిస్థితుల్లో తప్ప ఎన్నికలు వాయిదా వేయడానికి వీలు లేదన్నారు. 2024, జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిందన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాలపరిమితి ముగిసిన తర్వాత ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. దాదాపు ఏడాదిన్నర అవుతున్నా ప్రభుత్వం, ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించడం లేదని నివేదించారు. తాజా మాజీ సర్పంచ్‌లను పక్కన పెట్టి గ్రామ పంచాయతీలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 243ఈ, 243కేను, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 నిబంధనలను ఉల్లంఘించడమేనని వాదించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులను అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో తమ గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు కొందరు సర్పంచ్‌లు వ్యక్తిగతంగా నిధులు సమకూర్చారని, ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్కార్, ఎస్ఈసీ మరింత సమయం కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పిటిషన్లలో తీర్పును రిజర్వు చేసింది.

సాగు అంతంతే

▶ మొదటి పేజీ తరువాయి

కురుస్తున్న తేలకపాటి వర్షాలతో రైతులు మళ్లీ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బావులు, బోర్ల కింద చాలా చోట్ల నార్లు పోసి, దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా చూస్తే కేవలం 33 వేల ఎకరాల్లో వరి సాగైంది. కాలువలు, చెరువులు, ప్రాజెక్టుల నుంచి సాగునీటి లభ్యత, నీటి విడుదలపై స్పష్టత రాకపోవడం, వర్షాలు కూడా సరిగ్గా లేకపోవడంతో మెజారిటీ చోట్ల దుక్కులు దున్నడం లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. పత్తి, జొన్న, మక్కలు, ఇతర తృణధాన్యాల సాగుతోపాటు కంది, పెసర, సోయాబీన్ వంటి పంటల సాగు విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చింది. ఈ వానాకాలంలో కోటీ 35 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు కేవలం 20 లక్షల ఎకరాల్లోపే వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఈ సమయంతో పోలిస్తే...ఆరు లక్షల విస్తీర్ణం తక్కువగా ఉంది.

- గత సంవత్సరం ఇప్పటి వరకు 21 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా, అదిప్పుడు 16 లక్షల ఎకరాలకే పరిమితమైంది. రాష్ట్రంలో ఈసారి 50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారని అంచనా వేశారు. వర్షాలు లేకపోవడం వల్లనే పత్తి సాగు విస్తీర్ణం పెరగలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.
- పత్తి తర్వాత అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో సోయాబీన్ 1.25 లక్షల ఎకరాల్లో సాగైంది.
- మక్కలు సుమారు 50 వేల ఎకరాల్లో సాగు చేయగా, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో ఉంది.

విత్తనాలు, ఎరువులపై ఆందోళన

పత్తి విత్తనాలకు సంబంధించి వివిధ శాఖలు చేసిన ఆపరేషన్ కొంత విజయవంతమైంది. జిల్లా స్థాయిలో పోలీస్, వ్యవసాయ శాఖ, సీడ్ సర్టిఫికేషన్ అధికారులు కలిసి నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో చాలా చోట్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. నిషేధిత బీటీ–3 విత్తనాలను కూడా సీజ్ చేశారు. అయినా ఇంకా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నిజామాబాద్ తదితర చోట్ల నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వ్యవసాయ శాఖ పోలీస్ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది.

- ఎరువులకు సంబంధించి రైతుల్లో ఆందోళన మొదలైంది. పత్తితోపాటు వరికి యూరియా, డీఏపీ అవసరం కాగా, యూరియా కేటాయింపులకు తగినట్టుగా కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేయలేదు. జూన్ నెలాఖరు వరకు 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 3 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చింది. రామగుండంలోని ఎరువుల ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి ఇటీవలే తిరిగి ప్రారంభం కావడంతో సమస్య ఉండదని మార్క్‌ఫెడ్ జీఎం విష్ణు 'సాక్షి'కి తెలిపారు. కాగా కేంద్ర ప్రభుత్వం యూరియా 9.8 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు డీఏపీ కూడా ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఈ సీజన్‌కు కేటాయించింది. సాగు విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో యూరియా, డీఏపీ కేటాయింపుల కన్నా ఎక్కువ అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. దొడ్డు యూరియా సరఫరా చేయడం లేదని, సన్న యూరియాతో ఇబ్బందులు ఉన్నట్టు రైతులు వాపోతున్నారు.

కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచారు



కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచింది. పంటల సాగు మొదలు పెట్టాలనుకుంటున్న రైతులకు యూరియా కొరత సమస్యగా మారింది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచితే బాగుంటుంది.

– కాలసాని నరసింహారెడ్డి, జమాండ్లపల్లి

దొడ్డు యూరియా సరఫరా చేయాలి



సహకార సంఘాల్లో మొత్తం దుమ్ముతో కూడిన సన్నపు యూరియానే సరఫరా చేస్తున్నారు. పొలాల్లో చల్లడానికి ఇది ఏమాత్రం అణువుగా ఉండదు. చల్లడానికి కూడా ఎక్కువ సమయం తీసుకుంటుంది. రైతులకు అనువుగా ఉండే దొడ్డు యూరియాను సరిపడా సకాలంలో సరఫరా చేస్తే బాగుంటుంది.

– నోముల తిరుపతిరెడ్డి, నల్లవెల్లి

మా భూములకు పట్టాలు ఇవ్వండి

- సచివాలయం వద్ద నారాయణపురం రైతుల ఆందోళన



సచివాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నారాయణపురం గ్రామ రైతులు

సాక్షి, హైదరాబాద్/కేసముద్రం: తాము గత 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాల పట్టాభూములను 2017లో ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అటవీ భూములుగా పేర్కొంటూ, పట్టాలు రద్దు చేసిందని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ భూములు తమకు చెందేలా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సచివాలయం వద్ద పలువురు రైతులు ఆందోళన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీవో 94 జారీ చేసి రైతు పేరు, తండ్రి పేరు అనే చోట వస్తున్న అడవి అనే పదం తొలగించారని కానీ, గ్రామంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఆరు నెలలు గడిచినా అధికారులు పాస్ పుస్తకాల జారీ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. పాస్ పుస్తకాలు లేకపోవడంతో దాదాపు 600 మంది రైతులకు పంట రుణాలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, ఇతర ప్రభుత్వ పథకాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూభారతి చట్టం గురించి మాట్లాడుతూ, నారాయణపురం గ్రామ సమస్యను ప్రస్తావించినా.. ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూభారతి చట్టం కింద తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, తమ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని కోరారు.

కుటుంబం ఆత్మాహుతికి యత్నం

- తండ్రి మానసిక క్షోభకు గురి చేస్తున్నాడని హోటల్‌కు నిప్పుపెట్టుకున్న వైనం



మంటల్లో కాలిపోతున్న హోటల్

హుస్నాబాద్ రూరల్: తండ్రి పెడుతున్న మానసిక క్షోభతో ఓ కుటుంబం ఆత్మాహుతికి యత్నించింది. ఈ సంఘటన హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. జాగిరి సాయి దంపతులు కిషన్‌నగర్‌లో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అతని తల్లి, సోదరుడు కూడా సాయి దగ్గరే ఉంటున్నారు. అయితే తండ్రి రెండో పెళ్లి చేసుకొని హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. అప్పటి నుంచి కుటుంబంలో తగాదాలు ఎక్కువయ్యాయి. తమ తండ్రి తమకు తెలియకుండానే ఇంటి స్థలం మరొకరికి విక్రయించారని, దీంతో తమకు దారి లేకుండా పోయిందని సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నాడు. తండ్రి మానసిక క్షోభకు గురి చేస్తుండటంతో జీవితంపై విరక్తి చెందారు. హోటల్‌పై పెట్రోల్ పోసి నలుగురు కుటుంబ సభ్యులు అందులోనే ఉండి నిప్పు పెట్టుకున్నారు. చుట్టుపక్కలవారు మంటలను గమనించి వారిని కాపాడారు. అయితే ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి ప్రమాదాన్ని నివారించారు. దీనిపై ఎస్సై మహేశ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు. ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడులు

ఖతార్‌లోని అమెరికా స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులు

- కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని యూఎస్ బేస్‌లపైనా దాడి జరిపినట్లు వార్తలు
- ఆపరేషన్ బేషరత్ ఫతాహ్ పేరిట మిస్సైళ్లతో మెరుపుదాడి
- వైట్‌హౌజ్ సిచ్యుయేషన్ రూమ్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న ట్రంప్
- ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ దాడుల పర్వం కొనసాగింపు
- అంతకుముందే ముప్పేట దాడులుచేసిన ఇజ్రాయెల్
- ఆరు ఇరాన్ సైనికవిమానాశ్రయాలపై ఇజ్రాయెల్ బాంబుల వాన
- 15 యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు నాశనం
- ఇరాన్‌ను గొప్పగా మార్చలేని ప్రస్తుత ప్రభుత్వం అవసరమా? అని ప్రశ్నించిన ట్రంప్


దోహా గగనతలంలో ఇరాన్ క్షిపణులు

టెహ్రాన్/టెల్ అవీవ్/దోహా/వాషింగ్టన్/న్యూఢిల్లీ: కీలక అణుక్షేత్రంపై భారీ బాంబులేసి వినాశనం సృష్టించిన అగ్రరాజ్యంపై ఇరాన్ యుద్ధాగ్రహంతో దూసుకెళ్లింది. తన క్షిపణులకు పనిచెప్పింది. ఖతార్‌లోని అమెరికా వైమానికస్థావరంపై సోమవారం రాత్రి క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలపైనా దాడిచేసినట్లు వార్తలొచ్చాయి. దోహా నగర సమీపంలోని అల్–ఉదేయిద్ అమెరికా ఎయిర్‌బేస్‌పై ఆరు స్వల్ప శ్రేణి, మధ్యస్థాయి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడులకు ఇరాన్ 'ఆపరేషన్ బేషరత్ ఫతాహ్' అని పేరుపెట్టింది. ఇరాక్‌లోని అయిన్ అల్ అసద్ బేస్‌పై ఇరాన్ రాకెట్లను ప్రయోగించింది. అయితే ఇక్కడ ఏ స్థాయిలో ధ్వంసం జరిగిందనేది తెలియరాలేదు. అయితే క్షిపణులను తమ గగనతల రక్షణవ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని అమెరికా ప్రకటించింది. తమ స్థావరాలపై దాడుల నేపథ్యంలో శ్వేతసౌధంలోని సిచ్యుయేషన్ రూమ్‌కు వెళ్లి తాజా పరిస్థితిపై రక్షణ మంత్రి హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డ్యాన్ కెయిన్, ఉన్నతాధికారులతో అధ్యక్షుడు ట్రంప్ సమీక్ష జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పలు దేశాల్లోని స్థావరాలపై ఇరాన్ క్షిపణులు దూసుకొస్తుండటంతో సమీప దేశాలు అప్రమత్తమయ్యాయి. తమ గగనతలాలను మూసేశాయి. తమ పైనా యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు కువైట్, ఖతార్, బహ్రెయిన్ ప్రకటించాయి. అల్ ఉదేయిద్ ఎయిర్‌బేస్ నుంచి జూన్ 19వ తేదీలోపే కీలక యుద్ధ, ఇంధన విమానాలను అమెరికా సురక్షితంగా వేరే చోటుకు తరలించినట్లు తాజా ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఉదేయిద్ బేస్‌లో ఏకంగా 10,000 మంది అమెరికా సైనికులు ఉంటారు. గత పాతికేళ్లుగా దీనిని అమెరికా వాడుతోంది. ఈ బేస్‌పై దాడులు చేయబోతున్నట్లు ఖతార్ ప్రభుత్వానికి ఇరాన్ కొన్నినిమిషాల ముందే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పేలుళ్ల శబ్దాలు దోహా సిటీదాకా వినిపించాయి. దీంతో ఎవరూ బయటకు రావొద్దని సంస్థలు, విద్యాలయాలు, ఆఫీస్‌లకు ప్రభుత్వం వెంటనే సందేశాలు పంపింది. ఆరుబయటకు రావొద్దని ఖతార్‌లోని తమ పౌరులకు భారత్, అమెరికా, బ్రిటన్ ఎంబసీలు అడ్వైజరీలు జారీచేశాయి. ఖతార్ గగనతలాన్ని మూసేయడంతో దోహాసిటీకి వెళ్లాల్సిన రెండు ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు మార్గమధ్యంలో వెనుతిరిగాయి. కొచ్చి నుంచి మస్కట్‌కు అక్కడి నుంచి కన్నూర్‌కు తిరిగి వచ్చినట్లు ఎయిర్‌ఇండియా తెలిపింది. ప్రస్తుతం ఖతార్‌లో తమ విమానమేదీ లేదని పేర్కొంది.

అమెరికా అండతో చెలరేగిన ఇజ్రాయెల్

అగ్రరాజ్యం అమెరికా భీకర బాంబుదాడులు చేసి, అండగా ఉన్నానని అభయ హస్తమివ్వడంతో సోమవారం ఇజ్రాయెల్ ఇరాన్‌పై చెలరేగిపోయింది. కారాగారం, మిలటరీ విమానాశ్రయాలు, స్వచ్ఛంద సంస్థ, రెవల్యూషనరీ గార్డ్ కోర్ ప్రధాన కార్యాలయం, అణుకేంద్రం, ప్రభుత్వ ఆఫీస్... ఇలా ఇరాన్‌లోని భిన్న రంగాల భవనాలపై క్షిపణి దాడులతో ఇజ్రాయెల్ పేలుళ్ల మోత మోగించింది. కీలక ఫోర్డో పర్వతగర్భ యురేనియం శుద్ధి కర్మాగారంపై తన వంతుగా క్షిపణి దాడులు చేసి మరింత వినాశనానికి పాల్పడింది. వేల కేజీల బాంబులను అమెరికా పడేసి విధ్వంసం సృష్టించిన మరుసటిరోజే ఇజ్రాయెల్ ఇదే న్యూక్లియర్ సెంటర్‌పై దాడులకు దిగింది. టెహ్రాన్‌లోని మిలటరీ కేంద్రాలపై ఏకంగా 50 యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఆరు ఇరాన్ ఆర్మీ ఎయిర్‌పోర్ట్‌లలో నిలిపి ఉంచిన ఎఫ్–15, ఎఫ్–5, ఏహెచ్–1 విమానం సహా 15 యుద్ధవిమానాలు, హెలికాప్టర్లను ధ్వంసంచేసింది. రన్‌వేలపై బాంబులేసింది. టెహ్రాన్‌లోని పాలస్తీన్ స్క్వేర్, రెవల్యూషనరీ గార్డ్ కోర్ ప్రధాన కార్యాలయంపై, బసీజ్ వాలంటీర్ కోర్ భవనంపై దాడులు చేసింది. ఉత్తర టెహ్రాన్‌లోని ప్రముఖ మానవతా సంస్థ 'ఇరానియన్ రెడ్ క్రిసెంట్' భవనంపైనా ఇజ్రాయెల్ నిర్దయగా బాంబులేసింది. దీంతో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ సైతం దీటుగా బదులిచ్చింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్3' పేరిట హైఫా, టెల్ అవీవ్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులను ఉధృతం చేసింది.

వ్యూహాత్మకంగా కారాగారంపై..

యుద్ధంలో సాయుధ బలగాలతోపాటు నిరాయుధ ఖైదీలుండే ఎవిన్ జైలు పైనా ఇజ్రాయెల్ గురిపెట్టింది. అయితే ఖైదీల గదులపై కాకుండా కారాగారం ప్రధాన ద్వారాన్ని బద్దలకొడుతూ డ్రోన్ దాడులుచేసింది. దీంతో గేటు తునాతునకలైంది. ఇరాన్ పాలకుల నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుపాలైన ఉద్యమకారులు, విపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను విడిపించేందుకే ఇలా డ్రోన్‌తో గేటును ధ్వంసంచేశారని తెలుస్తోంది.

ప్రభుత్వాన్ని పడగొట్టడంపై ట్రంప్ దృష్టి

ఇరాన్‌ను ఏలుతున్న సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీ రాజకీయవర్గాన్ని గద్దె దింపాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఆయన మాటల్లో స్పష్టమైంది. సోమవారం ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. '' ఇరాన్‌ను ప్రస్తుత ప్రభుత్వం గొప్ప దేశంగా అవతరింపజేయడంలో ఘోరంగా విఫలమైంది. ఇలాంటి విఫల ప్రభుత్వం అధికారంలో కొనసాగడం ఎంతవరకు సబబు అనిపించుకుంటుంది?' అని ట్రంప్‌వ్యాఖ్యానించారు. ఇరాన్‌ను ప్రభుత్వాన్ని కూల్చేఉద్దేశం తమకు లేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి హెగ్సెత్ మాట్లాడిన కొన్ని గంటలకే ట్రంప్ ఇలా తన మనసులో మాట బయటపెట్టారు.

ఘర్షణ తగ్గేందుకు కృషిచేస్తానన్న పుతిన్

అమెరికా జోక్యం చేసుకోవడంతో రష్యా మద్దతు కూడగట్టేందుకు మాస్కోకు వెళ్లి అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రయత్నం కొంతమేర ఫలించింది. పశ్చిమాసియాను రణరంగం నుంచి శాంతిపథంలోకి పయనింపజేసేందుకు తన వంతు కృషిచేస్తానని, ఈ విషయంలో ఇరాన్‌కు సాయపడతానని పుతిన్ సోమవారం ప్రకటించారు. '' ఇరాన్‌పై దుస్సాహసంతో అమెరికా, ఇజ్రాయెల్ దాడులుచేశాయి. అణుబాంబు తయారీకి ఎలాంటి ఆధారాలు లేకున్నా, సరైన కారణాలు లేకుండా పశ్చిమాసియాను కదనరంగంగా మార్చేసి ఇజ్రాయెల్, అమెరికా అంతర్జాతీయ ఒడంబడికల తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడ్డాయి'' అని పుతిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిక్కడు.. దొరకడు!

ఇజ్రాయెల్ దాడులతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ

- ఆయన ఆచూకీ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు
- కంటికి రెప్పలా కాపాడుకుంటున్న భద్రతా దళాలు
- ఖమేనీ కోసం వేట సాగిస్తున్న ఇజ్రాయెల్ నిఘా వర్గాలు

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నానాటికీ తీవ్రరూపం దాలుస్తోంది. దాడులు, ప్రతిదాడులకు పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధంలోకి అమెరికా సైతం అడుగుపెట్టడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. ఇజ్రాయెల్‌తోపాటు అమెరికాపై కత్తులు నూరుతున్న అసలు కథానాయకుడు, ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఇప్పుడు ఎక్కడున్నారు? అనేది టాప్ సీక్రెట్‌గా మారింది. దశాబ్దాలుగా ఇరాన్‌ను మకుటం లేని మహారాజులా ఏలుతున్న 86 ఏళ్ల ఖమేనీ కోసం ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వేట సాగిస్తున్నాయి. ఆయనకు విదేశాల్లోనే కాదు, సొంత దేశంలోనూ శత్రువులున్నారు. ఖమేనీ ఆచూకీ దొరికితే సజీవంగా బంధించి, చట్టప్రకారం శిక్షించడమో లేక అక్కడికక్కడే అంతం చేయడమో తథ్యమని పశ్చిమ దేశాల మీడియా అంచనా వేస్తోంది. ఇరాన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్టించాలంటే ఆయన ప్రాణాలతో ఉండడానికి వీల్లేదని ఇజ్రాయెల్, అమెరికా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ భౌతికంగా లేకుండాపోతేనే ఈ యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేయడం గమనార్హం. ''ఖమేనీ ఆధునిక హిట్లర్. అతడు బతికి ఉండడానికి వీల్లేదు'' అని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ సైతం అన్నారు.

చావుకు భయపడే మనిషి కాదు

ఇరాన్‌లో ఈ నెల 12న ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడికి దిగింది. ఆ వెంటనే ఖమేనీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గుర్తుతెలియని ప్రాంతంలో అత్యంత పటిష్టమైన భద్రత కలిగిన బంకర్‌లో ఆయన క్షేమంగా ఉన్నట్లు ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. సుశిక్షితులైన బాడీగార్డులు ఆయనకు రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. ఖమేనీ కచ్చితంగా ఎక్కడున్నారో ఎవరికీ తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) అత్యున్నత స్థాయి అధికారులకు సైతం ఖమేనీ ఆచూకీ గురించి



తెలియదని అంటున్నారు. ఇజ్రాయెల్ నిఘా వర్గాలకు ఏమాత్రం ఉప్పందకుండా ఇరాన్ సర్కారు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఖమేనీని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. ఉన్నత శ్రేణి భద్రతా దళం నిరంతరం ఆయనకు కాపలా కాస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఖమేనీ ప్రాణాలకు ఎవరూ హానీ తలపెట్టే అవకాశం లేకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమేనీ చావుకు భయపడే మనిషి కాదని, ఇరాన్ భవిష్యత్తు కోసం ఆయన ప్రాణాలతో ఉండడం అవసరమని అన్నారు.

అమెరికా దాడుల తర్వాత బంకర్‌లోకి..

సాధారణ పరిస్థితుల్లో ఖమేనీ సెంట్రల్ టెహ్రాన్‌లోని ఓ కాంపౌండ్‌లో ఉంటారు. అక్కడి నుంచి విధులు నిర్వర్తిస్తారు. మిలటరీ కమాండర్లు, అధికారులతో ప్రతివారం సమావేశమవుతారు. ప్రజలతో మాట్లాడాలన్నా ఇక్కడే. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరు. ఇజ్రాయెల్ దాడులు మొదలైన వెంటనే ఖమేనీ బంకర్‌లోకి వెళ్లలేదని సమాచారం. బయటే ఉంటూ ప్రతిదాడికి వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 21న అమెరికా సైన్యం యుద్ధరంగంలోకి అడుగుపెట్టిన తర్వాతే ఆయన బంకర్‌లోకి చేరుకున్నారు. మూడు ప్రధాన అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఖమేనీ మరింత అప్రమత్తమయ్యారు. తన విశ్వాసపాత్రులైన అనుచరులు, సహాయకులతోనూ కమ్యూనికేషన్ తగ్గించుకున్నారు. ఫోన్లు ఉపయోగించడం ఆపేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉంటున్నారు. శత్రువులకు తన ఆచూకీ చిక్కకుండా ఉండడానికే ఈ జాగ్రత్త. శత్రువుల చేతికి చిక్కితే మరణాన్ని చేతులారా ఆహ్వానించినట్లేనని ఖమేనీని బాగా తెలుసు. ఆయనను ఖతం చేయడానికి ఇజ్రాయెల్ ఇప్పటిదాకా చేయని ప్రయత్నమే లేదు. ఇజ్రాయెల్ ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఎంతోమందిని హత్య చేసింది. కొద్ది రోజుల క్రితమే పేజర్ బాంబులతో హెజ్‌బొల్లా నాయకులను మట్టుబెట్టింది. ఖమేనీని మాత్రం కనీసం టచ్ చేయలేకపోయిందంటే ఆయన ఎంత సురక్షితంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ''ఏదో ఒకరోజు ఇజ్రాయెల్ నన్ను చంపేయడం ఖాయం. దేశం కోసం వీరమరణం పొందడం నాకు సంతోషమే'' అని కొన్నేళ్ల క్రితం ఖమేనీ వ్యాఖ్యానించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎదురులేని ఖొర్రంషహర్

- ఇరాన్ అమ్ములపొదిలో కీలక అస్త్రం
- 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే ఆయుధం

ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా సైన్యం బంకర్ బస్టర్ బాంబులు, క్షిపణులు ప్రయోగించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది. ఖొర్రంషహర్–4 మిస్సైల్ సహా మొత్తం 40 క్షిపణులు ప్రయోగించినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ)ప్రకటించింది. ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలను ఛేదించామని వెల్లడించింది. ఖొర్రంషహర్–4 క్షిపణి ప్రయోగ దృశ్యాలు ఇరాన్ ప్రభుత్వ టీవీ చానల్‌లో ప్రత్యక్షమయ్యాయి. ఇది ఇరాన్ అమ్ములపొదిలో అత్యంత కీలకమైన అస్త్రం అని చెప్పొచ్చు. ఇరాన్‌కు ఇదే అతిపెద్ద క్షిపణి కావడం గమనార్హం. ఇరాన్‌లోని ఖొర్రంషహర్ అనే నగరం పేరునే దీనికి పెట్టారు. ఖైబర్ మిస్సైల్ అని కూడా అంటారు. 1980వ దశకంలో ఖొర్రంషహర్‌లో ఇరాక్–ఇరాన్ మధ్య భారీ యుద్ధం జరిగింది. ప్రస్తుతం సౌదీ అరేబియాలో ఉన్న యూదుల కోట 'ఖేబర్'ను 7వ శతాబ్దంలో అప్పటి పర్షియా(ఇరాన్) పాలకులు అక్రమించారు.

- ఖొర్రంషహర్–4ను ఇరాన్ ప్రభుత్వ రంగంలోని ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ఆర్గనైజేషన్(ఏఐఓ) అభివృద్ధి చేసింది. ఇది ద్రవ ఇంధనంతో నడిచే మీడియం–రేంజ్ బాలిస్టిక్ క్షిపణి.
- తొలిసారిగా 2017 జనవరిలో పరీక్షించారు. 2017 సెప్టెంబర్‌లో టెహ్రాన్ మిలటరీ పరేడ్‌లో ప్రజల కోసం మొదటిసారి బహిరంగంగా ప్రదర్శించారు.
- ఈ క్షిపణి పొడవు 13 మీటర్లు. వ్యాసం 1.5 మీటర్లు. బరువు 19.5 టన్నులు. పరిధి 2,000 కిలోమీటర్లు. 1,800 కిలోల వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు. కానీ, దీని పరిధి 2,500 కిలోమీటర్లకుపైగా ఉంటుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఈజిప్టు, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, రొమేనియా, బల్గేరియా, గ్రీస్ దేశాలు ఈ మిస్సైల్ పరిధిలోకి వస్తాయి.
- ఖొర్రంషహర్–4 టార్గెట్ ఏరియాకు చేరుకున్న తర్వాత ఏకంగా 80 లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగలదని అంటున్నారు. అత్యంత వేగంతో ప్రయాణిస్తూ శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థల నుంచి సులువుగా తప్పించుకోగలదని సమాచారం. అంటే ఈ క్షిపణిని



మధ్యలోనే కూల్చివేయడం దాదాపు అసాధ్యమే. ఒక్కసారి గురిపెడితే లక్ష్యాన్ని తాకాల్సిందే.

- ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థకు అసలైన ముప్పు ఖొర్రంషహర్–4 నుంచే పొంచి ఉంది. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ కానీ, డేవిడ్ స్లింగ్ కానీ దీన్ని అడ్డుకోలేవు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పోయి చెప్పులు కుట్టుకో!

- ఇండిగో ట్రైనీ పైలట్‌పై సహోద్యోగుల వివక్షపూరిత వ్యాఖ్యలు
- ముగ్గురిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు

న్యూఢిల్లీ: ప్రైవేట్ విమానాయాన సంస్థ ఇండిగోలో ట్రైనీ పైలట్‌పై కుల వివక్ష పూరిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఆఫీసులో తన కుమారుడిపై ముగ్గురు సహోద్యోగులు దుర్భాషలాడారని బాధితుడు శరణ్‌కుమార్ తండ్రి అశోక్‌కుమార్ తెలిపారు. కాక్‌పిట్‌లో కూర్చోవడానికి, విమానం నడపడానికి అర్హతలేదని, వెళ్లి చెప్పులు కుట్టుకోవాలంటూ తన కొడుకును అవమానపరిచారని ఆయన పేర్కొన్నారు. బాధితుని తండ్రి ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇండిగోలో పనిచేస్తున్న శరణ్‌కుమార్ వేతనంలో అనధికార కోతలు విధించారు. ఎలాంటి కారణం లేకుండా సిక్‌లీవ్స్‌ను తగ్గించారు. సిబ్బంది ప్రయాణం, ఏసీఎమ్ సౌకర్యాలను రద్దు చేశారు. చివరకు రాజీనామా చేయాలంటూ లేఖ జారీ చేశారు. దీంతో ఆయన దిద్దుబాటు శిక్షణ పొందవలసి వచ్చింది. అయితే.. దీనిపై ప్రశ్నించినందుకు సహచరులు తపస్ డే, మనీష్ సహానీ, రాహుల్ పాటిల్‌లు శరణ్‌కుమార్‌పై కుల వివక్షపూరిత వ్యాఖ్యలు చేశారు. 'మా ముందు కూర్చుని, మ మ్మల్ని వివరణ అడిగే ధైర్యం ఉందా? ఈ భవనంలో వాచ్‌మన్‌గా ఉండే అర్హత కూడా లేని నువ్వు వివరణ అడుగుతున్నావా? మీరు విమానం నడపడానికి అర్హులు కాదు. తిరిగి వెళ్లి చెప్పులు కుట్టండి. మీరు షూ తుడవడానికి కూడా పనికి రారు' అంటూ అవమానించారు. ఈ విషయాన్ని ఇండిగో ఎయిర్‌లైన్స్ సీఈఓ, ఎథిక్స్ కమిటీకి నివేదించినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో.. శరణ్ తండ్రి అశోక్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సహోద్యోగులు నిరంతరం తన కుమారుడిని లక్ష్యంగా చేసుకుని వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తన కొడుకును అవమానించే ఉద్దేశంతోనే కులం గురించి స్పష్టంగా ప్రస్తావించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఫిర్యాదు ఆధారంగా, ముగ్గురు నిందితులపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గగనతల నిషేధాన్ని మళ్లీ పొడిగించిన పాక్

ఇస్లామాబాద్: భారత విమానాలపై విధించిన గగనతల నిషేధాన్ని మరో నెలపాటు పొడిగిస్తున్నట్లు పాకిస్తాన్ సోమవారం తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో ఏప్రిల్ 23న మొదటిసారిగా ఈ నిషేధాన్ని పాక్ నెలపాటు విధించింది. అనంతరం మే 23న నిషేధాన్ని నెల రోజులు పొడిగించింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించడంతో మరోసారి జూన్ 23 నుంచి జూలై 23వ తేదీ వరకు గగనతల నిషేధాన్ని పొడిగిస్తూ పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ తాజాగా నోటమ్ ఉత్తర్వులు జారీ చేసింది. భారత్‌లో రిజిస్టరైన విమానాలు, భారత్ సొంత, నిర్వహించే లేదా లీజుకు తీసుకున్న మిలటరీ సహా అన్ని విమానాలకు పాక్ గగనతలంలోకి అనుమతి లేదని అందులో పేర్కొంది.

జమ్మూలో ల్యాండవ్వకుండానే ఎయిరిండియా విమానం వాపస్

జమ్మూ: ఢిల్లీ– శ్రీనగర్ వయా జమ్మూకు బయలుదేరిన ఎయిరిండియా విమానం సోమ వారం ల్యాండవ్వకుండానే తిరిగి ఢిల్లీకి చేరుకుంది. ఢిల్లీ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం టేకాఫ్ తీసుకున్న ఈ విమానం ముందుగా జమ్మూలో ఆగాల్సి ఉంది. అయితే, జమ్మూ విమానాశ్రయంపై కొద్దిసేపు చక్కరు కొట్టిన విమానం నేరుగా తిరిగి ఢిల్లీకే వచ్చింది. జమ్మూలో ఆ సమయంలో వాతావరణం, రన్ వే క్లియరెన్స్ అన్నీ బాగానే ఉన్నాయని అధికారులు తెలిపారు, ల్యాండింగ్ ప్రాంతం సరిగా లేకపోవడంతోనే పైలట్ వెనుదిరగాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందని అధికారులు వివరించారు. ఎయిరిండియా ఈ పరిణామంపై స్పందించలేదు.

గుజరాత్‌లో బీజేపీకి బిగ్ షాక్

- విసావదర్ ఉప ఎన్నికలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం
- పంజాబ్‌లో ఆప్, బెంగాల్‌లో తృణమూల్, కేరళలో యూడీఎఫ్ గెలుపు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) బీజేపీకి గట్టి షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, ఒక స్థానంలో అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ పార్టీ ఘన విజయం సాధించింది. మరో స్థానంలో అధికార బీజేపీ నెగ్గింది. లూథియానా వెస్ట్(పంజాబ్), కాళీగంజ్(పశ్చిమ బెంగాల్), కాడీ, విసావదర్(గుజరాత్), నీలంబూర్(కేరళ) శాసనసభ స్థానాలకు ఈనెల 19న ఉప ఎన్నికలు జరిగాయి. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. విసావదర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గోపాల్ ఇటాలియా ఘన విజయం సొంతం చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గోపాల్ ఇటాలియాకు 75,942 ఓట్లు రాగా, కిరీట్ పటేల్‌కు 58,000 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో విసావదర్ నుంచి గెలుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే భయానీ భూపేంద్రభాయ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. తమ సిట్టింగ్ స్థానాన్ని ఆప్ నిలబెట్టుకుంది. కాడీ ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి రాజేంద్ర చావ్డా 39,000 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే కర్సాన్ సోలంకీ మృతిచెందడంతో ఉప ఎన్నిక జరిగింది. పంజాబ్‌లోని లూథియానా వెస్ట్‌లోనూ ఆప్ మళ్లీ గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి సంజీవ్ అరోరా కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్‌పై 10 వేల ఓట్ల మెజార్టీతో నెగ్గారు. బీజేపీ అభ్యర్థి జీవన్ గుప్తా మూడో స్థానంలో నిలిచారు. లూథియానా వెస్ట్‌లో ఆప్ ఎమ్మెల్యే గుర్‌ప్రీత్‌బస్సీ గోగీ మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. బెంగాల్‌లోని కాళీగంజ్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత అలీఫా అహ్మద్ బీజేపీ అభ్యర్థి ఆశీష్ ఘోష్‌పై 50,000 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అలీఫా తండ్రి, తృణమూల్ ఎమ్మెల్యే నజీరుద్దీన్ అహ్మద్ మృతిచెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. కేరళలోని నీలంబూర్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అభ్యర్థి అర్యదన్ షౌకత్ వామపక్ష అభ్యర్థి ఎం.స్వరాజ్‌పై 11,000 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నీలంబూర్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ వాద్రా ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.


విసావదర్ నుంచి గెలిచిన ఆప్ నేత గోపాల్

గుజరాత్, పంజాబ్‌లో మాదే విజయం: కేజ్రీవాల్

గుజరాత్, పంజాబ్ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థుల విజయం పట్ల ఆప్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ సోమవారం హర్షం వ్యక్తంచేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికలకు ఇది సెమీఫైనల్ అని, ఇందులో తామే గెలిచామని స్పష్టంచేశారు. రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లను ఓటర్లు పూర్తిగా తిరస్కరించడం ఖాయమని అన్నారు. ఆప్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.

మా వాటా ఇవ్వండి.. లేకుంటే యుద్ధమే

సిందూ జలాలపై భుట్టో వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: సిందూ నదీ జలాల ఒప్పందం ప్రకారం న్యాయమైన నీటి వాటాను భారత్ తమకు ఇవ్వకుంటే మరోసారి యుద్ధం తప్పదని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చీఫ్, ఆ దేశ మాజీ మంత్రి బిలావల్ భుట్టో పేర్కొన్నారు. సోమవారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడారు. ఒప్పందం నుంచి భారత్ వైదొలగడం అన్యాయమంటూ ఆయన, ఇందుకు ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. 'భారత్‌కు రెండు మార్గాలున్నాయి. న్యాయంగా రావాల్సిన నీటి వాటాను పంచడం, లేదా సిందూ పరీవాహకప్రాంతంలోని మొత్తం ఆరు నదుల నీటిని మేమే తీసుకోవడం'అని బిలావల్ పేర్కొన్నారు. సిందూ నదీ జలాలను నిలిపివేయడం ఐరాస నిబంధనలకు వ్యతిరేకమన్నారు.

ఇరాన్‌పై దాడులను ఖండించిన ఉత్తర కొరియా

ప్యాంగ్యాంగ్: ఇరాన్‌పై అమెరికా దాడులను ఉత్తర కొరియా సోమవారం తీవ్రంగా ఖండించింది. ఇది సార్వభౌమ దేశ భద్రతా ప్రయోజనాలు, ప్రాదేశిక హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికాల నిరంతర యుద్ధ ఎత్తుగడలు, ప్రాదేశిక విస్తరణ కాంక్ష ఈ ఉద్రిక్తతలకు కారణమని, వీటిని పశ్చిమ దేశాలు అంగీకరించి ప్రోత్సహించాయని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. ఇరాన్‌పై దాడులను ప్రపంచమంతా ఖండించాలని పిలుపునిచ్చింది.

ఒంటరి తల్లుల సంతానానికి ఓబీసీ సర్టిఫికెట్

మార్గదర్శకాలు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఒంటరి తల్లుల పిల్లలకు ఓబీసీ(ఇతర వెనుకబడిన కులాల)సర్టిఫికెట్ల జారీకి సుప్రీంకోర్టు అంగీకరించింది. ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపింది. తద్వారా తండ్రి వైపు నుంచి ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే వీటిని మంజూరు చేసేందుకు అవకాశం ఏర్పడనుంది. 'ఒంటరి తల్లుల పిల్లలకు ఓబీసీ సర్టిఫికెట్ జారీకి సంబంధించిన చాలా ముఖ్యమైన అంశమిది. ఒంటరి తల్లి ఓబీసీకి చెందిన వారైతే ఆమె కుల ధ్రువీకరణ ఆధారంగా ఆమె పిల్లలకూ ఓబీసీ సర్టిఫికెట్ జారీ చేయాలని పిటిషనర్ కోరుతున్నారు. ప్రస్తుతమున్న మార్గదర్శకాల ప్రకా రం తండ్రి, లేదా రక్త సంబంధీకులు ఓబీసీకి చెందిన వారైతేనే ఆ పిల్లలకు ఓబీసీ సర్టిఫికెట్ అందజేస్తున్నా రు. దీని వల్ల ఒంటరి తల్లులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు'అని సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం పేర్కొంది. 'ఈ అంశం చాలా ముఖ్యమైంది. కొన్ని అంశాలను పరిష్కరించిన తర్వాత మార్గదర్శకాలను జారీ చేస్తాం'అని జస్టిస్ విశ్వనాథన్ వాదనల సందర్భంగా పేర్కొన్నారు. 'విడాకులు తీసుకున్న ఒక మహిళ పిల్లల ఓబీసీ కులధ్రువీకరణ పత్రం కోసం మాజీ భర్త వద్దకు ఎలా వెళ్లగలదు?'అని ఆయన ప్రశ్నించారు. ఈ పిటిషన్‌పై ఈ ఏడాది ఫిబ్రవరిలో విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సోమవారం విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున వాదనలు వినిపించారు. 2012 నాటి రమేశ్‌భాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించారు. ఒంటరి తల్లుల పిల్లలకు ఓబీసీ సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను వెలువ రించాలని విన్నవించారు. ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను జూలై 22వ తేదీకి వాయిదా వేసింది.

గంటకు 160 కిలోమీటర్లు

నమో భారత్ రైలు ట్రయల్ సక్సెస్

న్యూఢిల్లీ: నమో భారత్ రైళ్లలో దేశ రాజధాని ఢిల్లీ నుంచి మీరట్‌కు గంటలోపే చేరుకునే రోజులు ఎంతో దూరంలో లేవు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎన్‌సీఆర్‌టీసీ) ఆదివారం ఈ మార్గంలో నమో భారత్ రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు 82 కిలోమీటర్ల కారిడార్‌లో ఉన్న అన్ని స్టేషన్లలో ఆగుతూనే గంటలోపే గమ్యాన్ని చేరుకుంది. దేశంలోనే మొట్టమొదటి రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్) ఢిల్లీ– ఘజియాబాద్–మీరట్ మార్గంలో ఇదో కీలక మైలురాయి అని ఎన్‌సీఆర్‌టీసీ పేర్కొంది. ప్రయోగ పరీక్ష సమయంలో నమోభారత్ రైలు గంటకు 160 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని అందుకుందని తెలిపింది. ఇదే సమయంలో సమాంతరంగా మీరట్ మెట్రో రైళ్లు కూడా నడిచాయని తెలిపింది. హై–స్పీడ్ రీజినల్ రైలు మార్గంలో లోకల్ మెట్రో రైళ్లు నడవడం ఇదే మొదటిసారని పేర్కొంది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 24 । జూన్ । 2025



తక్కువ ధరకు బంగారమంటూ..

చౌటుప్పల్‌కు చెందిన ఓ రియల్టర్ కర్ణాటక ముఠా చేతిలో మోసపోయాడు. తక్కువ ధరకు బంగారం పేరుతో ఆ ముఠా రూ.65 లక్షలు స్వాహా చేసింది. -8లో



క్రేజీ ఆట.. టేస్టీ బాట..

క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు రెస్టారెంట్ బిజినెస్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో వారి వ్యాపార రంగానికి నగరం ఒక తిరుగులేని గమ్యంగా చేసుకుంటున్నారు. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఘనంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్స్ స్ఫూర్తిని చాటేందుకు నిర్వహించే వార్షిక 'ఒలింపిక్ డే రన్' సోమవారం ఘనంగా జరిగింది. ఒలింపియన్లు, మాజీ క్రీడాకారులు, అర్జున అవార్డ్ గ్రహీతలు, కోచ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో వర్ధమాన క్రీడాకారులు, పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఒలింపిక్ జ్యోతిని వెలిగించి నగరంలోని 14 కేంద్రాల నుంచి రన్ నిర్వహించారు. ఆ తర్వాత అన్ని వైపుల నుంచి వచ్చిన ర్యాలీలతో కలిపి ఎల్బీ స్టేడియంలో ప్రధాన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా జ్యోతిని స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోనీబాలా దేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల డెహ్రాడూన్ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పతకాలు సాధించిన 33 మంది క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలు అందజేశారు. - గన్‌ఫౌండ్రీ



150 బృందాలను రెడీ చేసిన హైడ్రా

- ప్రతిదాంట్లోనూ ఒక డీఆర్ఎఫ్ అధికారి
- పర్యవేక్షణ బాధ్యతల్లో బల్దియా ఇంజినీర్లు
- 'సాక్షి'తో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



మాన్సూన్ టీమ్స్ సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో:

వర్షాకాలం నేపథ్యంలో సర్వకాల సర్వావస్థల్లోనూ సేవలు అందించడానికి 150 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను సిద్ధం చేసినట్లు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రతి బృందం తమ విధులకు సంబంధించి జవాబుదారీగా ఉండటానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ టీమ్స్‌కు సంబంధించి ఆయన సోమవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. రంగనాథ్ తెలిపిన వివరాలివి...

ఈసారి వ్యూహం మార్చి ఏర్పాటు...

విపత్తు సమయంలో స్పందించడం, సహాయక చర్యలు అందించడం హైడ్రా ఆధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) ప్రధాన విధి. తొలిసారిగా మాన్సూన్ బృందాల నిర్వహణను సైతం ప్రభుత్వం హైడ్రాకు అప్పగించింది. ఈ నేపథ్యంలో గతానికి భిన్నంగా వ్యూహం మార్చి ముందుకు వెళ్తున్న హైడ్రా అందుకు తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన 150 మాన్సూన్ టీమ్స్ ఎంపిక పూర్తి చేశారు. గతంలో ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఉండేవారు. వీరంతా నిర్ణీత కాలానికి కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసే వారు కావడంతో జవాబుదారీతనం కొరవడేది. దీంతో హైడ్రా ఈ బృందాల స్వరూపాన్ని మార్చింది.

మూడు షిఫ్టుల్లో ముగ్గురు చొప్పున...

ఈసారి ఒక్కో మాన్సూన్ టీమ్‌లో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఒక్కో టీమ్ ఎనిమిది గంటల చొప్పున... రోజుకు మూడు బృందాలు నిర్విరామంగా సిద్ధంగా ఉంటాయి. ప్రతి బృందంలోనూ డీఆర్ఎఫ్ నుంచి ఓ అధికారి విధుల్లో ఉంటారు. ఆ టీమ్ ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఎలాంటి ఆపరేషన్స్ చేపడుతోంది? విపత్తు సమయంలో స్పందన ఏంటి? తదితర అంశాల పర్యవేక్షణ డీఆర్ఎఫ్ అధికారి చేపడతారు. మొత్తం 150 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను 90 మంది మార్షల్స్ నేతృత్వం వహిస్తుంటారు. రెస్క్యూ ఆపరేషన్స్‌లో అనుభవం ఉన్న మాజీ సైనికోద్యోగులు మార్షల్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జీహెచ్ఎంసీ, జల మండలితో సమన్వయం ఏర్పాటు చేసుకుంటున్న హైడ్రా అధికారులు మాన్సూన్ ఆపరేషన్స్‌లో సహాయం కోసం ఆరుగురు జీహెచ్ఎంసీ ఇంజినీర్లను వినియోగిస్తున్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

వర్షాకాలంలో తలెత్తే వాటర్ లాగింగ్, ట్రాఫిక్ జామ్, వరదలు తదితర సందర్భాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి హైడ్రా ప్రత్యేక కంట్రోల్ రూమ్ సైతం సిద్ధం చేసింది. ఇవి 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. నగరవాసులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సి వచ్చినా 90001 13667, 87124 06901, 040-2955 5500 నెంబర్లలో సంప్రదించవచ్చు. వీటితో పాటు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ నెం.040-2111 1111కు కాల్ చేసీ సహాయం పొందవచ్చు.

రీల్స్ కోసం.. బైకుపై ఎనిమిది మంది

- ప్రమాదకర స్టంట్‌పై పోలీసులకు ఫిర్యాదు..వెంటనే అరెస్టు



ద్విచక్ర వాహనంపై స్టంట్ చేస్తున్న ఎనిమిది మంది యువకులు

రాజేంద్రనగర్: ఒకరు కాదు..ఇద్దరు కాదు..ఏకంగా ఎనిమిది మంది యువకులు ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంపై అర్ధరాత్రి రీల్స్ కోసం స్టంట్ చేశారు. జాతీయ రహదారిపై ఈ స్టంట్ కొనసాగుతుండటంతో ఈ దారి గుండా వెళ్తున్న వారు తమ సెల్‌ఫోన్‌లో బంధించి ఎక్స్ వేదికగా పోస్టు చేసి..సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది యువకులు ద్విచక్ర వాహనంపై శంషాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు పయనమయ్యారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు మైనర్లతో పాటు ఐదుగురు యువకులు పయనిస్తూ రీల్స్ చేశారు. ప్రమాదభరితంగా స్టంట్‌లు చేశారు. ఈ దృశ్యాలను అటుగా వెళుతున్న పలువురు చిత్రీకరించి ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఈ రహదారి రాత్రి సమయాల్లో బిజీగా ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో వీఐపీల రాకపోకలతో అలర్ట్‌గా ఉంటుంది. ఈ స్టంట్ విషయమై పలువురు సైబరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సోమవారం గుర్తించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఐదుగురు యువకులను, ముగ్గురు మైనర్లను రాజేంద్రనగర్ పోలీసులకు సోమవారం సాయంత్రం అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ ఆస్తులెన్నంటే..

డ్రోన్ ఆధారిత జీఐఎస్ సర్వేతో వెల్లడవుతున్న వివరాలు

- కబ్జాలకు తావు లేకుండా ఇక కట్టుదిట్టమైన చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి ఎన్నో ఆస్తులున్నాయి. వాటిల్లో కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు, చెరువులు, పార్కులు, స్పోర్ట్స్ స్టేడియంలు, ఆటస్థలాలు, ఫంక్షన్‌హాళ్లు, పబ్లిక్ టాయ్‌లెట్లు తదితరమైనవెన్నో ఉన్నాయి. అయినా తమకున్న ఆస్తులేమిటో, ఏవి ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నాయో, ఏ దుస్థితిలో కునారిల్లుతున్నాయో, ఏ అక్రమార్కుల కబ్జాలో చిక్కుకున్నాయో, ఎక్కడ ఏ ప్రైవేటు పెత్తనంతో ఉన్నాయో కూడా జీహెచ్ఎంసీ అధికారులకు తెలియదు. అంతెందుకు ఒక పార్కు సమీపంలోని స్థలం కబ్జా అయితే అది జీహెచ్ఎంసీదా, కాదా, అనేది మేయర్‌కు సైతం తెలియలేని పరిస్థితుల్లో ఆ ఆస్తులున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఒక మంచి నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఆస్తులను గుర్తించే పని చేపడుతోంది. ఆస్తిపన్ను ఆదాయం పెంచుకునేందుకు ప్రజల ఆస్తుల సర్వే చేపట్టిన జీహెచ్ఎంసీ..తమ ఆస్తుల్ని కూడా తెలుసుకునేందుకు పనిలోపనిగా 'డ్రోన్ బేస్డ్ జీఐఎస్ సర్వే'ను ప్రారంభించింది.

ఇప్పటి వరకూ పూర్తయిన సర్వే వివరాల మేరకు..

ఏవి	ఎన్ని
ఆటస్థలాలు	578
పార్కులు	1342
పబ్లిక్ టాయ్‌లెట్స్	758
స్విమ్మింగ్‌పూల్స్	14
స్పోర్ట్స్ కాంప్లెక్సులు	37

వీటి సర్వే ఇలా...

సర్వేలో భాగంగా ఆటస్థలాలు, పార్కులు, పబ్లిక్ టాయ్‌లెట్లు, స్పోర్ట్స్ కాంప్లెక్సుల వివరాలు క్రోడీకరించి.. వాటిని జియో మ్యాపింగ్ కూడా చేశారు. అక్షాంక్ష, రేఖాంశాలతో సహ మ్యాపింగ్ చేయడంతో ఇక జీహెచ్ఎంసీ ఆస్తులు ఏ లొకేషన్‌లో, ఏ స్థితిలో ఉన్నాయో కూడా అధికారులు తెలుసుకునే సౌలభ్యం ఏర్పడింది. కానీ, కమ్యూనిటీ హాళ్ల వంటి వాటి సర్వే ఇంకా చేపట్టలేదు. చాలా వరకు కమ్యూనిటీ సెంటర్లు స్థానిక లీడర్లు, కార్పొరేటర్ల చేతుల్లో ఉన్నాయి. ఎప్పుడైనా జీహెచ్ఎంసీకి ఏదైనా అవసరం వచ్చినా వాటి తాళాలు ఎవరి దగ్గర ఉన్నాయో తెలియక వెతుక్కునే పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీ హాళ్ల విషయంలో గట్టి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.



కట్టుదిట్టమైన చర్యలు

మొత్తానికి జీహెచ్ఎంసీ ఆస్తుల్ని జీఐఎస్ పోర్టల్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు. వాటిని కబ్జాల పాలు కాకుండా, జులాయిలు తిష్టవేయకుండా చూస్తామని, అద్దెల కివ్వడం, అవసరమైన సేవలందించడం ద్వారా ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతామని అధికారులు చెబుతున్నారు.

చెరువులతో పాటు నాలాల ఆక్రమణ



నగరంలోని అనేకచోట్ల ఇదే పరిస్థితి

- హైడ్రా ప్రజావాణిలో 52 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: నగరం అనేక ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలకు గురయ్యాయి. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్వహించిన ప్రజావాణిలో వీటికి సంబంధించి 52 ఫిర్యాదులు అందాయి. ఆరు మీటర్ల వెడల్పు ఉండాల్సిన వరద కాలువలు రెండు మీటర్లకే పరిమితం కావడం పైనా ఫిర్యాదులు వచ్చాయి. మియాపూర్‌లోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో రహదారిని కబ్జా చేసి అడ్డుగా ప్రహరీ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ రోడ్డును తన పూర్వీకుల ఆస్తిగా పేర్కొంటూ కొందరు తొమ్మిది నెలల క్రితం ప్రీకాస్ట్ వాల్ నిర్మించారని, ఆపై గది, తాత్కాలిక షెడ్ నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అల్వాల్ పరిధిలోని రిట్రీట్ కాలనీలో నాలా ఆక్రమణ జరిగిందంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. లాయోలా కాలేజ్ సమీపంలో 12 అడుగుల నాలాపై ఓయో గదులు నిర్మించడంతో పాటు, బహుళ అంతస్తుల భవనం కూడా నిర్మించారని హైడ్రాకు తెలిపారు. కొండాపూర్‌లోని కాంతీవనం కాలనీలో 2220 గజాల పార్కును ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 218/11, 12, 13 సర్వే నంబర్లలో ఉన్న ఈ భూమిలోని పార్కును 1996 నుంచి వాకింగ్ కోసం వినియోగిస్తూ వస్తున్నారు. జీహెచ్ఎంసీ పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించడానికి నిధులు కూడా మంజూరు చేసినా ఈ పనులను ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని హైడ్రాకు తెలిపారు. కొహెడ గ్రామ పరిధిలోని 141 సర్వే నంబరులో13 ఎకరాల పిట్టి చెరువును మాయం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఏసీబీ వలలో జీహెచ్ఎంసీ ఏఈ



ఏఈ మనీషా

అంబర్‌పేట: కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ టి.మనీషా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒప్పందం ప్రకారం రెండోవిడత లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ సంఘటన సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్-16 పరిధిలోని గోల్నాక వార్డు కార్యాలయంలో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..మనీషా సర్కిల్ పరిధిలో నల్లకుంట డివిజన్ ఏఈగా కొంత కాలం పని చేసి ప్రస్తుతం గోల్నాక డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. డివిజన్ పరిధిలోని ఓ అభివృద్ధి పనిని కాంట్రాక్టర్ దక్కించుకుని పూర్తి చేశాడు. దాని బిల్లు కోసం సదరు కాంట్రాక్టర్ ఏఈని అడుగగా ఆమె రూ.15 వేలు లంచం డిమాండ్ చేసింది. దీంతో కాంట్రాక్టర్ మొదటి విడతగా రూ.5 వేలు ఇచ్చాడు. రెండో విడత అందించేందుకు ముందు అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సోమవారం గోల్నాక వార్డు కార్యాలయంలో ఏఈకి డబ్బులు అందించాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఏఈ మనీషా ఏసీబీకి పట్టుబడక ముందు అభివృద్ధిపై ఎమ్మెల్యే నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షా సమావేశం పూర్తి కాకముందే అనుమతి తీసుకుని బయటకు వచ్చి ఏసీబీకి పట్టబడడం గమనార్హం.

ప్రజావాణికి అధికారులు రావాల్సిందే..!

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరుకావాల్సిందేనని కలెక్టర్ హరిచందన దాసరి స్పష్టం చేశారు. హాజరు కానీ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి అధికారులంతా సమయానికి హాజరై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో అందించే దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష చేస్తూ వచ్చే సోమవారం నాటికి పరిష్కరించాలని, వచ్చే ప్రజావాణిలో మరోసారి సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల సమస్యలను ఓర్పుగా విని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

దయాస్ దిగి..

ప్రజావాణికి వీల్‌చెయిర్‌లో వచ్చిన వికలాంగ వృద్ధ మహిళను గుర్తించిన కలెక్టర్ హరిచందన స్వయంగా దయాస్ నుండి దిగివచ్చి ఆమె నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఆమె సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారిని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ హరిచందన

ఇక స్టీల్ బాటిల్స్

పర్యావరణ హిత దృక్పథంతో కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల స్థానంలో స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించడం ప్రజావాణి కార్యక్రమంతో శ్రీకారం చుట్టారు. తదుపరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఇదే తరహా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

రెండు నిమిషాలు మౌనం

హైదరాబాద్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిషిత గుండెపోటుతో మృతి చెందడంతో ప్రజావాణి కార్యక్రమంలో ఆమెకు నివాళులర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి.ముకుందరెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు ఆశన్న, కోటాజి, సీపీఓ డాక్టర్ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఇన్‌చార్జి డీఆర్ఓ శ్రీధర్, ఏవో కలెక్టరేట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి వచ్చిన వికలాంగ మహిళ సమస్య వింటున్న కలెక్టర్ హరిచందన

ఇక ఇందిరమ్మ మోడల్ కాలనీలు!

జీ ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణాల యోచన

- 15 ఏరియాల్లో ప్రభుత్వ స్థలాల గుర్తింపు
- మరికొన్ని స్థలాల గుర్తింపు కోసం సర్వే
- ఇన్‌సిటూ కింద నివాసితులకు కేటాయింపు
- గ్రేటర్ పరిధిలో 84 వేల ఇళ్ల నిర్మాణాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గూడు లేని నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు స్థానికంగానే ఇందిరమ్మ మోడల్ కాలనీలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జీహెచ్ఎంసీ పాలక వర్గం కాలపరిమితి మరో ఎనిమిది నెలలో ముగిసి ఎన్నికలు రానుండడంతో స్థానికంగా పట్టు సాధించేందుకు ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపై దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాల స్థానంలో భవిష్యత్తులో నిర్వహణ భారం లేకుండా జీ ప్లస్ త్రీ పద్ధతిలో చిన్నపాటి భవన సముదాయాలను నిర్మించాలని నిర్ణయించింది. అందులో ఇన్ సిటూ కింద అక్కడి నివాసితులకు ఇళ్లను కేటాయించి మిగిలిన ఇళ్లను అర్హులైన సమీప స్థానికులకు మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలనియోచిస్తోంది.

ప్రభుత్వ స్థలాల గుర్తింపు సర్వే

నగరంలో ఇరవై ఏళ్లకుపైగా పేదలు నివసిస్తున్న ప్రభుత్వ స్థలాల (మురికి వాడలు)పై రెవెన్యూ యంత్రాంగం దృష్టిసారించింది. అర్బన్ డివిజన్ల వారిగా గుర్తించేందుకు సర్వేకు దిగింది. ఇప్పటికే హైదరాబాద్ జిల్లా పరిధిలో సుమారు 15 ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించింది. సైదాబాద్‌లోని సరళదేవినగర్, పిల్లి గుడిసెలు, మారేడుపల్లిలోని అంబేద్కర్ నగర్, గురుబ్రహ్మ నగర్, ఆసిఫ్‌నగర్ మండలంలోని 4 బస్తీలు, మెహిదీపట్నంలోని మాంగార్‌బస్తీ తదితర ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. జూబ్లీహిల్స్‌లోని 9 ఎకరాలు, అంబేద్కర్ నగర్‌లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిపై కూడా సర్వే నిర్వహిస్తోంది. అయితే డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయాలు నిర్మించిన తరహాలోనే బస్తీల్లోని గుడిసెలు కూల్చి అక్కడే గృహ సముదాయాలు నిర్మిస్తామంటుండంతో పేదలు పెద్దగా ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. మొత్తం ఎనిమిది మండలాల్లోని 15 బస్తీలను ఇళ్ల నిర్మాణానికి ఎంపిక చేయగా అందులో సగానికి పైగా బస్తీ వాసుల నుంచి పెద్దగా సుముఖత వ్యక్తం కానట్లు సమాచారం. అయినప్పటికి వారికి సర్దిచెప్పి ఒప్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు..?

ఇందిరమ్మ మోడల్ కాలనీలో జీ ప్లస్ త్రీ భవన సముదాయాల్లో సింగిల్ బెడ్ రూమ్ చొప్పున ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల కొరత కారణంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కాకుండా సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తే రెట్టింపు కుటుంబాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఒక్కో లబ్ధిదారునికి 400 స్క్వేర్ ఫీట్స్(చదరపు అడుగుల) విస్తీర్ణంలో సింగిల్ బెడ్‌రూం ఫ్లాటును ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొదటి విడతగా కనీసం సుమారు 3500 ఇళ్ల చొప్పున 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెరసి 84 వేల ఇళ్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తులు లక్షల్లో..

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గూడు లేని నిరుపేదల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలనలో సుమారు 24 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయి. అందులో దాదాపు 70 శాతం వరకు కుటుంబాలకు గూడులేదని, కనీసం స్థలం లేదని డిక్లరేషన్ ఇచ్చారు. మొత్తం మీద ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాల్లో హైదరాబాద్ జిల్లావాసులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మేడ్చల్, రంగారెడ్డి జిల్లా నుంచి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. గత ఆరు నెలల క్రితం దరఖాస్తులపై క్షేత్రస్థాయి సర్వేలో 'ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్'లో వివరాలు నమోదు చేసి అర్హులను గుర్తించారు. కేవలం హైదరాబాద్‌లోనే లక్ష కుటుంబాలు అర్హులుగా ఉన్నట్లు తేలింది. మిగతా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కూడా అర్హుల జాబితా అధికంగానే ఉన్నట్లు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థి అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో నివసించే ఎండీ అఖిల్ కార్ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. ఆయన కుమారుడు అమన్ షాదాన్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. ఈనెల 21న ఉదయం కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా తిరిగి రాకపోయేసరికి తల్లిదండ్రులు స్నేహితుల కుటుంబ సభ్యులను ఆరా తీశారు. రెండు రోజులు గడిచినా అమన్ పాషా ఆచూకీ దొరకలేదు. ఫోన్ చేస్తే కొన్నిసార్లు రింగ్ కావడం మరికొన్నిసార్లు ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడం గమనించారు. ఆచూకీ దొరకపోవడంతో తండ్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యంతాగి స్కూల్ వ్యాన్ నడిపిన డ్రైవర్



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన నీరజ్ పబ్లిక్ స్కూల్ వ్యాన్ డ్రైవర్

బంజారాహిల్స్: వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం సాయంత్రం వేర్వేరు చోట్ల స్కూల్ బస్సుల డ్రైవర్లకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డ్రంక్ అండ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అమీర్‌పేట్ నుంచి విద్యార్థులను తీసుకెళ్తున్న లాల్ బంగళాలోని నీరజ్ పబ్లిక్ స్కూల్ వ్యాన్ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా, మైత్రివనం, జూబ్లీహిల్స్‌లోని డైమండ్ హౌజ్, ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తా, యూసుఫ్‌గూడ బస్తీ, తదితర ప్రాంతాల్లో ఆయా పోలీస్ స్టేషన్ల ట్రాఫిక్ పోలీసుల వందకుపైగా బస్సులను ఆపి డ్రైవర్లకు శ్వాస పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ వ్యాన్ డ్రైవర్ పట్టుబడ్డారని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ తెలిపారు. తాజ్‌కృష్ణా వద్ద జరిగిన డ్రంక్ డ్రైవ్‌లో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే కూడా పాల్గొన్నారు.

కలెక్టరేట్ 'ప్రజావాణి'కి 117 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 117 ఫిర్యాదులు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూకబ్జాలు తదితర వాటిపై కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు.

తక్కువ ధరకు బంగారమంటూ టోకరా!

చౌటుప్పల్ వ్యాపారి నుంచి రూ.65 లక్షలు స్వాహా
- చాదర్‌ఘాట్‌లోని ఎంజీబీఎస్ సమీపంలో ఘటన
- కర్ణాటకకు చెందిన ప్రధాన సూత్రధారి పట్టివేత
- రూ.40 లక్షలు రికవరీ, పరారీలో మరో ఇరువురు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ డాక్టర్ బాలస్వామి, అదనపు డీసీపీ నర్సయ్య తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: చౌటుప్పల్‌కు చెందిన ఓ రియల్టర్ వ్యాపారాభివృద్ధి కోసం తన పేరు, ఫోన్ నెంబర్ కార్యాలయంపై రాసుకోవడమే శాపమైంది. అలా లభించిన ఫోన్ నెంబర్ ఆధారంగా ఆయనకు కాల్ చేసిన కర్ణాటక ముఠా తక్కువ ధరకు బంగారం పేరుతో రూ.65 లక్షలు స్వాహా చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న అఫ్జల్‌గంజ్ పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. ఫలితంగా ప్రధాన సూత్రధారిని పట్టుకోవడంతో పాటు రూ.40 లక్షలు రికవరీ చేసినట్లు తూర్పు మండల డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సోమవారం తెలిపారు. అదనపు డీసీపీ జె.నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ ఎం.మట్టయ్యలతో కలిసి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ మోసాలు...

కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన కొన్ని ముఠాలు తెలుగు రాష్ట్రాలనే టార్గెట్‌గా చేసుకుని మోసాలు చేస్తున్నాయి. పొలం దున్నుతుంటేనో, పాత ఇంటిని కూలుస్తుంటేనో నిధి లభించిందని చెప్తారు. అందులో ఉన్న బంగారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా దాచామని, సగం ధరకే ఇస్తామంటూ ఎర వేస్తారు. వీళ్లు టార్గెట్లను ఎంచుకోవడానికి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ వ్యాపార ప్రకటనలు, దుకాణాలపై ఉన్న పేర్లు, ఫోన్ నెంబర్లు ఎంచుకుంటారు. వీరి వల్లోపడుతున్న వారిలో అత్యధికులు రియల్టర్లు, చిన్న స్థాయి బంగారం వ్యాపారులే ఉంటున్నారు. ఇలాంటి ముఠాల్లో తాళ్ల వ్యాపారి జయ కుమార్‌ది ఒకటి. తన బావ మరిది ఉదయ్, స్నేహితుడు సందీప్‌తో కలిసి రంగంలోకి దిగాడు.

బోర్డుపై ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా...

చౌటుప్పల్‌కు చెందిన మునుకుంట్ల నిరంజన్ అక్కడి భరత్‌నగర్ కాలనీలో శ్రీ బాలాజీ రియల్ ఎస్టేట్స్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. జయ కుమార్ నేతృత్వంలోని ముఠా ఈ ఏడాది మార్చిలో ద్విచక్ర వాహనాలపై సిటీకి వచ్చింది. చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో సంచరిస్తూ టార్గెట్ల కోసం అన్వేషించింది. చౌటుప్పల్‌లో సంచరిస్తున్నప్పుడు వారి కంట్లో నిరంజన్ కార్యాలయం బోర్డు పడింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా రెడ్డి పేరుతో ఉదయ్ సంప్రదించాడు. సగం ధరకు బంగారమంటూ ఎర వేశాడు. అదే నెల్లో రూ.25 వేలు తీసుకుని అరతులం బంగారం ఇచ్చాడు. దీన్ని పరీక్షించిన నిరంజన్ మేలిమి బంగారంగా తెలుసుకున్నారు. ఆపై తన స్నేహితుడు దేవేందర్‌తో కలిసి రూ.65 లక్షలకే కేజీ ఖరీదు చేయడానికి సిద్ధయ్యారు. ఈ సందర్భంలో వీరితో రఘు పేరుతో సందీప్ కూడా సంప్రదింపులు జరిపాడు.

'అంబర్‌పేట' నుంచి అఫ్జల్‌గంజ్ వరకు...

గత నెల 12న కేజీ బంగారం సిద్ధంగా ఉందని ఫోన్ చేసిన రఘు నగదు తీసుకుని పెద్ద అంబర్‌పేట రమ్మని చెప్పాడు. దీంతో నిరంజన్ (రూ.45 లక్షలు), ఇతడి స్నేహితుడైన ధర్మేంద్ర (రూ.20 లక్షలు) ఇద్దరూ కలిసి రూ.65 లక్షలు తీసుకుని తమ కారులో పెద్ద అంబర్‌పేటకు వచ్చారు. నిరంజన్‌తో ఫోనులో సంప్రదింపులు జరుపుతున్న రెడ్డి... అక్కడ నుంచి వారిని ఎల్బీ నగర్‌కు, ఆపై దిల్‌సుఖ్‌నగర్ రప్పించి చివరకు ఎంజీబీఎస్ సమీపంలోకి రమ్మన్నారు. అక్కడ వీరిని కలిసిన రఘు వారి వాహనంలోనే ఎక్కాడు. కొద్దిసేపటికి ద్విచక్ర వాహనంపై వచ్చిన జయ కుమార్, రెడ్డి బంగారం ఉందంటూ ఓ బ్యాగ్ ఇచ్చి, నగదుతో కూడిన బ్యాగ్ పట్టుకుపోయారు. అప్పటి వరకు వారితోనే ఉన్న రఘు సైతం దృష్టి మళ్లించి మరో వాహనంపై ఉడాయించాడు. నిరంజన్ ఆ బ్యాగ్ తెరిచి చూడగా... పైన చీరలు, కింద నాపరాళ్లు కనిపించడంతో మోసపోయినట్లు గుర్తించాడు.

ముమ్మరంగా గాలించిన ప్రత్యేక బృందం...

బాధితుల ఫిర్యాదుతో అఫ్జల్‌గంజ్ ఠాణాలో కేసు నమోదు కాగా... ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి, డీఐ రవికిరణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక అంశాలతో పాటు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా నిందితుల ఆచూకీ కనిపెట్టారు. నిందితుల కోసం కర్ణాటకతో పాటు నగరంలోనూ ముమ్మరంగా గాలించారు. సోమవారం ఎంజీబీఎస్ వద్దకు కారులో చేరుకున్న జయ కుమార్‌ను పట్టుకున్నారు. ఇతడి నుంచి కారుతో పాటు రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.25 లక్షలు ఉదయ్, సందీప్ వద్ద ఉన్నట్లు జయ కుమార్ బయటపెట్టాడు. దీంతో పరారీలో ఉన్న వారిద్దరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

ప్రజావాణిపై శ్రద్ధ ఏదీ?

- పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు
- టౌన్ ప్లానింగ్ విభాగానికే అత్యధిక అర్జీలు

లక్డీకాపూల్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా మారింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అనేక పర్యాయాలు అర్జీలు సమర్పించాల్సి వస్తోంది. ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించే అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ముషీరాబాద్ సర్కిల్‌లో 'అర్జీ సమర్పించడమే కానీ..సమస్య పరిష్కారం కావడం లేదని' ఓ ఫిర్యాదుదారుడు వాపోయాడు. కాగా జీహెచ్ఎంసీ వ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 224 అర్జీలు అందాయి.

సత్వరమే పరిష్కరించండి : కమిషనర్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి కమిషనర్ స్వయంగా వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. సీఈ లు రత్నాకర్, నిత్యానంద అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, నళిని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల కొకైన్ స్వాధీనం

- ముగ్గురి రిమాండ్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

రాజేంద్రనగర్: గోవా నుంచి కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ ముఠాను నార్సింగి, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 107 గ్రాముల కొకైన్, 25 గ్రాముల మత్తు పదార్థాల పిల్స్ (మాత్రలు), ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.30 లక్షల ఉంటుందని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సాయంత్రం డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నైజీరియా దేశానికి చెందిన ఓనేకా (22) 2022లో స్టూడెంట్ వీసాపై నకిలీ పాస్‌పోర్టుతో గుజరాత్‌కు వచ్చాడు. నకిలీ పాస్‌పోర్టు కేసులో ఇతన్ని పాస్‌పోర్టును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. 2024లో నైజీరియాకు వెళ్లిన ఓనేకా తన ఒరిజనల్ పాస్‌పోర్టుతో భారతదేశానికి వచ్చి గోవాలో ఉంటున్నాడు. 2022 నుంచి ఇతనికి నైజీరియా నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న బాచీతో సంబంధాలు ఉన్నాయి. కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను విక్రయించడం ప్రారంభించాడు. ఇందులో భాగంగా మణికొండకు చెందిన వెడ్డింగ్ ప్లానర్ గోపిశెట్టి రాజేశ్ (40)తో పరిచయం ఏర్పడింది. ఇతని స్నేహితుడు రాజమండ్రికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బొమ్మ దేవర వీరరాజు (32) పరిచయం ఏర్పడింది. వీరు ముగ్గురు కలిసి గతంలో మత్తు పదార్థాలను సరఫరా చేశారు. గచ్చిబౌలి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారు. జైలుకు వెళ్లి వచ్చినా వీరి దందా మారలేదు. గోవాకు వెళ్లి ఓనేకా కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలను తీసుకొచ్చాడు. వీటిని గత నెలలో మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో జరిగిన రేవ్ పార్టీతో మోకీలాలో, గత నెల 31వ తేదీన మంగళగిరిలో పణిరాజుకు కొకైన్‌ను విక్రయించారు. మిగిలిన కొకైన్‌తో పాటు మత్తు పదార్థాలను తమకున్న పరిచయాలతో వాట్సాప్ ద్వారా విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న నార్కోటిక్ అధికారులు, పోలీసులు మణికొండ అల్కాపురిలోని గోపిశెట్టి రాజేశ్ ఇంటిపై దాడి చేశారు. ముగ్గురు నిందితులతో పాటు 107 గ్రాముల కొకైన్, 25 గ్రాముల మత్తు పదార్థాల మాత్రలు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల సెల్‌ఫోన్లలో కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను ఎవరెవరికి సరఫరా చేశారన్న సమాచారాన్ని సేకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. సెల్‌ఫోన్ వాట్సాప్ గ్రూపుల్లో ఇందుకు సంబంధించిన చాటింగ్‌ను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

15 సార్లు చెక్‌బౌన్స్.. ఫంక్షన్‌హాల్ సీజ్

- అధికారులపై ఫంక్షన్‌హాల్ యజమాని చిందులు



క్రౌన్ ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అంబర్‌పేట: ఆస్తి పన్ను చెల్లించని ఫంక్షన్‌హాల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. సుమారు రూ.30 లక్షలు బకాయి ఉందని పలు మార్లు నోటీసులు ఇచ్చినప్పటికి చెల్లించకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ఫంక్షన్‌హాల్ యాజమాని జీహెచ్ఎంసీ కార్యాలయంలో వీరంగం సృష్టించాడు. నా ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేస్తారా అంటూ దుర్భాలషాడారు. ఏకంగా డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లి హంగామా సృష్టించాడు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్-16 పరిధిలో చోటు చేసుకుంది. జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం...అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో క్రౌన్ ఫంక్షన్‌హాల్ ఉంది. దీనిపై దాదాపు రూ.30 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉండడంతో అధికారులు పలు మార్లు నోటీసులు కూడ జారీ చేశారు. అంతేకాకుండా గత జనవరిలో ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయినా ఫంక్షన్ హాల్ యాజమాని ఎప్పటికప్పుడు చెక్కులు ఇవ్వడం వాటిని బౌన్స్ చేయడం చేసుకుంటూ వస్తున్నాడు. ఇప్పటి వరకు అతని 15 మార్లు చెక్కులు బౌన్స్ అయ్యాయని జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. చివరకు ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేయడంతో యాజమని హైమద్ అధికారులపై చిందులువేశారు. అబిడ్స్‌లో ఉన్న సర్కిల్ కార్యాలయంలో హంగామా చేయడంతో అధికారలు బెంబేలెత్తిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధపడడంతో అతని కుమారులు అతికష్టం మీద అతన్ని అక్కడి నుంచి తీసుకువచ్చారు. అతని చర్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పరిశీలిస్తున్నమన్నారు. ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో చెల్లించాల్సిందేనని డీఎంసీ మారుతి దివాకర్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపు కోసం చెక్‌లు ఇచ్చి వాటిని బౌన్స్ చేస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

రూ.42 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్: విశాఖపట్నం నుంచి హర్యాణకు కారులో గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.42 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం మేడ్చల్ జోన్ డీసీపీ ఎస్.కోటిరెడ్డి, సైబరాబాద్ ఎస్ఓటి డీసీపీ డి.శ్రీనివాస్‌లు మీడియాకు వివరాలను వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. కర్నాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా మద్బూల్ తండాకు చెందిన ఐదుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణాను వ్యాపారంగా ఎంచుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని సరఫరా చేస్తు విలాసాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ఈ ముఠాలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న సాగర్ పవార్(23) ఈ నెల 22న కారులో విశాఖపట్నం నుంచి హర్యాణాకు కారులో గంజాయిని తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ జోన్ ఎస్ఓటి, దుండిగల్ పోలీసులు దుండిగల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్-5 వద్ద కారును ఆపి తనిఖీ చేయగా కారులో గంజాయి దొరికింది. రూ.42 లక్షలు విలువ చేసే 120 కిలోల గంజాయి, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ప్రధాన సూత్రధారి దేవరాజ్ అలియాస్ సచిన్‌తో పాటు బజరంగ్,హనుమంత్ పవార్, రాజ్‌కుమార్ లు పరారీలో ఉన్నారని, వారిని సైతం త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. నిందితుడు సాగర్ పవార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఓటి ఏడిసిపి విశ్వప్రసాద్, మేడ్చల్ డివిజన్ ఏసిపి సిహెచ్ శంకర్ రెడ్డి, దుండిగల్ సిఐ సతీష్, ఎస్ఓటి సిఐ శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

యాదవ, కురుమలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



గాంధీభవన్ ముట్టడిలో మాట్లాడుతున్న మేకల రాములు యాదవ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 16 శాతం జనాభా ఉన్న యాదవ, కురుమ కులస్తులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గాంధీభవన్‌ను ముట్టడించి గొర్రెలతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా యాదవులకు మంత్రి వర్గంలో చోటు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. త్వరలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హామీని ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏకశిల లేఔట్‌లో ఆక్రమణల తొలగింపు

ఫిర్యాదు వచ్చిన వారంలోనే చర్యలు తీసుకున్న హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: పోచారం సమీపంలోని ఏకశిల లేఔట్‌లో ఉన్న ఆక్రమణలను హైడ్రా బృందాలు సోమవారం తొలగించాయి. దీనిపై ప్రజావాణి ద్వారా ఫిర్యాదు వచ్చిన వారం రోజుల్లోనే విచారణ పూర్తి చేసిన అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్కడి సర్వే నెంబర్లు 739 నుంచి 749 వరకు ఉన్న 149 ఎకరాల్లో 1987లో 2080 ప్లాట్లతో ఏకశిల లేఔట్ వేశారు. 2005లో అందులోని 47 ఎకరాల భూమిని వ్యవసాయ భూమిగా చూపిస్తూ చెరకు దశరథ్ గౌడ్, మునుకుంట లక్ష్మయ్య కుటుంబీకులు ఆలూరి వెంకటేష్‌తో పాటు మరి కొందరికి విక్రయించడంతో వివాదం మొదలైంది. ఇవే సర్వే నెంబర్లలోని 7.16 ఎకరాల్ని అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వం 2002లో స్వాధీనం చేసుకుని కొన్నాళ్లకు తిరిగి అప్పగించింది. ఏకశిలా లేఔట్‌లోని ఆ భూమిని ప్లాట్లు కోల్పోయిన వారికి ఇవ్వాల్సి ఉండగా...భూ యజమానులు వేరొకరికి విక్రయించారు. అప్పటికే ఓ లేఔట్ ఉండడంతో ఆ పాస్ పుస్తకాలనూ రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. ఈలోగా ఆ భూమిని కొన్న వారు చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీనిపై ప్లాట్ల యజమానులు ప్రజావాణి ద్వారా హైడ్రాను ఆశ్రయించారు. తమ లేఔట్‌లో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో గత బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఏకశిల లేఔట్‌కు వెళ్లి పరిశీలించి ప్లాట్ యజమానులతో మాట్లాడారు. శనివారం హైడ్రా కార్యాలయంలో ఇరుపక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ జరిపారు. వారి వద్ద ఉన్న వివిధ పత్రాలను పరిశీలించారు. ప్రహరీ నిర్మించే నాటికి కొరెముల గ్రామం మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చింది. అయినప్పటికీ గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకుని ప్రహరీ నిర్మించినట్లు ప్లాట్ల యజమానులు చెప్పారు. దీంతో హైడ్రా టీమ్స్ గూగుల్ మ్యాప్స్‌ను పరిశీలించి.. ఆ గ్రామం పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు ప్రహరీ నిర్మించలేదని, ఆ తర్వాత కట్టారని తేల్చారు. దీంతో దాన్ని కూల్చడానికి హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం హైడ్రా బృందాలు ఆ లేఔట్‌లోని ప్రహరీతో పాటు ఆక్రమణలను తొలగించాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లక్డీకాపూల్: సైఫాబాద్ డివిజన్ నిజాం కాలేజీ, హైదర్‌గూడ, విఠల్‌వాడి సబ్ స్టేషన్‌లలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సైఫాబాద్ ఏడీఈ తెలిపారు. బ్రాండ్ ఫ్యాక్టరీ 11 కేవీ ఫీడర్, ఉర్దూ హాల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. కమిషనర్ ఆఫీసర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని హైదరాబాద్ మెయిన్ రోడ్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, అపోలో హాస్పిటల్, స్వాతి మెస్ ఎదురుగా, మల్లిక్ చాంబర్ ఏరియా, పయనీర్ చాంబర్‌లకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ వివరించారు.

నియామకం



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ మున్నూరు కాపు సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన తూముల రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ నియామకపత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనను నమ్మి ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని రవికుమార్ పేర్కొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల దళిత డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలకు ఆర్‌డీవో ద్వారా కాకుండా ఎమ్ఆర్ఓ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలను ఇప్పించాలని ఆయన కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుల సర్టిఫికెట్లు లేకుండా విద్య, ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో మా పిల్లలు ఎన్నో అవకాశాలు కోల్పోతున్నారని ఆర్‌డీవోలో ఉన్న అధికారులకు తమ కులం పేరు చెపితే మేము ఎప్పుడూ వినలేదు అని మాల, మాదిగ సర్టిఫికెట్ తీసుకొమ్మంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో శోభా, నర్సయ్య చిందు, రామారావు డక్కలి, శాకమూరి యాదగిరి, పంబాల ఎల్లేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిపై 'పరీక్ష'

- రేపటి నుంచి అభ్యాసన సామర్థ్య పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఖైరతాబాద్ జోన్‌లో 18 వేల మంది విద్యార్థులకు పరీక్ష


ఎన్టీటీ నగర్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు

బంజారాహిల్స్: పాఠశాలలో చేరింది మొదలు విద్యా సంవత్సరం ముగిసే వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల ప్రగతి, సామర్థ్యాలు, తెలివితేటలను పరిశీలించి వారిని మెరుగైన ఫలితాల సాధన దిశగా సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖాధికారులు 2025–26వ విద్యాసంవత్సరం కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించే నిమిత్తం ఈ నెల 25 నుంచి అభ్యాసన సామర్థ్య తొలి పరీక్షను నిర్వహించనున్నారు.
– విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళ్‌రావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రాథమిక పాఠశాలల పరిధిలో మూడంచెల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆయా పాఠశాలల టీచర్లు తగిన ప్రణాళికలు రూపొందించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఈ పరీక్షతో విద్యార్థుల సామర్థ్యాలు ఏ దశలో ఉన్నాయో తెలుసుకునే వీలుంటుంది.

ముఖ్యాంశాలివీ...

ప్రధానమైన 'బేస్‌లైన్' పరీక్షను ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు.
ఈ మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) నుంచి అన్ని పాఠశాలలకు మార్గనిర్దేశకాలు జారీ అయ్యాయి.

- సంబంధిత ప్రశ్నా పత్రాలను తరగతుల వారీగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు.
- ఆయా పరీక్షల మూల్యాంకనం వివరాలను జులై 15 నాటికి తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్లోడ్ చేయనున్నారు.
- 2025–26వ విద్యాసంవత్సరం ఆరంభంలో జరిగే బేస్‌లైన్ పరీక్షను తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ అంశాలపై నిర్వహిస్తారు.
- ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తారు.
- ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజిస్తారు.


ఫిలింనగర్ స్కూల్‌లో విద్యార్థులు

- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం బోధన ఉంటుంది.
- కరోనా తర్వాత విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే.
- ఇందులో భాగంగానే 1–5వ తరగతుల విద్యార్థులకు ప్రత్యేక బోధనా ప్రణాళికను రూపొందించారు. 6–9వ తరగతుల విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(లిప్) కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.
- డిసెంబర్‌లో మిడ్‌లైన్, విద్యాసంవత్సరం ముగింపున అంటే మార్చిలో ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహిస్తారు.
- ఫలితాల ఆధారంగా విద్యార్థుల ప్రగతిని మెరుగుపరిచేందుకు టీచర్లు ప్రత్యేక దృష్టి పెడతారు. ఇదే సమయంలో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రగతి తీరుపై తల్లిదండ్రులతోనూ సమావేశాలు నిర్వహిస్తారు. ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశానుసారం ఖైరతాబాద్ జోన్ పరిధిలో పకడ్బందీగా బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించడానికి సిద్ధమైనట్లు టీచర్లు తెలిపారు. ఇప్పటికే ప్రశ్నా పత్రాలు చేరాయన్నారు. విద్యార్థుల ప్రగతికి ఈ పరీక్షలు కొలమానంగా నిలుస్తాయని చెప్పారు. ప్రారంభంతో పోలిస్తే చివరి పరీక్ష నాటికి విద్యార్థులు సాధించిన ప్రగతిపై మరింత స్పష్టత వచ్చి సీ గ్రేడ్‌లో ఉండేవారు మార్చి నాటికి ఏ, బీ గ్రేడ్లలోకి చేరేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లుగా బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీకాంతరెడ్డి వివరించారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళి


ఫిలింనగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

ఫిలింనగర్: జన సంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం ఫిలింనగర్‌లోని భగత్ సింగ్ కాలనీలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడిగారి భోజిరెడ్డి మాట్లాడుతూ... ఏక్ దేశమే దో నిషాన్ నహీ చలేగా అనే నినాదంతో దేశం కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జి పోరాడటం జరిగిందని, కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమేనని ఆర్టికల్ 370 రద్దు చేయాలని దేశం కోసం ఆయన ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండుగుల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు వల్లెపు శంకర్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గందే అరుణ్ కుమార్, బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మశంకర్ నగర్‌లో...

రహమత్‌నగర్: శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు తంగలపెల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బ్రహ్మశంకర్ నగర్‌లో ముఖర్జీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ నేతలు భరత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విశాల్‌సింగ్, శంకర్, రామ కృష్ణ, నాగేష్,షేర్ అలాం, విఘ్నేష్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'రథోత్సవ' ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష


సమీక్ష చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని జగన్నాథ టెంపుల్ రథోత్సవం ఈ నెల 27వ తేదీన జరగనుండగా ట్రాఫిక్ ఏర్పాట్లను సోమవారం ఆలయ ప్రతినిధులతో కలిసి వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రకాశ్ గౌడ్ పరిశీలించారు. రథోత్సవం నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఎంత మంది భక్తులు వస్తారు. ఎన్ని వాహనాలు వస్తాయనేదానిపై చర్చించారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి తెలంగాణ భవన్ వరకు, తెలంగాణ భవన్ నుంచి కొత్త రోడ్డు మీదుగా రోడ్ నెం. 12 వైపు, రోడ్ నెం. 12 కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్డులో ఎట్టి పరిస్థితుల్లోనూ భక్తులు తమ కార్లను పార్కింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రథోత్సవాలకు వచ్చే భక్తులంతా తమ కార్లను బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఐపీఎస్ క్వార్టర్స్ పక్కన, రోడ్ నెం. 12 ఏసీబీ కార్యాలయం ఎదురుగా, ఇస్కాన్ టెంపుల్‌లోనూ పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఆలయ ప్రతినిధులు కూడా భక్తులకు అవగాహన కలిగించాలన్నారు. భక్తులు కూడా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడెక్కడ వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని అన్నారు.

మోదీ పాలనలోనే ప్రగతిపథంలో భారత్

బంజారాహిల్స్: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారత్ 11 ఏళ్లలో ఎంతో ప్రగతిని సాధించిందని బీజేపీ సిటీ స్పోక్స్ పర్సన్ శ్రవణ్ యాదవ్ అన్నారు. మొహల్లా చౌపాల్ కార్యక్రమంలో భాగంగా 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలన, సాధించిన విజయాలపై సోమాజిగూడ డివిజన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ ప్రెసిడెంట్ సూర్య వినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ యాదవ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను లబ్ధిదారులకు చేరేలా కార్యకర్తలు, నేతలు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నేతలు బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వేణు తదితరులు పాల్గొన్నారు.


మొహల్లా చౌపాల్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రవణ్ యాదవ్

ఆరు నెలలు దాటినా రోడ్డు వేయరా?


పటేల్‌నగర్ బస్తీలో రోడ్డును చూపిస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పటేల్‌నగర్ బస్తీలో రోడ్డు దెబ్బతిని బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం సీవరేజీ లైన్ నిర్మాణం కోసం గోతులు తవ్వి కొత్త లైన్ వేసి రోడ్డును రిస్టోరేషన్ చేయకుండా వదిలేశారు. రోడ్డును బాగు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేదని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 21, నల్లవంకాయ 23, పొడుగువంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 18, క్యాప్సికం 65, పచ్చికాకరకాయ 38, పందిరిబీర 31, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండకాయ 21, గుండు బీన్స్ 85, గింజచిక్కుడు 35, గోకరకాయ 37, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 28.మొరంగడ్డ 23, కందగడ్డ 35, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 10.



అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే చర్యలు తథ్యం


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: వాహనాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. సోమవారం ఉదయం ఫిలింనగర్ రోడ్ నెం. 1లో వారు పర్యటించి రోడ్లపై పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై పాటు వ్యాపారులకు అవగాహన కల్పించారు. మరోసారి రోడ్లపై వాహనాలు పార్కింగ్‌లు చేయిస్తే వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా ఎవరికి వారు వాహనాలు పార్కింగ్ చేస్తుండటం వల్ల ప్రధాన రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయండి: ఆప్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా హక్కు చట్టం తక్షణమే అమలు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నేతలు ఎం.డి.సోహైల్, డాక్టర్ లక్ష్మనాయుడు, సలావుద్దీన్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి సోమవారం హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్–1 బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్తీ నాయకులు స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఆయా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ, వీధి దీపాల అధికారులు కిరణ్, వణిధర్, రాజేష్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ షరీఫ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



'ఆపరేషన్ కగార్ నరమేధం'

పంజగుట్ట: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న భయంకరమైన నరమేధ చర్యలు వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చలో రాజ్‌భవన్ ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా ఏఐవైఎఫ్ నాయకులు ఖైరతాబాద్ కూడలివద్దకు రాగానే పోలీసులు వారిని అడ్డుకుని ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ వద్దే అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. కొంతమందిని అదుపులోకి తీసుకున్నా మరికొంతమంది తప్పించుకుని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఖైరతాబాద్ కూడలి వరకు చేరుకుని రాజ్‌భవన్ వైపు వెళ్లేందుకు యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఎట్టకేలకు 35 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, చేపూరి కొండల్, ఆర్.బాలకృష్ణ, చిలుక రాజ్ శ్రీను, సల్మాన్ బేగ్, శివకుమార్, మాజీద్, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

అమీర్‌పేట: అమీర్‌పేట లక్ష్మీ దుర్గా సోనాబాయమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, నాయకులు సత్యనారాయణ, అశోక్‌యాదవ్, హనుమంత్‌రావు, వనం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లార్వా దశలోనే దోమలను అరికట్టాలి

వెంకటేశ్వరకాలనీ: లార్వా దశలోనే దోమలను అరికడితే వాటి వృద్ధి ఆగిపోతుందని ప్రజలు అంటురోగాల బారిన పడకుండా ఉంటారని జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య తెలిపారు. సోమవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో దోమల నివారణ కోసం ఎంటమాలజీ సిబ్బంది చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో లార్వా నిర్మూలన పిచికారీ చేసిన తర్వాత ఇంటికి నెంబర్ వేయాలని పేర్కొన్నారు ప్రతీ ఇంటికి వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యజమానులకు చూపించి దాని వల్లే దోమల వృద్ధి చెందుతాయనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. దోమల వల్ల అంటు వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. ఒకవైపు దోమల నివారణ కోసం మందులు పిచికారీతో పాటు ఫాగింగ్ కూడా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.


ఎతాప్‌నగర్‌లో పర్యటిస్తున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి


మొక్క నాటుతున్న ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

హిమాయత్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా సోమవారం నారాయణగూడలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... యువత మత్తుకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నదన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భావితరాలకు మంచి పర్యావరణం కోసం మొక్కలను నాటి వాటిని పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు షఫీ, నాగరాజు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా రహదారులు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లో ఏర్పడిన గుంతలు

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14 ప్రధాన రోడ్డులో గత ఏడాది కాలంలో ఒకవైపు వరదనీటి కాలువ పనులు.. ఇంకోవైపు మంచినీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. దీంతో ఎవరికి వారే రోడ్లను ఛిద్రం చేస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత కూడా రోడ్లకు మరమ్మతులు చేయడంలో జీహెచ్ఎంసీ పూర్తిగా విఫలమవుతున్నది. ఫలితంగా రోడ్డు గుంతలమయమై మట్టి తేలి ముంపుతో నరకాన్ని చూపిస్తున్నాయి. రోడ్డు నెంబర్–14లోని రత్నదీప్ సూపర్ మార్కెట్, జుడియో మీదుగా మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ ఇంటి వరకు రోడ్లు మొత్తం తవ్వేసి గుంతలు వదిలేసి కాంట్రాక్టర్లు జారుకున్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీర్లు చోద్యం చూస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం, అక్రమాలు,అవినీతితో రోడ్లన్నీ గుంతలు తేలి మట్టి కొట్టుకుపోతున్నాయి. వీరిని నియంత్రించాల్సిన విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారులూ పట్టించుకోవడం లేదు. పనులు పూర్తయిన తర్వాత రెస్టోరేషన చేయడంలో ఇంజనీర్లు చూపుతున్న నిర్లక్ష్యానికి స్థానికులు బలవుతున్నారు. ఏడాది కాలంగా ఈ రోడ్డంతా నరకప్రాయంగా మారింది. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల నిర్వాహకం స్థానికులకు శాపంగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇదే రోడ్డు నుంచి ప్రయాణిస్తుంటారు. అయినా సరే ఇంజనీర్లు పట్టించుకున్న పాపానపోవడం లేదు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్రానికి, దేశానికి ఖ్యాతి తీసుకురావాలని కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్ అన్నారు. సోమవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో తెలంగాణ ఒలింపిక్ అసోషియేషన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తాధ్వర్యంలో వేగంగా... ఉన్నతంగా... బలంగా–కలిసి అనే థీంతో నిర్వహించిన 39వ ఒలింపిక్ డే–2025 వేడుకల్లో పాల్గొన్నారు. నవీన్‌యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీలో పాల్గొన్నారు. వేడుకలు యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపుతుందని నిర్వాహకులు తెలిపారు.


ఒలిపిక్ డే వేడుకల్లో పాల్గొన్న క్రీడాకారులు, నవీన్‌యాదవ్

'వాటర్‌వర్క్స్' ఓటర్‌లిస్టు సవరించాలని వినతి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ ప్రతినిధులు

పంజగుట్ట: హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్, సివరేజ్ బోర్డులో పారదర్శకంగా ఉద్యోగ సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి సోమవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.భూమయ్య, శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు ఓటర్ లిస్టును సవరించాలని కోరారు. కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు, సర్కిల్-1, బోర్డు లెవెల్‌లో ఆర్డర్స్ ఇచ్చే ప్రక్రియలో ఉన్నందున పదోన్నతులు పూర్తయ్యాక ఎన్నికలు నిర్వహించాలన్నారు. గత ఎనిమిది నెలల్లో చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారని, కొంతమంది మృతి చెందారని ఓటర్ లిస్టును సవరించి కొత్త ఓటర్ లిస్టు తేవాలని కోరారు. జలమండలి ఎన్నికల సమస్యను కార్మిక శాఖ దృష్టికి కూడా తీసుకెళ్తామని పేర్కొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి కిషన్‌రెడ్డి నివాళి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నేతలతో కలిసి ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా చిత్రకారుడు వెంకన్నబాబు గీసిన కిషన్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్, గంగరాజు, రాజ్‌కుమార్, రూప పాల్గొన్నారు.

5,116 మంది రైతులకు రూ.4.61 కోట్ల రైతు భరోసా



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో ని రైతు భరోసా పథకంలో భాగంగా సోమవారం నాటికి 5,116 మంది రైతుల ఖాతాల్లో రూ.4.61 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. రైతు భరోసా పథకంతో అన్నదాతకు ప్రభుత్వం అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. రైతు భరోసా పథకం కింద విడతల వారీగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ అవుతున్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ పంటల సాగు కోసం రైతు భరోసా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వానా కాలానికి సంబంధించిన రైతు భరోసా పథకం నిధులు అందించడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవొటెల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట మేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఫాక్స్‌సాగర్ నీటిని తోడేస్తున్నారు!

- అర్థంకాని ఇరిగేషన్ అధికారుల తీరు
- ఎండిపోతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్న స్థానికులు
- వెంచర్లకు మేలు చేసేందుకే అధికారుల మొగ్గు



ఎడమవైపు ఎండిపోయిన ఫాక్స్‌సాగర్ చెరువు

జీడిమెట్ల: జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువులోని నీరు రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. దీంతో భూగర్భ జలాలు సైతం పాతాళానికి చేరుకున్నాయి. ఇరిగేషన్ అధికారుల అత్యుత్సాహం, అనాలోచిత వైఖరి వల్ల జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ ఎండుముఖం పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏడాది నిండుకుండలా కనిపించే చెరువు గత కొద్దిరోజులుగా నీరు లేక వెలవెలబోతోంది. ఫాక్స్‌సాగర్ చెరువుకు జలకళ ఉంటే దిగువ ప్రాంతాలైన వెంకటాద్రినగర్, సుభాష్‌నగర్, ఎగువ ప్రాంతం కొంపల్లి, అయోధ్యనగర్, దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఇళ్లల్లో ఉన్న బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. గతేడాది ఆగస్టు నెల నుంచి ఫాక్స్‌సాగర్‌లోని నీటిని ఇరిగేషన్ అధికారులు అదేపనిగా బయటకు వదిలేస్తున్నారు. దీంతో ప్రతినిత్యం వేల లీటర్ల చెరువు నీరు నాలాలో వృథాగా పోతోంది.

నెలరోజులుగా...

ఫాక్స్‌సాగర్ చెరువులో నీరు తగ్గుముఖం పట్టడంతో ఎన్నడూ లేని విధంగా చెరువు రెండువైపులా ఎండిపోయి కనిపిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో దిగువ కాలనీల్లోని బోర్లలోనూ నీరు తక్కువగా వస్తోంది. మూడు నెలల క్రితం పుష్కలంగా నీళ్లు ఉన్న బోర్లు ఇప్పుడు అడుగంటిపోయాయి. నీళ్లు సరిపడా లేక దిగువ కాలనీల ప్రజలు ఇప్పటికే గగ్గోలు పెడుతున్నారు.

నీటిని ఎందుకు తోడేస్తున్నారు..

ప్రభుత్వం చెరువుల్లో నీటిని కాపాడుకోవాలని ఓ వైపు ప్రయత్నం చేస్తుంటే నిండుగా ఉన్న ఫాక్స్‌సాగర్ చెరువు నీటిని అధికారులు వృథాగా బయటకు తోడేస్తుండటం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అసలు అధికారులు చెరువు నీటిని బయటకు ఎందుకు తోడేస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. 15 రోజుల క్రితం ఫాక్స్‌సాగర్ ప్రాంతాన్ని పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ నీటిని బయటకు తోడటం ఆపివేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఆ మాటలను పట్టించుకోకుండా ప్రతినిత్యం నీటిని బయటకు పంపిస్తున్నారు. ఒకవేళ వర్షాలు సరిగా కురవక నీటి ఎద్దడి ఏర్పడితే దానికి ఇరిగేషన్ అధికారులే బాధ్యత వహించాలని స్థానిక కాలనీల ప్రజలు అంటున్నారు.

వెంచర్ల కోసమేనా?..

చెరువు కింద ఉన్న ప్రైవేట్ జాగాలో ఇప్పటికే నిర్మాణాలు చేపట్టేందుకు బిల్డర్లు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఫాక్స్‌సాగర్ నిండుకుండాలాగా ఉంటే ఆ సమీప ప్రాంతాల్లోని వెంచర్లలో నిర్మాణాలు చేపట్టే క్రమంలో గుంతల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. అందుకే అధికారులు నీటిని బయటకు తోడేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ఫాక్స్‌సాగర్ చెరువులో ఉన్న నీటిని బయటకు పంపించకుండా ఇక ప్రభుత్వ పెద్దలే చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కుడివైపు నీరు లేకపోవడంతో ఎండిపోయిన చెరువు



వృథాగా బయటకు పోతున్న నీరు, కిందిభాగాన వెంచర్..

'స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్' ఏర్పాటుకు అంగీకారం

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్- కేఐఈటీ మధ్య ఒప్పందం



ట్రిపుల్ ఐటీ , కేఐఈటీ ఒప్పంద కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: ఇంటిగ్రేటెడ్ నెట్ జీరో డాష్‌బోర్డ్‌తో స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌ను ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ద్వారా కాకినాడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(కేఐఈటీ) క్యాంపస్‌లో ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. ఈ మేరకు కేఐఈటీ, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌ల మధ్య ఒక ఒప్పందం సోమవారం కుదిరింది. కేఐఈటీ క్యాంపస్‌లో కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలిషాన్ మోహన్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కేఐఈటీ వ్యవస్థాపక చైర్మన్ పి.విశ్వం, ట్రిపుల్ ఐటీ ప్రతినిధి ఒప్పందంపై సంతకాలు చేశారు. కేఐఈటీ క్యాంపస్‌లో స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా కాకినాడ స్మార్ట్ సిటీకి విస్తరించడం, అత్యాధునిక పరిశోధన, రియల్ టైమ్ అర్బన్ సొల్యూషన్స్, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ముందంజలోకి తీసుకురావడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం మాట్లాడుతూ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ మోడల్‌ను కేఐఈటీకి విస్తరించడం సంతోషంగా ఉందన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో టీచింగ్, నాన్-టీచింగ్ స్టాఫ్ పోస్టులను ఔట్ సోర్సింగ్‌లో నియమించడానికిగాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెజ్యూమ్, సర్టిఫికెట్లతో ఈ నెల 28వ తేదీలోగా నాంపల్లిలోని హజ్ హౌస్, రూమ్ నంబర్ 606లో సమర్పించాలని సూచించారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులను పిలుస్తామని పేర్కొన్నారు. జేఎల్ పోస్టులు ఇంగ్లిష్, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ, హిస్టరీ, మైక్రో బయోలజీ, కెమిస్ట్రీ పీజీటీ పోస్టులు ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ టీజీటీ పోస్టులు ఇంగ్లిష్, జనరల్ సైన్స్, సోషల్, స్టాఫ్ నర్స్, డిప్యూటీ వార్డెన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని ధర్నా



పౌరసరఫరాల శాఖ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

పంజగుట్ట: దరఖాస్తు చేసుకున్న అర్హులకు వెంటనే తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గేటు ముందు బైఠాయించి వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం వేలాదిమంది దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నారని అన్నారు. కొత్తగా పెళ్లి అయినవారు, పిల్లల పేర్లను రేషన్‌కార్డుల్లో నమోదు చేసుకోవాల్సిన వారు ఎంతో మంది ఉన్నారని, వీరంతా రేషన్ కార్డుల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని వారి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, దశరథ్, మహేందర్, కె.రాజన్న, కె.నాగలక్ష్మి, కిరణ్, వరలక్ష్మి, వెంకటేష్, అశోక్, పద్మ, అజయ్ మారయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆర్గానిక్ ఎక్స్‌పోలో నార్మ్‌కు మొదటి బహుమతి

రాజేంద్రనగర్: న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ వ్యవసాయ ఉద్యాన వన ఆర్గానిక్ ఎక్స్‌పో-2025లో రాజేంద్రనగర్ నార్మ్‌కు మొదటి బహుమతి లభించింది. ప్రగతి మైదానంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఈ ఎక్స్‌పోలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి హర్ష మనోత్రా ఈ అవార్డును ప్రదానం చేశారు. సోమవారం ఈ స్టాండ్‌ను కేంద్ర రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి సందర్శించారు. ఈ ఎక్స్‌పోలో వ్యవసాయ అభివృద్ధికి సేవలు అందిస్తున్న దాదాపు వంద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు పాల్గొన్నాయి.



ఎక్స్‌పో 2025లో ఐసీఏఆర్-నార్మ్ స్టాల్‌ను సందర్శిస్తున్న కేంద్రమంత్రి భగీరథ్ చౌదరి

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్

– కమిషనర్ ఆర్.వి.కర్ణన్

లక్డీకాపూల్: దోమల నివారణకు ముమ్మరంగా ఏఎల్ఓ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఆయా విభాగాల హెచ్.ఓ.డి.లతో సోమవారం దోమల నివారణ, శానిటేషన్, కోర్టు కేసులపై కమిషనర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా జోన్లలో ఎంటమాలజీ సిబ్బంది ఏఎల్ఓ కార్యక్రమాలు చేయకుండా ఇతర విధులు కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారందరు ఏ.ఎల్.ఓ. కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క వల్ల దోమల ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని, దానిని తొలగించేందుకు ప్రణాళిక తయారు చేయాలని అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. పరిశుభ్రత కోసం నగరంలో చేపడుతున్న ముందస్తు వర్షాకాల శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను మరిన్ని రోజులు కొనసాగించాలని అధికారులకు సూచించారు. శానిటేషన్ ఏసీ రఘు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 25 తేదీ వరకు ముందస్తు వర్షాకాలం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ ఇప్పటి వరకు 120 వార్డులో పూర్తయ్యాయని, 3,900 మెట్రిక్ టన్నుల సి అండ్ డి వేస్ట్, 5,400 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించినట్లు వివరించారు. అనుమతిస్తే ఒక్కో వార్డులో ఇంకా మిగిలిపోయిన కాలనీల కోసం ఈ నెల 26వ తేదీ నుంచి మరో 20 రోజులపాటు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు కేసులపై దృష్టి సారించాలని, జోనల్ కమిషనర్లు ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం హెడ్ ఆఫీస్‌లో ఏసీ లీగల్‌ను సంప్రదించాలని అధికారులను ఆదేశించారు.

తెలుగు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల (సాయం)లో వివిధ తెలుగు కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 1965లో ప్రారంభమైన ఈ కళాశాలలో తెలుగు భాష సాహిత్యాల్లో ప్రిడిగ్రీ కోర్సు, బీఏ, ఎంఏ (లాంగ్వేజెస్) కోర్సులు నడుస్తున్నాయి. ఈ కోర్సులు చదివిన వారు తెలుగు పండితులుగా, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులుగా, అధికారులుగా, పాత్రికేయులుగా స్థిరపడ్డారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల పీడీసీ ప్రి డిగ్రీ కోర్సులకు అర్హులని, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన వారు బీఏ (లాంగ్వేజెస్)లో డిగ్రీ ఆన్‌లైన్ సిస్టమ్ దోస్త్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. తెలుగు ద్వితీయ భాషగా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎం.ఏ(లాంగ్వేజెస్‌కు)అర్హులు. పగటిపూట ఉద్యోగాలు చేసుకుంటూ ఈ తెలుగు కోర్సులు చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారందరు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కళాశాలలో చేరి తరగతులకు హాజరుకావచ్చు. పూర్తి వివరాల కోసం ఫోన్: 94410 85114 / 90328 12971 నెంబర్లలో సంప్రదించవచ్చని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి

– జిల్లా కలెక్టర్ హరిచందన



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం నేపథ్యంలో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2025ను జిల్లా అంతటా చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యా అధికారి రోహిణి అధికారులు పాల్గొన్నారు.

ఏడో గ్యారంటీ అమలులో రేవంత్ విఫలం

నిరసనకారులపై పోలీసుల దాడిని ఖండించిన ప్రగతిశీల మహిళా సంఘం



పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళా సంఘాల నేతలు

హిమాయత్‌నగర్: ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామిక పాలనను వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆచరణలో విఫలమయ్యారని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) విమర్శించింది. రేవంత్ పాలనలో పోలీసులు నిరసనకారులపై చేస్తున్న దాష్టీకాన్ని, క్రూరంగా హింసించడాన్ని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ అమెరికా మద్దతుతో పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడిని వ్యతిరేకిస్తూ అమెరికన్ కన్సులేట్ ఎదురుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, మహిళా కార్యకర్తల, వయోధికులపై గచ్చిబౌలి పోలీసులు దాడి చేయడం అమానుషమని అన్నారు. సంధ్యతోపాటు వయోధికులైన సాధినేని వెంకటేశ్వర్లు, వేములపల్లి వెంకట్రామయ్య, ఇంకా అనేక మంది గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర హక్కుల కోసం ఉద్యమించే నిరసనకారుల పట్ల గౌరవంగా, మానవీయంగా వ్యవహరించాలని కోరారు. నిరసనకారులతో అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీవోడబ్ల్యూ ప్రతినిధులు డి.స్వరూప, అందె మంగ, పి.పద్మ, సీహెచ్ భారతి, ఉమెన్ ట్రాన్స్‌జెండర్ జేఏసీ ప్రతినిధులు కె.సజయ, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

– మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవడం తప్ప రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని, రిజర్వేషన్ల కోసం ఏనాడూ ప్రధానిని కలవలేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై తాజా, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలతో కలిసి వెనకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేదిక ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు చేసి ఎన్నికలకు వెళతామని హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవ్వండని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. వెంటనే ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లు పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలని, కేంద్రంపై ఒత్తిడి తేవడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీల వాటా తేల్చాలని కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళతామని ప్రకటిస్తే గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు మరో ఉద్యమం తీసుకువస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్‌పీటీసీల ఫోరం అధ్యక్షులు గడీల కుమార్ గౌడ్, రాజ్ ముదిరాజ్, సర్పంచుల సంఘం ప్రతినిధి యాదయ్య, ఎంపీపీ కళ్యాణ్, పల్లె కళ్యాణి, సుక్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో రోగికి గుండెపోటు

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడిన కార్మికుడు



రోగికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన శ్రీనివాస్

లక్డీకాపూల్ : నిమ్స్‌లో వైద్యసేవలు పొందేందుకు వచ్చిన రోగి గుండెపోటుకు గురయ్యాడు. ఈ సంఘటన ఆస్పత్రిలోని అవుట్ పేషెంట్ బ్లాక్‌లో ఉన్న రూమ్ 32 వద్ద చోటు చేసుకుంటుంది. కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలం పెద్ద నక్కలపేట్‌కు చెందిన బగ్గీ అశోక్ తన భార్యతో కలిసి బుధవారం జనరల్ మెడిసిన్ విభాగానికి వచ్చాడు. అక్కడ వైద్యుడ్ని సంప్రదించేందుకు నిరీక్షిస్తున్న అశోక్ అకస్మాత్తుగా గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీనివాస్ వైద్యుల రాక కోసం ఎదురుచూడకుండా వెంటనే స్పందించాడు. ప్రాణపాయ పరిస్థితిలో ఉన్న అశోక్‌కు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడాడు. ఆ వెంటనే ట్రాలీపై అశోక్‌ను ఏఎంసీ వార్డులో అడ్మిట్ చేసి మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేశారు. ప్రస్తుతం రోగి అశోక్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీభాస్కర్ అన్నారు. కాగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి రోగి ప్రాణాలు కాపాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీనివాస్‌ను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ భార్య లక్ష్మి, ఆయన బంధువులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హిజ్రాలు అసభ్య ప్రవర్తన మానుకోవాలి

– ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్



ట్రాన్స్‌జెండర్స్ సమావేశంలో మాట్లాడుతున్న ముద్రబోయిన రచన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిజ్రాలు శుభకార్యాల ప్రదేశాలకు బిక్షాటనకు వెళ్లి అక్కడ జరిగే పూజలు, హోమాలు, పెళ్లిళ్లు, వ్యాపార ప్రారంభాలు, గృహ ప్రవేశాల్లో దాతలకు దీవెనలు ఇచ్చి ఇష్టపూర్వకంగా ఇచ్చే కట్నాలను తీసుకోవాలని, అక్కడ అసభ్యంగా ప్రవర్తించవద్దని ట్రాన్స్‌జెండర్స్ పీపుల్స్ అసోసియేషన్ కోరింది. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ముద్రబోయిన రచన, కేఎంవీ మొనాలిసా, గంగా, సోని, జాస్మిన్, అనిత మాట్లాడుతూ శుభకార్యాలయాల్లో కోరినంత ఇవ్వకపోతే హిజ్రాలు నగ్న ప్రదర్శనలకు దిగటం, అసభ్యంగా ప్రవర్తించి ప్రజల మనోభావాలను దెబ్బతీయటం, నోటికి వచ్చినట్టు శాపనార్థాలు పెట్టడం సరైంది కాదన్నారు. హిజ్రాలకు సొంత ఇల్లుతోపాటు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీపీఎస్కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్‌కు రక్షణ కల్పించేందుకు చట్టం ఏర్పాటు చేయాలని, హిజ్రా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

గృహ కార్మికులకు సంక్షేమ చట్టం అవసరం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆధునిక కాలంలో వెట్టి చాకిరి, శ్రమ దోపిడికి గురవుతున్న గృహ కార్మికుల కోసం సంక్షేమ చట్టం రూపొందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో గృహ కార్మికుల ముసాయిదా చట్టం-2025పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆకలి, అవమానాలకు గురవుతూ వెట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రశ్నించి పోరాడితేనే బానిసత్వానికి విముక్తి లభిస్తుందన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ గృహకార్మికుల సంక్షేమానికి చట్టం చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడంతోపాటు భారత్ జోడో యాత్రలో ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సైతం ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో గృహ కార్మిక సంఘం అధ్యక్షురాలు మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ, వివిధ సంఘాల ప్రతినిధులు పులి కల్పన, బి.ప్రసాద్, ఎస్.శివలింగం, పిల్లి సుధాకర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ మాటల్లో తప్పేముంది?

– గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన దోపిడీలను ఆధారాలతోసహా కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రజల ముందుంచారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. దీనికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ సీఎం కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని ప్రధాని సహా, పలువురు జాతీయ నాయకులంతా మాట్లాడారని గుర్తు చేశారు. సంజయ్ మాట్లాడిన దాంట్లో తప్పేముందని ప్రశ్నించారు. ఎవరి సొమ్మని కాళేశ్వరం లాంటి విఫల ప్రాజెక్టు కట్టారని నిలదీశారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. సంజయ్ మాటల్లో తప్పుంటే నిరూపించాలని, లేకుంటే సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసే దమ్ముందా అని సవాలు విసిరారు. అనేక ప్రాజెక్టుల పేర్లు చెప్పి కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 24, జూన్, 2025



ఉత్కంఠగా తెలంగాణ షూటింగ్

ఛాంపియన్‌షిప్

250కి పైగా అథ్లెట్లు హాజరు
పోటా పోటీగా ప్రదర్శన

సాక్షి, సిటీ బ్యూరో : గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న గీఐ తెలంగాణ స్టేట్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2025 మూడో రోజుకు చేరింది. ట్రాప్, స్కీట్, 10మీ ఎయిర్ పిస్టల్, 25మీ పిస్టల్ ఈవెంట్స్‌లో 250కి పైగా అథ్లెట్లు పాల్గొన్నారు. ట్రాప్ విభాగంలో అక్రమా మొహమ్మద్ నఫ్హీ, కె. ముక్తారుద్దీన్, ముజాహిద్ అలీ ఖాన్ తమ వర్గాల్లో గోల్డ్ మెడల్స్ గెలిచారు. 10మీ ఎయిర్ పిస్టల్‌లో అర్ణవ్ క్షితిష్ 378/400తో ఆధిక్యంలో ఉండగా, 25మీ స్పోర్ట్స్ పిస్టల్‌లో లీషా కిరణ్ 282/300 స్కోర్‌తో తొలి స్థానంలో నిలిచింది. షాట్ గన్ విభాగంలో 70 మంది, పిస్టల్ ఈవెంట్స్‌లో 200కి పైగా అథ్లెట్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంగీ ప్రతిభావంతులందరికీ అభినందనలు తెలిపారు. పోటీలు మరింత పోటాపోటీగా కొనసాగుతూనే ఉన్నాయి.



26 నుంచి

ఫిక్కీ

బీ2బీ సమావేశాలు..

సాక్షి, సిటీబ్యూరో: యుఏఈలోని షార్జా ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ (సైఫ్ జోన్) సహకారంతో ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) 'యుఏఈ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో మీ వ్యాపారాన్ని విస్తరించండి' అనే పిలుపునిస్తూ నగరంలో ప్రత్యేక బీ2బీ సమావేశాలు ఈ నెల 26 నుంచి నిర్వహించనుంది. ఈ కార్యక్రమం హోటల్ ఐటీసీ కాకతీయ హోటల్లో మూడు రోజుల పాటు జరుగనుంది. ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్, గజా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ వీవీ రామరాజు ఈ వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఆధారిత వ్యాపారాలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునే అవకాశం కల్పించడానికి ఆచరణాత్మక వేదికను అందిస్తుందని, ఈ సమావేశాల్లో పాల్గొనడం ఉచితమనీ, ముందస్తు రిజిస్ట్రేషన్ మాత్రం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

సిటీ వ్యాపార తెరపై బాలీవుడ్ నటీనటుల రంగ ప్రవేశం ఇప్పటికే ఊపందుకుంది. అదే బాటలో మరోవైపు క్రీడాకారులు, మరీ ముఖ్యంగా క్రికెట్ వీరులు నగర పిచ్‌పై అడుగుపెట్టడం మొదలైంది. జాతీయ స్థాయిలో వినోద, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు ఇతర రంగాలపై సుముకత వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా రెస్టారెంట్ బిజినెస్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో వారి వ్యాపార రంగానికి నగరం ఒక తిరుగులేని గమ్యంగా కనిపిస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో





క్రేజీ ఆట.. టేస్టీ బాట..

నగరం వైపు దృష్టి సారించిన టాప్ క్రికెటర్స్



వరుసగా ఇక్కడ రెస్టారెంట్స్ ప్రారంభిస్తున్న వైనం

ఇప్పటికే సిటీలో విభిన్న వ్యాపారాల్లో బాలీవుడ్ సందడి

అదే బాటలో ఇప్పుడు క్రీడాకారులు కూడా ఆగమనం

బిజినెస్ విస్తరణకు గమ్యస్థానంగా భాగ్యనగరం

వైవిధ్యభరిత కేఫ్‌ల నుంచి విలాసవంతమైన ఫైన్–డైన్ స్పాట్‌ల వరకూ కాదే వ్యాపారమూ కాలు పెట్టేందుకు అనర్హము అన్నట్టుగా సెలబ్రిటీలు నగరంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు ఇప్పటికే విభిన్న దేశాల, వైవిధ్యభరిత రుచులతో ఆహార ప్రియులకు వెల్‌కమ్ చెబుతున్న నగరం పలువురు సెలబ్రిటీల కొత్త రూట్‌కు బాటలు వేస్తోంది. మిగిలిన మెట్రోలతో పోలిస్తే వేగవంతమైన వృద్ధితో, విస్తృతమైన వ్యాపార అవకాశాలతో స్వాగతం పలుకుతోంది. ఈ నేపథ్యంలో నగరంలో ఆహార విపణి రంగంలో కాలు మోపిన క్రికెటర్లు, వారు నెలకొల్పిన రెస్టారెంట్ల విశేషాలు ఇవీ..



పేసర్.. ఫ్లేవర్..

క్రికెట్ ప్రేమికులకు చిరపరిచితమైన భారత పేసర్ మహమ్మద్ సిరాజ్ నగరం వైపు తన బౌలింగ్‌ను గురిపెట్టాడు. ఆయన హైదరాబాద్‌లో తన సొంత విలాసవంతమైన రెస్టారెంట్, జోహార్ఫాను ఏర్పాటు చేశాడు. ఈ వారంలో ఇది ప్రారంభం కాబోతున్న ఈ రెస్టారెంట్ బంజారా హిల్స్ రోడ్ నంబర్ 3లో ఆయన నెలకొల్పారు. జోహార్ఫా.. మొఘల్, పెర్షియన్, అరేబియన్, చైనీస్ వంటకాల మిశ్రమంతో నగరవాసులకు రాచరికపు కుకింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇస్తున్నారు.



రన్‌మెషీన్.. వన్ 8తో వచ్చేన్..

భారత క్రికెట్ లెజెండ్ విరాట్ కోహ్లీ తన ప్రసిద్ధ వన్8 కమ్యూన్ రెస్టారెంట్‌ను గత ఏడాది మేలో నగరంలో ప్రారంభించారు. అనతి కాలంలోనే నగరంలో అత్యంత ట్రెండీగా, లగ్జోరియస్‌గా మారింది. నగరంలోని నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ రెస్టారెంట్ దాని ప్రీమియం వైబ్ ప్రత్యేకమైన వంటకాలకు ప్రసిద్ధి చెందింది. ఈ రెస్టారెంట్‌లో గత జనవరి నెలలో ఓ గెస్ట్‌కి స్వీట్ కార్న్ తీసుకున్నందుకు గాను రూ.525 బిల్ వేయడం అనే ఉదంతం వైరల్ అయ్యింది. సోషల్ మీడియాలో మీమ్ ఫెస్ట్‌గా మారింది.

'గ్రాండ్' ఎంట్రీ..

అంతర్జాతీయంగా పేరొందిన చదరంగం క్రీడాకారుడు గ్రాండ్‌మాస్టర్ అంకిత్ సైతం నగరంలో క్రీడాకారుల రాకకు తన వంతు ఊపు తెచ్చారు. యోగా, వెల్‌నెస్ నిపుణుడు కూడా అయిన అంకిత్.. గత మార్చి నెలలో జూబ్లీహిల్స్‌లో ఒక వినూత్నమైన ఆరోగ్య సాధనా కేంద్రాన్ని 'అంకితం' పేరిట ఏర్పాటు చేశారు. పైలేట్స్, యోగా, ధ్యానంతో పాటు జిమ్ వర్కవుట్స్ సైతం అందుబాటులోకి తెస్తూ పూర్తి స్థాయి వ్యాయామాలకు, వెల్‌నెస్ యాక్టివిటీలకు అంకితం అయిన వెల్‌నెస్ స్టూడియోను ఆయన ప్రారంభించారు.



రుచుల.. బ్యారక్స్..

గత ఏడాది డిసెంబర్‌లో సైనిక్‌పురిలో బ్యారక్స్ – ఆంటెరూమ్‌ను ప్రారంభించడం ద్వారా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కూడా నగర ఆహార రంగంలోకి ప్రవేశించారు. మూడు అంతస్తుల్లో విస్తరించి ఉన్న ఈ విలాసవంతమైన ప్రదేశం కేవలం రెస్టారెంట్.. అంత కంటే ఎక్కువ. ఇది పూర్తి స్థాయి సోషల్ గేదరింగ్ అని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



ఈ జాబితాలో కొత్తగా సిరాజ్ జోహార్ఫా చేరడంతో.. మరింత మంది క్రికెటర్లు, క్రీడా ప్రముఖులు ఈ పంథాను అనుసరిస్తారని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు. క్రీడల్లో అద్భుతమైన విజయాలతో నగరవాసులకు దగ్గరైన క్రీడాకారులు తమ వంటకాల్లో వైవిధ్యం ద్వారా కూడా తమను అలరిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.





ఏఐ, మెషీన్ లెర్నింగ్ కోర్సులవైపు యువత అడుగులు


ముందు చూపు..

కెరీర్‌పై స్పష్టమైన అవగాహనతోనే ఎంపికలు

ఉద్యోగావకాశాల్లోనూ మారుతున్న ప్రాధాన్యత

కాలంతో పాటు మారుతున్న ఇంజినీరింగ్ విద్యార్థినుల మనోగతం

సాక్షి, సిటీబ్యూరో: కాబోయే ఇంజినీర్లు ఏ విధమైన ఉద్యోగావకాశాలను ఎంపిక చేసుకుంటున్నారు? దీనికి సంబంధించి ఇంజినీరింగ్‌లో ఎలాంటి కోర్సులను కావాలనుకుంటున్నారు? అంశాలపై ఇటీవల కాలంలో బైటెక్సల్ అనే ఓ సంస్థ నిర్వహించిన సర్వే స్పష్టం చేస్తోంది. ఇందులో మొత్తం లక్ష మంది విద్యార్థులు పాల్గొనగా 62వేల మంది అబ్బాయిలు, 38 వేల మంది అమ్మాయిలు, విద్యార్థినులు ఉన్నారు. ఈ సర్వేలో ఆసక్తికర అంశాలు కనిపిస్తున్నాయి. అబ్బాయిల కంటే అమ్మాయిలు తమ భవిష్యత్తుపై చాలా స్పష్టతతో ఉన్నారని తెలుస్తోంది. ఇంజినీరింగ్‌లో చదివే కోర్సులు, తదుపరి భవిష్యత్తులో చేయాలనుకునే ఉద్యోగావకాశాలపై 40 శాతం మంది విద్యార్థినులు ముందునుంచే సిద్ధమవుతున్నారు. అయితే అబ్బాయిల్లో మాత్రం 36శాతం మందికి మాత్రమే భవిష్యత్తుపై స్పష్టతతో ఉన్నారు. కెరీర్‌పై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఒత్తిడి కనిపిస్తోందని అబ్బాయిలు అభిప్రాయపడుతున్నారు.





ఆ రెండు కోర్సులంటే..

టైర్–1 నగరాలైన హైదరాబాద్, పుణె నగరాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థినిలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ కోర్సులవైపు మొగ్గుచూపుతున్నారు. నిత్యనూతనంగా మారుతున్న సాంకేతిక కోర్సులపై ఆసక్తి చూపిస్తున్నారు. కెరీర్ ప్రారంభ దశలోనే తమకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుంటున్నారు. ఉద్యోగావకాశాల్లోనూ తమ ప్రాధాన్యతలపై స్పష్టతతో ఉంటున్నారు. కోడ్ ప్రాక్టీస్, ప్రాజెక్ట్ వర్క్‌స్పేస్, లైవ్ ప్లాట్‌ఫాం డేటా ఆధారంగా భవిష్యత్తు ఇంజినీర్లు ఏరంగాలపై ఆసక్తి చూపిస్తున్నారనే అంశాలను విడుదల చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థినిలు 66 శాతం మంది అధునాత ప్రోగ్రామింగ్ (అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామింగ్)కోర్సులపై ఆసక్తి చూపిస్తున్నారు. 40 శాతం మంది డిఫైన్డ్ కెరీర్ కోరుకుంటున్నారని తేలింది. అత్యధికంగా 40.58 శాతం మంది విద్యార్థినులు ఏఐ, మెషిన్ లెర్నింగ్ కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. భవిష్యత్తు ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని అంచనా వేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నూతన ఆవిష్కరణలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ, నాగ్‌పూర్, చండీగఢ్, డెహ్రాడూన్ వంటి చిన్న పట్టణాలతో పోల్చితే హైదరాబాద్, పుణెల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్ కోర్సులపై ఆసక్తి చూపే వారు భారీ సంఖ్యలో కనిపిస్తున్నారు.

ట్రావెల్ సిటీ..

- ఇంటర్ సిటీ ప్రయాణాలకు హైదరాబాద్ కీలకం
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ రెడ్‌బస్ నివేదికలో వెల్లడి
- బుకింగ్స్‌లో 30శాతం వృద్ధి నమోదు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో నగరాల మధ్య సాగే ఇంటర్ సిటీ ట్రావెల్‌కు హైదరాబాద్ కీలకంగా ఉందని, ప్రయాణీకులకు బస్ రిజర్వేషన్ సౌకర్యాలను అందించే ప్రముఖ ఆన్‌లైన్ బస్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ రెడ్‌బస్ నివేదిక వెల్లడించింది. ఈ సంస్థ ఇంటర్‌సిటీ ట్రావెల్ ట్రెండ్‌లపై తన వార్షిక బస్‌ట్రాక్ నివేదిక ప్రకారం దేశంలోనే అత్యంత చురుకైన ఇంటర్‌సిటీ ట్రావెల్ మార్కెట్‌గా తెలుగు రాష్ట్రాలు ఉన్నాయని తెలిపింది. గత ఏడాదిలో ఈ రెండు రాష్ట్రాలు బుకింగ్‌లలో 30% వృద్ధి నమోదైందని, దీనికి డిజిటల్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్స్ దోహదం చేశాయని తెల్పింది.



టాప్ రూట్స్ ఇవే..

నివేదిక వెల్లడించిన టాప్ ఇంటర్‌సిటీ రూట్స్‌లో తొలి స్థానంలో హైదరాబాద్–బెంగళూరు, ఆ తర్వాత హైదరాబాద్–విజయవాడ, తిరుపతి–బెంగళూరు, విశాఖపట్నం–హైదరాబాద్ అత్యంత రద్దీగా ఉండే రూట్స్. తద్వారా ఇంటర్ సిటీ రూట్స్‌లో హైదరాబాద్ ప్రధాన రవాణా కేంద్రం అని నివేదిక స్పష్టం చేసింది. ప్రయాణీకుల బుకింగ్స్ శైలి గమనిస్తే.. 56% మంది ప్రయాణీకులు అదే రోజు బుకింగ్‌లు చేయగా, 40% మంది 1–7 రోజుల ముందుగా బుక్ చేసుకున్నారు. ప్రయాణికుల్లో 71శాతం మంది స్లీపర్ బస్సులకు 68% మంది ఏసీ బస్సులకు ప్రాధాన్యతను ఇచ్చారు.

మానవత్వం, నైతికతపై మీరా మాట్లాడేది?



‘ఎక్స్’వేదికగా సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త సింగయ్య మృతిపై విష ప్రచారంతో టీడీపీ, ఎల్లో బ్యాచ్ చేస్తున్న క్షుద్ర రాజకీయాలను ‘ఎక్స్’వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడిగిపారేశారు. ‘‘ఒక మనిషిని కోల్పోయిన కుటుంబం పట్ల చేతనైనంత మేర మా బాధ్యతను నిర్వర్తించాం. అందులోనూ మరణించిన ఆ వ్యక్తి మా మనిషి, మమ్మల్ని అభిమానించే వ్యక్తి అయినప్పుడు ఆ బాధ్యత మరింత రెట్టింపు అవుతుంది. ఇదే పర్యటనలో గుండెపోటు కారణంగా ప్రాణాలు కోల్పోయిన మరో అభిమాని విషయంలోనూ ఇదే రీతిలో స్పందించాం. అయినా కూడా మామీద విష ప్రచారాలు చేస్తున్నారు. మానవత్వం, నైతికత గురించి మీరు పాఠాలు చెప్పడం ఆశ్చర్యకరం..’ అని ధ్వజమెత్తారు. ‘మీ పర్యటనల సమయంలో.. మీ మీటింగుల్లో చనిపోయిన వారి విషయంలో మీరు ఏం చేశారు? ఎంత చేశారు? ఎంత మేర చేశారు? మానవత్వం, నైతికత గురించి మీరా మాట్లాడేది?..’అని సీఎం చంద్రబాబును సూటిగా నిలదీశారు. ఇప్పటికైనా మారండి..! అని హితవు పలుకుతూ సోమవారం తన ‘ఎక్స్’ఖాతాలో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఏమన్నారంటే..

చంద్రబాబూ..! ఈరోజు మీరు రాజకీయాలను మరింత దిగజార్చారు. నేను అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా? అసలు నా పర్యటనకు మీరు ఎందుకు ఆంక్షలు పెట్టి, ఎవరూ రాకూడదని కట్టడి చేశారు? గతంలో మీరుగానీ, మీ పవన్‌కళ్యాణ్‌గానీ తిరుగుతున్నప్పుడు మేం ఇలాంటి ఆంక్షలు ఎప్పుడైనా పెట్టామా? ప్రతిపక్ష నాయకుడిగా నేను మా కార్యకర్తల ఇంటికి వెళ్లడం తప్పా? ప్రతిపక్ష నాయకుడిగా రైతుల తరపున, ప్రజల తరపున వారికి సంఘీభావం తెలియజేయడానికి వెళ్లడం తప్పా? ఒక మాజీ ముఖ్యమంత్రిగా, జడ్ ప్లస్ సెక్యూరిటీ భద్రత అన్నది నాకు అయినా.. మీకు గతంలో అయినా, భవిష్యత్తులో అయినా ఆటోమేటిక్ హక్కు కాదా? మాకు బుద్ధి పుట్టినప్పుడు భద్రత ఇస్తాం..! లేదంటే మూడ్ రానప్పుడు మీకు జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీని విత్‌డ్రా చేసుకుంటామనే అధికారం ఏ ప్రభుత్వానికైనా ఉంటుందా? అది మీకైనా, నాకైనా!! జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రి ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఆ కార్యక్రమంపై తన కార్యాలయం ద్వారా ముందుగానే సమాచారం ఇస్తారు. అలా సమాచారం ఇచ్చిన తర్వాత ఏ ప్రభుత్వంలో పోలీసులు అయినా జడ్ ప్లస్ సెక్యూరిటీ ప్రొటోకాల్ అనుసరించి ఆమేరకు ఆ మాజీ ముఖ్యమంత్రికి సెక్యూరిటీ కల్పించాలి. ఇది నాకైనా, మీకైనా ఒకటే. ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాటించాల్సిన ప్రొటోకాల్ ఇది. మరి జడ్‌ప్లస్ సెక్యూరిటీతో ఉన్న మాజీ ముఖ్యమంత్రి తన ప్రోగ్రామ్‌కు సంబంధించిన రూట్ మ్యాప్ ఇచ్చిన తర్వాత.. పైలట్ వెహికల్స్, రోప్ పార్టీలు అన్నవి సెక్యూరిటీ ప్రోటోకాల్‌లో భాగమైనప్పుడు.. మరి మీ రోప్ పార్టీలకు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న మాజీ ముఖ్యమంత్రి ప్రయాణం చేస్తున్న వాహనం చుట్టూ రోప్ పట్టుకుని, ఎవరూ వాహనం మీద పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉండదా? మనుషుల తాకిడి ఎక్కువగా ఉన్న పరిస్థితుల మధ్య! అందుకే కదా.. జడ్‌ప్లస్ కేటగిరీ సెక్యూరిటీతో మాజీ ముఖ్యమంత్రి ప్రయాణంలో, ప్రొటోకాల్‌లో భాగంగా ఈ రోప్ పార్టీని, పైలట్ వాహనాలను పెట్టడానికి కారణం.

- మరి మీ పైలట్ వెహికల్స్, అందులో సెక్యూరిటీ, రోప్ పార్టీలు.. జడ్‌ప్లస్ సెక్యూరిటీ ఉన్న మాజీ ముఖ్యమంత్రి వాహనం చుట్టూ, ఇంతమంది ప్రజల తాకిడి ఉన్నప్పుడు ఎందుకు లేవు? ఒకవేళ ఉండి ఉన్నమాట నిజమే అయితే ఎవరైనా వెహికల్ కింద ఎలా పడగలుగుతారు? మరి ఏది వాస్తవం? మీరు సెక్యూరిటీ ఇవ్వలేదన్నదా లేక వెహికల్ కింద ఎవరూ పడలేదన్నదా?
- జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రికి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా గవర్నమెంటే ఇవ్వాలి. గవర్నమెంట్ డ్రైవరే ఆ వాహనాన్ని డ్రైవ్ కూడా చేయాలి. ఇది ప్రొటోకాల్. మంచి బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ మీరు ప్రొవైడ్ చేయకపోవడంతో గవర్నమెంటు అనుమతితో నేనే నా సొంత డబ్బుతో సొంతంగా వాహనాన్ని కొనిపెట్టా. డ్రైవర్‌ను మీరు (గవర్నమెంటు) ప్రొటోకాల్ ప్రకారం ఇచ్చారు. మరి మీ గవర్నమెంటు డ్రైవర్ తోలుతున్న ఈవెహికల్, మీరు ఇచ్చిన పైలట్ వెహికల్స్, మీ రోప్ పార్టీల ఆధ్వర్యంలో ప్రయాణం జరుగుతున్నప్పుడు.. మాజీ ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న వాహనం సెక్యూరిటీ బాధ్యత మీది కాదా? అందుకే కదా ఈ ప్రొటోకాల్.
- ఆరోజు మీ ఎస్పీ ఈ ఘటన మీద ఇచ్చిన స్టేట్‌మెంట్ ఏమిటి? మరి ఎందుకు ఈ టాపిక్ డైవర్షన్ రాజకీయాలు?
- ప్రతిపక్షంగా ఉన్నందున నేను ప్రెస్‌మీట్ పెట్టి గతంలో మీరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, హామీలపై మీరు చెప్పిన మాటలు, గతంలో మీరు ఇంటింటికీ పంపించిన బాండ్లను, మీ మేనిఫెస్టో, మీ అబద్ధాలను, మీ మోసాలను బయటపెడితే.. మీ పాలనా వైఫల్యాలను, రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో మీరు చేస్తున్న భయంకర పాలన గురించి ఎక్స్‌పోజ్ చేస్తే... రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి, తద్వారా ఖజానాకు మీ వల్ల జరిగిన నష్టాన్ని, అతలాకుతలమవుతున్న రైతులు, అక్క చెల్లెమ్మలు, పిల్లల బతుకులు.. వీటన్నింటినీ నేను చెబితే... వాటికి సమాధానం చెప్పలేక, ప్రజల్లో మీ మీద ఉన్న వ్యతిరేకత, నామీద ప్రేమను చూసి తట్టుకోలేక, మీరు డైవర్షన్ రాజకీయాలు మరింత దిగజారి చేయడం అత్యంత హేయకరం. కాస్తైనా సిగ్గు తెచ్చుకుని మారండి.
- ఒక్కటి మాత్రం నిజం. నేను సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల గ్రామానికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు.. దురదృష్టకర ఘటన జరిగిందని మా పార్టీ నాయకులు నాదృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మా పార్టీ ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి బాలసాని కిరణ్, తర్వాత మాజీ మంత్రి అంబటి రాంబాబు సహా అప్పటికే మా పార్టీ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారని మావాళ్లు చెప్పారు. వెంటనే నేను స్పందించి మరుసటి రోజు కూడా ఆ కుటుంబం దగ్గరకు వెళ్లాలని, కష్టంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.10 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చా. ఒక మనిషిని కోల్పోయిన కుటుంబం పట్ల చేతనైనంత మేర మా బాధ్యతను మేం నిర్వర్తించాం. అందులోనూ మరణించిన ఆ వ్యక్తి మా మనిషి, మమ్మల్ని అభిమానించే వ్యక్తి అయినప్పుడు ఆ బాధ్యత మరింత రెట్టింపు అవుతుంది. ఇదే పర్యటనలో గుండెపోటు కారణంగా ప్రాణాలు కోల్పోయిన మరో అభిమాని విషయంలోనూ ఇదే రీతిలో స్పందించాం. అయినా కూడా మామీద విషప్రచారాలు చేస్తున్నారు. మానవత్వం గురించి, నైతికత గురించి మీరు పాఠాలు చెప్పడమే ఆశ్చర్యం!

చంద్రబాబే యమకింకరుడు!

ఆయన ‘పాద’ఘట్టంతో సామాన్యుల ప్రాణాలు బలి

- బాబు ప్రచార ఆరాటానికి గోదావరి పుష్కరాల్లో 29 మంది మృతి
- కందుకూరు ఇరుకు రోడ్డులో 8 మందిని బలిగొన్న వైనం.. గుంటూరు చీరల పంపిణీలో ముగ్గురు మహిళల ప్రాణాలు హరీ
- అవన్నీ చంద్రబాబు పరోక్షంగా చేసిన హత్యలే
- తిరుపతిలో ఆరుగురు భక్తులను, సింహాచలంలో ఏడుగురిని బలిగొన్న బాబు ప్రభుత్వం
- గతంలో చంద్రబాబు కాన్వాయ్ ఢీకొని ఇద్దరు మృతి
- వాటిపై కేసులు పెడితే బాబు యావజ్జీవం జైల్లోనే

చంద్రబాబు ‘పాద’ఘట్టం కింద నలిగిపోయిన ప్రాణాలు అనేకం..! గతంలో చంద్రబాబు కాన్వాయ్ ఢీకొనిఇద్దరు సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ప్రభుత్వ వైఫల్యాలతో అర్ధాంతరంగా ముగిసిన జీవితాలు ఎన్నో..! కానీ అవి ఏదో ప్రమాదవశాత్తూ జరిగిన దుర్ఘటనలు కావు. పరోక్షంగా చంద్రబాబు చేసిన హత్యలే!! అందుకు బాధ్యుడిని చేస్తూ హత్యానేరం కింద కేసులు పెడితే ఆయన జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుందని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు అడుగు పెడితే చాలు... యమపాశం పట్టుకుని యమకింకరుడు వచ్చినట్టుగా సామాన్యులు హడలిపోయే పరిస్థితులు కల్పించిన ఆ ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నూనె శ్రీధర్ బ్యాంకు లాకర్లలో భారీగా నగలు, నగదు!

- ఆభరణాల విలువే రూ. 25 కోట్లకు పైగా ఉంటుందని అంచనా
- ముగిసిన నాలుగో రోజు కస్టడీ.. ఆయన బంధువుల్లో కొందరికి త్వరలో నోటీసులు!



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ అక్రమాస్తులు చూసి ఏసీబీ అధికారులే నివ్వెరబోతున్నారు. సోమవారం నాలుగో రోజు కస్టడీలో భాగంగా నూనె శ్రీధర్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఏసీబీ అధికారులు కీలక వివరాలు సేకరించారు. మొదటి మూడు రోజులు సహకరించనప్పటికీ సోమవారం పలు ఆస్తుల పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు ముందుంచి ప్రశ్నించడంతో శ్రీధర్ నోరువిప్పినట్లు తెలిసింది. మరోవైపు ఆయనకు చెందిన బ్యాంకు లాకర్లను తెరిపించగా వాటిలో భారీగా బంగారు ఆభరణాలు, ఆస్తుల పత్రాలు, నగదును ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. అనధికారిక సమాచారం ప్రకారం లాకర్లలో లభ్యమైన బంగారు ఆభరణాల విలువే రూ. 25 కోట్లకుపైగా ఉంటుందని తెలిసింది. అయితే అందులోని ఆస్తుల వివరాలు ఏమిటో తెలియరాలేదు. కోర్టు ఆదేశం ప్రకారం మంగళవారంతో శ్రీధర్ ఏసీబీ కస్టడీ ముగియనుంది. మరోవైపు ఇప్పటివరకు సేకరించిన వివరాల ఆధారంగా శ్రీధర్ కుటుంబ సభ్యులు, బంధువుల్లో కొందరికి ఏసీబీ త్వరలో నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

హైదరాబాద్-దోహా విమాన సర్వీసులు మళ్లింపు

గగనతలాన్ని ఖతర్ మూసేసిన నేపథ్యంలోనే..



శంషాబాద్: తమ దేశంలోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడిన నేపథ్యంలో ఖతర్ తన గగనతలాన్ని మూసేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. దీంతో హైదరాబాద్ నుంచి దోహాకు వెళ్లాల్సిన పలు విమానాలను శంషాబాద్ విమానాశ్రయ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ నుంచి సోమవారం అర్ధరాత్రి రెండు విమానాలు దోహాకు వెళ్లాల్సి ఉంది. ఖతార్ తాజా నిర్ణయం నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఖతార్, బహ్రెయిన్ తదితర దేశాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు.

హోరెత్తిన ‘యువత పోరు’

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏపీ వ్యాప్తంగా యువత, విద్యార్థుల ఉద్యమ బాట

ఉద్యోగాలు ఇవ్వలేదు.. రూ.3 వేల నిరుద్యోగ భృతి ఎక్కడంటూ నిలదీతలు



ఏలూరు కలెక్టరేట్ వద్ద యువతను అడ్డుకుంటున్న పోలీసులు..

సాక్షి, అమరావతి: ఉద్యోగాల భర్తీ అంటూ ఉత్తుత్తి హామీతో... నిరుద్యోగ భృతి పేరిట నయవంచనకు పాల్పడిన కూటమి ప్రభుత్వంపై యువత, విద్యార్థులు కన్నెర్రజేశారు. అరొకరగా నిధులు విడుదల చేస్తూ.. విద్యా దీవెన, వసతి దీవెనపై సవతి ప్రేమ చూపుతున్న ఏపీ సర్కారు తీరును ఎండగట్టారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిలదీశారు. మాట తప్పి... వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారు. పోలీసుల అణచివేత చర్యలను ఎదుర్కొంటూ ముందుకు కదిలారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు ఏడాదైనా నెరవేర్చలేదని నిప్పులు చెరిగారు. అధికారంలోకి వస్తే ఉద్యోగాలు భర్తీ చేస్తామని, అప్పటివరకు యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అంటూ కూటమి పార్టీలు ఇచ్చిన హామీ ప్రచారానికే పరిమితమైంది. విద్యా దీవెన కింద రూ.4,200 కోట్లు, వసతి దీవెన కింద రూ.2,200 కోట్లు... మొత్తం రూ.6,400 కోట్లకు గాను రూ.750 కోట్లు విదిలించింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సోమవారం ‘యువత పోరు’ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఆ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు కదంతొక్కారు. ఎక్కడికక్కడ వందలాది మంది ప్లకార్డులు చేతబట్టి ‘బాబు వచ్చాడు.... వాలంటీర్లను రోడ్డుపై నిలబెట్టాడు, ఏడాదిలో 4 లక్షల ఉద్యోగాలు తొలగించాడు.. నిరుద్యోగ భృతి ఎప్పుడు?.. గ్రూప్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇంకెప్పుడు... ప్రతి నిరుద్యోగికి రూ.36 వేలు నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి.. ఫీజులు చెల్లించక విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం... వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలి’’ అని నినదించారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని మండిపడ్డారు. నిరుద్యోగుల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, హామీలు అమలు చేయకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్లకు యువతీ, యువకులతో కలిసి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు వినతిపత్రాలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పెద్దఎత్తున తరలివచ్చిన యువతతో కార్యక్రమం విజయవంతమైంది.

కవచ్ 4.0 వెర్షన్ ట్రయల్స్ షురూ

- మళ్లీ దక్షిణ మధ్య రైల్వే పరిధి ప్రాంతాలే ఎంపిక
- రఘునాథ్‌పల్లి-మౌలాలీ, సనత్‌నగర్-వికారాబాద్ సెక్షన్లలో ట్రయల్స్
- వాటి ఫలితాల ఆధారంగా దేశవ్యాప్తంగా ఏర్పాటు
- జోన్ పరిధిలో 4,655 రూట్ కి.మీ.లో ఏర్పాటుకు అనుమతి




సాక్షి, హైదరాబాద్: పరస్పరం రైళ్లు ఢీకొనకుండా నిరోధించేందుకు సొంత పరిజ్ఞానంతో అత్యాధునిక సాంకేతికతతో రైల్వే రూపొందించిన కవచ్ సాంకేతిక తదుపరి వెర్షన్ ట్రయల్స్ ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు కవచ్ 3.2 వెర్షన్ ఉండగా, ఇటీవల 4.0 వెర్షన్‌ను రూపొందించారు. రైల్వే అనుబంధ సంస్థ రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌ఓ) అభివృద్ధి చేసిన ఈ అప్‌గ్రేడెడ్ వెర్షన్ ట్రయల్స్‌కూ దక్షిణ మధ్య రైల్వే పరిధినే ఎంపిక చేయటం విశేషం. సనత్‌నగర్-వికారాబాద్-వాడీ సెక్షన్‌ను కవచ్ 3.2 వెర్షన్ ప్రయోగాలు, ట్రయల్స్‌కు ఎంపిక చేయగా, ఇప్పుడు ఆధునిక వెర్షన్ కోసం సనత్‌నగర్-వికారాబాద్, రఘునాథ్‌పల్లి-మౌలాలీ సెక్షన్‌లను ఎంపిక చేశారు. ఈ ట్రయల్స్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో 6,600 రూట్ కి.మీ.కు గాను 4,655 కి.మీ.లలో కవచ్ 4.0 ఏర్పాటుకు రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే జోన్ పరిధిలో 1465 కి.మీ. మేర కవచ్ 3.2 వెర్షన్ ఏర్పాటై ఉంది. ఇప్పుడు దీన్ని కొత్త వెర్షన్‌తో అప్‌గ్రేడ్ చేయటంతో పాటు మిగతా ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది. 4.0 వెర్షన్ ప్రయోగాల కోసం ఎంపిక చేసిన సనత్‌నగర్-వికారాబాద్ సెక్షన్‌లో 63 కి.మీ. మేర పాత వెర్షన్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఈ పరిధిలో కొత్త వెర్షన్ ట్రయల్స్ మొదలయ్యాయి. రఘునాథ్‌పల్లి- మౌలాలీ సెక్షన్ పరిధిలో పాత వెర్షన్ లేదు. ఇప్పుడు ఈ సెక్షన్ పరిధిలోని 86 కి.మీ.లో కొత్త వెర్షన్ ఏర్పాటు చేసి ట్రయల్స్ ప్రారంభించారు.

కొత్త వెర్షన్ సరే.. ఈ జాప్యమేంటి?

కవచ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పుష్కర కాలంగా కవచ్ వ్యవస్థపై ట్రయల్స్ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రయోగాల కోసం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏర్పాటు చేసిన 1,465 కి.మీ.తప్ప దేశంలో మిగతా చోట్ల దీన్ని ఏర్పాటు చేయలేదు. ఈలోపు కవచ్ 4.0 ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఈ ప్రయోగాలు, ట్రయల్స్‌తో మళ్లీ జాప్యం తప్పేలా కనిపించటం లేదు. కవచ్ 4.0 వెర్షన్ కోసం బల్లార్షా - కాజీపేట - విజయవాడ, విజయవాడ - గూడూరు, విజయవాడ - దువ్వాడ, వాడి-గుంతకల్-ఎర్రగుంట్ల-రేణిగుంట సెక్షన్లకు సంబంధించి 1,618 కి.మీ.కు టెండర్లు పిలిచారు. కొత్త వెర్షన్‌లో రైలును మరింత వేగంగా, తక్కువ నిడివిలో సురక్షితంగా బ్రేక్ వేసి ఆపే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. పాత దానిలో సంప్రదాయ సిగ్నలింగ్ వ్యవస్థ ఉండగా, కొత్త దాంట్లో ఇంటెలిజెంట్, డైనమిక్ ప్రాసెసింగ్ సిస్టమ్ వాడుతున్నారు. 4.0లో గ్రాఫికల్ ఇంటర్‌ఫేస్‌తో, డ్రైవర్‌కు క్లియర్ విజువల్, అథెంటికేటెడ్ అలర్ట్స్ ఇవ్వగలదు. దీన్ని హ్యాక్ చేయటం అంత సులువు కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు వినియోగంలో ఉన్న యాంటీ కొలిజన్ సిస్టమ్స్ సరసన నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్.. తగ్గేదేలేద్..!




తగ్గేదే లేదు.. ఆఫీస్ స్పేస్ అయినా.. ఉద్యోగాలైనా.. టాప్ నగరాల్లో మన హైదరాబాద్ ఉండాల్సిందే. ‘వి ఆర్ సిటీ 2024’ పేరుతో ‘అన్‌బాక్సింగ్‌బీఎల్‌ఆర్ ఫౌండేషన్’ రూపొందించిన నివేదిక ఇదే చెబుతోంది. ఖరీదైన ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రావడంతో కొత్తగా జత కూడిన ప్రధాన ఉద్యోగాల సంఖ్య పరంగా దేశంలో బెంగళూరు తర్వాత రెండో స్థానంలో భాగ్యనగరం నిలిచింది. ఆసక్తికర విషయం ఏమంటే.. 7 ప్రధాన నగరాల్లో 2018-23 మధ్య కార్మికుల్లో మహిళల వాటా అత్యధికంగా దాదాపు రెండింతలు పెరిగింది హైదరాబాద్‌లోనే. అలాగే 2019-23 మధ్య 6.3 లక్షల చదరపు అడుగుల గ్రేడ్-ఏ మాల్ స్పేస్ తోడై టాప్-5 స్థానాన్ని కైవసం చేసుకుంది. దేశీయంగా అయిదేళ్లలో అత్యధికంగా 27 నగరాలు, పట్టణాలకు విమాన సేవలను బెంగళూరు విస్తరిస్తే, హైదరాబాద్ 18 కేంద్రాలతో టాప్-2లో పోటీపడుతోంది. ఇంటి రుణం సగటు అధికంగా ఉన్న టాప్-3 నగరాల్లో హైదరాబాద్ చోటు సంపాదించింది. దశాబ్ద కాలంలో కొత్తగా ఏర్పాటైన కంపెనీల సంఖ్య పరంగానూ సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకుంది.

– సాక్షి, స్పెషల్ డెస్క్


ఆఫీస్ స్పేస్ - ఉద్యోగాలు

2014-2023 మధ్య నగరాల వారీగా కొత్తగా జత కూడిన టాప్ ఎండ్ ఆఫీస్ స్పేస్ ఆధారంగా ప్రధాన ఉద్యోగాలు తోడైన తీరు




మహిళా కార్మికులు

కార్మికుల్లో మహిళల వాటా (శాతాల్లో)



గ్రేడ్-ఏ మాల్ స్థలం

2019-23 మధ్య అదనంగా చేరిన గ్రేడ్-ఏ మాల్ స్థలం (లక్షల చదరపు అడుగుల్లో)




విమానాశ్రయాలు

ఒక్కో నగరంతో దేశీయంగా కొత్తగా అనుసంధానమైన విమానాశ్రయాలు




సగటు గృహ రుణం

2023 మార్చి నాటి రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం.. గృహ రుణం కింద బ్యాంకు నుంచి తీసుకున్న సగటు రుణ మొత్తం (రూ.లక్షల్లో)



సినిమా టికెట్ ధర

బుక్ మై షో వేదికగా సినిమా టికెట్ సగటు విక్రయ ధర (రూపాయల్లో)



కొత్త కంపెనీలు

కొత్త కంపెనీలు ఏర్పాటైన తీరు ఇలా

నగరం	2012-13	2022-23
ఢిల్లీ ఎన్సీఆర్	10,610	27,137
గ్రేటర్ ముంబై	5,874	13,229
బెంగళూరు	2,278	10,085
హైదరాబాద్	2,279	8,037
పుణే	1,506	6,771
చెన్నై	2,005	5,922
కోల్‌కతా	6,393	5,899

లీజుకు తీసుకున్న ఆఫీస్ స్పేస్

గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లీజింగ్ (లక్షల చదరపు అడుగులు)

నగరం	2014-18	2019-23
బెంగళూరు	127	250
హైదరాబాద్	114	159
గ్రేటర్ ముంబై	62	98
ఢిల్లీ ఎన్సీఆర్	83	90
చెన్నై	61	89
పుణే	44	81
కోల్‌కతా	8	30

1,487 గజాలు.. రూ. 33 కోట్లు

- గచ్చిబౌలిలో హౌసింగ్ బోర్డుకు చెందిన వాణిజ్య స్థలానికి వేలంలో భారీ ధర
- మొత్తం 11 ప్లాట్ల విక్రయంతో బోర్డుకు రూ. 65 కోట్ల ఆదాయం



కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో హౌసింగ్ బోర్డుకు సంబంధించిన వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కూకట్‌పల్లి: భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డుకు చెందిన 11 స్థలాలు సోమవారం బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధరలకు అమ్ముడయ్యాయి. మొత్తంగా బోర్డుకు రూ. 65.02 కోట్ల ఆదాయాన్ని అందించాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని 1,487 గజాల ఒక వాణిజ్య స్థలం ఏకంగా రూ. 33 కోట్లు పలికింది. చదరపు గజానికి రూ. 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ణయించగా వేలంపాటలో అది ఏకంగా రూ. 2.22 లక్షలు పలికింది. అలాగే అదే ప్రాంతంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు చెందిన 1,206 గజాల స్థలం వేలంలో రూ. 13.51 కోట్లు పలికింది. అక్కడ చదరపు గజానికి రూ. 80 వేలను ఆఫ్ సెట్ ధరగా ఖరారు చేయగా వేలంలో గజం రూ. 1.12 లక్షలకు అమ్ముడుపోయింది. చింతల్‌లో నాలుగు స్థలాలు, నిజాంపేటలో నాలుగు ఫ్లాట్లు సైతం ఈ వేలంపాటలో అమ్ముడయ్యాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల వేలం ద్వారానే రూ. 55.56 కోట్ల మేర ఆదాయం హౌసింగ్ బోర్డుకు సమకూరింది. చింతల్‌లోని ప్లాట్ నెం.113, 114, 115 ద్వారా సుమారు రూ. 8.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ వేలంలో 55 మంది పాల్గొన్నారు. ఈ మేరకు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతం ఓ ప్రకటన విడుదల చేశారు.

రెరా ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అనుగు సంతోష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సభ్యులతో కలసి ట్రిబ్యునల్ కార్యకలాపాలు నిర్వహించారు. జస్టిస్ సంతోష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.


బడి గంట



స్కూల్ బ్యాగ్ ఎంత బరువుగా ఉంటే ఆ స్కూల్‌లో అంత గట్టిగా పాఠాలు చెప్తున్నట్టు అనుకోకూడదు. స్కూల్ బ్యాగ్ విద్యార్థికి నెత్తిన మోసే మూట కాకూడదు. పిల్లల ఆరోగ్యం కోసం శ్రద్ధ చూపే తల్లిదండ్రులు స్కూల్ బ్యాగ్ బరువు విషయంలో నిస్సహాయంగా ఉంటారు. పిల్లలు బయటకు చెప్పలేని ఆ భారాన్ని మోస్తూ అనారోగ్యాలు కొని తెచ్చుకుంటారు. పిల్లల్ని స్కూల్‌కు పంపడం అంటే అవసరమైన పుస్తకాలతో పంపడం. హమాలీలుగా పంపడం కాదు. మోసి చూశారా మీ పిల్లల స్కూల్ బ్యాగ్ బరువెంతో?

స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించారా?

స్కూల్ బ్యాగ్ ఎంత బరువుగా ఉంటే ఆ స్కూల్‌లో అంత గట్టిగా పాఠాలు చెప్తున్నారని సంబరపడిపోతుంటారు కొందరు తల్లిదండ్రులు.

విద్యార్థి మోసే బ్యాగ్ బరువును బట్టి అతని చదువును అంచనా వేస్తారు మరికొందరు.

ఇవి కేవలం అపోహలు మాత్రమే. పిల్లల వీపున బండ మోయించినట్లు వారి చేత స్కూల్ బ్యాగ్ మోయించడం సబబు కాదు. పిల్లల ఆరోగ్యం కోసం శ్రద్ధ చూపే తల్లిదండ్రులు స్కూల్ బ్యాగ్ బరువు విషయంలో నిస్సహాయంగా ఉంటారు.

పిల్లలు బయటకు చెప్పలేని ఆ భారాన్ని మోస్తూ అనారోగ్యాలు కొని తెచ్చుకుంటారు. పిల్లల్ని స్కూల్‌కు పంపడం అంటే అవసరమైన పుస్తకాలతో పంపాలి. మీరెప్పుడైనా చూశారా మీ పిల్లల స్కూల్ బ్యాగ్ బరువెంతో?

ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు చదువు పేరుతో చాలా పని పెడుతుంటారు. కొందరు ఇది పిల్లలకు అవసరం అనుకుంటే మరికొందరు ఈ మాత్రం హడావిడి స్కూల్‌కు అవసరం అనుకుంటారు. అందుకే చాలా స్కూళ్ల లో రెగ్యులర్ సిలబస్‌తోపాటు అసైన్‌మెంట్, ప్రాజెక్టులు, స్లిప్ టెస్టులు, క్లాస్ వర్క్, హోం వర్కు, రఫ్ కాపీ, గైడ్, డైరీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్, జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ బుక్.. ఇలా విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్‌కు 6 నుంచి 7 నోటు బుక్స్‌లను కేటాయిస్తూ విద్యార్థుల వెన్ను వంచుతున్నారు. స్కూల్ బ్యాగ్ బరువు విద్యార్థి వయస్సు, ఎత్తుకు తగ్గట్టు ఉండాలని, విద్యార్థి బరువులో 10 శాతం మించకుండా ఉండాలని నిపుణులు చెప్పే మాటలు మాటలుగా ఉండిపోతున్నాయి. అధిక బరువున్న స్కూల్ బ్యాగులు పిల్లల శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా వెన్నునొప్పికి దారితీస్తోంది.

పిల్లల బ్యాగ్ బరువు ఎంత ఉండాలి

1–2 తరగతులు: 1.5 నుండి 2 కిలోలు
3–5 తరగతులు: 2 నుండి 3 కిలోలు
6–8 తరగతులు: 3 నుండి 4 కిలోలు
9–10 తరగతులు: 4 నుండి 5 కిలోలు

నో బ్యాగ్ డే

వారానికి ఒకసారి గానీ లేదా నెలలో రెండు రోజులు గానీ పిల్లలకు స్కూల్ బ్యాగ్ నుంచి స్వేచ్ఛ కల్పించడం 'హ్యాపీనెస్ కర్రికులం'లో భాగంగా అమలు చేయాలనే ఆలోచనలు కొన్ని ప్రభుత్వాలు చేసినా అవి వాస్తవరూపం దాల్చడం లేదు. నిజానికి ఇది పిల్లలకు చాలా సంతోషాన్ని ఇచ్చే ఆలోచన. స్కూల్ బ్యాగ్ లేని రోజు పిల్లలు ఆటలు పాటలు కథలు బొమ్మలు... వీటితో గడిపితే మానసిక వికాసం కలుగుతుంది. బ్యాగ్ మోత తప్పి వెన్నుకు విశ్రాంతి లభిస్తుంది. అయితే టీచర్లు తల్లిదండ్రులు కూడా ఈ ఆలోచనను అంగీకరించరు. పిల్లలు అనునిత్యం పుస్తకాలు మోస్తూ పుస్తకాల్లో తలలు కూరి ఉంటేనే వాళ్ళు మంచిపిల్లలు అన్నది వారి భావన. ఆడితే పాడితే ఎలా?

బ్యాగ్ బరువును ఇలా తగ్గిద్దాం..

- పిల్లలకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్‌లు మాత్రమే బ్యాగ్‌లో ఉంచుకునేలా చూడాలి. లంచ్‌బాక్స్, వాటర్ బాటిల్ వంటివి విడివిడిగా ఉంచుకోవడం మంచిది.
- పుస్తకాలను బైండింగ్ చేయించడం కంటే పేపర్‌తో అట్టలు వేయడం ద్వారా బరువు తగ్గుతుంది.
- పేరెంట్స్–టీచర్ సమావేశం జరిగినప్పుడు బ్యాగ్ బరువు విషయం స్కూల్ వారితో చర్చించాలి. వారికి తగిన సూచనలు చేయాలి.
- మీ ఇంటికి స్కూల్ దగ్గరగా ఉంటే ఒక పని చేయొచ్చు. పిల్లల్ని పొద్దున్న తరగతుల పుస్తకాలు మాత్రమే తీసుకెళ్లేలా చూసి, లంచ్ బ్రేక్ సమయంలో మీరు వెళ్లి మధ్యాహ్నం తరగతుల పుస్తకాలు ఇవ్వొచ్చు. ఉదయం తరగతుల పుస్తకాలు మీరు తీసుకు రావొచ్చు. దీనివల్ల పిల్లలపై బ్యాగ్ భారం తగ్గుతుంది.
- రేపు ఏయే పాఠాలు జరుగుతున్నాయో, ఏయే టీచర్లు సెలవులో ఉన్నారో, ఏ పుస్తకాలు అవసరమో ముందే పిల్లలకు చెప్పేలా ప్రణాళిక రూపొందించమని స్కూల్ యాజమాన్యాన్ని అడగండి. దీనివల్ల అవసరమైన పుస్తకాలు మాత్రమే తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.
- చాలా పాఠశాలల్లో క్లాస్ వర్క్, హోం వర్క్ అని రెండు వేర్వేరు పుస్తకాలు వాడమని పిల్లలకు సూచిస్తుంటారు. దానికన్నా ఒకే పుస్తకంలో ముందువైపు క్లాస్‌వర్క్, వెనక వైపు హోం వర్క్ రాసేలా చూడమని టీచర్లకు సూచించొచ్చు.
- కొన్ని పాఠశాలల్లో రోజువారీ పాఠ్యపుస్తకాలు అక్కడే పెట్టి, హోం వర్క్ పుస్తకాలు మాత్రం ఇంటికి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుంది. అది అన్నిచోట్లా అమలుచేసేందుకు ప్రయత్నాలు చేయొచ్చు.

బుక్‌షెల్ఫ్

పాజిటివ్... పవర్‌ఫుల్ పేరెంటింగ్

సైకోథెరపిస్ట్ జి. త్రివేది, పేరెంటింగ్ ఎక్స్‌పర్ట్ అనఘ నాగ్‌పాల్ తాజా పుస్తకం... దిస్ బుక్ వోన్ట్ టీచ్ యూ పేరెంటింగ్: బట్ ఇట్ విల్ మేక్ యూ ఏ బెటర్ పేరెంట్. బెటర్ పేరెంటింగ్ స్టైల్స్, వ్యక్తిగత అనుభవాలు, ప్రాక్టికల్ చెక్ లిస్ట్‌లు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. ఈ కాలంలో పేరెంటింగ్‌కు ఎదురవుతున్న సవాళ్ల గురించి చర్చించే పుస్తకం ఇది.

'పేరెంటింగ్ గురించి బోధించడానికి ఈ పుస్తకం రాయలేదు. ఏం చేస్తే మంచిది, ఏంచేయకూడదు...ఇలా ఎన్నో విషయాల గురించి చర్చిస్తూ రైట్ పేరెంటింగ్ గురించి చెప్పడమే ఈ పుస్తక లక్ష్యం' అంటున్నారు రచయిత్రులు. సోషల్ మీడియా, డిజిటల్ టూల్స్... మొదలైన వాటి వల్ల గతంతో పోల్చితే ఇప్పటి తల్లిదండ్రులు పేరెంటింగ్‌కు సంబంధించి రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వాటికి ఈ పుస్తకం పరిష్కార మార్గాలు సూచిస్తుంది. దీనికోసం ఎంతో రీసెర్చ్ చేశారు. బాల్యం నుంచి టీనేజ్ వరకు పిల్లలకు సంబంధించిన వివిధ దశల్లో తల్లిదండ్రులు ఎలాంటి విధానాలను అనుసరించాలో ఈ పుస్తకం సూచిస్తుంది. నిజ జీవిత కథలను ప్రస్తావిస్తూ పాజిటివ్ పేరెంటింగ్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్, పిల్లలకు ఉపకరించే సెల్ఫ్–రిఫ్లెక్షన్ ఎక్సర్‌సైజ్‌లు, సెల్ఫ్–రెగ్యులేషన్ టెక్నిక్‌ల గురించి తెలియజేస్తుంది.

పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా ప్రచురించిన ఈ పుస్తకంలో ఎనిమిది చాప్టర్లు ఉన్నాయి. 'పేరెంట్స్ తమ బాల్యంలోకి వెళ్లడానికి, ఆ జ్ఞాపకాల ఆధారంగా పిల్లల గురించి ఆలోచించడానికి, పాజిటివ్ పేరెంటింగ్ విషయంలో ప్రతి చాప్టర్ ఉపయోగపడుతుంది' అంటున్నారు రచయిత్రులు.



● ఏఐ వింతలు

కీర్తిశేషులతో కమ్యూనికేషన్



అబ్బు: ఏరా సుబ్బూ... ఎలా ఉన్నావు?

సుబ్బు: నువ్వు లేకుంటే నేను ఎలా ఉంటానురా? ఎప్పుడూ నీ జ్ఞాపకాలే...

అబ్బు: అది సరే. భూలోక విశేషాలు ఏంటీ? కొత్త బైక్ కొన్నావా? ఇంకా ఆ డొక్కు బైకే వాడుతున్నావా(నవ్వు)

గమనిక: అబ్బు రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడు. సుబ్బు తన గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు.

మరి వాళ్లు ఎలా మాట్లాడుకుంటున్నారు?

అదంతా 'గ్రీఫ్‌బాట్స్' మహిమ!

'గ్రీఫ్‌బాట్స్' లేదా 'డెట్‌బాట్స్' అనే ఏఐ స్టార్టప్‌లు చనిపోయిన వ్యక్తి ప్రతిరూపాన్ని సృష్టించడమే కాదు వారితో మాట్లాడిస్తాయి. ఈ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్‌ఎల్‌ఎం)లు చనిపోయిన వారి మాట తీరు, హావభావాలను అచ్చంగా అనుకరిస్తాయి.

ప్రాజెక్ట్ డిసెంబర్, స్టోరీ ఫైల్, అండ్ యూ, వోస్లీ వర్చువల్... మొదలైన స్టార్టప్‌లు చనిపోయిన జీవిత భాగస్వామి, ఫ్రెండ్, బంధువు... ఇలా ఎంతో మంది ఏఐ అవతార్‌లతో మాట్లాడించే టూల్స్‌పై దృష్టి పెట్టాయి. దీనికోసం ప్రైవేట్ డాటాను కూడా విస్తృతంగా వాడుకుంటున్నాయి.

జస్టిన్ హారిసన్ స్టార్టప్ 'అండ్ యూ' యూజర్‌లకు సరికొత్త అవకాశాన్ని అందిస్తోంది. ఈ స్టార్టప్ సృష్టించిన ఏఐ–పవర్డ్ ఆడియో వెర్షన్స్ ద్వారా చనిపోయిన వారికి ఫోన్ చేసి మాట్లాడవచ్చు (అంటే... అవతలి వ్యక్తి గొంతు అచ్చం చనిపోయిన వ్యక్తి గొంతును పోలి ఉంటుంది. బతికి ఉన్నప్పుడు ఎలా మాట్లాడేవారో అలాగే మాట్లాడతారు!)

'అమ్మా, నాన్న లేకపోవడం పెద్ద లోటుగా ఉంది. వారిచ్చే సలహాలు నాకు ఎంతో ఉపయోగపడేవి... ఇలా చనిపోయిన తల్లిదండ్రులను తలుచుకొని బాధ పడేవారు బోలెడు మంది ఉంటారు. అలాంటి వారికి మేము సృష్టించిన సాంకేతికత ఎంతో ఊరట ఇస్తుంది' అంటున్నాడు జస్టిన్ హారిసన్.

చనిపోయిన వారితో 'జూమ్ కాల్'లాంటి సంభాషణలు చేయడానికి వీలు కల్పించే సాంకేతికతను యూజర్‌లకు అందిస్తోంది 'స్టోరీ ఫైల్' స్టార్టప్. కీర్తిశేషుల ఏఐ అవతార్‌లు కొందరికి సంతోషం కలిగిస్తున్నప్పటికీ, ఆత్మీయులకు ఊరట ఇస్తున్నప్పటికీ 'గ్రీఫ్‌బాట్స్' స్టార్టప్‌లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

బులియన్

జూన్ 23న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,710
బంగారం (22 క్యారెట్లు)	91,357
వెండి	1,08,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,160
బంగారం (22 క్యారెట్లు)	92,300
వెండి	1,10,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,690
బంగారం (22 క్యారెట్లు)	92,300
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,160
బంగారం (22 క్యారెట్లు)	95,070
వెండి	1,10,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,200
బంగారం (22 క్యారెట్లు)	90,340
వెండి	1,07,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,690
బంగారం (22 క్యారెట్లు)	92,300
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

ఆరుద్ర కార్తె: జూన్ 22 నుంచి

దేశీ టొమాటోల సిరి!




ఆఫ్రికా టోగో

కొన్ని పంటల్లో దేశీ వంగడాల వైవిధ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. కర్ణాటకకు చెందిన వి. కాంతరాజు 27 రకాల దేశీ టొమాటో వంగడాలను సాగు చేస్తూ పరిరక్షిస్తున్నారు. అత్యంత విలక్షణమైన ఆఫ్రికా టోగో, బ్లాక్ ప్లమ్, బ్లాక్ టొమాటో వంటి విశిష్ట రకాలు కూడా ఇందులో ఉన్నాయి. టొమాటోలే కాదు అనేక పంటల దేశీ వంగడాలను సేకరించటం, వాటిని రైతులకు ఇచ్చి ఏటేటా పండిస్తూ సంరక్షించటమే పనిగా పెట్టుకుంది మైసూరుకు చెందిన సేంద్రియ రైతుల సంఘం 'సహజ సమృద్ధ'. కాంతరాజు కూడా ఈ సంఘం సభ్యుడే. ఈ 27 రకాల టొమాటోలతో పాటు చాలా రకాల ధాన్యాలు, పప్పుధాన్యాలను సైతం ఆయన సాగు చేస్తున్నారు. దేశీ విత్తనాలతో కూడిన సమీకృత సేంద్రియ వ్యవసాయమే ఆహార, పౌష్టికాహార, ఆదాయ భద్రతను కల్పిస్తుందని కాంతరాజు అంటున్నారు. కర్ణాటక దేశీ పంటల వైవిధ్యాన్ని కళ్లారా చూడాలంటే జూలై 5,6 తేదీల్లో మైసూరులో జరిగే దేశీ విత్తనోత్సవాన్ని సందర్శించాల్సిందే! అందరూ ఆహ్వానితులే.
వివరాలకు 70900 09944.

బిఆర్‌సిలపై 4 రోజుల శిక్షణ

ప్రకృతి వ్యవసాయంలో ఘన, ద్రవరూప ఎరువులు, ద్రావణాలు, కషాయాలు, జీవన ఎరువులు, జీవన పురుగు మందులను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చే కేంద్రాలను బయో రిసోర్స్ సెంటర్లు(బిఆర్‌సిలు) అంటారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకునే వ్యక్తులు, సహకార సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వాహకులకు నూజివీడు సమీపంలో కొండపర్వలో ఏర్పాటైన కృష్ణసుధ అకాడమీ ఫర్ ఆగ్రోఎకాలజీలో జూలై 1 నుంచి 4 వరకు 4 రోజుల పాటు ఆంగ్లంలో శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. బిఆర్‌సిలకు సంబంధించిన 10 అంశాలపై శిక్షణ ఇస్తారు.
ఫీజు, రిజిస్ట్రేషన్ వివరాలకు.. 850 028 3300.


ప్రొఫెసర్ నందుల రఘురామ్

'నత్రజని కాలుష్యం' భూగోళంపై జీవనాన్ని కష్టాలపాలు చేస్తోంది. రసాయనిక ఎరువుల వాడకం, బొగ్గు/పెట్రోలియం ఉత్పత్తుల వంటి శిలాజ ఇంధనాల వాడకం అంతకంతకూ పెరిగిపోతుండటమే ఇందుకు కారణం. మనుషుల పనుల వల్ల అతిగా పర్యావరణంలోకి వెలువడుతున్న నత్రజని.. ప్రకృతిలోని సహజ ప్రక్రియలకు అంతరాయం కలిగిస్తోంది. 'నత్రజని కాలుష్యం' ముఖ్యంగా మూడు రకాలుగా భూగోళంపై మూడు సంక్షోభాలను కలిగిస్తోంది. దీన్నే 'ప్లానెటరీ ట్రిపుల్ క్రైసిస్' అంటారు. సుస్థిర పద్ధతుల్లో నత్రజని కాలుష్యాన్ని నిర్వహించే మార్గాలపై ప్రొఫెసర్ నందుల రఘురామ్ గత పాతికేళ్లుగా విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇంటర్నేషనల్ నైట్రోజన్ ఇనీషియేటివ్ ఎమెరిటస్ చైర్మన్‌గా, గురుగోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ(ద్వారాక, ఢిల్లీ)లో ప్రొఫెసర్‌గా డా.రఘురామ్ సేవలందిస్తున్నారు. 2017లో ప్రపంచంలోనే మొదటిగా 'ఇండియన్ నైట్రోజన్ అసెస్‌మెంట్' నివేదిక రూపొందించటంలో ఆయనది కీలకపాత్ర. దీనిపై ఐక్యరాజ్యసమితిలో అప్పట్లోనే తీర్మానం జరిగింది కూడా. డా.రఘురామ్‌ని 'సాక్షి సాగుబడి' ఇటీవల ఇంటర్వ్యూ చేసింది. రసాయనిక ఎరువుల 'నత్రజని కాలుష్య' తీవ్రత ఎంతో? కారణాలేమిటో? పరిష్కారాలేమిటో? ఇప్పుడు తెలుసుకుందాం.



రసాయనిక ఎరువుల్లో 60-70% వృథా!

- పంటకు ఉపయోగపడుతున్న రసాయనిక ఎరువులు 30–40% మాత్రమే!
- నీరు, గాలి, భూమిని కలుషితం చేస్తున్న 'నత్రజని కాలుష్యం'
- భూతాపాన్ని పెంచడంలో, జీవవైవిధ్యాన్ని హరించటంలోనూ దీని పాత్ర ఎక్కువే
- ఇంతకీ నత్రజని కాలుష్యానికి 'నో' చెప్పేదెలా?

ప్రజల ఆకలి తీర్చే క్రమంలో అధిక దిగుబడుల కోసం హరితవిప్లవంలో భాగంగా వాడటం ప్రారంభించిన రసాయనిక ఎరువులు నిజానికి పంటలకు ఉపయోగపడుతున్న దానికంటే వృథా అవుతున్నది చాలా ఎక్కువ. ముఖ్యంగా నత్రజని ఎరువుల వాడకం, వృథా ఎక్కువే. ప్రొఫెసర్ నందుల రఘురామ్ మాటల్లో చెప్పాలంటే.. 'మన దేశంలో పొలాల్లో వేస్తున్న రసాయనిక ఎరువుల్లో 30–40% మాత్రమే పంటకు ఉపయోగపడుతున్నాయి. 60–70% వృథాగా పోతున్నాయి. నీటి కాలుష్యానికి, వాయు కాలుష్యానికి, భూతాపోన్నతికి కారణమవుతున్నాయి. జల వనరుల్లో జీవవైవిధ్యానికి తూట్లు పొడుస్తున్నాయి' అన్నారాయన.



6 కోట్ల టన్నుల ఎరువులు

మన దేశంలో పంటల సాగు కోసం 2023–24లో 6 కోట్ల మెట్రిక్ టన్నులకు పైగా రసాయనిక ఎరువులు వాడారు. యూరియా 357.81 లక్షల టన్నులు, డిఏపి 109.73 లక్షల టన్నులు, ఎంఓపి 16.45 లక్షల టన్నులు, ఎన్‌పికె మిశ్రమ ఎరువులు 116.80 లక్షల మెట్రిక్ టన్నుల వినియోగం జరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఈ ఎరువులపై సబ్సిడీ కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. లక్షన్నర కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. మరోవైపు, ఎరువుల మోతాదు పెంచుతున్నా దిగుబడులు పెరగని స్థితి నెలకొంటున్నది. రైతులు ఏటేటా అధికంగా ఎరువులు వాడకతప్పని స్థితిని ఎదుర్కొంటున్నారు.

'ట్రిపుల్ ప్లానెటరీ క్రైసిస్'

నత్రజని కాలుష్య ప్రభావంతో 'ట్రిపుల్ ప్లానెటరీ క్రైసిస్' పెచ్చరిల్లుతోంది. వాతావరణ మార్పు, జీవవైవిధ్య నష్టం, కాలుష్యం అనే మూడు పరస్పర అనుసంధాన సంక్షోభాలకు ఇది నేరుగా దోహదం చేస్తోంది.

1 వ్యవసాయంలో ఎరువుల వాడకం నత్రజని కాలుష్యానికి ప్రధాన మూలం. పంటలు వాడుకోలేకపోయిన అధిక నత్రజని నీటి వనరుల్లోకి వెళ్లి భూగర్భ జలాల్లోకి చేరుతోంది.

2 పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలను మండించడం వలన నైట్రోజన్ ఆక్సైడ్లు విడుదలవుతున్నాయి. ఇది వాయు కాలుష్యం, వాతావరణ మార్పులకు దోహదం చేస్తోంది.

3 శుద్ధి చేయని లేదా సరిగా శుద్ధి చేయని మురుగునీటిలో అధిక స్థాయిలో నత్రజని, ఇతర పోషకాలు ఉంటాయి, ఇవి చెరువులు, రిజర్వాయర్లు, నదులు, సముద్రాలను కలుషితం చేస్తాయి. ఈ కాలుష్యం వల్ల ఆక్సిజన్ లోపించి చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయి. ఆ నీటిలో విపరీతంగా నాచు పెరిగిపోతుంది. ఇది జలచరాలకు మరణశాసనంగా మారుతుంది.

ఏమి చేయవచ్చు?

→ నత్రజని తదితర ఎరువులను అవసరం మేరకు తగు మాత్రంగా, సముచిత పాళ్లలో ఉపయోగించాలి.
→ పశువుల పేడ మూత్రాన్ని సక్రమంగా సేకరించి, వినియోగించే పద్ధతులను అమలు చేస్తే నత్రజని కాలుష్యం తగ్గుతుంది.
→ వ్యర్థాలను తగిన రీతిలో పునర్వినియోగించటం, వనరుల వినియోగ సామర్థ్యాన్ని ప్రోత్సహించి అధిక ఎరువుల వాడకం అవసరాన్ని తగ్గించవచ్చు.
→ ప్రభుత్వాలు నత్రజని ఉద్గారాలను పరిమితం చేసే పద్ధతులను ప్రోత్సహించేలా విధానాల్లో మార్పులు తేవాలి.
→ నత్రజని కాలుష్యాన్ని అరికట్టే క్రమంలో సమాజంలో వ్యక్తుల పాత్ర కూడా కీలకం. మాంసం వినియోగాన్ని తగ్గించటం, రసాయనాల్లేని వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం, నత్రజని కాలుష్యాన్ని పరిష్కరించే విధానాల కోసం కృషి చెయ్యాలి.

ఎరువు 4 రోజుల్లో మాయం!

పంటలకు స్థూల పోషకాలైన నత్రజని (యూరియా), ఫాస్ఫరస్, పొటాషియం /సల్ఫర్‌లను 4:2:1 నిష్పత్తిలో వాడాలి. ఉదా.. వరి పంటకు సీజన్‌కు హెక్టారుకు అన్నీ కలిపి 120 కిలోల ఎరువు వెయ్యాలని శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. అయితే, రైతులు ఈ నిష్పత్తిపై సరైన అవగాహన లేక ఈ మోతాదులను పట్టించుకోవటం లేదు. పంట పచ్చబడితే చాలన్నట్లు యూరియానే పొలాల్లో కుమ్మరిస్తున్నారని, అది కూడా పంట సీజన్‌లో కేవలం రెండు సార్లు మాత్రమే ఎరువులు వేస్తున్నారని ప్రొఫెసర్ రఘురామ్ అన్నారు. రసాయనిక ఎరువులను పంట 2–4 రోజుల్లోనే తీసుకోగలుగుతుంది. పంట తీసుకునేది 30–40% మాత్రమే. మిగతా 60–70% ఎరువు నీటి ద్వారా, గాలి ద్వారా వృథాగా పోతున్నది. సమర్థవంతంగా ఎరువు వినియోగించకపోవటం వల్ల సుమారు రూ. లక్ష కోట్ల ఎరువుల సబ్సిడీ వృథా అవుతోందని ప్రొ. రఘురామ్ అన్నారు. ఏ ఎరువు ఎంత పాళ్లలో వేయాలో అంతే వెయ్యాలి. తక్కువ మోతాదులో, ఎక్కువ సార్లు వేస్తే ఎక్కువగా పంటకు ఉపయోగం. వృథా తగ్గుతుంది. అప్పుడే నత్రజని కాలుష్యమూ తగ్గుతుంది అన్నారాయన. అయితే, ఎక్కువ సార్లు వేయటానికి రైతులకు ఖర్చు ఎక్కువ అవుతుంది. మంచి గిట్టుబాటు ధర దక్కినప్పుడే రైతులు ఆపని చేయగలుగుతారన్నారు.

ఈ పోషకాలను సమర్థంగా వాడుకోలేమా?

దేశంలో రోజుకు 15,000 కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు ఉత్పత్తి అవుతోంది. ఈ నీటిలో 65,250 మెట్రిక్ టన్నుల నత్రజని తదితర పోషకాలు ఉంటాయి. శుద్ధి చేసి ఆ పోషకాలను పునర్వినియోగించలేక ప్రతి రోజూ 55,000 మెట్రిక్ టన్నులకు పైగా పోషకాలను కోల్పోతున్నాం. మురుగు నీటిలోని పోషకాలను పూర్తిగా రీసైకిల్ చేస్తే రసాయనిక ఎరువులు 40% వరకు ఆదా అయ్యేవని ప్రొఫెసర్ రఘురామ్ అన్నారు.

అదేవిధంగా, దేశంలో 20 కోట్ల పశువులున్నాయి. రోజుకు ఒక జంతువుకు 15 కిలోల పేడ వస్తుంది. అందులో 5% ఎన్‌పికె పోషకాలు ఉన్నాయి. వాటి పరిమాణం 1,50,000 మెట్రిక్ టన్నులు. ఇది మనం వాడే మొత్తం రసాయనిక ఎరువుల్లో 95 శాతం. దీనికి అదనంగా, రోజుకు ఒక పశువు 15–20 లీటర్ల మూత్రం పోస్తుంది. వీటిలో 3% పోషకాలు ఉంటాయి. ఆ మొత్తం 1,20,000 మెట్రిక్ టన్నులు. సక్రమంగా మూత్రాన్ని సేకరించి వాడుకోలేక చాలా కోల్పోతున్నాం. మరో మాటలో చెప్పాలంటే.. పంట పొలాలు, జనావాసాల నుంచి వెలువడే మురుగునీటిలో 3,35,000 టన్నులకు పైగా పునర్వినియోగించదగిన పోషకాలు ఉన్నాయి. ఇది మన దేశంలో రోజువారీగా వాడుతున్న ఎరువులకు రెట్టింపు ఉంటాయని డా.రఘురామ్ వివరించారు.

– పంతంగి రాంబాబు



భారత మాజీ క్రికెటర్ దిలీప్ దోషి కన్నుమూత

భారత మాజీ లెఫ్టార్మ్ స్పిన్నర్ దిలీప్ దోషి (77) సోమవారం లండన్‌లో గుండెపోటుతో కన్నుమూశారు. 32 ఏళ్ల వయసులో ఆయనకు తొలిసారి భారత్ జట్టు తరఫున ఆడే అవకాశం దక్కింది. 1979–1983 మధ్య కాలంలో 33 టెస్టులు ఆడి 114 వికెట్లు పడగొట్టిన దిలీప్ దోషి...15 వన్డేల్లో 22 వికెట్లు తీశారు. 1981లో మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియాపై భారత జట్టు చారిత్రాత్మక విజయంలో దిలీప్ 5 వికెట్లతో కీలక పాత్ర పోషించారు. దేశవాళీ క్రికెట్‌లో సౌరాష్ట్ర, బెంగాల్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన ఆయన సుదీర్ఘ కాలం ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో వార్విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్ జట్ల తరఫున ఆడారు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన తర్వాత లండన్‌లోనే శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్నప్పుడు కూడా భారత్ జట్టులో బిషన్‌సింగ్ బేడి హవా నడుస్తుండటంతో దిలీప్‌కు ఎక్కువగా టెస్టులు ఆడే అవకాశం రాలేదు. 'స్పిన్ పంచ్' పేరుతో ఆయన ఆటోబయోగ్రఫీ వచ్చింది. దిలీప్ మృతి పట్ల బీసీసీఐ సంతాపం వ్యక్తం చేసింది.

'పదేళ్లుగా అదే మాట వింటున్నా'

తన పనైపోయిందన్న విమర్శలకు బుమ్రా సమాధానం

- మరిన్ని మ్యాచ్‌లు గెలిపించడమే లక్ష్యమన్న పేసర్



లీడ్స్: భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో దాదాపు పదేళ్లుగా ఉన్నాడు. ఐపీఎల్‌లో పుష్కర కాలం పూర్తి చేసుకున్నాడు. అయితే కెరీర్ ఆరంభం నుంచి అతని భిన్నమైన బౌలింగ్ శైలిపై ఎన్నో చర్చలు సాగాయి. ఈ తరహా యాక్షన్‌తో ఎక్కువ కాలం కొనసాగలేడని, సుదీర్ఘ కెరీర్ సాగడం కష్టమని చాలా మంది అభిప్రాయపడ్డారు. పైగా గాయాలతో ఆటకు దూరం కాగానే ఇంతటితో కెరీర్ ముగిసినట్లే అనే విమర్శలు వినిపించాయి. కానీ బుమ్రా వాటన్నింటినీ పట్టించుకోలేదు. అద్భుత ప్రదర్శనలతో భారత్‌కు చిరస్మరణీయ విజయాలు అందించి ప్రపంచ అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా ఎదిగాడు. బరిలోకి దిగిన ప్రతీసారి కొత్త రికార్డులు తన ఖాతాలో వేసుకుంటున్నాడు. తాజాగా ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన తర్వాత అతను ఈ విషయాలపై స్పందించాడు. 'నేను ఎప్పుడైనా భారత్‌కు ఆడాలని బలంగా కోరుకున్నా. నాపై నాకున్న నమ్మకం వల్లే అన్ని ఫార్మాట్‌లలో ఆడగలిగా. కానీ వేరేవాళ్లు ఎవరూ దానిని నమ్మలేదు. నువ్వు అసలు ఎప్పుడూ ఆడలేవు అని మొదట్లో అనేవారు. ఆ తర్వాత ఆరు నెలలు, ఆపై ఎనిమిది నెలలు ఆడితే గొప్ప అనేవారు. కానీ ఇప్పుడు భారత్ తరఫున దాదాపు పదేళ్లు ఆడితే ఐపీఎల్‌లో మరో మూడేళ్లు అదనంగా ఆడాను. ఇప్పుడు కూడా ఒక గాయం కాగానే నా పనైపోయిందని వెంటనే అనేస్తారు. ప్రతీ మూడు–నాలుగు నెలలకు ఇవే మాటలు వస్తాయి. నేను ఇవేమీ పట్టించుకోను. నా పని నేను చేస్తూ పోతా. భారత జట్టును గెలిపించేందుకు ప్రయత్నిస్తా. ఆపై దేవుడు నాకు ఏది రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది' అని బుమ్రా వ్యాఖ్యానించాడు. బుమ్రా ఫిట్‌నెస్, పనిభారాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అతను మూడు టెస్టులే ఆడతాడని కోచ్ గంభీర్ ప్రకటించాడు. అయితే ఇదే విషయంపై బుమ్రా కాస్త భిన్నంగా స్పందించాడు. తాను మూడు టెస్టులే ఆడతానా లేదా అనేదానిపై అతను స్పష్టతనివ్వలేదు. 'మున్ముందు ఏం జరగవచ్చనే విషయంపై ఆలోచించడం అనవసరం. ప్రస్తుతం మైదానంలో ఏం జరుగుతోంది అనే దానిపైనే నా దృష్టి ఉంది. నేను పూర్తి చేయాల్సి పని ఉంది. పిచ్ ఎలా స్పందిస్తోంది, వికెట్ ఎలా తీయాలి, ఏ బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలి అనే అంశాలపైనే నేను ఆలోచిస్తున్నాను. అంతే తప్ప ఎన్ని టెస్టులు ఆడతానని కాదు. ఒక్కసారి మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ లెక్కలన్నీ చూసుకోవచ్చు. రాత్రయ్యాక ఈ రోజు నేను నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చానని భావిస్తే ప్రశాంతంగా పడుకుంటా' అని బుమ్రా వివరించాడు.

26 నుంచి కేపీఆర్ ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం (హెచ్‌డీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి కోనేరు పూర్ణచంద్రరావు (కేపీఆర్) స్మారక ఆలిండియా ఓపెన్ 'ఫిడే' రేటింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. ఐదు రోజులపాటు జరిగే ఈ టోర్నీని హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. విజేతగా నిలిచిన ప్లేయర్‌కు భారత గ్రాండ్‌మాస్టర్, రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి తాత అయిన కోనేరు పూర్ణచంద్రరావు ట్రోఫీతోపాటు రూ. 75 వేలు నగదు పురస్కారం అందజేస్తారు. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 8,05,000. అండర్–7, 9, 11, 13, 19 వయో విభాగాల వారికి కూడా ప్రత్యేక నగదు పురస్కారం ఇస్తామని హెచ్‌డీసీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నీలో ఆడాలనుకుంటున్న వారు తమ పేర్లను 7337578899, 7337399299 ఫోన్ నంబర్ల ద్వారా లేదా www.easypaychess.com వెబ్‌సైట్ ద్వారా ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

విజయంపై గురి

ఇంగ్లండ్ విజయలక్ష్యం 371 ● ప్రస్తుతం 21/0

- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 364 ఆలౌట్
- రాహుల్, పంత్ సెంచరీలు

భారత బ్యాటింగ్ దళం అంచనాలకు అనుగుణంగా తమ బాధ్యత ముగించింది. చివర్లో కొంత తడబాటు కనిపించినా... రాహుల్, పంత్ సెంచరీలతో చెలరేగి భారీ భాగస్వామ్యం నెలకొల్పడంతో ప్రత్యర్థికి కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పుడు ఇక బౌలర్ల వంతు...బుమ్రా ఒక్కడే ఇంగ్లండ్ ఆట కట్టిస్తాడా...ఈసారి మేం కూడా అంటూ ఇతర బౌలర్లూ సహకరిస్తారా అనేది చూడాలి. చివరి రోజు 90 ఓవర్లలో 350 పరుగులు చేయాల్సిన ఇంగ్లండ్ దూకుడుగా ఆడి ఛేదనకు మొగ్గు చూపుతుందా...లేక పరిస్థితి మారిపోతే కాస్త తగ్గి 'డ్రా'కు ప్రయత్నిస్తుందా చూడాలి. మరోవైపు హెడింగ్లీ మైదానంలో ఆఖరి రోజు ఆటకు వాన ముప్పు కూడా ఉంది!

లీడ్స్: భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసవత్తర స్థితికి చేరింది. 371 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. జాక్ క్రాలీ (12 బ్యాటింగ్), బెన్ డకెట్ (9 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 96 ఓవర్లలో 364 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (247 బంతుల్లో 137; 18 ఫోర్లు) శతకం పూర్తి చేసుకోగా... రిషభ్ పంత్ (140 బంతుల్లో 118; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ టెస్టులో రెండో సెంచరీ సాధించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 195 పరుగులు జోడించారు. ఒకదశలో 333/4తో ఉన్న భారత్ 31 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు కోల్పోయింది.

తొలి సెషన్ నెమ్మదిగా...

ఓవర్‌నైట్ స్కోరు 90/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన భారత్ అదే స్కోరు వద్ద కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (8) వికెట్ కోల్పోయింది. దాంతో రాహుల్, పంత్ తొలి సెషన్‌లో చాలా జాగ్రత్తగా ఆడారు. 87 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఇంగ్లండ్ కూడా చక్కటి నియంత్రణతో బౌలింగ్ చేయడంతో పరుగులు అంత సులువుగా రాలేదు. 58 పరుగుల వద్ద రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను బ్రూక్ వదిలేయడం జట్టుకు కలిసొచ్చింది. తొలి సెషన్‌లో భారత్ 24.1 ఓవర్లలో 63 పరుగులే చేయగలిగింది.

పంత్, రాహుల్ జోరు...

లంచ్ తర్వాత ఒక్కసారిగా భారత్ ఆట మారింది. బ్యాట్ ఝుళిపించిన పంత్ దూకుడు పెంచి పరుగులు రాబట్టగా... రాహుల్ తనదైన శైలిలో చూడచక్కటి షాట్లతో అలరించారు. 83 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న పంత్ ఆ తర్వాత మరింత ధాటిగా ఆడుతూ తర్వాతి 25 బంతుల్లోనే 44 పరుగులు రాబట్టాడు. మరోవైపు 202 బంతుల్లో రాహుల్ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత కొద్ది సేపటికే పంత్ కూడా ఈ టెస్టులో రెండో సెంచరీని (130 బంతుల్లో) తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ జోడీని విడదీసేందుకు తీవ్రంగా శ్రమించిన ఇంగ్లండ్ ఎట్టకేలకు 46.4 ఓవర్ల తర్వాత సఫలమైంది. శతకం పూర్తయిన తర్వాత రూట్ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాదిన పంత్... బషీర్ వేసిన తర్వాతి ఓవర్లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. రెండో సెషన్‌లో భారత్ 27 ఓవర్లలోనే ఏకంగా 5.37 రన్‌రేట్‌తో 145 పరుగులు సాధించడం విశేషం. విరామానంతరం ఆట మళ్లీ మలుపు తిరిగింది. కార్స్ బౌలింగ్‌లో రాహుల్ బౌల్డ్ కాగా...కరుణ్ నాయర్ (20) మరో అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. ఆ తర్వాత టంగ్ నాలుగు బంతుల్లో శార్దుల్ (4), సిరాజ్ (0), బుమ్రా (0)లను అవుట్ చేయగా... ప్రసిధ్ కృష్ణ (0) చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో రవీంద్ర జడేజా (40 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించగలిగాడు.



రాహుల్ సెంచరీ అభివాదం



పంత్ సెంచరీ సంబరం

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 471; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 465; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) కార్స్ 4; రాహుల్ (బి) కార్స్ 137; సాయి సుదర్శన్ (సి) క్రాలీ (బి) స్టోక్స్ 30; గిల్ (బి) కార్స్ 8; పంత్ (సి) క్రాలీ (బి) బషీర్ 118; నాయర్ (సి అండ్ బి) వోక్స్ 20; జడేజా (నాటౌట్) 25; శార్దుల్ (సి) రూట్ (బి) టంగ్ 4; సిరాజ్ (సి) స్మిత్ (బి) టంగ్ 0; బుమ్రా (బి) టంగ్ 0; ప్రసిధ్ (సి) టంగ్ (బి) బషీర్ 0; ఎక్స్‌ట్రాలు 18; మొత్తం (96 ఓవర్లలో ఆలౌట్) 364. వికెట్ల పతనం: 1–16, 2–82, 3–92, 4–287, 5–333, 6–335, 7–349, 8–349; 9–349; 10–364. బౌలింగ్: వోక్స్ 19–4–45–1, కార్స్ 19–2–80–3, టంగ్ 18–2–72–3, బషీర్ 22–1–90–2, స్టోక్స్ 15–2–47–1, రూట్ 3–0–21–0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (బ్యాటింగ్) 12; డకెట్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 21.** బౌలింగ్: బుమ్రా 3–0–9–0, సిరాజ్ 2–1–9–0, జడేజా 1–0–3–0.

2 ఒక టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు సాధించిన రెండో వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్ గుర్తింపు పొందాడు. గతంలో జింబాబ్వేకు చెందిన ఆండీ ఫ్లవర్ (2001–దక్షిణాఫ్రికాపై) మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఇంగ్లండ్ గడ్డపై ఇలా రెండు సెంచరీల ఫీట్ నమోదు చేసిన తొలి భారత బ్యాటర్ పంత్ కావడం విశేషం.

1 ఒక టెస్టు మ్యాచ్‌లో భారత బ్యాటర్లు ఐదు సెంచరీలు నమోదు చేయడం ఇదే తొలిసారి. తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్ సెంచరీలు చేయగా...రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్, పంత్ శతకాలు బాదారు.

8 పంత్ సెంచరీల సంఖ్య. అత్యధిక సెంచరీలు సాధించిన వికెట్ కీపర్లలో గిల్‌క్రిస్ట్ (17), ఆండీ ఫ్లవర్ (12) మాత్రమే అతనికంటే ముందున్నారు.

7 ఒకే టెస్టులో రెండు సెంచరీలు చేసిన ఏడో భారతీయ క్రికెటర్ పంత్. గతంలో విజయ్ హజారే, సునీల్ గావస్కర్ (3 సార్లు), రాహుల్ ద్రవిడ్ (2 సార్లు), విరాట్ కోహ్లి, అజింక్య రహానే, రోహిత్ శర్మ ఈ ఘనత సాధించారు.

సాక్షి సినిమా



● సూర్య

డిష్యుం.. డిష్యుం

డిష్యుం.. డిష్యుం.. అంటూ విలన్లను రఫ్ఫాడిస్తున్నారు సూర్య. ఆయన హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కాగా ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంతేకాదు.. ఈ సినిమాలో సూర్య క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, కొన్ని సన్నివేశాల్లో నెగటివ్ షేడ్స్ కూడా కనిపిస్తాయనే టాక్ తెరపైకి వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.



● ఎన్టీఆర్

డ్రాగన్ దేశభక్తి

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, మలయాళ నటుడు టొవినో థామస్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఓ లాంగ్ షెడ్యూల్ చిత్రీకరణ కర్ణాటకలో జరిగింది. లేటెస్ట్ షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగానే ఎన్టీఆర్‌పై ప్రస్తుతం ఓ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. ఈ సాంగ్ స్క్రీన్‌పై విజువల్‌గా అద్భుతంగా ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ఈ పాట రెగ్యులర్ సాంగ్ కాదని, దేశభక్తిని గుర్తుచేసేలా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2026 జూన్ 25న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్.



● వెంకటేశ్



● మోహన్‌లాల్



● అజయ్ దేవగణ్

మూడు భాషల్లో ఒకేసారి దృశ్యం 3

'దృశ్యం' సినిమాలకున్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. మలయాళ, తెలుగు, హిందీ భాషల్లో 'దృశ్యం, దృశ్యం 2' చిత్రాలు ఘన విజయం సాధించాయి. ఈ సిరీస్‌లో రానున్న మూడో చిత్రం 'దృశ్యం 3'పై ఇటు ఇండస్ట్రీ, అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. మోహన్‌లాల్ హీరోగా జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మలయాళంలో వచ్చిన 'దృశ్యం, దృశ్యం 2' చిత్రాలు విజయాన్ని అందుకున్నాయి. తెలుగులో వెంకటేశ్ హీరోగా శ్రీప్రియ దర్శకత్వం వహించిన 'దృశ్యం', వెంకటేశ్–జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో రూపొందిన 'దృశ్యం 2' హిట్‌గా నిలిచాయి. ఇక హిందీలో అజయ్ దేవగణ్ హీరోగా డైరెక్టర్ నిషికాంత్ కామత్ తెరకెక్కించిన 'దృశ్యం', అజయ్ దేవగణ్– డైరెక్టర్ అభిషేక్ పాఠక్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం 2' సినిమాలు కూడా మంచి విజయం సాధించాయి. ఇకపోతే ఈ సిరీస్‌లో మూడో భాగం ముందుగా మలయాళంలో రూపొందనున్న సంగతి తెలిసిందే. మూడో భాగంలోనూ మోహన్‌లాల్ నటించనుండగా జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించనున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం అక్టోబరులో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇదిలా ఉంటే... జీతూ జోసెఫ్ కథతో సంబంధం లేకుండా హిందీలో 'దృశ్యం 3' ఉంటుందని అజయ్ దేవ్‌గణ్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. దీనిపై తాజాగా జీతూ జోసెఫ్ మాట్లాడుతూ–''మలయాళంలో నేను రాసిన కథతోనే తెలుగు, హిందీ భాషల్లోనూ 'దృశ్యం 3' సినిమా వస్తుంది. స్క్రిప్ట్ పని పూర్తయ్యాక హిందీ మూవీ టీమ్‌కు ఇస్తాను. అక్కడి సంస్కృతి, నేటివిటీకి తగ్గట్టు వాళ్ల కథలో మార్పులు చేసుకుంటారు. మూడు భాషల్లో ఒకేసారి 'దృశ్యం 3'ని చిత్రీకరించడం సాధ్యం కాకపోయినప్పటికీ అన్ని భాషల్లోనూ ఒకేసారి విడుదల చేయాలనే ఆలోచన ఉంది'' అని స్పష్టం చేశారాయన. 'దృశ్యం 3' తెలుగులో వెంకటేశ్, హిందీలో అజయ్ దేవగణ్ హీరోలుగా నటిస్తారని ఊహించవచ్చు. అయితే దర్శకులు ఎవరనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

గతాన్ని తిరగరాయాలనుకోలేదు

- మణిరత్నం



కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల అయింది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. తెలుగులో శ్రేష్ఠ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేశారు. కమల్‌హాసన్, మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం 'నాయకన్'(తెలుగులో 'నాయకుడు'). 1987 అక్టోబర్ 21న విడుదలైన ఈ సినిమా హిట్‌గా నిలిచింది. దాదాపు 37 ఏళ్ల తర్వాత వారిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'థగ్ లైఫ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా వారి అంచనాలను అందుకోలేకపోయింది. దీనిపై మణిరత్నం తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ''కమల్‌హాసన్, నా కలయికలో వచ్చిన 'నాయకుడు' సూపర్ హిట్ అయింది. 'థగ్ లైఫ్' కూడా అదే స్థాయిలో ఉంటుందని ఆశించిన ప్రేక్షకులకు నేను చెప్పగలిగేది ఒక్కటే. మమ్మల్ని క్షమించండి. 'నాయకుడు' కంటే తక్కువగా 'థగ్ లైఫ్'ని చేయాలనుకోలేదు. అలాగే గతాన్ని తిరగరాయాలనే ఆలోచన మాకెప్పుడూ లేదు. పూర్తి విభిన్నమైన చిత్రం అందించాలనుకున్నాం. అయితే 'థగ్‌లైఫ్'పై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకోవడంతో మేము అనుకోని ఫలితాన్ని అందుకున్నాం. మేము అందించిన దానికంటే వాళ్లు పూర్తి భిన్నమైన కథని కోరుకున్నారని అర్థం చేసుకున్నా'' అని మణిరత్నం తెలిపారు.



● కియారా

మీనా కుమారి?

దివంగత ప్రముఖ నటి మీనాకుమారి జీవితం ఆధారంగా హిందీలో 'కమల్ ఔర్ మీనా' అనే సినిమా తెరకెక్కనుంది. 'హిచ్ కీ, మహారాజ్' వంటి చిత్రాల ఫేమ్ సిద్ధార్థ్ పి. మల్హోత్రా దర్శకత్వం వహించనున్నారు. కాగా ఈ సినిమాలోని మీనాకుమారి పాత్ర కోసం కృతీసనన్, కియారా అద్వానీ వంటి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే సిద్ధార్థ్ పి. మల్హోత్రా ఇటీవల ఈ సినిమా కథని కియారా అద్వానీకి వినిపించగా, ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో వివాహ బంధంలో అడుగుపెట్టిన కియారా ప్రస్తుతం గర్భవతిగా ఉన్నారు. ఆమె ప్రసవం, కొంత విశ్రాంతి తర్వాత ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలన్నది మేకర్స్ ప్లాన్. అయితే ప్రెగ్నెన్సీ తర్వాత మీనాకుమారిలా కనిపించాలనుకోవడం కియారాకు పెద్ద సవాల్ అని, అయినప్పటికీ కథ నచ్చి ఒప్పుకున్నారని బాలీవుడ్ టాక్. ట్రాజెడీ క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమాగా చెప్పుకునే మీనా కుమారిగా కియారా నటిస్తే, ఈ సినిమాలోని దర్శకుడు కమల్ అమ్రోహి పాత్రను ఎవరు పోషించనున్నారనే చర్చకూడా జరుగుతోంది. సిద్ధార్థ్ పి. మల్హోత్రా, అమ్రోహి ఫ్యామిలీ, సరెగమా సంస్థలు ఈ సినిమాను నిర్మించనున్నాయి.

భావోద్వేగాల సోపానం



● అర్జున్, జెన్నీఫర్

'తెప్ప సముద్రం, వెడ్డింగ్ డైరీస్' ఫేమ్ అర్జున్ అంబటి హీరోగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్. పూరి జగన్నాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎస్ఎస్ మీడియా పతాకంపై గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూలై 11న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. టీజర్‌ను నిర్మాత సి.కల్యాణ్ విడుదల చేశారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని హీరో ఎలివేషన్స్‌ను పూరీగారి శైలిలో చెప్పారు శివ. మా చిత్రం అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''నేహా అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించాను'' అని జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. ''యాక్షన్, భావోద్వేగ సన్నివేశాల్లో అర్జున్ అద్భుతంగా నటించాడు'' అన్నారు నాగ శివ. మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాండ్ మాట్లాడారు. ఈ సినిమాకు సహ–నిర్మాత: గుడిమిట్ల ఈశ్వర్.

వినోదాల ప్రయాణం



● 'హ్యాపీ జర్నీ' పోస్టర్

హరిప్రసాద్ కోనే, ఇషాని గోష్ జంటగా వినోదం, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హ్యాపీ జర్నీ'. చైతన్య కొండా దర్శకత్వంలో గంగాధర్ కొండ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించి, మాట్లాడుతూ–''హ్యాపీ జర్నీ' కథ నచ్చడంతో పోస్టర్‌ను రిలీజ్ చేయడానికి అంగీకరించాను. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో జరుగుతున్న అలజడులపై సామాజిక స్పృహ ఉన్న దర్శకుడు, మంచి అభిరుచి ఉన్న నిర్మాతలు కలిసి ఇలాంటి సినిమా తీయడం అభినందనీయం. హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు నేను సహకరిస్తాను'' అన్నారు. దువ్వాసి మోహన్, సంజయ్ రాయచూర, ఆనంద్ భారతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: చైతన్య రాజ్.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
511	141
81,897	24,972

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,600	▲	150
డోజోన్స్	42,476	▲	261
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,758	▽	16
డాక్స్	23,269	▽	82
షాంఘై	3,381	▲	22
నికాయ్	38,354	▽	49

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.35	87.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.04
€	యూరో	ఎస్‌బీఐ	98.48	101.22
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.48	59.99
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.04	57.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.80	69.50
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.19	23.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.23	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.20	13.02

ఆన్‌లైన్ ఫార్మసీలకు చెక్!

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు • నిబంధనలను కఠినతరం చేసే యోచనలో కేంద్రం

దేశీయంగా రూ. 2.4 లక్షల కోట్ల రిటైల్ ఫార్మసీ మార్కెట్ • అందులో ఈ-ఫార్మసీలకు 3-5 శాతం వాటా



ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ ఫార్మసీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పటికే టాటా 1ఎంజీ, ఫార్మ్‌ఈజీ, నెట్‌మెడ్స్‌లాంటి దిగ్గజ ప్లాట్‌ఫాంలు వేగంగా విస్తరిస్తుండటంతో పాటు కొత్తగా మరిన్ని పుట్టుకొస్తున్నాయి. పేమెంట్ సేవల సంస్థ ఫోన్‌పేకి చెందిన పిన్‌కోడ్ ఈ మధ్య బెంగళూరు, పుణే, ముంబైలో 10 నిమిషాల్లోనే ఔషధాల డెలివరీ సర్వీసును ప్రారంభించింది. ఇక ప్రైవేట్ ఫార్మసీ చెయిన్ దవా ఇండియా సంస్థ పుణేలో 60 నిమిషాల్లో డెలివరీ సేవలు అందిస్తోంది. అటు ఓటీపీ వెంచర్స్ నుంచి 2.4 మిలియన్ డాలర్లు సమీకరించిన జీల్యాబ్ ఫార్మసీ కూడా ఢిల్లీ-ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో 60 నిమిషాల్లో ఔషధాలు అందిస్తోంది. వీటిలో కొన్ని ప్లాట్‌ఫాంలు కస్టమర్లను సమీపంలోని మెడికల్ స్టోర్స్‌తో అనుసంధానం చేస్తుండగా, మరికొన్ని తమ డార్క్ స్టోర్స్ (గిడ్డంగులు) ద్వారా వినియోగదారులకు నేరుగా ఔషధాలను అందిస్తున్నాయి. ఔషధాలతో పాటు మెడికల్ పరికరాలు, ఇతరత్రా అధిక మార్జిన్ ఉండే ఉత్పత్తులు మొదలైనవి విక్రయిస్తున్నాయి. అయితే, సదరు సంస్థలు సత్వరం ఔషధాలను అందిస్తున్నప్పటికీ కొన్ని విమర్శలూ ఎదుర్కొంటున్నాయి. ఔషధాల ప్రిస్క్రిప్షన్, ఆర్డర్ ఇచ్చిన వారి వయస్సు మొదలైన వివరాలను ఈ-ఫార్మసీలు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఈమధ్య కాలంలో ఇవి మరింతగా పెరిగాయని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ఫార్మసీల నిబంధనలను కఠినతరం చేయడంపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నాయి.

హోమ్ డెలివరీని నిలిపివేయాలి: ఏఐవోసీడీ

ఇంటివద్దకే ఔషధాల సరఫరా సేవలను తక్షణం నిలిపివేయాలంటూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐవోసీడీ) డిమాండ్ చేస్తోంది. కోవిడ్ సమయంలో అత్యవసర వేళల్లో పేషెంట్ల సౌకర్యార్థం ఈ సర్వీసులను ప్రవేశపెట్టారని, ప్రస్తుతం అటువంటి అత్యవసర పరిస్థితుల్లేవని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు రాసిన లేఖలో పేర్కొంది. ఏఐవోసీడీలో ప్రస్తుతం 12.4 లక్షల మంది కెమిస్టులు, డ్రగ్గిస్టులు సభ్యులుగా ఉన్నారు. క్రిసిల్ నివేదిక ప్రకారం దేశీయంగా మొత్తం రిటైల్ ఫార్మసీ మార్కెట్ 2.4 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో అసంఘటిత విభాగం వాటా 85 శాతంగా ఉంది. ఆన్‌లైన్ ఫార్మసీల వాటా 3-5 శాతంగా ఉంది. కొన్ని సంపన్న దేశాల్లో ఇది 22-25 శాతం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే దేశీయంగా ఫార్మసీ మార్కెట్ మరింతగా విస్తరించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

కొత్త చట్టంపై ప్రభుత్వం కసరత్తు..

సత్వరం ఔషధాలను అందిస్తున్న ఈ-ఫార్మసీల నియంత్రణకు ప్రస్తుతం నిర్దిష్ట చట్టం అంటూ లేదు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధనలు ఆన్‌లైన్ ఫార్మసీలకు నిర్దిష్టంగా చట్టబద్ధత కల్పించకపోవడం, స్పష్టత లోపించడం వల్ల, ప్రస్తుత నిబంధనల స్థానంలో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వాస్తవానికి ఔషధాల ఆన్‌లైన్ అమ్మకాలను కూడా చేరుస్తూ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945ని మార్చేలా 2018లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముసాయిదా సవరణలను ప్రతిపాదించింది. వీటిపై తమకేవైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే తెలియజేయాలంటూ ఓ నోటిఫికేషన్‌లో సంబంధిత వర్గాలను కోరింది. అయితే, ఈ నోటిఫికేషన్‌ను కెమిస్టుల సమాఖ్య సుప్రీం కోర్టులో సవాలు చేసింది. 2018 డిసెంబర్‌లో లైసెన్సు లేని ఆన్‌లైన్ ఫార్మసీలు ఔషధాలను విక్రయించడంపై స్టే విధిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

తెలుగు రాష్ట్రాల్లో మేనేజ్ ఇంజిన్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జోహో కార్పొరేషన్‌లో భాగమైన ఎంటర్‌ప్రైజ్ ఐటీ మేనేజ్‌మెంట్ ఉత్పత్తుల సంస్థ మేనేజ్‌ఇంజిన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంటలో, తెలంగాణలోని హైదరాబాద్‌లో రెండు కార్యాలయాలు ఉన్నట్లు సంస్థ ఏఐ సెక్యూరిటీ హెడ్ సుజాత ఎస్ అయ్యర్ తెలిపారు. రేణిగుంటలో 1,000 మంది పైగా సిబ్బంది ఉన్నట్లు వివరించారు.



హైదరాబాద్ డిజిటల్ హబ్‌గా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రాంతీయంగా సంస్థలకు పటిష్టమైన ఏఐ ఆధారిత ఐటీ, సైబర్‌సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను అందిస్తున్నట్లు వివరించారు. వివిధ రంగాల కంపెనీల అవసరాలను బట్టి ఉపయోగపడే లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్‌ను (ఎల్‌ఎల్‌ఎం) రూపొందించడంపై కసరత్తు చేస్తున్నామన్నారు. తమకు ప్రస్తుతం భారత్ మూడో అతి పెద్ద మార్కెట్‌గా ఉంటోందని, త్వరలో రెండో పెద్ద మార్కెట్ కాబోతోందని సుజాత చెప్పారు. గత ఐదేళ్లుగా మేనేజ్‌ఇంజిన్ క్లౌడ్ సర్వీసుల విభాగం వార్షికంగా 70 శాతం వృద్ధి చెందుతోందని తెలిపారు. కస్టమర్లపరంగా చూస్తే దేశీ మార్కెట్లో బీఎఫ్‌ఎస్‌ఐ, తయారీ, రియల్ ఎస్టేట్ తదితర రంగాలకు చెందిన 7,500 మంది క్లయింట్లు ఉన్నారని సుజాత తెలిపారు.

మార్కెట్‌ను వెంటాడుతున్న యుద్ధం

- 5 నెలల గరిష్టానికి క్రూడాయిల్
- సెన్సెక్స్ 511 పాయింట్లు డౌన్
- నిఫ్టీకి 141 పాయింట్ల నష్టం



ముంబై: ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడితో పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా సోమవారం 511 పాయింట్లు నష్టపోయి 81,897 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు కోల్పోయి 24,972 వద్ద నిలిచింది. క్రూడాయిల్ ధరలూ అయిదు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో ఉదయమే సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ఐటీ, టెక్, ఆటో షేర్లలో భారీ అమ్మకాలు నెలకొన్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 931 పాయింట్లు క్షీణించి 81,477 వద్ద, నిఫ్టీ 288 పాయింట్లు పతనమై 24,824 కనిష్టానికి దిగివచ్చాయి. అయితే ట్రేడింగ్ చివర్లో దిగువ స్థాయిలో కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంత తగ్గాయి. ఆసియాలో కొరియా, జపాన్ మార్కెట్లు నష్టాల్లో, చైనా హాంగ్‌కాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- నష్టాల మార్కెట్లోనూ చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతుతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.5% పెరిగాయి.

ఆయిల్, ఏవియేషన్ షేర్లలో ఒడిదుడుకులు

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న తరుణంలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు మళ్లీ భగ్గుమని, కాస్త చల్లారాయి. ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్, ఏవియేషన్ రంగాల షేర్లు ఇంట్రాడేలో అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. అయితే ట్రేడింగ్ ముగిసేసరికి రికవరీ అయ్యాయి. ఐఓసీ 1%, హెచ్‌పీసీఎల్ 0.50% పెరిగాయి. బీపీసీఎల్ 0.10% నష్టపోయింది. ఇంట్రాడేలో హెచ్‌పీసీఎల్ 2%, ఐఓసీ 1.60%, బీపీసీఎల్ 1.50% పతనమయ్యాయి. స్పైస్‌జెట్ 2%, ఇండిగో ఏవియేషన్ షేర్లు 1.50% లాభపడ్డాయి.

రూపాయి.. 5 నెలల కనిష్టం

డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలహీనపడి అయిదు నెలల కనిష్టం 86.78 వద్ద స్థిరపడింది. ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడి, క్రూడాయిల్ ధరలు అయిదు నెలల గరిష్టానికి చేరుకోవడం దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

యూరప్ కారు.. తగ్గిన జోరు!	డిక్సన్ టెక్నాలజీస్‌లో వాటా విక్రయం

ఫోన్‌పే ఐపీవో సన్నాహాలు షురూ

మర్చంట్ బ్యాంకర్ల నియామకం

న్యూఢిల్లీ: గ్లోబల్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా మర్చంట్ బ్యాంకర్లను ఎంపిక చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఐపీవో నిర్వహణకు కొటక్ మహీంద్రా క్యాపిటల్, జేపీ మోర్గాన్ చేజ్, సిటీగ్రూప్, మోర్గాన్ స్టాన్లీలను నియమించుకున్నట్లు పేర్కొన్నాయి. కాగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలు జనరల్ అట్లాంటిక్, వాల్‌మార్ట్, రిబ్బిట్ క్యాపిటల్, టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్, టైగర్ గ్లోబల్ నుంచి ఫోన్‌పే 85 కోట్ల డాలర్లు(రూ. 7,021 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్లు) విలువలో ఈ పెట్టుబడులు సమకూర్చుకోవడం గమనార్హం! అంతక్రితం 2022లో సింగపూర్ నుంచి భారత్‌కు బదిలీకావడానికి వీలుగా దేశీ ప్రభుత్వానికి పన్నుల రూపేణా ఫోన్‌పే బిలియన్ డాలర్లు(రూ. 8,000 కోట్లు) చెల్లించిన సంగతి తెలిసిందే. 2016లో ఏర్పాటైన కంపెనీ ఇప్పటివరకూ రూ. 18,000 కోట్ల పెట్టుబడులు సమకూర్చుకుంది. 2023-24లో ఆదాయం 74 శాతం జంప్‌చేసి రూ. 5,064 కోట్లను తాకింది. ఇసాప్ వ్యయాలను మినహాయిస్తే రూ. 197 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2022-23) రూ. 738 కోట్ల నష్టం ప్రకటించింది.



భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జీఎస్- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్‌టీఐఐలో మాస్టర్స్, పీజీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి.. సినిమా, టెలివిజన్ రంగాల్లో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(ఎంఎఫ్ఏ), పీజీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు-సీట్లు

» ఫిల్మ్ వింగ్(ఎంఎఫ్ఏ-మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్): డైరెక్షన్-స్క్రీన్‌ప్లే రైటింగ్-11 సీట్లు; సినిమాటోగ్రఫీ-11, ఎడిటింగ్-11, సౌండ్ రికార్డింగ్-డిజైన్-11, ఆర్ట్ డైరెక్షన్-ప్రొడక్షన్ డిజైన్-11, స్క్రీన్ యాక్టింగ్-16, స్క్రీన్‌రైటింగ్(ఫిల్మ్, టీవీ-వెబ్ సిరీస్)-16 సీట్లు ఉన్నాయి.
» టెలివిజన్ వింగ్(ఏడాది పీజీ సర్టిఫికెట్ కోర్సు): టీవీ డైరెక్షన్-11 సీట్లు, ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ-11, వీడియో ఎడిటింగ్-11, సౌండ్-టీవీ ఇంజనీరింగ్-11 సీట్లు ఉన్నాయి.

అర్హతలు

» ఎంఎఫ్ఏ కోర్సులకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు(ఆర్ట్ డిజైన్ కోర్సుకు ఫైన్ ఆర్ట్స్ సంబంధిత బ్యాక్‌గ్రౌండ్ తప్పనిసరి). ఏడాది పీజీ కోర్సులకు ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» వయసు: గరిష్ఠ వయో పరిమితి లేదు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.07.2025
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 20.07.2025 నుంచి 26.07.2025.
» ప్రవేశ పరీక్ష(స్టేజ్-1): 27.07.2025.
» తరగతుల ప్రారంభం: 2025 నవంబర్ మూడో వారం
» పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై, పుణె, బెంగళూరు, లక్నో, రాంచీ, విజయవాడ తదితర నగరాల్లో పరీక్ష జరుగుతుంది.
» వెబ్‌సైట్: https://ftii.ac.in

మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లో 50 మెషినిస్ట్ పోస్టులు

మధ్యప్రదేశ్‌లోని మునిషన్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఖమారియా యూనిట్.. ఒప్పంద ప్రాతిపదికన మెషినిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 50.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ట్రేడ్ అప్రెంటిస్‌లో శిక్షణ పొంది ఉండాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 31.07.2025 నాటికి 18 నుంచి 35 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: ట్రేడ్ టెస్ట్/ప్రాక్టికల్ టెస్ట్, ఎన్‌సీవీటీలో సాధించిన మార్కుల ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఖమారియా, జబల్‌పూర్ జిల్లా, మధ్యప్రదేశ్-482005 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 31.07.2025.
» వెబ్‌సైట్: https://munitionsindia.in

ఈసీఐసీ, న్యూఢిల్లీలో డీన్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈసీఐసీ).. వివిధ మెడిక్ టీచింగ్ ఇన్‌స్టిట్యూషన్-పీజీఐఎంఈఆర్ఎస్/ఎఈడీఐసీపీఎల్ కాలేజీల్లో ఒప్పంద ప్రాతిపదికన డీన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10.
» అర్హత: ఎండీ, ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి. » వయసు: 07.07.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.37,400 నుంచి 67,000.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రీజనల్ డైరెక్టర్, ఈఎస్ఐసీ కార్పొరేషన్, పంచదీప్ భవన్, సెక్టార్-16(లక్ష్మీ నారాయణ్ మందిర్ ఫరీదాబాద్, హర్యానా) చిరునామకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 07.07.2025.
» వెబ్‌సైట్: https://www.esic.gov.in

ఎన్‌హెచ్ఐపీఎంపీఎల్‌లో ఏహెచ్ఈ పోస్టులు

నేషనల్ హైవేస్ ఇన్వెట్ ప్రాజెక్ట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎన్‌హెచ్ఐపీఎంపీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ హైవే ఇంజనీర్(ఏహెచ్ఈ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(సివిల్ ఇంజనీరింగ్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.» వయసు: 02.07.2025 నాటికి 35 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.45,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: hr.nhipmpl@nhai.org.
» దరఖాస్తులకు చివరితేది: 02.07.2025.
» వెబ్‌సైట్: https://nhai.gov.in

ఇన్‌కాయిస్, హైదరాబాద్‌లో 61 ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఎన్‌సీఓఐఎస్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 61.
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ సైంటిస్ట్ 3-04, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 2-16, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-09, ప్రాజెక్ట్ అసిస్టెంట్స్-17, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-15.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పీజీ, పీహెచ్‌డీ, బీటెక్(ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ప్రాజెక్ట్ సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 50 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్-1కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్-2కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్-3కి 45 ఏళ్లు.
» వేతనం: నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్-3కి రూ.78,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్-2కు రూ.67,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్-1కు రూ.56,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.18,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 30.06.2025.
» వెబ్‌సైట్: https://vacancies.incois.gov.in

నాణ్యమైన విద్యకు 'నవోదయం'

» నవోదయ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలు
» 2026-27కు నోటిఫికేషన్ విడుదల
» 12వ తరగతి వరకూ ఉచితంగా నాణ్యమైన విద్య

నాణ్యమైన విద్యను అందించడంలో మంచి పేరున్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. ఈ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తారు. చదువుతోపాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం కల్పించేలా నవోదయ స్కూల్స్‌లో బోధన ఉంటుంది. ఈ నేపథ్యంలో.. జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలపై ప్రత్యేక కథనం..

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అటానమస్ సంస్థ 'నవోదయ విద్యాలయ సమితి' దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను నిర్వహిస్తుంది. ఇవి రెసిడెన్షియల్ స్కూల్స్. ప్రతి జిల్లాలో కనీసం ఒక నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 27 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 654 నవోదయ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ముఖ్యంగా గ్రామీణ బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

75 శాతం సీట్లు పల్లె విద్యార్థులకు

- ప్రతి నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. వీటిల్లో 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మిగతా 25 శాతం సీట్లకు ఎవరైనా(గ్రామీణ, పట్టణ) పోటీ పడొచ్చు.
- గ్రామీణ కోటాలో సీటు పొందాలనుకునే విద్యార్థులు 3,4,5 తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలో చదవాలి. మొత్తం సీట్లలో మూడోవంతు సీట్లను బాలికలకు కేటాయించారు.

నవోదయతో ప్రయోజనాలు

- ఈ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు ఉన్నత బోధన ప్రమాణాలతో 6వ తరగతి నుంచి 12వ తరగతి చదువుకోవచ్చు. ఉచిత విద్యతోపాటు భోజన, వసతి సౌకర్యం కూడా లభిస్తుంది.
- సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరించి బోధన అందిస్తారు. దీంతోపాటు జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో రాణించేలా శిక్షణ ఇస్తారు.
- ఎనిమిదో తరగతి వరకు బోధన మాతృభాష/ప్రాంతీయ భాషలో కొనసాగుతుంది. అనంతరం మ్యాథ్స్, సైన్స్ ఇంగ్లిష్ మీడియంలో, సోషల్ హిందీ మీడియంలో బోధిస్తారు.

అర్హతలు

- 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, లేదా ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ)కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యార్థులు ప్రవేశం కోరుతున్న జిల్లాలోని స్కూల్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో చదువుతుండాలి. ఒకసారి మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంటుంది.
- గత విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదివిన వారు, రెండో సారి ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులకు అర్హత ఉండదు.

వయసు

- విద్యార్థులు 01.05.2014-31.07.2016 మధ్యలో జన్మించి ఉండాలి.

ప్రవేశ విధానం

రాత పరీక్ష(జేఎన్‌వీఎస్‌టీ)లో ప్రతిభతోపాటు సంబంధిత అన్ని ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అడ్మిషన్ ఖరారు చేస్తారు.

వంద మార్కులకు పరీక్ష

జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష వంద మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ విభాగంలో 40 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. ఈ విభాగానికి కేటాయించిన పరీక్ష సమయం 60 నిమిషాలు. అదేవిధంగా అరిథమెటిక్ టెస్ట్ విభాగంలో 20 ప్రశ్నలు-25 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 20 నిమిషాలు. అలాగే లాంగ్వేజ్ టెస్ట్ విభాగంలో 20 ప్రశ్నలు- 25 మార్కులకు అడుగుతారు. ఇలా మొత్తం 80 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన మొత్తం సమయం 2 గంటలు. మూడు విభాగాల ప్రశ్నలున్న ఒకే బుక్‌లెట్‌ను పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు అందజేస్తారు. విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌పై తమ సమాధానాలు బ్లాక్ లేదా బ్లూపాయింట్ పెన్నుతో గుర్తించాల్సి ఉంటుంది.

- విద్యార్థి ఇంగ్లిష్, హిందీ, తెలుగు.. ఇలా తాము కోరుకున్న ఏదైనా మాధ్యమంలో పరీక్షకు హాజరుకావచ్చు. ఈ పరీక్షలో అర్హత కోసం ప్రతి విభాగంలో కనీస మార్కులు పొందాల్సి ఉంటుంది. నెగిటివ్ మార్కుల నిబంధన లేదు.



రాత పరీక్షలో రాణించేలా

- ఈ పరీక్షలోని మెంటల్ ఎబిలిటీ టెస్ట్ విభాగంలో.. నాన్ వెర్బల్ ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా ఫిగర్స్, డయాగ్రమ్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. దీనిద్వారా విద్యార్థి సాధారణ మానసిక సామర్థ్యాన్ని పరిశీలిస్తారు. ఆడ్ మ్యాన్ అవుట్, ఫిగర్ మ్యాచింగ్, ప్యాట్రన్ కంప్లీషన్, ఫిగర్ సిరీస్ కంప్లీషన్, అనాలజీ, జామెట్రికల్ ఫిగర్స్ (ట్రయాంగిల్, స్క్వేర్, సర్కిల్), మిర్రర్ ఇమేజింగ్, పంచ్‌హోల్డ్ ప్యాట్రన్(ఫోల్డింగ్, అన్‌ఫోల్డింగ్), స్పేస్ విజువలైజేషన్, ఎంబడెడ్ ఫిగర్.. ఇలా పది భాగాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. అభ్యర్థులు సాధ్యమైనన్ని మోడల్ ప్రశ్నలను, గత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం ద్వారా ఈ విభాగంలో మంచి స్కోర్ సొంతం చేసుకోవచ్చు.
- అరిథమెటిక్ విభాగంలో.. అంకెలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగాహారాలు, డెసిమల్స్, లాభనష్టాలు, వడ్డీలు, దత్తాంశాలు, భిన్నాలు, వైశాల్యం, చుట్టుకొలత తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు ఐదోతరగతి వరకూ నేర్చుకున్న గణితాంశాలపై పట్టు సాధించాలి.
- లాంగ్వేజ్ టెస్ట్ విభాగంలో.. ప్యాసేజ్ ఇచ్చి దాని కింద ప్రశ్నలు అడిగి.. వాటికి సరైన సమాధానాలు గుర్తించమంటారు. విద్యార్థులు ప్యాసేజ్‌ను సరిగా అర్థం చేసుకున్నారో లేదో పరిశీలిస్తారు. ప్రతి ప్యాసేజ్ కింద ఐదు ప్రశ్నలు అడుగుతారు. అలా నాలుగు ప్యాసేజ్‌లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: 29.07.2025
- పరీక్ష తేదీలు: 13.12.2025/11.04.2026
- వెబ్‌సైట్: https://navodaya.gov.in/NVS.html

పరిశోధన సంకలనం ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి రూపొందించిన విద్యారంగ ప్రముఖుల పరిశోధనాత్మక వ్యాసాలతో కూడిన సంకలనాన్ని మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పేరుతో వెలువడిన ఈ పుస్తకం ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఉన్నత విద్యలో సంస్కరణలు, ఆవిష్కరణలు, ఎదురవుతున్న సవాళ్లను రచయితలు ఈ పుస్తకంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్కే మహమ్మద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవక్రియ రుగ్మతలకు వ్యాక్సిన్

పూర్వ విద్యార్థులతో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎంవోయూ



సాక్షి, హైదరాబాద్: జీవక్రియ రుగ్మతలకు సంబంధించిన వ్యాక్సిన్ తయారీ కోసం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.. పలువురు పూర్వ విద్యార్థులతో సోమవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు కోసం అమెరికాకు చెందిన యుటోపియా థెరాప్యూటిక్స్ సుమారు రూ. 13 కోట్ల నిధులు సమకూరుస్తోంది. వర్సిటీ పూర్వ విద్యార్థులు డాక్టర్ ఉదయ్ సక్సేనా, మార్కండేయ గోరంట్లతో పాటు వర్సిటీ అధికారులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. బోస్టన్‌లో ఈ నెల 19న జరిగిన బయో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సదస్సులో ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన జరిగినట్లు అధికారులు తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ బయోటెక్ అసోసియేషన్ ఈ ప్రాజెక్టుకు నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుందన్నారు. జీవ వైవిధ్యాన్ని బలోపేతం చేయడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని వివరించారు.

బాలల రక్షణలో మనమే నం.1

2024-25లో అత్యధిక బాలకార్మిక రెస్క్యూ ఆపరేషన్‌లు తెలంగాణలోనే

11,063 మందికి వెట్టిచాకిరీ నుంచి విముక్తి.. రాష్ట్రంలోనే అత్యధిక అరెస్ట్‌లు



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బాలల హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి 2024–25లో నమోదైన కేసులు, కాపాడిన బాలల విషయంలో తెలంగాణ తొలిస్థానంలో ఉందని ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపొందించిన నివేదిక వెల్లడించింది. బాలకార్మికులు, యాచక, లైంగిక దోపిడీకి సంబంధించి నమోదైన కేసుల్లో విముక్తి పొందిన వారిలో 90 శాతం మంది బాలకార్మికులేనని.. అత్యధికంగా తెలంగాణ నుంచి 11,063 మంది ఉన్నారని తెలిపింది. బాలకార్మికులకు సంబంధించిన కేసుల్లో జరిగిన అరెస్ట్‌లలోనూ తెలంగాణ తొలి స్థానంలో ఉందని వివరించింది. ఈ మేరకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో పలు అంశాలను పొందుపరిచింది.

నివేదికలోని అంశాలు ఇలా...

- 2024–25లో దేశవ్యాప్తంగా 27,320 రెస్క్యూ ఆపరేషన్‌లు నిర్వహించారు. అందులో అత్యధికంగా తెలంగాణలో 7,632 రెస్క్యూ ఆపరేషన్లు జరగ్గా యూపీలో 2,469, రాజస్తాన్‌లో 2,453, మధ్యప్రదేశ్‌లో 2,335 రెస్క్యూ ఆపరేషన్లు జరిగాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన అన్ని రెస్క్యూ ఆపరేషన్లలో 86 శాతం బాలకార్మికులకు సంబంధించినవే ఉన్నాయి.
- వివిధ ప్రభుత్వ సంస్థలు, ఎన్జీఓలు కలిపి రక్షించిన 44,902 మంది బాలల్లో 90 శాతం మంది బాలకార్మికులే ఉన్నారు. వారిలో అత్యధికంగా తెలంగాణలో 11,063 మందిని రక్షించారు. ఆ తర్వాత స్థానాల్లో బిహార్ 3,974, రాజస్తాన్ 3,847, యూపీ 3,804, ఢిల్లీ 2,588 ఉన్నాయి.
- మొత్తంగా 2,971 మంది బాలలను లైంగిక దోపిడీ నుంచి రక్షించగా అందులో అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 1,005 మందిని, బిహార్‌లో 454 మందిని, ఒడిశాలో 232 మందిని, మహారాష్ట్రలో 194, రాజస్తాన్‌లో 191 మందిని కాపాడారు.
- బాలకార్మికులు, బెగ్గింగ్, లైంగిక దోపిడీకి సంబంధించి 2024–25లో మొత్తంగా 5,809 మంది యజమానులు, అక్రమ రవాణాదారులను అరెస్ట్ చేశారు. ఈ మొత్తం కేసుల్లో అత్యధిక అరెస్ట్‌లు తెలంగాణలో జరిగాయి. బాలకార్మికుల కేసుల్లో 2,226, లైంగిక దోపిడీల్లో 21 అరెస్ట్ కలిపి మొత్తంగా 2,247 అరెస్ట్ అయ్యాయి. ఏపీలో నమోదైన బాలకార్మికుల కేసుల్లో 211 మందిని, బెగ్గింగ్ కేసులో ఒకరిని, లైంగిక దోపిడీ వ్యవహారంలో మరొకరిని కలిపి మొత్తం 213 మందిని అరెస్ట్ చేశారు.

గ్లోబల్ వార్మింగ్ / బ్రెయిన్ వార్మింగ్

వాతావరణ మార్పులతో మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం

మానసిక సమస్యలను సున్నితంగా పరిష్కరించాలి అంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు ప్రజల భావోద్వేగ పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధ్యయనాల్లో వెల్లడైంది. రైతులు మొదలు వలసదారుల వరకు వివిధ వర్గాల ప్రజల్లో మానసిక సమస్యలు ఒక్కో రకంగా ఉంటున్నట్లు తేలింది. కరువులు, వరదలు, భూకంపాలు, తుపానుల వంటి ప్రకృతి విపత్తులకు గురైన ప్రజల్లో ఏళ్ల తరబడి ఆత్మన్యూనతా భావం, కుంగుబాటు, ఆత్మహత్యా భావనలు ఉంటున్నట్లు మానసిక శాస్త్రవేత్తలు, నిపుణులు తేల్చారు. దీన్ని ఎకో-యాంగ్జయిటీగా వారు పేర్కొంటున్నారు.

పలు అధ్యయనాల్లో వెల్లడైన అంశాలు..

- మనుషులు 'నైస్ మెంటల్ ఎక్విలిబ్రియం'లో ఉండటానికి భద్రత అనే భావన అవసరం. దీన్ని వాతావరణ మార్పులు చెరిపేస్తున్నాయి.
- లాన్‌సెట్ ప్లానెటరీ హెల్త్–2021 అధ్యయనం ప్రకారం 10 దేశాల్లో 16–25 ఏళ్ల వయసుగల యువతలో 59% మంది వాతావరణ భవిష్యత్తుపై తీవ్ర భయంతో ఉన్నారు.
- ఉత్తరాఖండ్‌లో సంభవించిన 2013 నాటి అత్యంత భారీ వరదల తర్వాత 42% మంది వరద బాధితుల్లో ఈ లక్షణాలు కనిపించినట్లు స్థానిక అధ్యయనాలు వెల్లడించాయి.

ఏయే వర్గాలు ప్రభావితం..

ప్రభావిత వర్గం	మానసిక ప్రభావం
యువత	భవిష్యత్తుపై భయం, ఆత్మన్యూనత
రైతులు	ఆర్థిక నష్టం వల్ల డిప్రెషన్, ఆత్మహత్య ధోరణి
వలసదారులు	మూలవాసం కోల్పోవడం వల్ల గుర్తింపులేని భావన
పర్యావరణ కార్యకర్తలు	భావోద్వేగ అలసట, నిరుత్సాహం

పరిష్కార మార్గాలు...

- వాతావరణ మార్పులు మానసిక స్థితిపై అవగాహన కల్పించాలి. విద్యావ్యవస్థలో మానసిక విద్యను భాగం చేయాలి.
- ప్రకృతి విపత్తుల తర్వాత బాధితులకు ఉచితంగా కౌన్సెలింగ్, మానసిక చికిత్స అందించే విధానాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టాలి.
- భూమి భవిష్యత్తుపై భయం కలుగుతోందనే భావన పక్కనపెట్టి ప్రకృతిలో జరిగే సహజ పరిణామాలను ప్రజలు అంగీకరించాలి.
- మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేర తగ్గించడం వంటి చర్యలు చేపట్టాలి.
- సామాజిక వేదికలు, కమ్యూనిటీలు ఈ తరహా అంశాలు, సమస్యల పట్ల ఆందోళనలో ఉన్నవారితో భావాలు పంచుకోవడం ద్వారా తాము ఒంటరి అనే భావన ఏర్పడదు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు గ్రీన్ సిగ్నల్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు ఎట్టకేలకు మార్గం సుగమం అయ్యింది. మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు ఉన్నత విద్యా మండలి సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి సోమవారం ఇవ్వాలనుకున్నారు. కేబినెట్ మీటింగ్ ఉండటం, సాంకేతిక విద్యా బోర్డు అధికారులు అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఈఏపీసెట్) ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు మే 11న విడుదలయ్యాయి. ఏటా ఫలితాలు విడుదలైన వెంటనే కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఫీజులపై స్పష్టత లేకపోవడంతో నెలన్నర దాటుతున్నా..కౌన్సెలింగ్ చేపట్టడానికి వీల్లేకుండా పోయింది. అయితే కేంద్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జోసా కౌన్సెలింగ్ ఇప్పటికే రెండు దఫాలు పూర్తయింది. మూడో విడత కూడా మొదలైంది. దీంతో రాష్ట్ర విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో షెడ్యూల్ విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

షరతులు వర్తిస్తాయి..!

షెడ్యూల్ విడుదలకు నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇంజనీరింగ్ ఫీజులపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ గత 8 నెలలుగా ఫీజులపై కసరత్తు చేస్తోంది. కాలేజీల ఆడిట్ రిపోర్టులను పరిశీలించి, అనేకసార్లు కాలేజీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. నెల రోజుల క్రితం ఫీజుల ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. కొన్ని కాలేజీలు ఏకంగా వంద శాతం ఫీజు పెంపును ప్రతిపాదించాయి. టాప్ కాలేజీల్లో వార్షిక ఫీజు రూ.2 లక్షలపైనే కమిటీ ఖరారు చేసినట్టు తెలిసింది. అయితే దీనికి ప్రభుత్వం నుంచి సానుకూలత రాలేదు. ఎమర్జింగ్ కోర్సులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని కాలేజీలు చెబుతున్నా, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కాలేజీల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కమిటీ ఏర్పాటుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారం తేలేవరకూ కౌన్సెలింగ్ ఆపడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుతానికి 2022లో ఖరారు చేసిన వార్షిక ఫీజులే నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టాలని నిర్ణయించింది. ఒక వేళ ఫీజులు పెరిగే పక్షంలో విద్యార్థులు పెంచిన మొత్తాన్ని చెల్లించాలనే షరతును కౌన్సెలింగ్ షెడ్యూల్‌లోనే పొందుపరచాలని నిర్ణయించింది.

నేడు షెడ్యూల్ వెలువడే అవకాశం

- ప్రస్తుతానికి పాత ఫీజులతోనే ప్రవేశాలకు నిర్ణయం
- ఒకవేళ ఫీజులు పెరిగితే విద్యార్థులు కట్టాల్సిందే..
- అనుబంధ గుర్తింపుపై ఇంకా రాని స్పష్టత



అనుబంధ గుర్తింపు ఎప్పుడు?

కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. కౌన్సెలింగ్‌లో 175 కాలేజీలు పాల్గొంటాయి. ప్రభుత్వ కాలేజీలన్నింటికీ గుర్తింపు ఇవ్వడం అనివార్యం. అయితే 156 ప్రైవేటు కాలేజీల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొన్ని కాలేజీల్లో ఫ్యాకల్టీ, మౌలిక వసతుల లోపాలను సరిచేసుకోవాలంటూ నోటీసులు ఇచ్చారు. ఈ సమ యం కూడా ఈ నెలాఖరుతో ముగుస్తుంది. ఆ తర్వాతే గుర్తింపు ప్రక్రియ ముందుకెళ్లే అవకాశం ఉంది. వంద కాలేజీలు డిమాండ్ లేని కోర్ గ్రూపుల్లో సీట్లు తగ్గించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాయి. కొన్ని కాలేజీలు కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచాలని కోరుతున్నాయి. ప్రభుత్వం మాత్రం కోర్ గ్రూపుల్లో సీట్ల తగ్గింపును అంగీకరించడం లేదు. దీంతో సీట్ల పెంపుపై కౌన్సెలింగ్ సమయానికి ఏ నిర్ణయం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం 1.18 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ఇందులో 68 శాతం కంప్యూటర్ సైన్స్, ఇతర ఎమర్జింగ్ కోర్సుల్లోనే ఉన్నాయి. కౌన్సెలింగ్ తేదీలు వెలువడిన తర్వాత అనుబంధ గుర్తింపుపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

విరివిగా.. విదేశీ మద్యం

ఏటా రూ.500 కోట్ల మేర నష్టపోతున్న ఆబ్కారీ శాఖ

విమానాలు, రైళ్లు, రోడ్డు మార్గాల్లో రాష్ట్రంలోకి..

ఎక్కువగా ఢిల్లీ, గోవా, హరియాణాల నుంచే..

విదేశాల నుంచి దర్జాగా తెచ్చుకుంటున్న మందుబాబులు

ఎక్కడ పార్టీలు జరిగినా పెద్దఎత్తున దొరుకుతున్న ఎన్‌డీపీఎల్

ఆదాయం కోసం బీర్లు, విస్కీ ధరలు పెంచుతున్న ప్రభుత్వం

మద్యం అక్రమ దిగుమతిపై మాత్రం చోద్యం



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) దందా నడుస్తోంది. వాయు, రోడ్డు అనే తేడా లేకుండా వీలున్నన్ని మార్గాల్లో ఈ అక్రమ మద్యం తెలంగాణలోకి విచ్చలవిడిగా ప్రవేశిస్తోంది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. విదేశీ, ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) ముసుగులో జరుగుతున్న ఈ ఎన్‌డీపీఎల్ లిక్కర్ దందాతో ఏటా ఖజానాకు రూ.300 నుంచి రూ.500 కోట్ల వరకు నష్టం వస్తోందని ఎక్సైజ్ వర్గాలే అంటున్నాయి. అయితే ఆదాయం పెంపు పేరుతో లిక్కర్, బీర్ల ధరలను పెంచుతున్న ప్రభుత్వం ఈ దందాను అరికట్టే విషయంలో మాత్రం చోద్యం చూస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఎక్కడ అనుమతుల్లేని పార్టీలు జరిగినా, పెద్ద మొత్తంలో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం కూడా పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం.

వీఐపీలే కాదు..ముఠాలు కూడా

ఎన్‌డీపీఎల్ రాష్ట్రంలోకి అనేక మార్గాల్లో ప్రవేశిస్తోంది. ప్రతి వ్యక్తి వద్ద కనీసం ఆరు లీటర్ల వరకు మద్యం ఉండొచ్చనే నిబంధన ఉంది. దీంతోపాటు విదేశాలకు వెళ్లి వచ్చే వారికి ఎయిర్‌పోర్టుల నుంచి మద్యం తెచ్చుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో వీఐపీలు ఎక్కువగా విదేశాల నుంచి మద్యాన్ని తెచ్చుకుంటారు. వీరికి తోడు ఈ మద్యం కోసం రాష్ట్రంలో ముఠాలు కూడా ఏర్పడ్డాయి. ఇతర దేశాల్లో ఖరీదైన విదేశీ మద్యం బాటిల్ రూ.12వేలు ఉంటుందని సమాచారం. అయితే, అదే మద్యాన్ని తెలంగాణలో రూ.25వేల వరకు అమ్మే వీలుంది. అదే బ్రాండ్ మద్యం ఇక్కడ అంత ధర పలుకుతుంది. దీంతో విదేశాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల వివరాలను సేకరించి వారితో తప్పనిసరిగా మద్యం తెప్పించేలా ఈ ముఠా సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లేదంటే ఎయిర్‌పోర్టుల్లోనే ప్రయాణికులతో మద్యం కొనుగోలు చేయిస్తున్నారు. ఈ మద్యాన్ని బయట అమ్ముకొని లాభాలు గడిస్తున్నారు. ఢిల్లీ లాంటి కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ మద్యం ధరలు తక్కువగా ఉంటాయి. హరియాణా, గోవాల్లోనూ తెలంగాణతో పోలిస్తే మద్యం ధరలు చాలా తక్కువ. ఇక్కడ ఐఎంఎఫ్ఎల్ ధరలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ రాష్ట్రాల నుంచి రైళ్లు, ఇతర రవాణా మార్గాల్లో మద్యం తెప్పిస్తున్నారు. ఏకంగా కొన్నిసార్లు ట్రాన్స్‌పోర్ట్ బుక్ చేసి మరీ ఎన్‌డీపీఎల్ తెప్పిస్తున్నారని ఎక్సైజ్ వర్గాలే అంటున్నాయి. ఈవెంట్ మేనేజర్లు, పార్టీల నిర్వాహకుల పేర్లతో ఈ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముకుంటున్నా, ఎక్సైజ్ వర్గాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కేవలం ప్రత్యేక డ్రైవ్‌లకు మాత్రమే ఎక్సైజ్ శాఖ పరిమితం కావడం గమనార్హం. ఆ డ్రైవ్‌లు ముగియగానే మౌనం వహించడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంల దాడులు సరిగా జరగకపోవడం, సరిహద్దు చెక్‌పోస్టులు నిర్వీర్యంగా మారడం ఎందుకనే ప్రశ్నలకు ఆ శాఖ అధికారుల వద్ద సమాధానం లేదు.

స్పెషల్ డ్రైవ్‌లు సరిపోతాయా?

రాష్ట్రంలో డ్యూటీ చెల్లించని మద్యాన్ని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్‌లు మాత్రమే సరిపోవని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. గతంలోనూ ఈ రకమైన డ్రైవ్‌లు నిర్వహించిన ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇటీవల కూడా ప్రత్యేక దాడులు నిర్వహించింది. సీనియర్ అధికారి షానవాజ్ ఖాసిం నేతృత్వంలో ఈ నెల 3వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఎక్కడికక్కడ నిఘా పెట్టి విదేశీ మద్యం అమ్ముతున్న వారిని పెద్ద ఎత్తున గుర్తించింది. వారి వద్ద నుంచి రూ.లక్షలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. అయితే, ఈ డ్రైవ్ ముగిసిన వెంటనే హైదరాబాద్ శివార్లలో జరిగిన ఓ సెలబ్రిటీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం పట్టుబడడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎన్‌డీపీఎల్‌ను నియంత్రించి ఎక్సైజ్ ఆదాయానికి గండి పడకుండా ఉండాలంటే స్పెషల్ డ్రైవ్ నిరంతరంగా కొనసాగాలని, ఎక్కడికక్కడ నిఘా పెంచాలని, ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్ల వద్ద చెక్‌పోస్టులు పెట్టాలని, రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను మరింత పటిష్టం చేయాల్సి ఉందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటేనే ఎన్‌డీపీఎల్ అరికట్టడం సాధ్యమవుతుందనే చర్చ ఆ శాఖ వర్గాల్లో జరుగుతోంది. మరి, ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే...!

పంటను కాపాడుకునేందుకు పాట్లు



చండూర్‌లో పత్తి పంటలో మొక్కలకు నీరు పోస్తున్న రైతులు

చిలప్‌చెడ్ (నర్సాపూర్): పక్షం రోజులుగా వర్షం కురవకపోవడంతో మొలకెత్తిన పత్తి మొక్కలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలంలోని చండూర్‌లో రైతులు మొలకెత్తిన పత్తి మొక్కలకు బకెట్లతో నీరు పోసి దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు.



మాజీ రాష్ట్రపతి వీవీ గిరి, జాతీయ కాంగ్రెస్ దివంగత నేత సంజయ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం గాంధీభవన్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్. చిత్రంలో ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, గద్వాల విజయలక్ష్మి, వంశీచంద్‌రెడ్డి తదితరులు

ఔషధ మొక్క.. ఆరోగ్యానికి రక్ష

మనతోపాటు, మనకన్నా ముందే పుట్టిన అనేక రకాల ఔషధ మొక్కలు మానవ మనుగడలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రకృతి మనకు అందించిన మొక్కలను నిత్యం చూస్తున్నా.. వాటి ప్రయోజనాలు, విలువలను తెలుసుకోలేకపోతున్నాం. ఇంట్లో, పెరట్లో, మిద్దెలపై పెంచుతున్న పూలమొక్కలతోపాటు పలు రకాల ఔషధ మొక్కలను సైతం పెంచితే ఇంటికి అందంతోపాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగుంటుందని సూచిస్తున్నారు ఔషధ మొక్కల ప్రేమికులు. అందాన్ని పెంచే అలోవేరా (కలబంద), తిప్పతీగ, నిమ్మగడ్డి, అశ్వగంధ, తులసి, పుదీనా, ఉసిరి, వేప, పసుపు, బ్రహ్మి, మెంతులు.. ఇలా మానవాళికి దోహదపడే ఔషధ మొక్కలు అనేకం ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సెంటనరీ కాలనీలో సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో అనేక రకాల ఔషధ మొక్కలను సంరక్షిస్తున్నారు. అంతేకాదు.. వాటి ఉపయోగాలను తెలియజేసేలా ప్రచారం కూడా చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





నిమ్మగడ్డి. జీర్ణక్రియను మెరుగుపరిచి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఒత్తిడిని తగ్గించి శరీరంలోని విషపదార్థాలను తొలగిస్తుంది. వంటకాల్లో సైతం నిమ్మగడ్డి ఒక ప్రత్యేకమైన రుచితోపాటు సువాసనను అందిస్తుంది. వేడినీటిలో మరిగించి టీలా తాగుతారు కొందరు.



నోని మొక్క. రుబియాసియే కుటుంబానికి చెందిన ఈ మొక్కతో ఔషధ ప్రయోజనాలు అనేకం. బ్లడ్‌ప్రెషర్ (బీపీ)ని కంట్రోల్ చేస్తుంది. కేన్సర్ నివారణకు ఈ మొక్క పండ్లు దోహదపడతాయి. నోనిలో యాంటీ యాక్సిడెంట్స్, ఖనిజాలు విటమిన్లు పుష్కలం. నోని పండ్లను నేరుగా లేదా జ్యూస్‌గా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. షుగర్ నియంత్రణకు దోహదపడుతుందంటున్నారు.



ఆకులు మందంగా, తెల్లగా ఉన్న ఈ మొక్క పేరు క్లినియా గ్రాండిఫ్లోరా (కుందేలు చెవిఆకు). ఆస్టరేసి కుటుంబానికి చెందిన ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు. దీని ఆకులు, వేర్లు ఆరోగ్య సమస్యలకు చికిత్సగా వాడతారు. ఆకురసాన్ని దద్దుర్లు, దురదలను తగ్గించేందుకు వాడతారు. మూత్ర సంబంధ వ్యాధులను సైతం నివారిస్తుంది.



ఆయిల్ నట్‌ట్రీ (నూనెగింజల చెట్టు). దీని విత్తనాల నుంచి నూనె తీస్తారు. ఔషధాల తయారీతోపాటు వంటల తయారీకి కూడా ఉపయోగిస్తారు. చర్మ సంబంధ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలకు ఈ నూనె వాడతారు. ఇంధనం, సబ్బులు, వార్నిష్‌ల తయారీకి సైతం దీని నూనెను ఉపయోగిస్తారు.



మల్టీ విటమిన్ ప్లాంట్. సైంటిఫిక్ నేమ్ సౌరోపస్ ఆండ్రోజినస్. ఏ, బీ, సీ, కే విటమిన్లను సమృద్ధిగా అందించే మొక్క. కాల్షియం, పొటాషియం, ఐరన్ వంటి ఖనిజాలను కలిగి హిమోగ్లోబిన్ ఉత్పత్తికి, రక్తపోటు నియంత్రణకు దోహదపడుతుంది. కొలెస్ట్రాల్, మధుమేహం, చెవినొప్పి నివారణలకు ఔషధంగా వినియోగిస్తారు.



అలోవేరా (కలబంద) ఈ మొక్క అందరికీ సుపరిచితం. గాయాలను నయం చేయడంలో ముఖ్యపాత్రను పోషిస్తుంది. చర్మం, జుట్టు పెరుగుదల, సంరక్షణ, చుండ్రు నివారణకు దోహదపడుతుంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మొక్క వైల్డ్‌గ్రేప్ (నల్లేరు). విటాసియే కుటుంబానికి చెందింది. అనేక ఔషధ గుణాలు కలిగిన ఈ మొక్క ఎముకల పెరుగుదల, పగుళ్లను నయం చేయడం, దగ్గు, జలుబు, జీర్ణ సమస్యలకు ఔషధంగా, కాల్షియం బూస్టర్‌గా పరిగణిస్తారు.



రణపాల (బ్రయోఫిలమ్). కిడ్నీలో రాళ్లు, చర్మవ్యాధులు, దగ్గు, జ్వరం, జీర్ణ, ఎముకల సమస్యల నివారణకు ప్రత్యేకంగా ఈ మొక్క ఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులు ఎముకలకు బలాన్ని చేకూరుస్తాయని వైద్యులు చెబుతారు.



గణపత్రి. ఇది విస్తృతంగా కనిపించే సుగంధపు మొక్క. ఆకులు, పూలు, విత్తనాలు ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. నొప్పి నివారణకు, యాంటీ యాక్సిడెంట్స్ పుష్కలంగా లభించే ఈ గణపత్రి మొక్క జీర్ణక్రియ మెరుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపునకు ఉపయోగపడుతుంది. దగ్గు, జలుబు నివారణకు, చర్మ సంబంధ వ్యాధుల చికిత్సలో సైతం ఉపయోగిస్తారు.


పార్కులో పెంచుతున్న అరుదైన మొక్కలు

వైజాగ్‌లో వండర్ పార్క్

విజ్ఞానం, వినోదం పంచే బయో డైవర్సిటీ పార్క్ బయాలజీ విద్యార్థులతో నిత్యం కళకళ


పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు (ఫైల్)

నగర జీవితంలోని కాంక్రీట్ జంగిల్‌కు భిన్నంగా, స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో సేదతీరాలని ఉందా? అరుదైన మొక్కల గురించి తెలుసుకుంటూ, వాటి అందాలను ఆస్వాదించాలనుకుంటున్నారా? అయితే మీరు కచ్చితంగా విశాఖపట్నం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించాలి. రాణి చంద్రమణి దేవి ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ఈ ఉద్యానవనం.. ఎన్నో వింతలు, విశేషాలతో ప్రకృతి ప్రియులను, విద్యార్థులను ఆకట్టుకుంటోంది.

- బీచ్‌రోడ్డు



షేవింగ్ బ్రష్ ట్రీ

పేరుకు తగ్గట్టే దీని పువ్వులు అచ్చం షేవింగ్ బ్రష్‌ను పోలి ఉంటాయి. ఇది ఒక ఎడారి మొక్క. చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. దీని పూల కేశాలు సన్నటి తీగల్లా ఉంటాయి. లావుగా ఉండే దీని కాండం నీటిని నిల్వ చేసుకుంటుంది. వేసవిలో నీటి కొరత ఏర్పడినప్పుడు, ఆ నీటినే వాడుకుని జీవిస్తుంది. ప్రకృతి ఎంత గొప్ప ఇంజినీరో చెప్పడానికి ఈ మొక్క ఒక ఉదాహరణ.



కొండగోగు

అంతరించిపోతున్న మొక్కల్లో ఇదొకటిగా చెబుతారు. ఈ మొక్క చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది. దీని పచ్చి కొమ్మలకు మంటపెడితే భగ్గున మండుతాయి. పక్షులు, తేనెటీగలు, సీతాకోకచిలుకలను అధికంగా ఆకర్షించే దీని పువ్వులు కప్పు ఆకారంలో ఉండటం మరో విశేషం.

ప్రకృతి అద్భుతాలకు చిరునామా



ఈ పార్క్ కేవలం చెట్ల సమాహారం కాదు.. జీవ వైవిధ్యానికి ఓ నిలువుటద్దం. అంతరించిపోతున్న జాతుల నుంచి విదేశీ వింతల వరకు ఇక్కడ కొలువుదీరిన ప్రతి మొక్కకూ ఓ ప్రత్యేక కథ ఉంది. పార్క్ సమన్వయకర్త డాక్టర్ ఎం. రామమూర్తి పర్యవేక్షణలో ఈ మొక్కల విశిష్టతలను విద్యార్థులకు, సందర్శకులకు వివరిస్తుండటం ఇక్కడి అదనపు ఆకర్షణ. ఈ పార్కులోని కొన్ని మొక్కల గురించి తెలుసుకుందామా?

కృత్రిమ హౌస్‌లో ఆర్కిడ్ల సోయగం



ప్రపంచంలోనే అత్యంత అందమైన పూల జాతుల్లో ఆర్కిడ్‌లు ఒకటి. వీటికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అలాంటి అద్భుతమైన మొక్కలు జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. 'ఈ మొక్కలు సాధారణంగా చల్లని ప్రాంతాల్లో పెరుగుతాయి. ఇవి మట్టిలో కాకుండా చెట్ల కాండాన్ని అల్లుకుని పెరుగుతూ, గాలిలోని తేమను పీల్చుకుంటూ జీవిస్తాయి. ముఖ్యంగా వేసవి కాలంలో ఇవి అధికంగా పుష్పిస్తాయి. ఆర్కిడ్‌ల ఆకారాలు, రంగులు విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. ఆర్కిడ్‌లు జీవించడానికి చల్లని వాతావరణం అవసరం.' అని సమన్వయకర్త రామమూర్తి తెలిపారు. అందుకే జీవ వైవిధ్య ఉద్యానవనంలో ప్రత్యేకంగా ఒక కృత్రిమ ఆర్కిడ్ హౌస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ తొట్టెల్లో బొగ్గు, కొబ్బరి పీచులను ఉపయోగించి మొక్కలను సంరక్షిస్తున్నారు. డ్యాన్సింగ్ లేడీ, ఎరైడ్స్ మల్టీఫోర, డెండ్రోబియం ఎఫిల్లా, సింబిడియం వంటి అనేక రకాల ఆర్కిడ్ మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. వాటికి పూసే పువ్వులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. మన దేశంలో మేఘాలయ, సిమ్లా ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి.

విద్యార్థులకు ప్రయోగశాల

ఈ బయోడైవర్సిటీ పార్క్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని బయాలజీ విద్యార్థులకు ఒక సజీవ ప్రయోగశాలగా మారింది. తమ పరిశోధనలు, ప్రాజెక్టుల కోసం విద్యార్థులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. డాక్టర్ రామమూర్తి వారికి మొక్కల చరిత్ర, వాటి పెంపకం, వైద్య, పర్యావరణ ప్రయోజనాలను వివరిస్తూ వారిలో ప్రకృతిపై ఆసక్తిని పెంచుతున్నారు.

ప్రేమను పంచే మొక్కలు



ప్రేమకు గుర్తు గులాబీ పువ్వు మాత్రమే కాదు. అనేక అరుదైన మొక్కలు, వాటి పువ్వులు, ఆకులు కూడా ఉన్నాయి. బయోడైవర్సిటీ పార్కులో ఇటువంటి ప్రత్యేకమైన మొక్కలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా ప్రేమికులు తమ ప్రేమకు గుర్తుగా చెట్లపై పేర్లు రాస్తుంటారు. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే.. 'వాలెంటైన్స్ ప్లాంట్'అనే ఒక మొక్క ఉంది. ఈ మొక్క ఆకులు చాలా మందంగా ఉండటం వల్ల వాటిపై పేర్లు రాసుకోవచ్చు. ఇలా రాసిన పేర్లు ఎప్పటికీ చెరిగిపోవు. అలాగే 'వాలెంటైన్స్ హార్ట్'అనే మరో అరుదైన మొక్క కూడా ఈ పార్కులో ఉంది. ఎడారి ప్రాంతాల్లో కనిపించే ఈ మొక్క చూడటానికి లవ్ సింబల్ ఆకారంలో ఉంటుంది. ఈ ప్రత్యేకత ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ మొక్కను 'స్వీట్ హార్ట్'అని కూడా పిలుస్తారు. ఇంకా 'మిలియన్స్ హార్ట్స్'మొక్క పార్కుకు వచ్చే యువతీ యువకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఒకే మొక్కకు వందల సంఖ్యలో గుండె ఆకారపు ఆకులు ఉండటం దీని ప్రత్యేకత. ఇది చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతోనే దీనికి 'మిలియన్స్ హార్ట్స్'అనే పేరు వచ్చింది.

క్లుప్తంగా...

ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గం

రాష్ట్ర వ్యాప్త నిరసనలకు వామపక్షాలు పిలుపు

సాక్షి, అమరావతి: ఇరాన్‌పై అమెరికా దాడులు దారుణమని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఆ పార్టీల రాష్ట్ర నేతలు వి.శ్రీనివాసరావు(సీపీఎం), కె.రామకృష్ణ (సీపీఐ), పి.ప్రసాద్(సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), జాస్తి కిశోర్‌బాబు(సీపీఐఎంఎల్), కాటం నాగభూషణం(ఎంసీపీఐయు), బి.బంగార్రావు (సీపీఐఎంఎల్-లిబరేషన్), బీఎస్ అమర్‌నాథ్(ఎస్‌యూసీఐసి), పీవీ సుందర రామరాజు(ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు(రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇరాన్‌పై దాడితో చమురు సంక్షోభం వస్తుందని, తద్వారా దేశ ప్రజలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి దృష్ట్యా భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడులకు వ్యతిరేకంగా విజయవాడలో ఈ నెల 25న నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

జూలై 12 వరకు విద్యార్థుల చేరికపై డ్రైవ్

సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై వచ్చేనెల 12వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి నెలరోజుల పాటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేయాలని, విద్యార్థులకు అందించే పథకాలను తల్లిదండ్రులకు వివరించి పిల్లలు పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. అలాగే బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి చేర్చుకోవాలని ఆదేశించారు. ఈమేరకు అన్ని జిల్లాల డీఈవోలు స్కూళ్ల హెచ్‌ఎంలకు మార్గదర్శకాలు జారీ చేయాలని ఎస్పీడీ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీఈ ప్రవేశాల అలసత్వంపై చర్యలు తీసుకోవాలి: ఎస్‌ఎఫ్‌ఐ

సాక్షి, అమరావతి: ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద చేపట్టిన అడ్మిషన్ల ప్రక్రియలో అధికారుల అలసత్వం కనిపిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. పేద పిల్లల అడ్మిషన్లను స్వీకరించేందుకు ప్రైవేటు పాఠశాలలు నిరాకరిస్తున్నాయన్నారు. ఆర్టీఈ చట్టం కింద మొదటి విడతలో 23,118 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా 7,577 మంది విద్యార్థులు ఇంకా చేరలేదన్నారు. రెండో విడతలో 8,583 సీట్లు కేటాయించారని, ఎంత మందిని చేర్చుకుంటారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంచారని, దీంతో ఫీజులో 50 శాతం చెల్లించాలని విద్యార్థులను యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

---

60 కి.మీ నుంచి 900 కి.మీకు..

నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు లెక్చరర్లకు జోన్లు మార్పు

- జోన్- 4,3 నుంచి జోన్-1కి 56 మంది తరలింపు
- జోన్, రీజియన్ పరిధి దాటి బదిలీలు
- సర్వత్రా వెల్లువెత్తుతోన్న విమర్శలు
- కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీకి కొత్తగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నేడు



సాక్షి, అమరావతి: ఇటీవల జరిగిన బదిలీల్లో అనేక తప్పులతో అభాసుపాలైన రాష్ట్ర సాంకేతిక విద్య, ఇప్పుడు కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీల విషయంలోనూ అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. ఏటా జోన్ స్థాయిలో జరిగే బదిలీలను ఈసారి సాంకేతిక విద్య డైరెక్టరేట్ నుంచి వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో చేపట్టనున్నారు. మంగళవారం ఈ ప్రక్రియ చేపట్టాలని షెడ్యూల్ విడుదల చేశారు. దీంతోపాటు జోన్-4లోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పనిచేసే 56 మందిని జోన్-1లోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్ నుంచి ఏప్రిల్ వరకు 11 నెలల కాలానికి ఆయా జోన్ల పరిధిలోని కాలేజీల్లో పనిచేసేందుకు విధుల్లోకి తీసుకుంటారు. కానీ ఈసారి కాంట్రాక్టు లెక్చరర్లను జోన్లు, రీజియన్లు దాటించి మరీ నియామకాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమవుతోంది.

రాయలసీమ నుంచి ఉత్తరాంధ్రకు..

గతేడాది 200 మంది అధ్యాపకులను సర్దుబాటు పేరుతో బదిలీలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో వాటిని రద్దు చేశారు. ఇకపై బదిలీల వ్యవహారం సవ్యంగా సాగుతుందని అందరూ భావించారు. అయితే గతానుభవాలను విస్మరించిన సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరేట్ మళ్లీ అదే రీతిలో బదిలీలకు తెరలేపింది. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధి జోన్-4లో నియమించాల్సిన కాంట్రాక్టు లెక్చరర్లు 56 మందిని ఆంధ్రా రీజియన్ జోన్-1లో నియమించేందుకు నిర్ణయించారు. తక్కువ జీతాలకు పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను దాదాపు 900 కిలోమీటర్ల దూరంలో నియమించడం ఆశ్చర్యకరం. ప్రస్తుతం పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లు 309 మంది ఉన్నారు. గత ప్రభుత్వం 2022లో పీఆర్సీ అమలు చేయడంతో నెలకు రూ.61,960 వేతనం 10 రోజులు మినహా 12 నెలల కాలానికి పొందేవారు. కానీ కూటమి ప్రభుత్వం వీరి వేతనాన్ని రూ.54,060కు తగ్గించేందుకు నిర్ణయించింది. తీవ్ర వ్యతిరేకత రావడంతో పాత వేతనమే ఉంచి ఉత్తర్వులిచ్చారు. దీంతోపాటు పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నుంచి కూడా వీరిని తొలగించింది. ఇంత తక్కువ వేతనంతో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను జోన్ దాటి రీజియన్ పరిధిలోకి బదిలీ చేయడం వెనుక ఆంతర్యమేంటన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు.

అరకొరవేతనంతో అంతదూరమా?

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో రెండు నెలల క్రితం సిబ్బంది రేషనలైజేషన్ చేపట్టారు. మూడేళ్లుగా విద్యార్థులు లేని కోర్సుల్లో లెక్చరర్ పోస్టులు సహా లెక్చరర్లను అవసరమున్న చోటికి తరలించారు. ఇటీవల రెగ్యులర్ బదిలీలు పూర్తి చేశారు. జోన్-1లో 2009లో ఏర్పాటు చేసిన కాలేజీల్లో మాత్రం లెక్చరర్లను నియమించలేదు. ఈ ప్రాంతానికి పోస్టులు మంజూరు చేయకపోవడంతో జోన్ పరిధిలోని కాలేజీల్లోని రెగ్యులర్ లెక్చరర్లతో సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. అయితే, గతేడాది కూటమి ప్రభుత్వం వర్క్‌లోడ్ పేరుతో దాదాపు 200 మంది రెగ్యులర్ లెక్చరర్లకు సర్దుబాటు బదిలీలు చేసినా జోన్ స్థాయిలో జరగాల్సినవి రీజియన్లనే మార్చి మరీ చేశారు. 60 కి.మీ పరిధిలో చేపట్టాల్సిన సర్దుబాటును ఏకంగా 900 కి.మీ దూరంలో నియమించడంతో బాధితులు పోస్టుల్లో చేరకుండా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించారు. మళ్లీ ఈ ఏడాది రాయలసీమ నుంచి ఉత్తరాంధ్రకి బదిలీ చేసి వేధించడం తప్ప దీని ద్వారా ప్రభుత్వానికి, సాంకేతిక విద్యాశాఖకు వచ్చే లాభం ఏంటో తెలియడం లేదని వాపోతున్నారు.

జాతీయ రహదారులు రక్తసిక్తం

- దేశంలోని పది హైవేలపై 2,300 మంది మృత్యువాత
- 2023 లెక్కల ప్రకారం... టాప్-1లో గుజరాత్
- 213 మంది మరణాలతో టాప్-3లో ఆంధ్రప్రదేశ్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాల్సిన రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రోడ్లపై నిత్యం పలువురు ప్రాణాలను కోల్పోతుండగా, మరికొందరు గాయపడి మంచాలకు పరిమితమవుతున్నారు. దేశంలోని జాతీయ రహదారులపై 2023లో దాదాపు 2,300 మంది మృత్యువాత పడ్డట్లు జాతీయ రహదారుల డేటా తెలుపుతోంది. 522 కిలోమీటర్ల పొడవు ఉన్న ఎన్‌హెచ్-48పై గుజరాత్‌లో 763 మంది మృతి చెందారు. ఆ ఏడాదిలో దేశంలో ఎక్కువమంది మృతిచెందింది గుజరాత్‌లోనే. 266 కిలోమీటర్ల ఎన్‌హెచ్-44పై హరియాణాలో 715మంది మృతి చెందారు. ఇక 154 కిలోమీటర్ల ఎన్‌హెచ్-65పై ఆంధ్రప్రదేశ్‌లో 213 మంది దుర్మరణం చెందారు. దేశంలోని పది జాతీయ రహదారుల్లో మృతిచెందిన వారి డేటా ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. కేవలం 21మంది మృతిచెందిన రాష్ట్రంగా పుదుచ్చేరి నిలిచింది. ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ.. ఫలితం కనిపించడం లేదు. త్వరితగతిన గమ్యానికి చేరుకోవాలనే లక్ష్యంతో జాతీయ రహదారులపై వేగంగా ప్రయాణిస్తున్న కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నట్టు కేంద్రం గుర్తించింది.

తడబడే వయస్సు.. పొరబడే మనస్సు!

నిన్నటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. కొత్త వారితో పరిచయాలు, సరికొత్తగా అనిపించే ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా, వింతగా అనిపిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియెట్ దశ అత్యంత కీలకం. జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నా.. జీవితం మళ్లీ మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. అందుకే ఇప్పుడిప్పుడే జూనియర్ కళాశాలల్లో చేరుతున్న వారు జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగితే ఇంటర్ దశ కొత్త బంగారులోకమై భవిష్యత్ ఉజ్వలమయమవుతుంది.

- ఇంటర్‌లో కౌమార దశ
- గాడితప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే లక్ష్యానికి చేరువ
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం




నంద్యాల(న్యూటౌన్): తొలిసారి ఎదుర్కొన్న పది పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మవిశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం.. కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కల్గించే ఆనందం.. ఇలా అన్నీ వెరసి విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ ఓ కొత్త బంగారు లోకమే. అనువైన గ్రూపు, ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్ లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా, గాడి తప్పి అధఃపాతాళానికి పడిపోయినా.. అంతా ఇంటర్‌లోనే బీజాలు పడతాయని చెప్పుకోవచ్చు. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే జాగ్రత్త పడాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోకూడదు. స్నేహితులే లోకంగా అన్పించే వయస్సులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లిదండ్రుల, అధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే భవిష్యత్ అంధకారమే.

చదువుకే ప్రాధాన్యం..

ఇంటర్‌లో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు చక్కగా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం ఎంతో ఉపయుక్తం.

సమయం.. సద్వినియోగం




ఇంటర్‌లో సెలవు రోజులు ఉంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరు. మనసును, శరీరాన్ని ఉల్లాసపరిచే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.

వ్యసనాలకు దూరంగా ఉండాలి..



జీతితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలో అలవాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. సెల్‌ఫోన్ వైరస్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది.

స్నే'హితులు'



ఇంటర్‌లో విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితానికి మంచి చుక్కాని లభించినట్లే. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి.

లక్ష్యానికి తొలి అడుగులు..

భవిష్యత్‌లో లక్ష్యం సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే. కొత్త కొత్త స్నేహదనంతో నిండి కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారు లోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలి.

స్కిన్ కేర్ ఏజ్ నో బార్!



కాలం ఎవరికోసమూ ఆగదు. కాలం గడుస్తున్న కొద్దీ అది ప్రతి అంశం మీదా ఏదో ఒక ప్రభావం చూపుతుంది. అలాగే మన చర్మం మీద కూడా. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుండటంతో చర్మానికి వచ్చే సమస్యలు, వ్యాధులొచ్చే అవకాశాలూ పెరుగుతాయి. అందుకే వయసు పెరుగుతున్న ప్రతి ఒక్కరూ... వారు ఏ వయసు వారైనప్పటికీ... తమ చర్మానికి వచ్చే కొన్ని సమస్యలను తెలుసుకుని తగిన శ్రద్ధ తీసుకోవడం అవసరం. కాలాన్నైతే ఆపలేం గానీ... దాని ప్రభావం వల్ల చర్మంపై వచ్చే మార్పులను ఆలస్యంగా వచ్చేలా చేసుకుని చాలాకాలం పాటు యౌవనంగా కనిపించవచ్చు. అదెలాగో తెలుసుకుందాం...




డాక్టర్ కొప్పిశెట్టి సత్య నాగ రవితేజ
సీనియర్ డర్మటాలజిస్ట్

సమయం గడుస్తున్న కొద్దీ చర్మానికి వచ్చే అనేక ఆరోగ్య సమస్యలు చాలానే ఉంటాయి. ఉదాహరణకు చర్మాన్ని పొడిబార్చే జీరోసిస్ వంటి సాధారణ సమస్యలు మొదలుకొని చర్మం కింద రక్తం పేరుకున్నట్లు కనిపించే పర్‌ప్యూరా, హిమటోమా వరకు... ఎండకు పగుళ్లుబారినట్లు కనిపించే సోలార్ ఎలాస్టోసిస్ మొదలుకొని... కొన్ని రకాల క్యాన్సర్స్ వరకు చాలా సమస్యలు రావచ్చు. అలాంటి సమస్యలేమిటన్నది చూద్దాం. చర్మంలో ప్రధానంగా మూడు పొరలు ఉంటాయి. బయటిపొరను ఎపిడర్మిస్, మధ్యపొరను డర్మిస్ అంటారు. దానికింద సబ్‌క్యుటేనియస్ టిష్యూ ఉంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ మూడు పొరల్లో చాలా మార్పులు వస్తాయి.

* * *

వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు...

ఎపిడర్మిస్ పొర: ఈ పొర పలుచబారడం మొదలవుతుంది. ఈ పొరలో చర్మానికి రంగు నిచ్చే మెలనోసైట్స్ అనే కణాలు తగ్గడం మొదలవుతుంది. అందుకే వృద్ధుల్లోని చర్మం చాలావరకు పారదర్శకంగా మారి... లోపల ఉండే రక్తనాళాలు కొంతవరకు బాగా కనిపిస్తూ ఉంటాయి. వయసు పెరుగుతున్నకొద్దీ చర్మం పాలిపోయినట్లుగా అవుతుంది.

డర్మిస్ పొర : ఇందులో చర్మ కణాలను గట్టిగా పట్టి ఉంచే కొలాజెన్, ఎలస్టిన్ అనే కనెక్టివ్ కణజాలాలు ఉంటాయి. వీటి వల్ల చర్మానికి సాగే గుణం, బలం సమకూరుతాయి. ఈ కణాలు బలంగా ఉన్నప్పుడు చర్మం బిగుతుగా ఉంటుంది. యౌవనంలో కొలాజెన్, ఎలాస్టిన్ కణజాలం బలంగా ఉంటుంది కాబట్టి చర్మం బిగుతుగా ఉంటుంది. వయసు పైబడుతున్నకొద్దీ ఈ బలం తగ్గుతుండటంతో చర్మం సాగినట్లుగా, వదులవుతున్నట్లుగా కనిపిస్తుంది. దాంతోపాటు డర్మిస్‌లో ఉండే రక్తనాళాలు సైతం బలహీనంగా అవుతాయి. దాంతో వయసు పెరిగిన వారిలో చిన్న దెబ్బకైనా వెంటనే రక్తస్రావం అవుతుంది.

సబ్‌క్యుటేనియస్ పొర : ఇందులో కొవ్వు ఉంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ కొవ్వు తగ్గిపోతూ ఉండటం కారణంగా చర్మం మునుపటిలా మందంగా ఉండదు. పలచబారిపోతుంది. ఈ పొరలోనే చెమట గ్రంథులూ, అలాగే చర్మంపై నూనె లాంటి పదార్థాన్ని స్రవించే సెబేషియస్ గ్రంథులూ ఉంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ గ్రంథుల పనితీరు కూడా తగ్గుతూ ఉంటుంది. దాంతో చెమట పట్టే సామర్థ్యం కూడా తగ్గిపోయి చర్మం పొడిబారినట్లుగా అవుతుంది. తన స్వాభావికమైన నునుపుదనాన్నీ కోల్పోతుంది.

వయసు పెరుగుతున్న కొద్దీ పైన చెప్పిన అన్ని సమస్యల కారణంగా చర్మం తన పటుత్వాన్ని కోల్పోయి వేలాడుతున్నట్లుగా అవుతుంది. చర్మంపై ముడుతలు (రింకిల్స్) కూడా వస్తాయి. కాలంతో వచ్చే ఈ మార్పులు రాకుండా చేయడానికిగానీ లేదా ఆపడం గానీ పూర్తిగా సాధ్యం కాదు. అయితే కొన్ని సందర్భాల్లో కొందరిలో ఈ మార్పులు చాలా వేగంగా జరగవచ్చు. అందుకు కారణమయ్యే అంశాలివి...

- పర్యావరణానికి సంబంధించిన అంశాలు
- సూర్యరశ్మి ● పొగ ● కాలుష్యం
- పారిశ్రామిక, గృహ రసాయనాలు
- వ్యక్తిగత అంశాల విషయంలో ● ఆహారం
- మానసిక ఒత్తిడి ● మితిమీరిన మేకప్
- మొక్కల నుంచి కలిగే అలర్జీలు
- చర్మం పట్ల తగినంత శ్రద్ధ తీసుకోకపోవడం

వీటి కారణంగా కొందరిలో చర్మంపై వచ్చే దుష్ప్రభావాలు చాలా త్వరత్వరగా రావచ్చు.

తొలి ప్రభావం ఇలా...

● చర్మం పొడిబారిపోవడం, పాలిపోవడం, సాగేగుణం (ఎలాస్టిసిటీ) కోల్పోవడం, ముడుతలు, వేలాడినట్లుగా కావడం... ఈ గుణాలన్నీ తొలుత ముఖం, చేతుల చర్మంపై ఎక్కువగా కనిపిస్తాయి. ముఖంలోనూ ముక్కుకు ఇరువైపులా, నోటి చుట్టూ, దవడపైన ఉండే చర్మం, గవదల దగ్గరా ఎక్కువగా కనిపిస్తాయి.

● చేతుల విషయానికి వస్తే ముంజేతులు, కాళ్ల వద్ద ఉన్న చర్మంలో తొలుత మార్పులు వస్తాయి ● ఆ తర్వాత శరీరంలోని మిగతా చర్మంపై అంతటా ఈ మార్పులు చోటు చేసుకుంటాయి.

ముడతలు పడటం ఇలా : చర్మంపై వచ్చే ముడతల్లోనూ రెండు రకాలుగా చెప్పవచ్చు. తొలుత కాస్త స్పష్టంగా కనిపించే ముడతలను 'ఫైన్ రింకిల్స్' అంటారు. ఇవే ముడతలు మరింత లోతుగా, ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటే వాటిని 'డీప్ రింకిల్స్' అంటారు. ఇవి నలభై ఏళ్లు దాటాక మొదట్లో ముడతలు కాస్త కనిపించీ కనిపించనట్లుగా ఉంటూ, ఆ తర్వాత క్రమంగా మరింత లోతుగా మారుతుంటాయి. తొలుత కనిపించీ కనిపించని సమయంలోనే చర్మంపై శ్రద్ధ తీసుకోకపోతే త్వరగానే డీప్ రింకిల్స్‌గా మారతాయి.

* * *

చర్మానికి వచ్చే కొన్ని సాధారణ సమస్యలు

● **జీరోసిస్ లేదా ఏస్టిటోటిక్ దర్మటైటిస్ :** ఈ సమస్యనే మామూలు వాడుక భాషలో పొడి చర్మంగా చెప్పవచ్చు. ఈ సమస్య ముందుగా కాళ్లలోని మోకాలి కింద భాగంలో ఉన్న చర్మంలో ఎక్కువగా కనిపిస్తుంది. దుస్తులు కప్పని భాగాల్లో ఈ సమస్య కొంత స్పష్టంగా కనిపిస్తుంది.


● **ఏజ్ స్పాట్స్ లేదా లివర్ స్పాట్స్ :** చర్మానికి రంగును ఇచ్చే కణాలు మెలనోసైట్స్ తగ్గడం వల్ల ఒంటి రంగు పాలిపోయినట్లుగా కనిపిస్తుంది. ఆ తర్వాత పెద్ద పెద్ద నల్లటి మచ్చలు వస్తాయి. వాటిని ఏజ్ స్పాట్స్ లేదా లివర్‌స్పాట్స్ లేదా సోలార్ లెంటిజీన్స్ అంటారు. చర్మం సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ అయ్యేచోట ఇవి ఎక్కువగా వస్తుంటాయి.

● **సోలార్ ఎలాస్టోసిస్ :** సూర్యరశ్మి నేరుగా తగిలే భాగాల్లో చర్మం కాస్త మందంగా మారినట్లుగా (లెదరీగా) ఉండటం, పగుళ్లు వారినట్లుగా కనిపించడం జరుగుతుంది. ఈ సమస్య ఎండలో పని చేసే వారిలో అంటే రైతులు, ఎండలో పనిచేసే కార్మికులు, నావికుల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

● **సెబోరిక్ కెరటోసిస్ :** చర్మంపై కందిగింజ పరిమాణంలో (ముఖ్యంగా చేతుల మీద, ముఖంపైన) గోధుమరంగు (బ్రౌన్)లో మచ్చలు వస్తాయి. వాటినే సెబోరిక్ కెరటోసిస్ అంటారు.

● **హైపోథెర్మియా :** హైపోథెర్మియా అనే కండిషన్‌లో సబ్ క్యుటీనియస్ పొరలో ఓ మార్పు వస్తుంది. స్వేదగ్రంథుల సామర్థ్యం తగ్గిపోతుంది. చర్మం మందం కోల్పోయి పలచబారుతుంది. దాంతో 'హైపోథెర్మియా' కండిషన్ ఉన్నవారు – వాతావరణంలో చలి ఎక్కువగా ఉంటే సాధారణ వ్యక్తుల కంటే చలిని చాలా ఎక్కువగా ఫీలవుతారు. అలాగే ఉష్ణోగ్రత కొద్దిపాటి పెరిగినా వెంటనే ఎండదెబ్బకు గురవుతారు.

● **స్కిన్ ట్యాగ్స్ లేదా యాక్రోకార్డాన్స్ :** చర్మం వదులుగా మారి – మెడలు, బాహుమూలాల వద్ద పులిపిర్లలా కాయల్లా కనిపిస్తాయి. తొడల వద్ద కూడా కనిపిస్తాయి. అదనపు చర్మంలా పొడుచుకు వచ్చినట్లుగా పులిపిర్ల (ఔట్‌గ్రోత్స్) లాగా కనిపిస్తాయి.



● **ఎయిర్ బార్న్ కాంటాక్ట్ దర్మటైటిస్ :** వయసు పైబడుతున్న కొద్దీ చర్మానికి అలర్జీలు వచ్చే అవకాశాలు పెరుగుతుంటాయి. అంతేకాదు అలర్జీలు చాలా తేలిగ్గా కూడా వస్తుంటాయి. పరిసరాల్లో ఉండే మొక్కల కారణంగా (పార్థీనియం వంటివి) చర్మంపై అలర్జీలు వస్తే దాన్ని ఎయిర్ బార్న్ కాంటాక్ట్ డర్మటైటిస్ అని అంటారు.

● **పర్‌ప్యూరా అండ్ హిమటోమాస్ :** చర్మం కింద ఉన్న రక్తనాళాలు పెళుసుబారడం వల్ల (ఫ్రాజైల్‌గా మారడం వల్ల) అవి తేలిగ్గా చిట్లవచ్చు. దాంతో అక్కడ రక్తం చేరినట్లుగా చర్మం లోంచి బయటకు కనిపిస్తుంది. దాన్ని 'సెనైల్ పర్‌ప్యూరా' అంటారు. రక్తం పేరుకుపోవడంతో అక్కడ చర్మం కాస్త ఉబ్బుగా కనిపిస్తుంటే దాన్ని హిమటోమా అని అంటారు.



● **కెరటో అకాంథోమా :** వయసు పైబడుతున్న వారిలో, ఎండలో ఎక్కువగా తిరిగే వారిలో క్యాన్సర్‌కాని కొన్ని కాయలు (నాన్ క్యాన్సరస్ స్కిన్ గ్రోత్స్) కనిపిస్తాయి. అవి చాలా పెద్దగా ఉండి, చుట్టూ ఎత్తుగా ఉన్నా మధ్యలో గుంటలా ఉంటాయి.

● **న్యూరోదర్మటైటిస్ :** ప్రధానంగా పాదాల మీద నల్లటి మచ్చలా వచ్చి, చాలా దురదగా ఉండే లక్షణాలతో వ్యక్తమయ్యే సమస్య ఇది.

చర్మానికి వచ్చే ఇన్ఫెక్షన్‌లు

వయసు పైబడుతున్నకొద్దీ చర్మం ఇన్ఫెక్షన్స్‌కు తేలిగ్గా గురవుతుంది. ఆ ఇన్ఫెక్షన్లు ఇవి...

● బ్యాక్టీరియా వల్ల –ఫాలికులైటిస్, సెల్యులైటిస్ ● ఫంగస్ వల్ల–క్యాండిడియాసిస్, డెర్మటోఫైట్ ఇన్ఫెక్షన్స్ ● వైరస్ వల్ల–జోస్టర్ ● ఇన్‌ఫెస్టేషన్స్ వల్ల–గజ్జి (స్కేబిస్) వంటివి.

ఆటో ఇమ్యూన్ వ్యాధులు

తమలోని వ్యాధి నిరోధక వ్యవస్థ తమ సొంత కణాలనే శత్రుకణాలుగా భావించడం వల్ల వచ్చే వ్యాధులనే ఆటో ఇమ్యూన్ వ్యాధులుగా చెబుతారు. ఆటో ఇమ్యూన్ వ్యాధులకు ఒక ఉదాహరణగా సోరియాసిస్‌ను చెప్పవచ్చు.

● **సోరియాసిస్ :** వయసు పెరుగుతున్న కొద్దీ సోరియాసిస్ అనే చర్మ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇవి మొదట పొడిగా ఆ తర్వాత వెండిరంగు పొట్టు రాలుతున్నట్లుగా లక్షణాలు కనిపిస్తాయి.

● **చర్మ క్యాన్సర్లు :** చర్మ క్యాన్సర్లు కాస్త అరుదుగా వచ్చేవే అయినప్పటికీ... పెరుగుతున్న వయసు వాటికి ఒక రిస్క్ ఫ్యాక్టర్. అందుకే వయసు పెరుగుతున్న కొద్దీ చర్మానికి క్యాన్సర్ వచ్చే అవకాశాలూ పెరుగుతాయి. వయసు పెరుగుతున్న వారిలో బేసల్ సెల్ ఎపిథిలియోమా, స్క్వామస్ సెల్ కార్సినోమా, మెలనోమా వంటి క్యాన్సర్స్‌లు కనిపించవచ్చు.



జాగ్రత్తలు

వయసును ఆపలేకపోయినా... కొన్ని జాగ్రత్తలతోనూ, సూచనలతో పాటు మంచి పోషకాహారం, వ్యాయామాలతో... వయసుతో పాటు వచ్చే దుష్ప్రభావాలను చాలావరకు ఆపవచ్చు. వయసు పైబడుతున్న వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలాకాలం పాటు చర్మాన్ని ఏజింగ్ తాలూకు లక్షణాల నుంచి సంరక్షించుకోవచ్చు. అవి...



● బాగా సుగంధభరితమైన సబ్బులు వాడకపోవడం. మైల్డ్ సోప్స్ మాత్రమే వాడటం ● బాత్ ఆయిల్స్‌ను వాడకపోవడం. బాత్ ఆయిల్స్‌తో, సుగంధభరితమైన సబ్బులతో అలర్జీలు వచ్చే అవకాశాలు ఎక్కువ ● ఎండలోకి వెళ్లేప్పుడు తగినంత ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్స్ వాడటం. (చలికాలంలోనూ వీటిని వాడటం మానుకోకూడదు) ● మాయిశ్చరైజేషన్ లోషన్స్‌తో చర్మాన్ని పొడిబారకుండా చూసుకోవడం ● శరీరాన్ని దాదాపుగా కప్పి ఉంచే మంచి సౌకర్యవంతమైన దుస్తులు ధరించడం ● అవసరాన్ని బట్టి క్యాప్ లేదా బ్రిమ్డ్ హ్యాట్ వంటివి వాడటం

● అన్ని రకాల పోషకాలూ ఉండే సమతుల ఆహారాన్ని తీసుకోవడం. పెరుగుతున్న వయసుతో చర్మంపై ప్రభావం కనపడనివ్వకుండా చేసుకోడానికి మంచి ఆహారం తీసుకోవడం చాలా అవసరం. అందులో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల చర్మం చాలాకాలం ఆరోగ్యంగా, ఏజింగ్‌కు గురికాకుండా ఉంటుంది. ఆకుకూరలు, పండ్లు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటాయి

● ఆహారంతో పాటు తగినంత ద్రవాహారం తీసుకుంటూ శరీరంలోని లవణాలను కోల్పోకుండా (డీహైడ్రేషన్‌కు గురికాకుండా) చూసుకోవడం

● పొగతాగే అలవాటును తక్షణం మానేయడం. (ఈ అలవాటు వల్ల కాలం గడిచేకొద్దీ ఏజింగ్ వల్ల చర్మంపై వచ్చే దుష్ప్రభావాలు చాలా వేగంగా వస్తాయి) ● గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం. (స్నానం చేసే విషయంలో గుర్తుంచుకోవాల్సిందేమిటంటే... మనం స్నానానికి వాడే నీటి ఉష్ణోగ్రత... మన శరీర ఉష్ణోగ్రత కన్నా తక్కువగా ఉండటం మంచిది) ● చర్మంపై వచ్చే ఇన్ఫెక్షన్స్‌కు వెంటనే చికిత్స తీసుకోవడం. (నిర్లక్ష్యం చేస్తే అవి మరిన్ని ఇతర సమస్యలకు దారితీయవచ్చు)

● డయాబెటిస్, థైరాయిడ్, పోషకాహారలోపాలు వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో చర్మం పొడిబారిపోయి మరికొన్ని సమస్యలు రావచ్చు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటూ ఉండటం ద్వారా పెరిగే వయసుకు అతీతంగా చాలాకాలం పాటు యంగ్‌గా కనిపించవచ్చు.

బిజినెస్ రీల్

బీఎస్ఎన్ఎల్ నుంచి 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసులు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ తాజాగా హైదరాబాద్‌లో 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసులను ప్రారంభించింది. జూన్ 18న సాఫ్ట్ లాంచ్ చేసినట్లు సంస్థ చైర్మన్ ఎ. రాబర్ట్ జె రవి తెలిపారు. సెప్టెంబర్ నాటికి పైలట్ ప్రాజెక్టును విశాఖ, బెంగళూరు, పుణె తదితర నగరాలకు కూడా విస్తరించనున్నట్లు వివరించారు. కంపెనీ ప్రాథమికంగా 100 ఎంబీపీఎస్ ప్లాన్‌కు రూ. 999, అలాగే 300 ఎంబీపీఎస్ ప్లాన్‌కి రూ. 1,499 చార్జీలు నిర్ణయించింది.

సంగీత మొబైల్స్ 51వ వార్షికోత్సవ ఆఫర్లు



బెంగళూరు: రిటైల్ మొబైల్ వ్యాపారంలోని 'సంగీత' మొబైల్స్ 51వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. సంగీత మొబైల్ స్టోర్‌ను సందర్శించే ప్రతి ఒక్కరికి రూ.5,001 విలువైన కచ్చితమైన బహుమతి లభిస్తుంది. కొనుగోలు చేసిన మొబైల్ ధర తగ్గినా.., రూ.10,000 వరకు నగదు తగ్గింపు పొందొచ్చు. ఎంపిక చేసిన ఉత్తమ స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లపై 50% తగ్గింపు ఇస్తుంది. ప్రతి ఫోన్‌పై రెండేళ్ల డ్యామేజీ ప్రొటెక్షన్ పొందవచ్చు. ఫోన్ ప్రమాదవశాత్తూ పగిలినా, స్క్రీన్ బ్రేక్ అయినా రీప్లేస్‌మెంట్‌పై 70% వరకు తగ్గింపు లభిస్తుంది. కేవలం 30 నిమిషాల్లో డోర్ డెలివరీ సదుపాయం ఉంది.

ఎన్‌టీపీసీ నిధుల సమీకరణ

రూ. 18,000 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: విద్యుత్ రంగ ప్రభుత్వ దిగ్గజం ఎన్‌టీపీసీ నిధుల సమీకరణ బాట పట్టింది. బాండ్లు లేదా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ. 18,000 కోట్లు సమీకరించేందుకు వాటాదారుల అనుమతి కోరుతోంది. ఇందుకు అనుగుణంగా పోస్టల్ బ్యాలట్‌కు తెరతీసింది. ప్రత్యేక రిజల్యూషన్‌లో భాగంగా ఈవోటింగ్ ద్వారా నిధుల సమీకరణకు సభ్యుల అనుమతిని కోరుతున్నట్లు కంపెనీ పేర్కొంది. ఒకేసారి లేదా దశలవారీగా దేశీ మార్కెట్లో ఏడాదిలోగా ప్రయివేట్ ప్లేస్‌మెంట్ చేపట్టనున్నట్లు తెలియజేసింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా నిధుల సమీకరణకు వాటాదారుల అనుమతి కోరే ప్రతిపాదనపై ఈ నెల 21న కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే వోటింగ్ హక్కులు వినియోగించుకునేందుకు ఈ నెల 20 కటాఫ్ డేట్‌గా ప్రకటించింది. రిమోట్ ఈవోటింగ్‌ను ఈ నెల 24న ప్రారంభించి జులై 23న ముగించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-6-2025

విశాఖ	565-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,108.00	3.57
BEL	421.4	3.22
HINDALCO	662	1.98
TATACONSUM	1,110.80	0.96
BAJFINANCE	913	0.88

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,584.70	-2.35
HCLTECH	1,699.90	-2.3
LT	3,579.00	-2.27
HEROMOTOCO	4,247.20	-2.1
M&M	3,136.00	-1.52

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,822
ఎన్ఎస్ఈ	90,775
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,07,339
ఎఫ్ఐఐ	- 1,874
డీఐఐ	+ 5,952

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.36 (రాత్రి 11.30కు)	$ 73.84 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.78 (రాత్రి 11.30కు)	$ 75.84 (క్రితం ముగింపు)

యూరప్ కారు.. తగ్గిన జోరు!



భారత్‌లో అమ్మకాలు అంతంతే...

జాబితాలో రేనాల్ట్, వీడబ్ల్యూ, స్కోడా | మూడేళ్లుగా వాహన అమ్మకాల వెనకడుగు | వెంటో, ర్యాపిడ్, స్కాలా సెడాన్లు డీలా

న్యూఢిల్లీ: ఆటో రంగ యూరోపియన్ దిగ్గజాలు భారత్‌లో వాహన అమ్మకాలు పెంచుకోవడంలో సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. గత మూడేళ్ల డేటా పరిశీలిస్తే రెనాల్ట్, ఫోక్స్‌వేగన్, స్కోడా కార్ల అమ్మకాలు క్షీణిస్తూ వస్తున్నాయి. గ్లోబల్ ఆటోమోటివ్ పరిశ్రమ డేటా, అనలిటిక్స్ అందించే జాటో డైనమిక్స్ గణాంకాల ప్రకారం రెనాల్ట్ అమ్మకాలు అత్యధికంగా నీరసించాయి. 2022-23లో 78,296 వాహనాలు విక్రయించగా.. 2023-24లో 45,349కు క్షీణించాయి. గతేడాది(2024-25) మరింత తగ్గి 37,900 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఈ బాటలో స్కోడా విక్రయాలు సైతం దేశీయంగా 52,269 యూనిట్ల నుంచి 2023-24కల్లా 44,522 వాహనాలకు వెనకడుగు వేశాయి. వీటితో పోలిస్తే గతేడాది అమ్మకాలు 44,866 యూనిట్లకు స్వల్పంగా పెరిగాయి. అయితే ఫోక్స్‌వేగన్ 2022-23లో 41,263 యూనిట్లు విక్రయించగా.. 2023-24కల్లా ఇవి 43,197కు ఎగశాయి. గతేడాది సైతం 42,230 వాహనాలు అమ్ముడయ్యాయి.

ఎస్‌యూవీలు కీలకం

గత మూడేళ్లలో యూరోపియన్ ఆటో దిగ్గజాలకు భారత మార్కెట్లో పలు సవాళ్లు ఎదురైనట్లు జాటో డైనమిక్స్ ఇండియా ప్రెసిడెంట్ రవి జి.భాటియా పేర్కొన్నారు. తొలి దశలో వెంటో, ర్యాపిడ్, స్కాలా తదితర సెడాన్‌లపైనే రేనాల్ట్, వీడబ్ల్యూ, స్కోడా అధిక దృష్టిపెట్టడం అమ్మకాల క్షీణతకు కొంత కారణమైనట్లు తెలియజేశారు. భారత్‌లో వేగవంత వృద్ధిలో ఉన్న ఎస్‌యూవీ విభాగంలో పరిమిత మోడళ్లనే ప్రవేశపెట్టడం ప్రతికూల ప్రభావం చూపినట్లు వివరించారు. వీటికితోడు మోడళ్లలో ఆధునిక వేరియంట్లను ప్రవేశపెట్టడంలో ఆలస్యం అమ్మకాల క్షీణతకు కారణమైనట్లు తెలియజేశారు. అంతేకాకుండా టైర్-2, టైర్-3 పట్టణాలలో తగిన స్థాయిలో నెట్‌వర్క్ విస్తరించకపోవడం వీటికి జత కలసినట్లు ప్రస్తావించారు. మరోవైపు భారతదేశ ప్రత్యేక పన్నుల విధానం కూడా కలసిరాలేదని పేర్కొన్నారు. అంటే సబ్4 మీటర్ల వాహనాలు తక్కువ లెవీల కారణంగా లబ్ధి పొందినట్లు తెలియజేశారు. వెరసి జపనీస్, కొరియన్ కంపెనీలు తక్కువ వ్యయంలో కంపాక్ట్ కార్లను విడుదల చేయడం ద్వారా అమ్మకాలు పెంచుకున్నట్లు తెలియజేశారు. అయితే యూరోపియన్ దిగ్గజాలు సంప్రదాయ పద్ధతిలో భారీ మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా అమ్మకాలు పెంచుకోవడంలో సమస్యలు ఎదుర్కొన్నట్లు వివరించారు.

పన్ను ప్రభావమిలా

ప్రస్తుత ఆటోమోటివ్ పాలసీ ప్రకారం 1200 సీసీ సామర్థ్యంవరకూ 4 మీటర్లలోపుగల ప్యాసింజర్ వాహనాల(పెట్రోల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ)పై 28 శాతం వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) విధిస్తారు. 1 శాతం కాంపెన్సేషన్ సెస్ ఉంటుంది. 4 మీటర్లలోపుగల 1500 సీసీ ప్యాసింజర్ వాహనాల(డీజిల్)పై 28 శాతం జీఎస్‌టీ, 3 శాతం కాంపెన్సేషన్ సెస్ అమలవుతుంది. 4మీటర్లకుపైన 1500 సీసీ ప్యాసింజర్ వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ, 17 శాతం సెస్ వర్తిస్తుంది. ఇక 1500 సీసీకి మించిన వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ, 17 శాతం సెస్ అమలవుతుంది. 4 మీటర్లకు, 1500 సీసీకి మించిన (170 ఎంఎంకు మించిన గ్రౌండ్ క్లియరెన్స్‌గల) ఎస్‌యూవీలపై 28 శాతం జీఎస్‌టీ, 22 శాతం సెస్‌ను విధిస్తారు.

దేశీ దిగ్గజాల దూకుడు

దేశీ దిగ్గజాలు టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాసహా జపాన్ దిగ్గజం మారుతీ సుజుకీ స్థానిక విడిభాగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, త్వరత్వరగా వేరియంట్లను విడుదల చేయడం, సీఎన్‌జీ, హైబ్రిడ్స్, బీఈవీ తదితర ప్రత్యామ్నాయ ఇంధన ఇంజిన్ల మోడళ్లను ప్రవేశపెట్టడం వంటి సానుకూలతలతో అమ్మకాలు పెంచుకుంటూ వచ్చినట్లు భాటియా పేర్కొన్నారు. తద్వారా మార్కెట్ వాటాను కొల్లగొడుతున్నట్లు తెలియజేశారు. అయితే స్కోడా ఇటీవల భారత్ మార్కెట్ కోసమే సబ్ కాంపాక్ట్ ఎస్‌యూవీ 'కైలాక్'ను రూపొందించి విడుదల చేసింది. తద్వారా అమ్మకాలు పెంచుకోవడంపై దృష్టి పెట్టినట్లు భాటియా తెలియజేశారు. యూరోపియన్ దిగ్గజాలు భవిష్యత్‌లో దేశీ తయారీ మోడళ్లను ఎగుమతులకు వినియోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా 4 మీటర్లలోపు వాహనాలు, ఆర్అండ్‌డీ, చౌక వ్యయ ప్లాట్‌ఫామ్స్‌పై దృష్టి పెట్టే వీలున్నట్లు వివరించారు. తద్వారా తిరిగి వాహన అమ్మకాల్లో నిలకడైన వృద్ధిని కొనసాగించే వీలున్నట్లు అంచనా వేశారు.

డిక్సన్ టెక్నాలజీస్‌లో వాటా విక్రయం

డీల్ విలువ రూ. 2,221 కోట్లు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్(ఇండియా) ప్రమోటర్ సునీల్ వాచని కంపెనీలో 2.77 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 13,301.47 సగటు ధరలో 16.7 లక్షల షేర్లను అమ్మివేశారు. తద్వారా రూ. 2,221 కోట్లకుపైగా అందుకున్నారు. బీఎస్ఈ బల్క్ డీల్ గణాంకాల ప్రకారం కంపెనీ చైర్‌పర్సన్ సునీల్ వాటా దీంతో డిక్సన్‌లో 5.34 శాతం నుంచి 2.57 శాతానికి క్షీణించింది. మొత్తం ప్రమోటర్ల వాటా 32.27 శాతం నుంచి 29.5 శాతానికి దిగివచ్చింది. కాగా.. మోతీలాల్ ఓస్వాల్ ఎంఎఫ్ రెండు దశలలో 2.39 శాతం వాటాకు సమానమైన 14.45 లక్షల డిక్సన్ షేర్లను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 13,308 సగటు ధరలో ఇందుకు రూ. 1,924 కోట్లు వెచ్చించింది. ఈ లావాదేవీ తదుపరి డిక్సన్ టెక్నాలజీస్‌లో మోతీలాల్ ఎంఎఫ్ వాటా 2.24 శాతం నుంచి 4.63 శాతానికి ఎగసింది. ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో కంపెనీ నికర లాభం రూ. 97 కోట్ల నుంచి రూ. 465 కోట్లకు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఇందుకు కన్సాలిడేటెడ్ ఆదాయం రెట్టింపునకు పైగా జంప్‌చేసి రూ. 10,293 కోట్లకు చేరడం సహకరించింది. 2023-24లో రూ. 4,658 కోట్ల ఆదాయం మాత్రమే సాధించింది. పూర్తి ఏడాదికి(2024-25) ఆదాయం రూ. 17,691 కోట్ల నుంచి రూ. 38,860 కోట్లకు బలపడగా.. కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 375 కోట్ల నుంచి రూ. 1,233 కోట్లకు ఎగసింది.

బల్క్ డీల్ నేపథ్యంలో డిక్సన్ టెక్ షేరు బీఎస్ఈలో 3.6 శాతం జంప్‌చేసి రూ. 14,554 వద్ద ముగిసింది.

రేర్ ఎర్త్ ఆంక్షలతో ఉపాధికి దెబ్బ

ఆడియో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 21,000 ఉద్యోగాలపై ఎఫెక్ట్



న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ మెటల్స్ ఎగుమతిపై చైనా ఆంక్షలు విధించడంతో దేశీయంగా ఈ ప్రభావం ఆటోమొబైల్స్‌సహా పలు రంగాలపై కనిపించనుంది. ఈ ప్రభావంతో ఆడియో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 21,000 ఉద్యోగాలు రిస్క్‌లో పడనున్నట్లు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల సమాఖ్య ఎల్సినా.. ప్రభుత్వానికి నివేదించింది. ఏప్రిల్‌లో టెర్బియం, డిస్‌ప్రోజియం తదితర రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఎగుమతిపై చైనా కఠిన ఆంక్షలకు తెరతీసింది. వీటిలో అధిక నాణ్యతగల(హైపెర్ఫార్మెన్స్) ఎన్‌డీఎఫ్ఈబీ(నియోడైమియం-ఐరన్-బోరన్) మ్యాగ్నెట్లు తదితరాలున్నాయి. ఇవి ప్రధానంగా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో వినియోగించే కీలక ముడిసరుకులు కావడంతో ఈ ప్రభావం దేశీయంగా కనిపిస్తోంది. వీటి సరఫరాలకు విఘాతం కలగడంతో దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న వాచీలు, వినికిడి సంబంధిత(ఇయర్ ఫోన్స్, బడ్స్) ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ దెబ్బతింటున్నట్లు ఎల్సినా పేర్కొంది. దీంతో పూర్తిస్థాయిలో తయారైన స్పీకర్ మాడ్యూల్స్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తున్నట్లు తెలియజేసింది. దీంతో ఎలక్ట్రానిక్ వస్తు తయారీకి విఘాతం కలగడమేకాకుండా దిగుమతులపై అధికంగా ఆధారపడవలసిన పరిస్థితులు తలెత్తుతున్నట్లు వివరించింది. ఫలితంగా స్పీకర్, ఆడియో విడిభాగాల పరిశ్రమపై ఆధారపడిన 5,000-6,000 ప్రత్యక్ష ఉద్యోగాలకుతోడు పరోక్షంగా 15,000మంది ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలతోపాటు నోయిడాలో ఉపాధి కల్పన దెబ్బతినే వీలున్నట్లు పేర్కొంది.

కోల్గేట్ ఇండియా నుంచి కొత్త బ్రాండ్లు

అంతర్జాతీయ పోర్ట్‌ఫోలియో నుంచి విడుదల

వృద్ధికి బలమైన అవకాశాలున్నాయి

సంస్థ ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్



న్యూఢిల్లీ: కోల్గేట్ (పామోలివ్) ఇండియా భారత మార్కెట్లో తన పోర్ట్‌ఫోలియో, వ్యాపార విస్తరణపై బలమైన అంచనాలతో ఉంది. సంస్థ అంతర్జాతీయ పోర్ట్‌ఫోలియో నుంచి మరిన్ని బ్రాండ్లను భారత్‌లో విడుదల చేయాలనుకుంటున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో ప్రభా నరసింహన్ ప్రకటించారు. కోల్గేట్, పామోలివ్ బ్రాండ్లపై ఈ సంస్థ నోటి సంరక్షణ, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను విక్రయిస్తుండడం తెలిసిందే. మరిన్ని బ్రాండ్లను తీసుకురావడంపై మాతృ సంస్థతో చర్చిస్తున్నట్టు నరసింహన్ తెలిపారు. ప్రస్తుత బ్రాండ్లతోపాటు కొత్త బ్రాండ్ల పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నట్టు చెప్పారు. పామోలివ్ బ్రాండ్‌పై ప్రీమియం బాడీ వాష్, హ్యాండ్ వాష్ విక్రయిస్తుండగా, ఏటా ఈ విభాగం 20-30 శాతం కాంపౌండెడ్ వృద్ధి నమోదు చేయగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు సంస్థ భవిష్యత్ ప్రణాళికల గురించి ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. పామోలివ్ బ్రాండ్‌పై మరిన్ని విభాగాల్లో ఉత్పత్తులను ఆవిష్కరించడం గురించి ప్రశ్నించగా.. అంతర్జాతీయంగా తమ పోర్ట్‌ఫోలియోలో ఎన్నో ఉత్పత్తులు ఉన్నాయని వివరిస్తూ.. మరిన్ని బ్రాండ్లను ప్రవేశపెట్టడంపైనే తాము దృష్టి సారించినట్టు ఆమె చెప్పారు. ఇక్కడి వినియోగదారుల అవసరాలకు సరిపోలే ఉత్పత్తులను తీసుకువస్తామని ప్రకటించారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే కోల్గేట్ పామోలివ్ 88 ఏళ్లుగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం. అంతర్జాతీయ ఆదాయంలో 4-5 శాతం భారత్ నుంచే వస్తోంది.

భారత మార్కెట్ ఎంతో కీలకం

140 కోట్ల జనాభా కలిగిన భారత్ మార్కెట్.. కోల్గేట్ పామోలివ్ అంతర్జాతీయ వృద్ధికి కీలకమని ప్రభా నరసింహన్ తెలిపారు. రానున్న రోజుల్లో భారత్ వాటా మరింత పెరుగుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కోల్గేట్‌కు అంతర్జాతీయంగా టాప్-5 మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే కొన్నేళ్లలో భారత్‌లో మధ్యతరగతి ప్రజలు గణనీయంగా పెరగనుండడం తమకు అద్భుతమైన అవకాశాలను తెచ్చిపెడుతుందన్న సంస్థ అంతర్జాతీయ సీఈవో ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. వేగంగా వృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ చానళ్లపై మరిన్ని డిజిటల్ ఫస్ట్ బ్రాండ్లను ఆవిష్కరించనున్నట్టు ప్రభా నరసింహన్ తెలిపారు. కోల్గేట్ పర్పుల్, మ్యాక్స్ ఫ్రెష్ సెన్సోరీస్ శ్రేణి, మౌత్ వాష్‌లను కోల్గేట్ ఇటీవల విడుదల చేయడం గమనార్హం. మరిన్ని ఉత్పత్తులు విడుదల ప్రణాళికతో ఉన్నట్టు ఆమె చెప్పారు. అయితే సంప్రదాయ కిరాణా స్టోర్లు తమ వ్యాపార వృద్ధికి కీలకమని పేర్కొన్నారు. క్విక్‌కామర్స్ ఛానళ్లకు అనుకూలంగా ఆన్‌లైన్‌లో అధిక డిస్కౌంట్లు ఇస్తుండడంతో కోల్గేట్ పామోలివ్ ఇండియా ఉత్పత్తులను మహారాష్ట్రలో బహిష్కరించాలంటూ అఖిల భారత ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పంపిణీదారుల సంఘం ఇటీవలి ఇచ్చిన పిలుపుపై స్పందిస్తూ.. అన్ని ఛానళ్లూ వృద్ధి చెందేందుకు తగినన్ని అవకాశాలున్నట్టు అభిప్రాయపడ్డారు.


వినియోగం పుంజుకుంటుంది..

ఈ ఏడాది చివరికి పట్టణ వినియోగం పుంజుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రభా నరసింహన్ వ్యక్తం చేశారు. గ్రామీణ వినియోగ మార్కెట్ బలంగా ఉందంటూ, అదే వృద్ధి ఇకముందూ కొనసాగుతుందన్నారు. ''కోల్గేట్ ఉత్పత్తులకు పట్టణ మార్కెట్ ఎంతో కీలకంగా ఉంది. సానుకూల స్థూల ఆర్థిక పరిస్థితులకు తోడు, ఇటీవలి ప్రభుత్వం ప్రకటించిన చర్యలు పట్టణ వినియోగానికి మద్దతుగా నిలుస్తాయి. జనాభాతో పోల్చి చూస్తే గ్రామీణ మార్కెట్ పరిమాణం ఎంతో చిన్నగా ఉంది. తగిన నోటి సంరక్షణ ఉత్పత్తులతో మరిన్ని అవకాశాలను సొంతం చేసుకోగలం''అని వివరించారు. మాస్ మార్కెట్‌తోపాటు ప్రీమియం విభాగాలపై తమ దృష్టి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఇండోగల్ఫ్ క్రాప్ @ రూ. 105-111

ఈ నెల 26-30 మధ్య ఐపీవో

రూ. 200 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: సస్య రక్షణ ఉత్పత్తుల కంపెనీ ఇండోగల్ఫ్ క్రాప్‌సైన్సెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 105-111 ధరల శ్రేణి ప్రకటించింది. గురువారం (26న) ప్రారంభంకానున్న ఇష్యూ సోమవారం(30న) ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 160 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 36.03 లక్షల షేర్లను ప్రమోటర్లు ఓమ్ ప్రకాష్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్ విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 200 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు బుధవారం(25న) షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 135 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 65 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 34 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మరో రూ.14 కోట్లు పెట్టుబడి వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 1993లో ఏర్పాటైన కంపెనీ పంటల రక్షణ ప్రొడక్టులతోపాటు మొక్కల పోషకాలు, బయోలాజికల్స్‌ను తయారు చేస్తోంది. 2024 డిసెంబర్31తో ముగిసిన తొలి 9 నెలల్లో రూ. 464 కోట్ల ఆదాయం, దాదాపు రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది.

పైప్‌లైన్‌పై గెయిల్ రూ. 844 కోట్లు పెట్టుబడి



న్యూఢిల్లీ: పెరుగుతున్న ఇంధన డిమాండ్‌కి తగ్గట్లుగా సరఫరా సామర్థ్యాలను పెంచుకునే దిశగా రూ. 844 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు ప్రభుత్వ రంగ గ్యాస్ సంస్థ గెయిల్ ఇండియా వెల్లడించింది. దహేజ్-ఉరన్-దభోల్-పాన్‌వెల్ సహజ వాయువు పైప్‌లైన్‌పై ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. ప్రస్తుతం దీని సామర్థ్యం రోజుకు 19.9 మిలియన్ ఘనపు మీటర్లుగా (ఎంసీఎండీ) ఉండగా వచ్చే మూడేళ్లలో దీన్ని 22.5 ఎంసీఎండీకి పెంచుకోనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు గెయిల్ తెలియజేసింది. మరోవైపు, 1,702 కిలోమీటర్ల ముంబై-నాగ్‌పూర్-ఝర్సుగూడ పైప్‌లైన్ ప్రాజెక్టును పూర్తి చేసే గడువు తేదీని ఈ ఏడాది జూన్ 30 నుంచి సెప్టెంబర్ 30కి పెంచినట్లు వివరించింది. దీనికి అదనంగా రూ. 411.12 కోట్లు అవసరమవుతాయని, ఫలితంగా ప్రాజెక్టు వ్యయం ముందుగా అంచనా వేసిన రూ. 7,844.25 కోట్ల కన్నా అధికంగా రూ. 8,255.37 కోట్లకు చేరుతుందని గెయిల్ పేర్కొంది. అటు 774 కిలోమీటర్ల శ్రీకాకుళం-అంగుల్ పైప్‌లైన్ ప్రాజెక్టు గడువును కూడా 2025 జూన్ నుంచి డిసెంబర్‌కి సవరించినట్లు వివరించింది. అటవీ శాఖ నుంచి అనుమతులు రావడంలో జాప్యం కారణంగా పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రభావం పడినట్లు పేర్కొంది.

రిలయన్స్ ఇన్‌ఫ్రా రుణ చెల్లింపులు

యస్ బ్యాంక్‌కు రూ. 273 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా సొంత అనుబంధ సంస్థ జేఆర్ టోల్ రోడ్ ప్రయివేట్(జేఆర్‌టీఆర్) ద్వారా రూ. 273 కోట్ల రుణాన్ని చెల్లించింది. తాజా చెల్లింపులతో ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్‌తో మొత్తం రుణాన్ని సెటిల్ చేసుకున్నట్లు వెల్లడించింది. దీంతో జేఆర్‌టీఆర్‌కు సంబంధించి యస్ బ్యాంక్ రుణాలకు హామీదారు బాధ్యతల నుంచి బయటపడినట్లు తెలియజేసింది. వెరసి యస్ బ్యాంక్ ప్రస్తుతం సంబంధిత పార్టీగా లేదా ప్రమోటర్‌గా కంపెనీ షేర్లను కలిగి లేదని తెలియజేసింది. ఈ నేపథ్యంలో రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు బీఎస్ఈలో 1.3 శాతం బలపడి రూ. 378 వద్ద ముగిసింది.

అదానీ గ్రూప్ తొలి ఆఫ్-గ్రిడ్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు



న్యూఢిల్లీ: దేశీయంగా తొలి ఆఫ్-గ్రిడ్ 5 మెగావాట్ హరిత హైడ్రోజన్ ప్లాంటును పైలట్ ప్రాతిపదికన గుజరాత్‌లోని కచ్‌లో ఏర్పాటు చేసినట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లక్ష్య సాధన దిశగా ఇదొక కీలక మైలురాయని ఒక ప్రకటనలో తెలిపింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో భాగమైన అదానీ న్యూ ఇండస్ట్రీస్ (ఏఎన్ఐఎల్) ఈ ప్లాంటును ఏర్పాటు చేసింది. గ్రీన్ అమోనియా, గ్రీన్ మెథనాల్, పర్యావరణహిత ఏవియేషన్ ఇంధనం, హరిత హైడ్రోజన్ మొదలైన ఉత్పత్తుల కోసం ఏఎన్ఐఎల్ భారీ స్థాయిలో ప్లాంట్లను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. పవన, సౌర విద్యుత్‌లాంటి పునరుత్పాదక ఇంధన వనరుల దన్నుతో నిర్దిష్ట ప్రక్రియ ద్వారా హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంటును ఆఫ్-గ్రిడ్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌గా వ్యవహరిస్తారు. హైడ్రోజన్ ఉత్పత్తి ప్రక్రియ కోసం అవసరమయ్యే పునరుత్పాదక ఇంధనాలను ప్లాంటు సొంతంగా తయారు చేసుకుంటుంది.



ఆటకు హాకీ స్టార్ లలిత్ బైబై

రెండు ఒలింపిక్ పతకాల జట్టులో ఫార్వర్డ్‌గా రాణింపు

దశాబ్దపు కెరీర్‌లో 67 గోల్స్‌తో సత్తా





టోక్యో ఒలింపిక్స్ కాంస్యంతో... పారిస్ ఒలింపిక్స్ కాంస్యంతో... ఆసియా క్రీడల స్వర్ణంతో...

న్యూఢిల్లీ: భారత వెటరన్ హాకీ ఆటగాడు లలిత్ ఉపాధ్యాయ్ అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్‌లలో కాంస్య పతకం గెలుపొందిన భారత జట్టులో ఫార్వర్డ్ ప్లేయర్‌గా కీలకపాత్ర పోషించాడు. పదేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన 31 ఏళ్ల లలిత్ భావించాడు. 2014 ప్రపంచకప్ ద్వారా అంతర్జాతీయ కెరీర్‌లో అడుగుపెట్టిన ఈ స్టార్ ఫార్వర్డ్ ఆటగాడు జట్టు విజయాల్లో తన వంతు పాత్రను నిలకడగా పోషించేవాడు. ఆటలో దూకుడు కనబరిచే అతను తన ప్రవర్తనతో జెంటిల్‌మన్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. తాజా సీజన్ ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌లో ఆదివారం బెల్జియంతో మ్యాచ్ అనంతరం లలిత్ ఉపాధ్యాయ్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. 'కేవలం అరకొర వసతులుండే ఓ మారుమూల పల్లెతో మొదలైన నా పయనం సుదీర్ఘకాలం కొనసాగడమే కాదు... నా కలల్ని సాకారం చేసింది. అన్నింటికి మించి దేశం తరఫున ఆడటం గొప్ప గౌరవాన్నిచ్చింది. రెండు సార్లు పోడియంపై నిల్చోని ఒలింపిక్ పతకాలు అందుకోవడం అంతులేని ఆనందాన్నిచ్చింది' అని తన రిటైర్మెంట్ సందేశంలో పేర్కొన్నాడు. అలనాటి హాకీలో ఘనమైన కీర్తిని గడించిన భారత జట్టు... ఆధునిక హాకీలో మాత్రం వెనుకబడింది. ఇలా ఎన్నో ఏళ్ల తర్వాత భారత హాకీ జట్టు ఎట్టకేలకు 2021 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో పోడియంలో మువ్వన్నెల జెండాను సగర్వంగా ఎగిరేలా చేసింది. తదుపరి పారిస్ విశ్వక్రీడల్లోనూ ఈ పతకాన్ని నిలబెట్టుకుంది. ఈ రెండు సందర్భాల్లోనూ లలిత్ ఉపాధ్యాయ్ కేవలం జట్టు సభ్యుడి పాత్రకే పరిమితం కాకుండా... ఫార్వర్డ్‌లో నిలకడను ప్రదర్శించి జట్టు విజయానికి దోహదం చేసిన వారిలో ఒకడిగా నిలిచాడు. పదేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 183 అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన లలిత్ 67 గోల్స్ సాధించాడు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (2016, 2018), ఆసియా కప్ (2017) విజయాలతో పాటు, హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్స్ (2017)లో కాంస్యం, 2018 చాంపియన్స్ ట్రోఫీ (2018)లో రజతం, ఆసియా క్రీడలు (2018)లో కాంస్యం, 2022లో స్వర్ణం గెలిచిన జట్టులో ఫార్వర్డ్ ప్లేయర్‌గా పలు గోల్స్ సాధించాడు. ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ (2021-22)లో మూడో స్థానంలో నిలిచిన టీమిండియా ప్లేయర్‌గాను ఉన్నాడు. హాకీ మైదానంలో అతని ప్రదర్శన భారత్‌కు గోల్స్, పతకాలు తెచ్చిపెడితే... అతని కృషికి భారత ప్రభుత్వం 2021లో అర్జున అవార్డుతో సత్కరించింది.

కెరీర్ హైలైట్స్

2020	ఒలింపిక్స్	కాంస్యం
2024	ఒలింపిక్స్	కాంస్యం
2022	ఆసియా క్రీడలు	స్వర్ణం
2018	ఆసియా క్రీడలు	కాంస్యం
2022	కామన్వెల్త్ క్రీడలు	రజతం
2018	ఆసియా చాంపియన్స్ ట్రోఫీ	స్వర్ణం
2016	ఆసియా చాంపియన్స్ ట్రోఫీ	స్వర్ణం
2021	అర్జున పురస్కారం	

భారత్ 13 మంగోలియా 0

- ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో టీమిండియా శుభారంభం
- రెండు గోల్స్‌తో మెరిసిన సౌమ్య గుగులోత్



సౌమ్య గుగులోత్

చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): ఆసియా కప్-2026 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'బి'లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 13-0 గోల్స్ తేడాతో మంగోలియా జట్టును చిత్తు చేసింది. భారత్ తరఫున ప్యారీ జక్సా ఐదు గోల్స్ (29వ, 45వ, 46వ, 52వ, 55వ నిమిషాల్లో)తో అదరగొట్టగా... తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ (20వ, 59వ నిమిషాల్లో), ప్రియదర్శిని సెల్లాదురై (73వ, 86వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. సంగీత (8వ నిమిషంలో), రింపా హల్దర్ (67వ నిమిషంలో), మాళవిక (71వ నిమిషంలో), గ్రేస్ డాంగ్మె (75వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. గోల్స్ పరంగా ఆసియా కప్ చరిత్రలోనే భారత జట్టుకిది అతిపెద్ద విజయం కావడం విశేషం. 1997లో, 2005లో గ్వామ్ జట్టుపై భారత్ 10-0 గోల్స్ తేడాతో గెలిచింది. తాజా ఫలితంతో భారత జట్టు తమ రికార్డును మెరుగుపర్చుకుంది. గత సీజన్‌లో 'భారత ఉత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారిణి' అవార్డు గెల్చుకున్న సౌమ్య అందించిన పాస్‌ను లక్ష్యానికి చేర్చి సంగీత భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత రింపా క్రాస్ పాస్‌ను హెడర్ షాట్‌తో సౌమ్య గోల్‌గా మలిచింది. విరామ సమయానికి ముందు ప్యారీ జక్సా రెండు గోల్స్ చేయడంతో భారత్ తొలి అర్ధభాగం ముగిసేసరికి 4-0తో ముందంజ వేసింది. రెండో అర్ధభాగంలో భారత్ మరింత దూకుడును పెంచింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 29న తిమోర్ లెస్టె జట్టుతో ఆడుతుంది. చివరిసారి భారత జట్టు 2003లో ఆసియా కప్ ప్రధాన టోర్నీలో ఆడింది.

నా లక్ష్యం... 'టోక్యో స్వర్ణం'

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా



ఒస్ట్రావా (చెక్ రిపబ్లిక్): భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో తన ప్రధాన లక్ష్యం ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిలే అని స్పష్టం చేశాడు. చోప్రా తను ఆశించిన 90 మీటర్ల మార్క్‌తో కాకపోయినా... పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్ల దూరంలో ఈటెను విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. తాజాగా ఇక్కడ జరిగే 'గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్'లో పాల్గొనేందుకు వచ్చిన భారత స్టార్ మరో విజయంపై కన్నేశాడు. రెండు ఒలింపిక్ పతకాల విజేత అయిన నీరజ్ తన ప్రదర్శనకు చెక్ రిపబ్లిక్ గ్రేట్ జాన్ జెలెజ్నీ కోచింగ్ ఎంతో దోహదం చేసిందని అన్నాడు. అతని శిక్షణలోనే రాటుదేలిన 27 ఏళ్ల భారత స్టార్ ఈ సీజన్‌లో జరిగిన ప్రారంభ దోహా డైమండ్ లీగ్‌లో తొలిసారిగా 90 మీటర్ల మార్క్‌ను అందుకున్నాడు. ఈ నేపథ్యంలో చోప్రా మాట్లాడుతూ 'మేటి అథ్లెట్, కోచ్ అయిన జెలెజ్నీతో కలిసి పనిచేయడం చాలా సంతోషానిస్తోంది. ఆయన ఇచ్చిన సూచనలు, కిటుకులతోనే ఈ ఏడాది 90 మీటర్ల మార్క్‌ను దాటేశాను. దీన్ని పునరావృతం చేయడంపై దృష్టిసారించాను. ఇక్కడి నైంబర్క్‌లో అహ్లాదకర వాతావరణంలో ట్రెయినింగ్ సెషన్ పూర్తిచేశాను. తప్పకుండా ఒస్ట్రావాలో నా శక్తి మేర రాణిస్తాను. అయితే నా ప్రధాన లక్ష్యం మాత్రం టోక్యోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నెగ్గడమే. ఇందుకోసమే క్రమం తప్పకుండా చెమటోడ్చుతున్నాను. తీరిక లేకుండా ఇటు ట్రెయినింగ్ సెషన్స్, అటు డైమండ్ లీగ్‌లలో పోటీపడుతున్నా' అని అన్నాడు. ఈ సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు టోక్యోలో ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లోనే స్వర్ణం గెలుపొందిన తొలి భారతీయ అథ్లెట్ అక్కడ మరో పతకాన్ని ఆశిస్తున్నాడు. ప్రస్తుతం ఒస్ట్రావా మీట్‌కు రావడం చాలా ఆనందంగా ఉందని చోప్రా అన్నాడు. ఒకప్పుడు ఇక్కడ జరిగే పోటీల్లో గ్రేటెస్ట్ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ పోటీని టీవీల్లో చూసి మురిసేవాడినని ఇప్పుడు అదే వేదికపై తాను పోటీ పడుతున్నానని చెప్పుకొచ్చాడు. మంగళవారం ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్ జరుగుతుంది.

ప్రణతి 'పసిడి' పరుగు



ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్): జాతీయ జూనియర్ అండర్-20 ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సోమవారం తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి ఎర్రోళ్ల ప్రణతి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ప్రణతి 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 14.42 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. షైనీ (తమిళనాడు; 14.44 సెకన్లు) రజతం, నేహాలి (మహారాష్ట్ర; 14.98 సెకన్లు) కాంస్యం గెలిచారు.

రిత్వికకు స్వర్ణం



భువనేశ్వర్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో రెండో పతకం చేరింది. టోర్నీ రెండో రోజు సోమవారం తెలంగాణకు చెందిన మిట్టపల్లి రిత్విక స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన రిత్విక విజేతగా నిలిచింది. రిత్విక 33.98 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. హర్షిత జయరామ్ (రైల్వేస్; 34.21 సెకన్లు) రజతం...అవని చాబ్రా (పంజాబ్; 34.51 సెకన్లు) కాంస్యం గెలిచారు. టోర్నీ తొలిరోజు ఆదివారం మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తెలంగాణ స్విమ్మర్ వ్రిత్తి అగర్వాల్ కాంస్య పతకాన్ని సాధించింది.

ముంబైని వీడిన పృథ్వీ షా

- త్వరలో మహారాష్ట్ర తరఫున దేశవాళీ బరిలోకి!
- ఎన్‌ఓసీ జారీ చేసిన ఎంసీఏ



ముంబై: భారత క్రికెట్‌లో మెరుపులా వచ్చివెళ్లిన యువ బ్యాటర్ పృథ్వీ షా తాజాగా ముంబై జట్టును వీడాడు. ఈ మేరకు మరో జట్టుతో ఆడేందుకు వీలుగా తనకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సిందిగా ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ)ను అభ్యర్థించాడు. అతని క్రికెట్ భవిష్యత్తు కోసం పృథ్వీ షా అభ్యర్థనను మన్నించిన ముంబై సంఘం ఎన్‌ఓసీ జారీ చేసింది. ఇదివరకే మహారాష్ట్ర సంఘంతో సంప్రదింపులు జరిపిన అతను ఈ సీజన్‌లో మహారాష్ట్ర క్రికెట్ జట్టు తరఫున దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగనున్నాడు. అంతర్జాతీయ కెరీర్‌లో టీమిండియా తరఫున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు ఆడాడు. చివరిసారిగా ముంబై తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ మాత్రమే ఆడాడు. అందులోనూ పెద్దగా మెరుపుల్లేకపోవడంతో ఎంసీఏ అతన్ని పూర్తిగా పక్కనబెట్టేసింది. అలా ఓ సీజన్ అంతా తుడిచిపెట్టుకుపోయిన తర్వాత కళ్లు తెరిచిన పృథ్వీ షా ఈ సీజన్‌లో ముంబై తరఫున అవకాశం రాదని గుర్తించాడు. దీంతో మరో జట్టును సంప్రదించిన మీదట ఎన్‌ఓసీ కోసం ముంబై సంఘాన్ని కోరాడు. ఈ సందర్భంగా ఎంసీఏ కూడా హుందాగా వ్యవహరించి అతను తమ దేశవాళీ జట్టుకు అందించిన సేవల్ని కొనియాడింది. ఎంసీఏ కార్యదర్శి అభయ్ హడప్ యువ క్రికెటర్ భవిష్యత్తులో రాణించాలని అభిలషించారు. దీనికి ప్రతిగా పృథ్వీ కూడా కృతజ్ఞత చాటుకున్నాడు. తనకెన్నో అవకాశాలచ్చిన ముంబై ద్వారానే నేను క్రికెట్‌కు పరిచయమయ్యానని చెప్పుకొచ్చాడు.

ఏడాదిగా... ఖాళీగా...

క్రికెట్‌లోకి వచ్చీరాగానే యువ కెరటంగా మారిన పృథ్వీ షా దిగ్గజాలు సునీల్ గావస్కర్, సచిన్ సహా పలువురి మన్ననలు పొందాడు. ఎంత వేగంగా వెలిగాడో... కానీ ఆటపై కొరవడిన ఆసక్తి, ఫామ్‌పై అలసత్వం, క్రమశిక్షణ రాహిత్యం, ఫిట్‌నెస్ సమస్యలతో అంతే వేగంగా కుంగాడు. మొదట టీమిండియాకు ఎప్పుడో దూరమయ్యాడు. తర్వాత ఐపీఎల్‌కు భారమయ్యాడు. తాజాగా సొంత జట్టు ముంబైకి అవసరం లేకుండా పోయాడు. క్రమంగా ఏ జట్టు అక్కున చేర్చుకోలేకపోవడంతో పూర్తిగా ఏడాదికిపైగానే ఖాళీగా ఉంటున్నాడు. మితిమీరిన శరీర బరువుతో సతమతమవుతున్న పృథ్వీ షా ముంబై జట్టులో స్థానం కోల్పోయాక... ఇప్పుడు మహారాష్ట్ర పంచన చేరేందుకు సిద్ధమయ్యాడు.

'టాప్స్' గ్రూప్‌లో నిత్య

జ్యోతి సురేఖకు ఆర్థిక సాయం



నిత్య


న్యూఢిల్లీ: తెలంగాణ అథ్లెట్ నిత్య గంధే కొత్తగా టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) అవకాశం దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు అధునాతన విల్లు కొనేందుకు 'టాప్స్' కింద ఆర్థిక సాయం చేయనుంది. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) తాజాగా ప్రకటించిన ఈ జాబితాలో స్టార్ డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్‌కూ చోటు దక్కింది. ఇటీవల జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో తేజస్విన్ రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లోనే నిత్య సభ్యురాలిగా ఉన్న భారత మహిళల బృందం 4-100 మీటర్ల రిలేలో రజత పతకాన్ని గెలుచుంది. అమెతో పాటు పతక విజేతలైన అభినయ, స్నేహ, శ్రాబనిలను కూడా 'టాప్స్'లో చేర్చారు. దక్షిణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా పోటీల్లో 200 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచిన 22 ఏళ్ల స్ప్రింటర్ అనిమేశ్ కుజూర్, స్వర్ణ విజేత హైజంపర్ పూజ, సెబాస్టియన్ (రేస్ వాకింగ్), విత్య (హర్డిల్స్), సచిన్ (జావెలిన్ త్రో), యూనుస్ (రన్నర్)లను 'టాప్స్'లో కొత్తగా చేర్చారు. ఈ ఏడాది ఆరంభంలో 179 మంది ఉన్న టాప్స్ కోర్ గ్రూప్ జాబితాను 94 మందికే పరిమితం చేయగా... తాజాగా ఆసియా చాంపియన్‌షిప్‌లో మెరిసిన అథ్లెట్లకు టాప్స్ సాయం లభించనుంది. సురేఖ సహా పర్నీత్, ప్రియాన్ష్‌లకు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ సన్నాహాల కోసం అధునాతన సామాగ్రిని కొనుగోలు చేసేందుకు రూ.11.90 లక్షలు అందజేయనుంది.

భారత్ 'పంచ్' అదిరింది



న్యూఢిల్లీ: సీషెల్స్ నేషనల్ డే అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. బరిలోకి దిగిన ఏడు వెయిట్ కేటగిరీల్లోనూ పతకాలు సాధించారు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్య పతకం ఉన్నాయి. హిమాన్షు శర్మ (50 కేజీలు), ఆశిష్ ముద్హానియా (55 కేజీలు), గౌరవ్ చౌహాన్ (ప్లస్ 90 కేజీలు) పసిడి పతకాలు గెల్చుకున్నారు. ఫైనల్లో ఓడిన అన్‌మోల్ (60 కేజీలు), ఆదిత్య యాదవ్ (65 కేజీలు), నీరజ్ (75 కేజీలు) రజత పతకాలు కైవసం చేసుకున్నారు. సెమీఫైనల్లో ఓడిన కార్తీక్ దలాల్‌కు కాంస్య పతకం దక్కింది.

సుమిత్ నగాల్‌కు నిరాశ



లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఈసారి సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ప్రాతినిధ్యం ఉండటం లేదు. గత ఏడాది మెయిన్ 'డ్రా'లో పోటీపడ్డ భారత నంబర్‌వన్, ప్రపంచ 294వ ర్యాంకర్ సుమిత్ నగాల్ ఈసారి క్వాలిఫయింగ్ దశలోనే ఇంటిముఖం పట్టాడు. సోమవారం మొదలైన వింబుల్డన్ క్వాలిఫయింగ్ టోర్నీలో సుమిత్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. 353వ ర్యాంకర్ గిలియో జెపెరి (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో సుమిత్ 2-6, 6-4, 2-6తో ఓడిపోయాడు. 99 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయిన సుమిత్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 15,500 బ్రిటిష్ పౌండ్లు (రూ. 18 లక్షల 14 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



ప్రాణాలకు తెగించి స్మగ్లర్ల డింగీ బోట్‌లో ఇంగ్లిష్ చానెల్ మీదుగా ఫ్రాన్స్ దిశగా వెళ్తున్న వలసదారులు వీళ్లంతా



గ్రీస్ దేశాన్ని కార్చిచ్చు దహించి వేస్తోంది. తూర్పు ఏజియన్ సముద్రం చియోస్ దీవిలోని కర్యేస్ గ్రామం మొత్తాన్ని మంటలు కబళించి వేస్తున్న దృశ్యమిది



ఆగ్రాలోని ప్రపంచ ప్రఖ్యాత తాజ్ మహల్ సముదాయం వద్ద సోమవారం వర్షం కురుస్తుండగా ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న పర్యాటకులు

పహల్గాంలో పర్యాటకుల సందడి

ఉత్సాహభరితమైన దృశ్యాలను పంచుకున్న సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: ఏప్రిల్‌లో ఉగ్రదాడి తరువాత పహల్గాం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. పర్యాటకుల సందడి పెరిగింది. ఈ నెలలోనే రెండోసారి పహల్గాం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పర్యాటలతో రద్దీగా ఉన్న పహల్గాం వీధులను, ట్రాఫిక్ జామ్ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ఆదివారం రాత్రి షేర్ చేశారు. పర్యాటక పునరుజ్జీవనం కోసం చేస్తున్న ప్రయత్నాలు నెమ్మదిగా ఫలిస్తున్నాయని చెప్పారు. ఉగ్రవాద దాడి తర్వాత ఏర్పడిన నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ పర్యాటకులు తిరిగి రావడం సంతోషాన్నిస్తోందన్నారు. 'నేను లాస్ట్ టైమ్ పహల్గాం వచ్చినప్పుడు మార్కెట్‌లో సైకిల్‌పై తిరిగితే దాదాపు ఎడారిగా కనిపించింది. కానీ ఈరోజు సందడిగా ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. స్థానిక పిక్నిక్ స్థలాల కోసం పోటీ పడ్డారు. నేను, నా సహోద్యోగులు చేసిన ప్రయత్నాలు ఫలించడం సంతృప్తికరంగా ఉంది' అని ఎక్స్‌లో ఒమర్ పేర్కొన్నారు.

ఆ ఇద్దరికీ ఐదు రోజుల రిమాండ్

జమ్మూ: ఏప్రిల్‌లో పహల్గాంలో 26 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులకు స్థానిక కోర్టు ఐదు రోజుల రిమాండ్ విధించింది. రెండు రోజుల క్రితం ఎన్ఐఏ అధికారులు పహల్గాంలోని బట్‌కొటెకు చెందిన పర్వేజ్ అహ్మద్ జొతార్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జొతార్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం వీరిని కోర్టులో హాజరు పరిచారు. తాము ఆశ్రయం కల్పించిన ముగ్గురు ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందిన నిషేధిత లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ సభ్యులనే విషయం తమకు తెలుసని వీరిద్దరూ విచారణ సందర్భంగా వెల్లడించారు. దాడికి ముందు ఉగ్రవాదులు ముగ్గురూ హిల్ పార్క్ ప్రాంతంలో వీరు చూపించిన గుడిసెలోనే మకాం వేసినట్లు తేలింది. ఉగ్రవాదులకు వీరు ఆహారంతోపాటు రవాణాకు వాహనం సమకూర్చారని కూడా వెల్లడైంది.

అధిక బరువును మోస్తున్న భారత్

సాక్షి, న్యూఢిల్లీ: భారత్‌లో స్థూలకాలయం పెను సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా ప్రజలను అధిక బరువు, ఊబకాయం పట్టిపీడిస్తున్నాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్(ఎన్‌సీఐసీపీఆర్) సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రతి ఐదు కుటుంబాల్లో ఒక కుటుంబంలోని వయోజనులంతా అధిక బరువుతో బాధపడుతున్నట్లు అధ్యయనంలో తేలింది. దాదాపు 20 శాతం కుటుంబాలకు అధిక బరువు సమస్యగా పరిణమించింది. 10 శాతం మంది స్థూలకాయంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారని అధ్యయనం నివేదించింది. మణిపూర్, కేరళ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం వంటి రాష్ట్రాల్లోని 30శాతం కంటే ఎక్కువ కుటుంబాల్లో దాదాపు పెద్దలందరూ అధిక బరువుతో ఉన్నారు. తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రతి ఐదింట రెండు కుటుంబాల్లో పెద్దలు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇటీవల తమిళనాడు హెల్త్ జర్నల్‌లో సంబంధిత అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలు, పట్టణ ప్రాంతాల్లో అధిక బరువు, ఊబకాయం సమస్యల వివరాలను అధ్యయనం వెల్లడించింది. సంపన్న ప్రాంతాలలో ముఖ్యంగా షెడ్యూల్డ్ తెగ వర్గాలలో 12.2 శాతం వరకు ఊబకాయంతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని అధ్యయనం పేర్కొంది. పట్టణ కుటుంబాల్లో దాదాపు 15 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 8 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక సహా దక్షిణ రాష్ట్రాలు స్థూలకాయానికి సంబంధించి హాట్‌స్పాట్‌లుగా అవతరించాయి.

ప్రతీ 5 కుటుంబాల్లో ఒకటి ఒబెసిటీ బాధిత కుటుంబమే

- దేశంలో 10% కుటుంబాల్లోని సభ్యులందర్నీ పీడిస్తున్న అధిక బరువు సమస్య
- గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో ఒబెసిటీ ఎక్కువ
- ఒబెసిటీ హాట్‌స్పాట్లుగా ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక

పట్టణ ప్రాంతాల్లో 30 శాతం కంటే ఎక్కువ పెద్దలు అధిక బరువు కలిగి ఉన్నారని అధ్యయనంలో గుర్తించారు. తమిళనాడులో 24.4 శాతం, పంజాబ్‌లో 23.5 శాతం కుటుంబాల్లోని పెద్దలు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశంలో అత్యధికంగా పుదుచ్చేరిలోని 25.2 శాతం కుటుంబాల్లో పెద్దలందరిలో ఊబకాయం పెద్ద విపత్తుగా తయారైంది. ధనిక వర్గాలు, నగర ప్రాంతాలు, ఆధునిక జీవన విధానం ఉన్న రాష్ట్రాలు ఎక్కువ ఒబెసిటీ, అధిక బరువు సమస్యకు ప్రభావితమవుతున్నాయి. ఈ ధోరణి మారుతున్న జీవనశైలికి కారణమని అధ్యయనం పేర్కొంది. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగం ఎక్కువగా ఉండడం, ఆహార శైలి మార్పు, శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక జీవనశైలి వంటి అంశాలు అధిక బరువు, ఊబకాయానికి ప్రధాన హేతువులవుతున్నాయి. ప్రతీ నాలుగు ధనవంతుల కుటుంబాల్లో ఒక కుటుంబంలోని వారందరినీ అధిక బరువు సమస్య వేధిస్తోంది. దేశంలోని 17.3 శాతం సంపన్న కుటుంబాల్లో ఊబకాయం ఇబ్బంది పెడుతోంది. షెడ్యూల్డ్ జాతుల (ఎస్టీ) వారిలో ఊబకాయం అత్యల్పంగా 4.2 శాతం మాత్రమే నమోదైంది.

రూ.50కే సికిల్ సెల్ అనీమియా టెస్ట్ కిట్

న్యూఢిల్లీ: అనువంశికంగా సంక్రమించే ప్రమాదకరమైన సికిల్ సెల్ అనీమియా నిర్ధారణను మరింత చౌకగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ వ్యాధి కిట్లను రూ.50కే అందుబాటులోకి తేనుంది. 2047 కల్లా సికిల్‌సెల్ అనీమియా రహితంగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా దేశంలోని దాదాపు ఏడు కోట్ల మందికి పెద్ద ఎత్తున నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం టెండర్లను పిలిపించింది. ఈ సందర్భంగా వివిధ తయారీ సంస్థలు రూపొందించిన కిట్లను పరిశీలించింది. ఒక్కో పరీక్షకు రూ.50 మాత్రమే ఖర్చయ్యే కిట్‌ను రూపొందించిన సంస్థను ఇందుకు ఎంపిక చేసింది. దీని దీని ద్వారా రూ.1,857 కోట్ల మేర ప్రజాధనం ఆదా అవుతుందని ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహెమాలజీ(ఎన్ఐఐహెచ్) సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రభాకర్ కేదార్ వెల్లడించారు. అనువంశికంగా వచ్చే రక్త సంబంధ వ్యాధి ప్రధానంగా ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్యధరా ప్రాంత దేశాలు, భారత్‌లో ఎక్కువగా కనిపిస్తోంది. దేశంలోని 2 కోట్ల మందిలో ఈ వ్యాధిని గుర్తించామని, కొన్ని ప్రాంతాల్లో ప్రతి 70 మందిలో ఒకరికి ఈ వ్యాధి సంక్రమించిందని కేదార్ వివరించారు.

ఆ వ్యాపారాలకు పోలీసు అనుమతి అక్కర్లేదు

ఢిల్లీలో పబ్స్, హోటళ్లు, రెస్టారెంట్లు, స్విమ్మింగ్‌పూల్స్ వంటి వాటికి వర్తింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో వ్యాపారాలు చేసుకునేందుకు ఇకపై పోలీసు అనుమతి అక్కర్లేదని మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పష్టం చేశారు. పోలీసులు ఇచ్చే నిరభ్యంతర (ఎన్‌ఓసీ) సర్టిఫికేట్ కోసం ఇకపై ఎవరూ వేచి చూడాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టంచేశారు. ఈమేరకు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఉత్తర్వులను ఇటీవల ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదించారు. దీంతో ఇకపై హోటళ్లు, పబ్‌లు, డిస్కోథెక్, రెస్టారెంట్లు, స్విమ్మింగ్ పూల్స్, వీడియో గేమ్ పార్లర్‌లు, గెస్ట్ హౌజ్‌లు, ఆడిటోరియం, ఇతర వినోద ఉద్యానవనాలు పనిచేసేందుకు పోలీసుల నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇందుకు సంబంధించిన లైసెన్స్‌లను ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ కౌన్సిల్, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు వంటి స్థానిక సంస్థలు ఇచ్చేలా మార్గదర్శకాలను రూపొందించారు. ఢిల్లీలో వ్యాపారాలను సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేఖా గుప్తా సోమవారం మీడియాతో చెప్పారు.

ప్రధాని మోదీ చురుకుదనం, పట్టుదల ప్రపంచ వేదికలపై భారత్‌కు పెద్ద ఆస్తి

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో కొంతకాలంగా ఉప్పూనిప్పుగా ఉంటున్న ఆ పార్టీ ఎంపీ శశి థరూర్ మరోసారి ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చురుకుదనం, దృఢసంకల్పం ప్రపంచ వేదికలపై భారత్‌కు గొప్ప ఆస్తిగా మారాయని థరూర్ పేర్కొన్నారు. అయితే, ఆయనకు మరింత మద్దతు ప్రోత్సాహం అవసరమని తెలిపారు. ఈ మేరకు 'ది హిందూ'లో ఆయన రాసిన వ్యాసాన్ని ప్రధాని మోదీ కార్యాలయం 'ఎక్స్'లో షేర్ చేసింది. భారత్ దౌత్యం పేలవంగా మారింది, అంతర్జాతీయ సమాజంలో భారత్ ఒంటరై పోతోందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ దాడులు కొనసాగిస్తున్న సమయంలో థరూర్ ప్రధానిని ప్రశంసించడం గమనార్హం. ఆయన వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను మరింత అసహనానికి గురి చేయడంతోపాటు పార్టీ నాయకత్వం, థరూర్ మధ్య అంతరం మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో దీటైన సమాధానం ఇవ్వడంతోపాటు మోదీ ప్రభుత్వం ఉగ్రవాదంపై తన వైఖరిని ప్రపంచదేశాలకు వివరించిన తీరును థరూర్ కొనియాడారు.

అణుశక్తి సంపన్న దేశం ఇజ్రాయెల్

టెల్ అవీవ్: ఇరాన్ అణు కేంద్రాలను సర్వనాశనం చేయడం తథ్యమని ఇజ్రాయెల్ పదేపదే చెబుతోంది. భవిష్యత్తులో తమ మనుగడకు ముప్పు వాటిల్లకుండా ఉండాలంటే అణు బాంబు తయారు చేయకుండా ఇరాన్‌ను అడ్డుకోవడం ఒక్కటే మార్గమని అంటోంది. ఇజ్రాయెల్ విజ్ఞప్తి మేరు ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసింది. మరోవైపు తన వద్దనున్న అణ్వస్త్రాల గురించి ఇజ్రాయెల్ నోరువిప్పడం లేదు. పశ్చిమాసియాలో అణుబాంబులు కలిగి ఉన్న ఏకైక దేశం ఇజ్రాయెల్ అన్న సంగతి బహిరంగ రహస్యమే. కానీ, దానిపై యూదు పాలకులు మాట్లాడడం గానీ, ఖండించడం గానీ చేయరు. అంతర్జాతీయ అణు నిరాయుధీకరణ ఒప్పందం(ఎన్పీటీ)లో భాగస్వామి కాని ఐదు దేశాల్లో ఇజ్రాయెల్ కూడా ఉంది. దాంతో అణ్వాయుధాలు వదులుకోవాలంటూ ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయలేకపోతున్నాయి. ఇజ్రాయెల్ అణుకేంద్రాలను అంతర్జాతీయ నిపుణులు తనిఖీ చేసే అవకాశం కూడా లేదు. ఇరాన్ అణు కార్యక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తున్న పశ్చిమ దేశాలు ఇజ్రాయెల్‌ను మాత్రం స్వేచ్ఛగా వదిలేయడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం సొంత భద్రత కోసం, శాంతియుత ప్రయోజనాల కోసమే అణు పరీక్షలు చేస్తున్నామని ఇరాన్ చెబుతున్నా పశ్చిమ దేశాలు ఒప్పుకోవడం లేదు. అణ్వస్త్రాలు కలిగిన ఇజ్రాయెల్‌ను ముద్దు చేస్తున్నాయి.

పెద్ద సంఖ్యలో అణు బాంబులు, న్యూక్లియర్ వార్‌హెడ్లు

- 1958 నుంచే అణు పరీక్షలు చేస్తున్న యూదు దేశం

1,110 కిలోల ప్లుటోనియం నిల్వలు

ఇజ్రాయెల్ అణు చరిత్ర ఈనాటిది కాదు. 1950వ దశకంలోనే అణ్వాయుధాలపై దృష్టి పెట్టింది. డిమోనా సిటీలో 1958లో నెగెవ్ న్యూక్లియర్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించింది. చుట్టూ శత్రుదేశాలే ఉండడంతో రక్షణ అణుబాంబులు అవసరమని అప్పటి ప్రధానమంత్రి డేవిడ్ బెన్ గురియన్ నిర్ణయించారు. ప్లుటోనియం ఉత్పత్తి జరుగుతున్న నెగెవ్ సెంటర్ గురించి ప్రపంచానికి తెలియనివ్వలేదు. అదొక వస్త్రాల ఫ్యాక్టరీ అంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. 1970 నాటికి అణు వార్‌హెడ్లను ప్రయోగించే స్థాయికి ఇజ్రాయెల్ చేరుకుంది. నెగెవ్ సెంటర్‌లో జరుగుతున్న అణు కార్యకలాపాల సంగతి 1986లో బయటపడింది. అక్కడే పని చేస్తున్న ఓ టెక్నీషియన్ ఈ విషయం బహిర్గతం చేశారు. దాంతో దేశద్రోహం ఆరోపణల కింద ప్రభుత్వం అతడిని 18 ఏళ్ల పాటు జైల్లో నిర్బంధించింది. ఇజ్రాయెల్ క్రమంగా అణుశక్తి సంపన్న దేశంగా మారింది. దాదాపు 200 న్యూక్లియర్ వార్‌హెడ్లు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే 1,110 కిలోల(2,425 పౌండ్లు) ప్లుటోనియం ఇజ్రాయెల్ వద్ద నిల్వ ఉంది. దీంతో 277 అణు బాంబులు తయారు చేయొచ్చు. న్యూక్లియర్ క్రూయిజ్ క్షిపణులను, అణు వార్‌హెడ్లను ప్రయోగించే ఆరు జలాంతర్గాముల తోపాటు బాలిస్టిక్ మిస్సైళ్లు ఇజ్రాయెల్ వద్ద ఉన్నట్లు సమాచారం. 6,500 కిలోమీటర్ల పరిధి వరకు అణుబాంబులను ఇజ్రాయెల్ ప్రయోగించగలదు. ఇజ్రాయెల్ అణ్వస్త్రాల ముప్పును ఎదుర్కొంటున్న ప్రధాన దేశం ఇరాన్.

అమెరికా వ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక నిరసనలు

- వీధుల్లోకి వచ్చిన వేలాది మంది
- తక్షణం దాడులు ఆపేయాలని డిమాండ్



వాషింగ్టన్‌లోని వైట్ హౌస్ వెలుపల ఆదివారం నిరసనకారుల ర్యాలీ

వాషింగ్టన్: ఇరాన్ అణు కేంద్రాలపై బాంబు దాడిని వ్యతిరేకిస్తూ యూఎస్ వ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. వేలాది మంది ప్రదర్శనకారులు వీధుల్లోకి వచ్చారు. షికాగోలోని బోస్టన్‌లో, వాషింగ్టన్‌లోని వైట్ హౌస్ వెలుపల, న్యూయార్క్ నగరంలోని ఐకానిక్ టైమ్స్ స్క్వేర్ వద్ద యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. పార్టీ ఫర్ సోషలిజం అండ్ లిబరేషన్, ఆన్సర్ కోయలిషన్, నేషనల్ ఇరానియన్ అమెరికన్ కౌన్సిల్‌తో సహా అనేక సంఘాలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ఇరాన్‌పై యూఎస్-ఇజ్రాయెల్ యుద్ధం నిలిపేయాలని, ఇజ్రాయెల్‌కు మద్దతును అమెరికా ఉపసంహరించుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. 'క్రిమినల్ యూఎస్/ఇజ్రాయెల్ యుద్ధం నుంచి ఇరాన్‌ను రక్షించండి', 'ట్రంప్ ఒక యుద్ధ నేరస్థుడు' అని ప్లకార్డులు ప్రదర్శించారు. అని మరొక ప్లకార్డు ప్రకటించింది. ప్రదర్శనకారులు బ్యానర్లు పట్టుకుని, యుద్ధ వ్యతిరేక నినాదాలు చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో నిండిపోయాయి. వైమానిక దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా వారు అభివర్ణించారు. ఈ విపత్కర పరిణామాలు ప్రాంతీయ లేదా ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తాను అధికారంలోకి వస్తే శాశ్వత యుద్ధాలను ముగిస్తానని, సైనిక సంఘర్షణలను అంతం చేస్తానంటూ ఇచ్చిన హామీలను ట్రంప్ ఉల్లంఘించారని మండిపడ్డారు. సామూహిక విధ్వంసక ఆయుధాలు న్నాయంటూ 2003లో ఇరాక్‌పై దండయాత్ర చేసిన జార్జ్ డబ్ల్యూ బుష్ కంటే ట్రంప్ భిన్నంగా లేరని వ్యాఖ్యానించారు. సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను వెంటనే ముగించాలని డిమాండ్ చేశారు. సైనిక వ్యయాన్ని ఆరోగ్య సంరక్షణ, విద్య, మౌలిక సదుపాయాలవైపు మళ్లించాలని సూచించారు.

ఇరాన్‌పై వైమానిక దాడుల తర్వాత న్యూయార్క్, వాషింగ్టన్ సహా ప్రధాన అమెరికాలోని ప్రధాన నగరాలను హై అలర్ట్ ప్రకటించడంతో ఈ యుద్ధ వ్యతిరేక నిరసనలు చెలరేగాయి. ఇప్పటివరకు నిర్దిష్టమైన బెదిరింపులు లేనప్పటికీ, సాంస్కృతిక, దౌత్య, మతపరమైన ప్రదేశాల చుట్టూ అదనపు గస్తీ ఏర్పాటు చేసింది. ఇరాన్‌లో పరిస్థితిని ట్రాక్ చేస్తున్నామని న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ట్వీట్ చేసింది.

గడ్డి తినిపించారు..

పశువుల అక్రమ రవాణా ఆరోపణలు

- ఒడిశాలోని గంజాంలో దళితులపై అమానుషం

బరంపురం: పశువులను దొంగతనంగా రవాణా చేస్తున్నారనే అనుమానంతో ఇద్దరు దళితులను తీవ్రంగా కొట్టి, సగం గుండు గీయించి, మోకాళ్లపై నడిపించడంతోపాటు గడ్డి తినిపించారు. ఈ దారుణం ఒడిశాలోని గంజాం జిల్లా ధారకోటే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖారిగుమ్మ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడంతో రాజకీయ పార్టీలు సామాజిక సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. సింగిపూర్‌కు చెందిన బాబులా నాయక్(54), బులు నాయక్(42)లు హరియూర్ గ్రామం నుంచి ఒక ఆటోలో రెండు ఆవులు, ఆవుదూడను తీసుకువస్తున్నారు. వీరిని ఖారిగుమ్మ గ్రామానికి చెందిన 'గో పరిరక్షకులు' కొందరు అడ్డుకున్నారు. వాటిని తన కుమార్తెకు బహుమతిగా ఇచ్చేందుకు తీసుకెళ్తున్నానని బాబులా చెప్పగా కొట్టిపారేశారు. దొంగతనం చేశారంటూ వారిపై నెపం వేశారు. రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా బాధితులు తిరస్కరించారు. దీంతో, వారిని తీవ్రంగా కొడుతూ నానా దుర్భాషలాడారు. సెలూన్‌కు తీసుకెళ్లి సగం జుత్తు గొరిగించారు. కిలోమీటర్ల దూరం వారిని మోకాళ్ల మీద నడిపించారు. మురుగు కాల్వలో నీటిని తాపించారు. గడ్డి తినిపించారు. కేసు నమోదు చేసి, ఆరుగురిని అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మరో ఆరుగురి కోసం గాలిస్తున్నామని ఎస్పీ సువేందు కుమార్ పాత్ర తెలిపారు. వారు గో పరిరక్షకులు కాదు, బలవంతంగా డబ్బులు వసూలు చేసేవారు మాత్రమేనని ఆయన అన్నారు.

ఎన్నికలకు ముందే బిహార్ ఓటరు జాబితా సవరణ

21ఏళ్ల తర్వాత ఇంటింటి సర్వే చేయనున్న కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బిహార్ రాష్ట్ర ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో నవీకరణకు కసరత్తు చేస్తోంది. ఏమాత్రం తప్పులు దొర్లకుండా అత్యంత ఖచ్చితత్వంతో జాబితా రూపొందించాలని ఈసీ నిశ్చయించుకుంది. ఇందుకోసం జూలై నెల నుంచి బిహార్‌వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని తుది నిర్ణయం తీసుకుంది. 2004 తర్వాత బిహార్‌లో మళ్లీ ఇలా ఇంటింటి సర్వే చేపట్టనుండటం ఇదే తొలిసారి. ఇప్పటికే బిహార్ ఓటర్లుగా ఉన్న వారిని మాత్రమే నూతన ఓటర్ల జాబితాలో చేర్చనున్నారు. ఢిల్లీ, ముంబై, మరే ఇతర రాష్ట్రాలకు తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన వలసవెళ్లి బిహార్ వాసుల పేర్లను కొత్త జాబితాలో చేర్చబోరు. ఇలాంటి వాళ్ల పేర్లతోపాటు మరణించిన వారి పేర్లను కొత్త జాబితాలో చేరకుండా అడ్డుకుంటారు. ప్రస్తుతం బిహార్‌లో 7.8 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా త్వరలో ఓటర్ల పేర్లు, ఇతర సమాచారాన్ని సేకరించి ఓటర్ల జాబితాను ఆధునీకరిస్తారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సహా మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు జూలై పదో తేదీలోపు బిహార్‌లో పర్యటించే అవకాశాలున్నాయని ఈసీ వర్గాలు చెప్పాయి.

ప్రతిపక్షాన్ని చులకన చేస్తే ప్రజలు సహించరు

ప్రధాని మోదీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే హితవు

రాయిచూర్: ప్రతిపక్ష పార్టీలను అల్పంగా భావిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వైఖరిని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఏర్పాటైన అఖిలపక్ష భేటీకి రెండు సందర్భాల్లోనూ ప్రధాని మోదీ రాకపోవడం ప్రతిపక్షాలంటే ఆయనకున్న గౌరవం ఏపాటిదో తెలుస్తోందని వ్యాఖ్యానించారు. అఖిలపక్ష భేటీకి దేశవ్యాప్తంగా ఉన్న నాయకులంతా రాగా, ప్రధాని మోదీ ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. బదులుగా బిహార్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీకి వెళ్లారని ఎత్తి చూపారు. ఇలాంటి వైఖరిని ప్రజలు హర్షించరని, ముఖ్యంగా దేశ యువత సహించబోదని ఆయన హెచ్చరించారు. దేశం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలోని రాయిచూర్‌లో సోమవారం జరిగిన బహిరంగం సభలో ఖర్గే ప్రసంగించారు. 'కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన బెట్టుకున్నారు. ప్రతీకారంగా మన సైన్యం పాక్ భూభాగంపై దాడి జరిపి ఉగ్రవాదులను ఏరిపారేసింది. యావత్తూ దేశం, సైనిక బలగాలు ఏకమై దేశానికి రక్షణగా నిలవగా, కొందరు వ్యక్తులు మాత్రం ఇదంతా తమ ఘనతేనని చెప్పుకుంటున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. ఆ వ్యక్తులు ఆర్మీలో కెప్టెన్, కల్నల్, లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసిన వారైతే దేశం కోసం పోరాడినందుకు గాను మనం ప్రశంసించి ఉండేవారం. కానీ, అలాంటిదేమీ లేకుండానే గొప్పలు పోతున్నారు' అని మోదీ సర్కారుపై పరోక్షంగా విమర్శలు కురిపించారు. మళ్లీ ట్రంపే అమెరికా అధ్యక్షుడిగా రావాలంటూ అమెరికాలో నినదించిన ప్రధాని మోదీ..మన వస్తువులపై భారీగా ట్యాక్సులు విధించినా ఒక్క మాటకూడా మాట్లాడలేదని ఆరోపించారు.



రష్యా దాడుల్లో 12 మంది మృతి

కీవ్: రష్యా మరోసారి రెచ్చిపోయింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తోపాటు పలు ప్రాంతాలపై ఆదివారం రాత్రి డ్రోన్లు, బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో విరుచుకుపడింది. దాడుల్లో కీవ్‌లో ఏడుగురు సహా మొత్తం 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. కనీసం 30 మంది క్షతగాత్రులయ్యారు. రష్యా 352 డ్రోన్లు, 11 బాలిస్టిక్ క్షిపణులు, ఐదు క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ పేర్కొంది. వీటిలో 339 డ్రోన్లు, 15 క్షిపణులను తమ గగనతల వ్యవస్థలు అడ్డుకున్నాయంది. నివాసప్రాంతాలు, ఆస్పత్రులు, క్రీడా సముదాయాలు లక్ష్యంగా దాడులు జరిగాయని ఆర్మీ తెలిపింది. కీవ్‌లో ఐదంతస్తుల అపార్టుమెంట్‌లో కొంతభాగం కుప్పకూలగా ఏడుగురు చనిపోయారని, నలుగురు శిథిలాల్లో చిక్కుకున్నారంది.

చైనా విదేశాంగ మంత్రితో అజిత్ దోవల్ భేటీ

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)అజిత్ దోవల్ సోమవారం బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. ప్రాంతీయ సుస్థిరత, శాంతి కోసం ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే ఎదుర్కొని పోరాడాల్సిన అవసరముందని ఈ సందర్భంగా దోవల్ నొక్కిచెప్పారు. షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) జాతీయ భద్రతాధికారుల అత్యున్నత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు దోవల్ చైనా వెళ్లారు. భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఇరువురు సమీక్షించారని విదేశాంగ శాఖ తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు, ప్రజల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకునేందుకు వీరు అంగీకారానికి వచ్చారని పేర్కొంది. రెండు దేశాలకు ప్రయోజనం కలిగించే అంశాలపైనా సమీక్ష జరిపారని విదేశాంగ శాఖ వివరించింది.

ఎస్పీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేల బహిష్కరణ

లక్నో: ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను సోమవారం పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, పార్టీ ప్రధాన సత్రాలను ఉల్లంఘించారని తెలిపింది. పార్టీ సైద్ధాంతిక నిబద్ధతలకు విరుద్ధంగా పదేపదే వ్యవహరించిన ఎమ్మెల్యేలు అభయ్ సింగ్ (గోషైగంజ్), రాకేష్ ప్రతాప్ సింగ్ (గౌరీగంజ్), మనోజ్ కుమార్ పాండే (ఉంచహార్)లను తొలగిస్తున్నట్టు పేర్కొంది. బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు మతపరమైన విభజన రాజకీయాలను ప్రోత్సహించే కార్యకలాపాల్లో ఉన్నారని, రైతు, మహిళా, రతు వ్యతిరేక విధానాలకు మద్దతు ఇస్తున్నారని ఇస్తున్నారని అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని పార్టీ ఒక ప్రకటనలో ఆరోపించింది, ఇది పార్టీ విలువలకు ప్రాథమికంగా విరుద్ధమని పేర్కొంది. శాసనసభ్యులకు తమ తప్పును సరిదిద్దుకోవడానికి అవకాశాలు ఇచ్చినా.. అదేవిధంగా వ్యవహరించారని ఆరోపించింది.

ఉత్తరాఖండ్ స్థానిక ఎన్నికల నిలిపివేత

రిజర్వేషన్లపై స్పష్టత లేదన్న హైకోర్టు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని స్థానిక సంస్థల ఎన్నికలను ఆ రాష్ట్ర హైకోర్టు నిలిపేసింది. పంచాయతీ సంస్థల్లో రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అస్పష్టంగా ఉందని కోర్టు పేర్కొంది. రాష్ట్రంలోని 12 జిల్లాలకు ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ తర్వాత కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 12 జిల్లాల్లో జూలై 10న పోలింగ్ జరుగుతుందని, జూలై 19న కౌంటింగ్ జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుశీల్ కుమార్ ఇటీవల ప్రకటించారు. నామినేషన్ల ప్రక్రియ జూన్ 25న ప్రారంభం కావాల్సి ఉండగా కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

'లోహఘర్' కోటను ఎవరు నిర్మించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ప్రాంతీయ రాజ్యాలు

సిక్కులు

గురునానక్ (1469-1539)

సిక్కు మతస్థాపకుడు గురునానక్. ఇతడు 1469లో పంజాబ్‌లోని తల్వండి అనే గ్రామంలో జన్మించాడు. మొదటి సిక్కు గురువైన గురునానక్ సర్వమత సమానత్వాన్ని, సహన భావాన్ని బోధించాడు. ఇతడి శిష్యులను 'నానక్ పంతి' అంటారు. కొంత కాలం తర్వాత వీరినే సిక్కులుగా పిలిచారు. దేవుడు ఒక్కడేనని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మాలని నానక్ బోధించాడు.

గురు అంగద్ (1539-1552)

గురు అంగద్ 1539లో నానక్ వారసుడిగా గురువయ్యాడు. ఇతడు మొగల్ చక్రవర్తి హుమాయూన్‌కు సమకాలీకుడు. అంగద్ 'గురుముఖి' లిపిని కనిపెట్టాడు. భాయిబాల సహాయంతో నానక్ జీవిత చరిత్రను రచించాడు.

గురు అమర్‌దాస్ (1552-1574)

ఇతడు 78 ఏళ్ల వయస్సులో సిక్కు గురువు అయ్యాడు. సతీ సహగమనాన్ని నిరసించాడు.

గురు రామ్‌దాస్ (1574-81)

ఇతడు గురు అమర్‌దాస్ అల్లుడు. గురు రామ్‌దాస్ మొగల్ చక్రవర్తి అక్బర్‌కు సమకాలీకుడు. అక్బర్ పంజాబ్‌లోని అమృత్‌సర్ ప్రాంతాన్ని ఇతడికి బహుకరించగా అక్కడే 1577లో స్వర్ణ దేవాలయ నిర్మాణానికి పునాది వేశాడు. ఒక సరస్సును తవ్వించాడు. ఇతడి కాలం నుంచే గురువు కావడం వారసత్వ హక్కుగా మారింది.

గురు అర్జున్ దేవ్ (1581-1606)

ఇతడు సిక్కుల అయిదో గురువు. ప్రాచీన హిందూ, ముస్లింల రచనల్లోని ముఖ్య సిద్ధాంతాలు సేకరించి 'ఆదిగ్రంథ్'ను సంకలనం చేశాడు. ఇది సిక్కుల పవిత్ర గ్రంథం. స్వర్ణ దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. 'వైశాఖి' అనే పండుగను ప్రవేశపెట్టి ప్రజల సంపాదనలో పదో వంతు వసూలు చేసేవాడు. జహంగీర్ కుమారుడైన ఖుస్రూ తండ్రికి ఎదురు తిరిగాడు. అర్జున్ దేవ్ ఖుస్రూకు ఆశ్రయం కల్పించాడు. ఫలితంగా జహంగీర్ చక్రవర్తి అర్జున్ దేవ్‌పై దేశద్రోహ నేరం మోపి అతణ్ని ఉరితీయించాడు. ఈ ఘటనతో అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న సిక్కులు సైనికులుగా మారారు.

గురు హర గోవింద్ (1606-44)

ఇతడు గురు అర్జున్ దేవ్ వారసుడు. రక్షక దళాన్ని చిన్న సైన్యంగా మార్చాడు. సైనిక శిక్షణ ఇప్పించాడు. 'అఖల్ తఖ్త్'ను స్థాపించాడు. 'లోహఘర్' (అమృత్‌సర్) కోటను నిర్మించాడు. ఇతడికి 'సచ్చా బాద్షా' అనే బిరుదు ఉంది. హర గోవింద్ సింగ్ 'సంగ్రామ్' యుద్ధంలో షాజహాన్ సైన్యాన్ని ఓడించాడు. ఇతడి తర్వాత గురువైన గురు హర రాయ్ (1644-61)శాంత స్వభావుడు. హర రాయ్ తర్వాత గురు హర కృష్ణ (1661-64) గురువయ్యాడు.

గురు తేజ్ బహద్దూర్ (1664-1675)

తేజ్ బహదూర్ కశ్మీర్‌లోని ఆనందపూర్‌లో స్థిరపడ్డాడు. ఇతడు ఔరంగజేబ్ అసహన మత విధానాన్ని వ్యతిరేకించాడు. దీంతో ఔరంగజేబ్ తేజ్ బహద్దూర్‌ను చిత్రవధ చేసి చంపించాడు.

గురు గోవింద్ సింగ్ (1675-1708)

ఇతడు పదో గురువు, చివరి వాడు. ఇతడు సిక్కులను రాజకీయ, సైనిక సమాజంగా రూపొందించాడు. దీన్నే ఖల్సా సమాజం అంటారు. సిక్కులు ఖడ్గంతో చిలికిన నీటిని తాగి 'సింగులు' (సింహాలు)గా బిరుదు వహించారు. ఖల్సా ప్రకారం సిక్కులు కేశ (పొడవు వెంట్రుకలు), కంఘ్రూ (దువ్వెన), కృపాణ్ (ఖడ్గం), కచ్చా (పొట్టి లాగు), కర్ద (చిన్న చాకు)ను ధరించేవారు. ఇతడి కుమారులందరూ ఆనందపూర్ యుద్ధంలో మరణించారు. గోవింద్ సింగ్‌ను నాందేడ్‌లో ఒక అఫ్గాన్ సైనికుడు కత్తితో పొడిచి చంపాడు. అయిదుగురు సిక్కులు ఎక్కడ కూడితే అక్కడే నేనుంటాను అని గురు గోవింద్ సింగ్ తన శిష్యులకు చివరి సందేశం ఇచ్చాడు.

1708 తర్వాత సిక్కుల చరిత్ర

బందా బహదూర్ (1708-16)

ఇతడు సిక్కుల నాయకుడయ్యాడు. సిక్కుల స్వాతంత్ర్యం కోసం మొగలులతో పోరాటం చేశాడు. సయ్యద్ సోదరులు బందా బహదూర్‌ను బంధించి హత్య చేశారు. సిక్కులు స్థాపించిన రాజ్యాలను ఖల్సా రాజ్యాలంటారు. 1773 నాటికి 12 ఖల్సా రాజ్యాలుండేవి. సుకేర్ చకియా వీటిలో ఒక రాజ్యం. చరత్ సింగ్ దీని స్థాపకుడు. అతని కుమారుడు రంజిత్ సింగ్. ఈయన 1780 నాటికి సుకేర్ చకియా పాలకుడయ్యాడు.

రంజిత్ సింగ్ (1792-1839)

ఇతడికి పంజాబ్ సింహం అనే బిరుదు ఉంది. 1799లో లాహోర్‌ను ఆక్రమించి సట్లేజ్ నదికి పశ్చిమంగా ఉన్న ఖల్సా రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. 1801లో మహారాజా అనే బిరుదు ధరించాడు. ఇతడు సిక్కు సామ్రాజ్య నిర్మాత. బ్రిటిష్ వారితో సఖ్యతతో మెలిగాడు. 1809లో గవర్నర్ జనరల్ మింటోతో సంధి చేసుకున్నాడు. రైతుల నుంచి 40 శాతం శిస్తు వసూలు చేసేవాడు. రంజిత్ సింగ్ వారసులు అసమర్థులైనందువల్ల మొదటి ఆంగ్లో సిక్కు యుద్ధం (1845-46), రెండో ఆంగ్లో సిక్కు యుద్ధం (1848-49)లో బ్రిటిషర్లు సిక్కులను జయించారు. దీంతో పంజాబ్ బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమైంది.

మరాఠాలు

శివాజీ



శివాజీ 1627లో జన్మించాడు. ఇతడి తల్లి జీజియా బాయి. శివాజీ దాదాజీ కొండదేవ్ సంరక్షణలో పెరిగాడు. ఇతడి గురువు రామదాస్. రాయ్‌గఢ్ వద్ద దుర్గాన్ని నిర్మించి తన కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నాడు. శివాజీని చంపి లేదా బంధించి తీసుకురమ్మని 1659లో బీజాపూర్ సుల్తాన్ తన సేనాని అఫ్జల్ ఖాన్‌ను ఆదేశించాడు. శివాజీ భాఘనఖ్ (పులిగోళ్లు) ఉపయోగించి అఫ్జల్‌ఖాన్‌ను హతమార్చాడు. 1665లో ఔరంగజేబ్ మీర్జా జయసింగ్‌ను శివాజీపై యుద్ధానికి పంపాడు. జయసింగ్ పురంధర్‌ను ముట్టడించాడు. శివాజీ 23 దుర్గాలను మొగలులకు ఇచ్చి 12 దుర్గాలను తన వద్ద ఉంచుకునేలా సంధి చేసుకున్నాడు. 1666లో శివాజీ తన కుమారుడైన శంభాజీతో కలిసి ఆగ్రాలో ఔరంగజేబ్‌ను సందర్శించాడు. కానీ ఔరంగజేబ్ శివాజీతో అమర్యాదగా ప్రవర్తించి అతణ్ని గృహ నిర్బంధం చేశాడు. శివాజీ మిఠాయిల గంపలో దాక్కొని తప్పించుకున్నాడు. తర్వాత దక్కన్ చేరి మొగలులకు ఇచ్చిన కోటలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. రాయ్‌గఢ్‌ను రాజధానిగా చేసుకున్న శివాజీ 1674లో పట్టాభిషిక్తుడయ్యాడు. శివాజీ 'ఛత్రపతి' బిరుదు వహించాడు. ఇతడి రాజ్యానికి స్వరాజ్యమని పేరు. శివాజీ రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అతడి ప్రత్యక్ష పాలనలో ఉన్న ప్రాంతానికి స్వరాజ్యమని, దాని చుట్టూ ఉన్న ప్రాంతానికి మొగలాయ్ అని పేరు. ఈ ప్రాంతాల నుంచి చౌత్, సర్దేశ్‌ముఖి అనే పన్నులు వసూలు చేశాడు. కేంద్ర ప్రభుత్వంలో అష్టప్రధాన్ అనే మంత్రి పరిషత్ ఉండేది. రాజు వారికి నేరుగా జీతాలను చెల్లించేవాడు. పంటలో నాలుగో వంతు భూమి శిస్తుగా వసూలు చేసేవారు. సైన్యాన్ని వ్యవస్థీకరించారు. పది మంది ఉన్న దళానికి అధిపతి 'నాయక' నుంచి వేయి మంది ఉన్న దళానికి అధిపతి 'హజరీ' వరకు అనేక భాగాలుగా సైన్యాన్ని విభజించారు. శివాజీ, అతడి వారసులు గెరిల్లా యుద్ధంలో ప్రావీణ్యం పొందారు.

పీష్వాలు

బాలాజీ విశ్వనాథ్ (1713-20)

సాహు కాలంలో బాలాజీ విశ్వనాథ్ ప్రధాన మంత్రి లేదా పీష్వా. సాహుకు వారసులు లేకపోవడం వల్ల అతడి మరణానంతరం మరాఠా సామ్రాజ్యం పీష్వాల పరమైంది. పీష్వా వంశ స్థాపకుడు బాలాజీ విశ్వనాథ్. ఇతణ్ని మహారాష్ట్ర జాతీయ స్థాపకుడిగా అభివర్ణిస్తారు. బాలాజీ విశ్వనాథ్ పీష్వా పదవిని వంశ పారంపర్యం చేశాడు. పుణేను రాజధానిగా చేసుకున్నాడు.

మొదటి బాజీరావు (1720-1740)

ఇతడు పీష్వాలందరిలోకెల్లా సమర్థుడు. హిందూ పద్ పద్ షాహి లేదా అఖిల భారత సామ్రాజ్యం నిర్మించాలనేది ఇతడి ఆశయం. లక్ష్య సాధనలో కొంత మేర సఫలీకృతుడయ్యాడని చెప్పవచ్చు. ఇతడి కాలంలో పన్నులు వసూలు చేసే సర్దార్లు బలవంతులై స్వతంత్రం ప్రకటించుకున్నారు. నాగ్‌పూర్‌లో రఘోజీ భోంస్లే, బరోడాలో షిల్లాజీ గైక్వాడ్, ఇండోర్‌లో మల్హర్‌రావ్ హోల్కార్, గ్వాలియర్‌లో రోటోజీ సింధియా స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. వీరందర్నీ మహారాష్ట్ర కూటమిగా చేర్చిన ఘనత మొదటి బాజీరావుదే.

బాలాజీ బాజీరావు (1740-1761)

ఇతడు మొదటి బాజీరావు కుమారుడు. బాలాజీ బాజీరావు కాలంలో మరాఠాల అధికారం, వైభవం ఉచ్ఛ స్థితికి చేరింది. 1757లో మరాఠాలు అహ్మద్ షా అబ్దాలీ ప్రతినిధి నుంచి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నారు. రఘుబా పీష్వా తమ్ముడు పంజాబ్‌ను జయించి అటక్ కోటపై మరాఠా జెండా ఎగురవేశాడు. ఇదే సమయంలో అఫ్గానిస్తాన్ రాజైన అహమ్మద్ షా అబ్దాలీ 1761లో పానిపట్ వద్ద మరాఠాలను ఓడించాడు. దీన్నే 'మూడో పానిపట్' యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో అబ్దాలీకి రెండో షా ఆలం, ఔద్ నవాబు సహకరించారు. గెరిల్లా పోరాటం చేయకపోవడం వల్లే మరాఠాలు ఈ యుద్ధంలో ఓడారు.

హైదరాబాద్ రాజ్యం

నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా 1724లో హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు 1722-24 మధ్య మొగల్ సామ్రాజ్యానికి వజీర్‌గా పనిచేశాడు. హిందువుల పట్ల సహన భావం ప్రదర్శించాడు. పూరన్ చంద్ అనే హిందువు ఆయన వద్ద దివాన్‌గా పనిచేయడమే దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. తర్వాత వరుసగా.. అతడి రెండో కుమారుడైన నాజర్ జంగ్, నిజాం మనవడైన ముజఫర్ జంగ్, నిజాం మూడో కుమారుడైన సలాబత్ జంగ్ అధికారంలోకి వచ్చారు. వీరి తర్వాత రెండో నిజాంగా లేదా రెండో అసఫ్‌జాగా నిజాం అలీ రాజ్యపాలన చేపట్టాడు. ఇతడు 1763లో ఉత్తర సర్కార్ జిల్లాలను, 1788లో గుంటూరును, 1802లో దత్త జిల్లాలను బ్రిటీషర్లకు ఇచ్చేశాడు. నిజాం అలీ తర్వాత సికిందర్ ఝా మూడో నిజాంగా రాజ్యానికొచ్చాడు. ఇతడు లష్కర్ (సికింద్రాబాద్)ను నిర్మించాడు. నసీరుద్దౌలా నాలుగో నిజాం, అఫ్జల్ ఉద్దౌలా అయిదో నిజాం. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్యంలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఇతడి ప్రధాని సాలార్‌జంగ్-1 గొప్పవాడు. సాలార్‌జంగ్ అసలు పేరు తురాబ్ అలీఖాన్. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ అఫ్జల్‌గంజ్‌లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, కాచిగూడలో రైల్వేస్టేషన్, నిజాం కళాశాల (1887), మహబూబ్ ఆలియా కళాశాలను నిర్మించాడు. చివరి నిజాంగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో పాలనా పగ్గాలు చేపట్టాడు.

బెంగాల్

ముర్షిద్ కులీఖాన్ 1700 నుంచి బెంగాల్ దివాన్‌గా పనిచేసి స్వతంత్రంగా వ్యవహరించాడు. ఇతడు 1717లో మరణించాడు. అలీ వర్దీఖాన్ 1741లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. ఇతడి రాజధాని ముర్షిదాబాద్. 1756లో సిరాజ్ ఉద్దౌలా సింహాసనాన్ని అధిష్టించాడు. 1757లో ఆంగ్లేయులు రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలో బెంగాల్ నవాబైన సిరాజ్ ఉద్దౌలాను ప్లాసీ యుద్ధంలో ఓడించారు. ఆంగ్లేయులు జయించిన మొదటి రాష్ట్రం బెంగాల్.

ఔద్

సాదత్ ఖాన్ 1724లో ఔద్‌ను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాడు. 1764లో ఔద్ నవాబైన షుజాద్దౌలా మొగల్ చక్రవర్తి రెండో షా ఆలం, బెంగాల్ నవాబ్ మీర్ ఖాసీంతో ఒక కూటమిని ఏర్పాటు చేశారు. వీరు ఆంగ్లేయుల నుంచి బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. 1764లో జరిగిన ఈ యుద్ధానికి బక్సార్ యుద్ధమని పేరు. కూటమిపై విజయం సాధించిన ఆంగ్లేయులు, బెంగాల్, బిహార్, ఒరిస్సాలపై దివానీ హక్కు పొందారు. ఈ యుద్ధం వల్ల ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో స్వతంత్ర రాజకీయాధికారం పొందింది. షుజాద్దౌలా తర్వాత అసఫ్ ఉద్దౌలా ఔద్ రాజ్యానికి నవాబు అయ్యాడు.


మైసూర్

1766లో మైసూర్ రాజు మరణించగానే హైదరాలీ సింహాసనం ఆక్రమించి సుల్తాన్ అయ్యాడు. 1776లో మొదటి ఆంగ్లేయ-మరాఠా యుద్ధంలో హైదరాలీ, నిజాం నవాబు కలిసి ఆంగ్లేయులపై పోరాడారు. ఈ యుద్ధంలో ఏ పక్షానికి విజయం లభించలేదు. 20 ఏళ్లపాటు శాంతి వర్ధిల్లింది. వారన్ హేస్టింగ్స్ నిజాం నవాబుకు గుంటూరు జిల్లాను ఇచ్చి అతణ్ని బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి వేరు చేశాడు. 1781-82లో జరిగిన రెండో మైసూర్ యుద్ధంలో ఐర్‌కూట్ నాయకత్వంలోని బ్రిటిష్ సేనలు పోర్టోనొవో వద్ద హైదరాలీని ఓడించాయి. 1782లో హైదరాలీ మరణించాడు. అతడి కుమారుడైన టిప్పు సుల్తాన్ అధికారాన్ని చేపట్టాక 1784లో శాంతి ఒప్పందం జరిగింది. గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలీస్ మహారాష్ట్రులు, నిజాం నవాబు, తిరువాన్కూరు, కూర్గు రాజులను తన వైపు తిప్పుకొని కూటమిని ఏర్పాటు చేశాడు. యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించి అతడి రాజ్యంలోని సగ భాగాన్ని స్వదేశీ రాజులకు ఇచ్చేశాడు. దీన్నే మూడో ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1790-92) అంటారు. 1799లో జరిగిన నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం టిప్పును ఓడించింది. శ్రీ రంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలో టిప్పు సుల్తాన్ 1799 మే 4న వీర మరణం పొందాడు.

ప్రధాన దేవాలయాలు	
కృష్ణస్వామి ఆలయం - హంపి	మహావీర్‌స్వామి ఆలయం - మౌంట్ అబూ
తీర దేవాలయం - మహాబలిపురం	మార్తాండ దేవాలయం - కశ్మీర్
కైలాసనాథాలయం - కంచి	విశ్వనాథ ఆలయం - కాశీ
జగన్నాథ ఆలయం - పూరి	త్రిమూర్తి విగ్రహం - ఎలిఫెంటా గుహలు
నటరాజ ఆలయం - చిదంబరం	కాందరీయ మహాదేవ ఆలయం-ఖజురహో
సుబ్రహ్మణ్యస్వామి ఆలయం - తిరుత్తణి	చెన్నకేశవ ఆలయం - బేలూరు
సూర్య దేవాలయం - కోణార్క్	వేయి స్తంభాల గుడి - హన్మకొండ
	రాజరాణి ఆలయం - భువనేశ్వర్

దేశంలోని ఏకైక ఖనిజాధారిత పారిశ్రామిక మండలం?

పారిశ్రామిక కార్యకలాపాలు భారీగా కేంద్రీకృతమైన భౌగోళిక ప్రాంతాన్నే పారిశ్రామిక మండలంగా వ్యవహరిస్తారు. పారిశ్రామిక ముడి సరకులు, మార్కెట్లు, అవస్థాపనా సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక కార్యకలాపాలు కొన్ని ప్రాంతాల్లో కేంద్రీకృతమై పారిశ్రామిక మండలాలు ఏర్పడతాయి. ఐరోపా, ఉత్తర అమెరికా, జపాన్‌లలో పారిశ్రామిక మండలాలు విశేషంగా అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు యూఎస్ఏలోని ఈశాన్య ప్రాంతం, మహా సరస్సుల ప్రాంతాల్లో విస్తారమైన పారిశ్రామిక మండలాలు రూపొందాయి. అదేవిధంగా అభివృద్ధి చెందుతోన్న చైనా, ఇండియా, బ్రెజిల్ దేశాల్లోనూ ఇటీవల పారిశ్రామిక మండలాల అభివృద్ధిని గమనించవచ్చు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

పారిశ్రామిక మండలాలు

ఒక భౌగోళిక ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న పారిశ్రామిక వస్తువుల విలువ, వసూలవుతున్న కార్పొరేట్ సుంకాల విలువ, వినియోగమవుతున్న విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక ఉపాధి పరిమాణం మొదలైన సూచికల ఆధారంగా పారిశ్రామిక మండలాలను గుర్తించవచ్చు. భారతదేశంలో ఆరు ప్రధాన పారిశ్రామిక మండలాలు ఉన్నాయి. అవి:

- ముంబై-పుణె మండలం
- హుగ్లీ బేసిన్ మండలం
- చోటా నాగపూర్ మండలం
- ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం
- అహ్మదాబాద్-వడోదర మండలం
- చెన్నై-మధురై-కోయంబత్తూరు మండలం

ముంబై-పుణె మండలం

ముంబై-పుణె, హుగ్లీ బేసిన్ మండలాలు స్వాతంత్ర్యానికి ముందే అభివృద్ధి చెందాయి. మిగతా నాలుగు మండలాలు ప్రధానంగా స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందాయి. మహారాష్ట్రలో విస్తరించిన ముంబై-పుణె మండలం దేశంలోకెల్లా అతి పెద్ద, అత్యాధునిక పారిశ్రామిక మండలం. స్వాతంత్ర్యానికి పూర్వమే నూలు వస్త్ర పరిశ్రమ స్థాపనతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఇప్పటికీ నూలు వస్త్ర పరిశ్రమను ఈ మండలానికి వెన్నుముకగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యం తర్వాత ఈ మండలంలో పారిశ్రామిక వైవిధ్యం సంభవించింది. ఆటోమొబైల్, చమురు శుద్ధి, కాగితం, ఇంజనీరింగ్, రసాయనాలు తదితర పరిశ్రమలు ఇక్కడ అభివృద్ధి చెందాయి. ముంబై మెట్రోపాలిటన్ నగరం ఈ పారిశ్రామిక మండల కేంద్రం. కళ్యాణ్, పుణె, కొల్హాపూర్, ఉలాస్‌పూర్, థానే, నాగాథానే, ట్రాంబే మొదలైన పారిశ్రామిక పట్టణాలు ఈ మండలం కిందకు వస్తాయి.

ముంబై రేవుపట్టణం, సహ్యాద్రి కొండల్లోని జలవిద్యుచ్ఛక్తి సామర్థ్యం, పటిష్టమైన రవాణా వ్యవస్థ, బ్యాంకింగ్ రంగం, స్థానిక పెట్టుబడి సామర్థ్యత, రాష్ట్ర ప్రభుత్వ ఉదారవాద విధానాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేస్తున్న అనుకూలాంశాలు. విపరీతంగా పెరుగుతున్న భూమి ధరలు, కాలుష్యం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి.

హుగ్లీ బేసిన్ మండలం

స్వాతంత్ర్యానికి పూర్వమే కలకత్తా నగర పరిసర ప్రాంతాల్లో హుగ్లీ బేసిన్ పారిశ్రామిక మండలం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. కలకత్తా నదీరేవు పట్టణం కావడం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి ప్రాథమిక దశలో కీలక పాత్ర పోషించింది.

మొదట జనపనార పరిశ్రమ అభివృద్ధితో ప్రారంభమై క్రమంగా ఆటోమొబైల్, భారీ యంత్ర పరికరాలు, వినిమయ వస్తువులు, రసాయనాలు, కాగితం, పెట్రో రసాయన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. హౌరా, డమ్‌డమ్, సాల్ట్ లేక్ సిటీ, రిస్రా, ఆగర్‌పారా, సెరామ్‌పూర్, చందర్ నాగోర్, ఫోర్ట్‌గ్లాస్టర్, లీలూ, బడ్జ్ బడ్జ్ అసన్‌సోల్, హల్దియా మొదలైనవి ఈ బేసిన్‌లో ముఖ్య పారిశ్రామిక పట్టణాలు.

దేశంలో మొదటి జనపనార కర్మాగారాన్ని రిస్రాలో స్థాపించారు. సమీపంలోని ఝరియా, రాణిగంజ్ బొగ్గు క్షేత్రాలు, జల రవాణా వ్యవస్థలు, అధిక జనసాంద్రత, కలకత్తా రేవుపట్టణం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేశాయి. రేవులో పూడిక సమస్య, తీవ్రమైన పారిశ్రామిక వివాదాలు, అతివాద ట్రేడ్ యూనియన్ ధోరణులు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ఇటీవల ప్రధాన అడ్డంకులుగా మారాయి. దీంతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి కుంటుపడింది.

చోటానాగపూర్ మండలం

ఇది దేశంలోని ఏకైక ఖనిజాధారిత పారిశ్రామిక మండలం. చోటానాగపూర్ పీఠభూమిలో పరిశ్రమలకు అవసరమైన ఖనిజ నిల్వలు విస్తారంగా ఉన్నాయి. దామోదర్ నదీలోయలోని బొగ్గు క్షేత్రాలు (బొకారో, గిర్ది, ఝరియా), హజారీబాగ్-సింగ్‌భమ్ ప్రాంతాల్లోని ఇనుము, బాక్సైట్, రాగి మొదలైన లోహ ఖనిజాలు పరిశ్రమలను ఆకర్షించాయి. గనుల తవ్వకం ఈ మండలంలో పెద్ద పరిశ్రమగా రూపొందింది. భారత ప్రభుత్వం స్థాపించిన వివిధ భారీ ప్రభుత్వ రంగ కర్మాగారాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాయి. రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (HEC), సింద్రీలోని ఎరువుల కర్మాగారం (FCI), బరేనీలోని చమురు శుద్ధి కర్మాగారాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇవేకాకుండా సిమెంట్ కర్మాగారాలు (చేబాసా), ఇనుము- ఉక్కు కర్మాగారాలు (బొకారో, జంషెడ్‌పూర్) ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందాయి. పటిష్టమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు లేకపోవడం ఈ మండలం అభివృద్ధికి ప్రధాన ఆటంకం. ఈ పారిశ్రామిక మండలంలోని భారీ ప్రభుత్వ రంగ సంస్థలకు అనుసంధానాలు లేకపోవడం వల్ల స్థానిక పారిశ్రామిక పట్టణాలు సమగ్ర ప్రాంతీయాభివృద్ధికి ఉపకరించడంలో విఫలమయ్యాయి. పారిశ్రామికాభివృద్ధి స్థానికులకు ఉపాధి చూపలేకపోయింది.

ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం

ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరం కేంద్రంగా 1970వ దశకం నుంచి పారిశ్రామికాభివృద్ధి ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రధాన రైలు మార్గాలు, జాతీయ రహదారులు ఢిల్లీ నగరంలో అభిసరణం చెందడం, విస్తార స్థానిక మార్కెట్, సమీపంలోని సారవంతమైన వ్యవసాయ ప్రాంతం ఈ మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. వ్యవసాయాధార పరిశ్రమలైన చక్కెర, నూలు వస్త్రాల తయారీతో ప్రారంభమై క్రమంగా పారిశ్రామిక వైవిధ్యం ఏర్పడింది. ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరంలో కాల్కా, షాదారా, నోయిడా, గుర్గావ్ ప్రాంతాల్లో ఆటోమొబైల్, ఇంజనీరింగ్, వినిమయ వస్తువుల తయారీ కేంద్రీకృతమైంది. ఆగ్రా, మధుర, ఘజియాబాద్, యమునానగర్ మొదలైనవి ఇతర పారిశ్రామిక కేంద్రాలు.

అహ్మదాబాద్-వడోదర మండలం

గుజరాత్‌లోని అహ్మదాబాద్-వడోదర మండలంలో పారిశ్రామికాభివృద్ధి 1970వ దశకం నుంచి వేగం పుంజుకుంది. అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్, జామ్‌నగర్, వల్సాస్, ఆనంద్, భరోచ్ ఈ ప్రాంతంలోని పారిశ్రామిక పట్టణాలు. నూలు వస్త్రాలు, చమురు శుద్ధి, పెట్రో రసాయనాలు, ఇంజనీరింగ్, సిమెంట్ మొదలైన పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. 'వడోదర'ను భారతదేశ పెట్రో రసాయనాల రాజధానిగా అభివర్ణిస్తారు. కంబత్ సింధు శాఖలో బయల్పడిన చమురు, సహజ వాయు నిక్షేపాలు, సారవంతమైన కథియావాడ్ వ్యవసాయ ప్రాంతం, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈ మండల అభివృద్ధికి దోహదం చేశాయి.

చెన్నై - మధురై - కోయంబత్తూరు మండలం

తమిళనాడులో పారిశ్రామికాభివృద్ధి మొదట చెన్నై పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. దీనికి చెన్నై రేవుపట్టణం ఉపయోగపడింది. మెట్టూరు, శివ సముద్రాల్లో జలవిద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాల అభివృద్ధి, నైపుణ్యం ఉన్న శ్రామికుల లభ్యత ఈ మండలానికి అనుకూలించే అంశాలు. కోయంబత్తూరులో నూలు వస్త్ర పరిశ్రమలు కేంద్రీకృతమవడంతో ఈ నగరం 'దక్షిణ భారత మాంచెస్టర్'గా అవతరించింది. ఇక్కడ ఇంజనీరింగ్, సిమెంటు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాయి. మధురై, ఈరోడ్, తిరుప్పూర్, సేలం మొదలైనవి ఇతర పారిశ్రామిక పట్టణాలు

3 దేశంలో దుర్భిక్షానికి కారణాలు!

దేశంలో ప్రధానంగా ముడు రకాల కారణాల వల్ల దుర్భిక్షం ఏర్పడే అవకాశాలున్నాయి.

అవి

1. శీతోష్ణస్థితి సంబంధ కారణాలు
2. హైడ్రోలాజికల్ కారణాలు
3. మానవ జోక్యం

శీతోష్ణస్థితి సంబంధ కారణాలు

శీతోష్ణస్థితి పరంగా దుర్భిక్షానికి కారణాలు..

ఎ) నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించడం

బి) నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయం కంటే ముందే తిరోగమించడం

సి) నైరుతి రుతుపవనాల్లో అంతరాయం

సాధారణంగా జూన్ ఒకటో తేదీకల్లా నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి జూలై 15కల్లా దేశమంతటా విస్తరిస్తాయి. కానీ కొన్నిసార్లు రుతుపవనాలు ఆలస్యంగా రావడం, నెమ్మదిగా విస్తరించడం వల్ల వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయానికే చేరినప్పటికీ, మధ్యలో అంతరాయం ఏర్పడుతుంది. రుతుపవనాలు క్రియాశీలకంగా ఉండని దశ 15-20 రోజుల కంటే ఎక్కువగా ఉంటే దుర్భిక్షానికి దారితీస్తుంది. ముఖ్యంగా జూలైలో రుతుపవనాలు క్రియాశీలకంగా లేకపోవడం లేదా అంతరాయం సంభవిస్తే ఖరీఫ్‌లో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఇది 'వ్యవసాయ దుర్భిక్షానికి' దారి తీస్తుంది.

సాధారణంగా అక్టోబర్ రెండో వారంకల్లా నైరుతి రుతుపవనాలు దేశం నుంచి తిరోగమిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఇవి సెప్టెంబర్ మొదటి వారానికే తిరోగమిస్తాయి. దీంతో వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం సంభవిస్తుంది. అనేక సంక్లిష్ట అంశాల వల్ల రుతుపవనాల్లో అనిశ్చితి ఏర్పడుతుంది. ఎల్‌నినో, ఈక్వినూ లాంటి దృగ్విషయాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో స్థానికంగా ఏర్పడే అధిక పీడన మండలాలు, హిమాలయాల్లోని మంచు, గ్లోబల్ వార్మింగ్ లాంటి అంశాలు నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుండటంతో దుర్భిక్షం తలెత్తుతోంది.

హైడ్రోలాజికల్ కారణాలు

కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం సరిపడా ఉన్నప్పటికీ హైడ్రోలాజికల్ కారణాల వల్ల అనావృష్టి ఏర్పడవచ్చు. ఉదాహరణకు చోటానాగపూర్ పీఠభూమికి చెందిన జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో 100 సెం.మీ.కు పైగా వర్షం కురుస్తుంది. కానీ పురూలియా, పలమావు, బొలంగీర్, కాళహంది ప్రాంతాల్లో తరచుగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కురిసిన వర్షపు నీటిని ఉపరితలంపై నిల్వ ఉంచే భూస్వరూపాలు లేకపోవడంతో వర్షపు నీరు వృథాగా సముద్రంలోకి చేరుతోంది. నైసర్గిక స్వరూపం కఠిన శిలలతో కూడి ఉండటం వల్ల వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకిపోవడం చాలా తక్కువ. దీంతో భూగర్భ జలాలు కూడా ఎక్కువ లోతులో ఉండి అనావృష్టి ప్రభావం తీవ్రమవుతోంది.

మానవ జోక్యం

ఇటీవల దుర్భిక్ష ప్రాంతాల సంఖ్య మరింతగా పెరుగుతోంది. దుర్భిక్షం తరచుగా సంభవిస్తోంది. కరవు తీవ్రత కూడా అధికమవుతోంది. పర్యావరణంలో మానవ జోక్యమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధునాతన పద్ధతిలో భారీ యంత్రాలను విరివిగా ఉపయోగించి వ్యవసాయ, నిర్మాణ కార్యకలాపాలను చేపడుతుండటం వల్ల ఉపరితల ప్రవాహ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. దీంతో ఉపరితల జలవనరులు కుచించుకుపోయి అనావృష్టి సమస్య అధికమవుతోంది. అడవులను విచక్షణారహితంగా నరికివేయడంతో జలాలు ఇంకిపోయే రేటు తగ్గి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. కరవు పీడిత ప్రాంతాల్లో అధిక నీటి వసతి అవసరమయ్యే పంటల సాగు వల్ల కూడా అనావృష్టి సంభవిస్తోంది. గత రెండు దశాబ్దాల నుంచి సంభవిస్తోన్న దుర్భిక్షం ప్రధానంగా మానవ ప్రేరేపితమైందని శాస్త్రవేత్తల అభిప్రాయం.

దేశంలో సుమారు 40 శాతం భౌగోళిక ప్రాంతాన్ని దుర్భిక్ష పీడిత ప్రాంతంగా వర్గీకరించారు. ఇరిగేషన్ కమిషన్ మొదటిసారిగా దుర్భిక్షాన్ని నిర్వచించి, దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించింది. 50సెం.మీ. కంటే తక్కువ సగటు వార్షిక వర్షపాతాన్ని పొందుతూ వర్షపాత పరిమాణంలో 50 శాతం కంటే ఎక్కువ విచలనం ఉన్న ప్రాంతాలను కరవు పీడిత ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఇటీవల దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించడానికి పంటల దిగుబడుల్లో క్షీణత, సాగు భూమి విస్తీర్ణంలో క్షీణతలనూ ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.

పశ్చిమ రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లోని కచ్ ప్రాంతాలను నిరంతర అనావృష్టి పీడిత ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతాల్లో సగటు వార్షిక వర్షపాతం 30 సెం.మీ. కంటే తక్కువగా ఉంటుంది. విచలనం 70 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. సహ్యాద్రి పర్వత వర్షచ్ఛాయా ప్రాంతం తీవ్ర దుర్భిక్ష పీడిత మండలం కిందకు వస్తుంది. మరాట్వాడా, విదర్భ(మహారాష్ట్ర), ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమలు ఈ మండలం కిందకు వస్తాయి. జార్ఖండ్‌లోని పలమావు, పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా, ఒడిశాలోని బొలంగీర్, కాళహంది, మధ్యప్రదేశ్‌లోని జబువా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బుందేల్‌ఖండ్ ప్రాంతాలను ఓ మోస్తరు అనావృష్టి పీడిత ప్రాంతాలుగా గుర్తించారు.

కళ్లకు కట్టిన ఆకాంక్షలు!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ క్రమంలో ప్రభుత్వాలు నియమించిన కమిటీలు... వాటి నివేదికలు ఎంతో కీలకంగా నిలిచాయి. తొలి దశ నుంచి మలి దశ ఉద్యమం వరకు ఈ కమిటీల నివేదికలు, సిఫార్సులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయానికి దోహదపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్రూప్స్ అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఈ ప్రాంత హక్కులు, ప్రజల ఆకాంక్షలకు సంబంధించి ఆయా కమిటీల నివేదికలు...

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

సామాజిక సమస్యల పరిష్కారానికి కమిటీల ఏర్పాటు, అవి అందించే నివేదికలు, వాటిలో పొందుపర్చిన సిఫార్సుల ఆధారంగా చర్యలు తీసుకోవడం సాధారణంగా జరిగే పరిణామం. తెలంగాణ విషయంలోనూ వివిధ కమిటీల నివేదికలు ఎంతో కీలక పాత్ర పోషించాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను ఇవి కళ్లకు కట్టాయి. కొన్ని కమిటీలు తెలంగాణ ప్రాంతంలోని సీమాంధ్ర ప్రాంత వాసుల ఆందోళనల గురించి ప్రస్తావించినప్పటికీ... అధిక శాతం కమిటీలు తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నివేదించాయి.

ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో కమిటీ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న యూపీఏ ప్రభుత్వం 2004 నవంబర్‌లో ఒక ఉపసంఘాన్ని నియమించింది. దీనికి ప్రణబ్ ముఖర్జీ ఛైర్మన్. రఘువంశ ప్రసాద్ సింగ్, దయానిధి మారన్‌లు సభ్యులు. గుర్తింపు పొందిన అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల మధ్య తెలంగాణ అంశంపై సర్వసమ్మతి తీసుకురావడానికి ఈ కమిటీ ప్రయత్నించింది. రాష్ట్రంలోనూ తెలంగాణ అంశంపై అప్పటి ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖరరెడ్డి.. సీనియర్ కేబినెట్ మంత్రి కె.రోశయ్య నాయకత్వంలో సబ్ కమిటీని నియమించారు.

శ్రీకృష్ణ కమిటీ ప్రత్యేకం

పార్లమెంటులో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ 2009 నవంబర్ 29న టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. తదనంతర పరిణామాలతో కేంద్ర హోంశాఖ మంత్రి పి. చిదంబరం 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలు పెడతామని ప్రకటించారు. కానీ తర్వాత సీమాంధ్ర నుంచి వచ్చిన ఒత్తిళ్లతో 2009 డిసెంబర్ 23న ఆయన రెండో ప్రకటన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల, సంఘాల సంప్రదింపులను పరిశీలించిన తర్వాతే రాష్ట్ర విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దీంతో తెలంగాణలో ఉద్యమం ఊపందుకుంది. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. తెలంగాణ ప్రజలు అనేక రూపాల్లో నిరసనను తెలిపారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు, సాధ్యాసాధ్యాలపై.. యూపీఏ ప్రభుత్వం 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో కమిటీని నియమించింది. దీనిలో ప్రొఫెసర్ రణబీర్ సింగ్(వైస్ చాన్సలర్, నేషనల్ లా యూనివర్సిటీ – ఢిల్లీ), డాక్టర్ అబుసలే షరీఫ్ (చీఫ్ ఎకనామిస్ట్/సీనియర్ రీసెర్చ్ ఫెలో, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్, ఢిల్లీ), ప్రొఫెసర్ రవీందర్ కౌర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్- ఐఐటీ, ఢిల్లీ), వినోద్ కుమార్ దుగ్గల్ (కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి) సభ్యులు. ఈ కమిటీ 2010 డిసెంబర్ 30న తన నివేదికను కేంద్ర హోంశాఖకు అందజేయగా.. 2011 జనవరి 6న కేంద్ర ప్రభుత్వం ఈ నివేదికను అందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఈ కమిటీ సమర్పించిన నివేదిక అత్యంత ప్రత్యేకమైనదిగా పేర్కొనొచ్చు.

క్షేత్రస్థాయిలో అధ్యయనం

తెలంగాణ ఏర్పాటు పరంగా ఇతర కమిటీలతో పోల్చితే శ్రీకృష్ణ కమిటీ ప్రత్యేకత క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడం! సమస్య మూలాలను తెలుసుకోవడానికి తెలంగాణ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో సైతం కమిటీ పర్యటించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాల్లోనూ కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా కమిటీ వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి మద్దతు, సహకారం, విలువైన సమాచారం పొందింది. తన నివేదికలో హైదరాబాద్‌ను మినహాయిస్తే తెలంగాణలోని మిగిలిన ప్రాంతాలన్నీ ఎంతో వెనుకబాటుతనంతో మగ్గుతున్నాయని కమిటీ పేర్కొంది.

అభిప్రాయాల స్వీకరణ

శ్రీకృష్ణ కమిటీ పనితీరులో మరో ముఖ్యాంశం.. కేవలం కమిటీ సభ్యులే ఆయా ప్రాంతాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికే పరిమితం కాలేదు. తెలంగాణ ప్రాంతంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు స్వీకరించే విధంగా వ్యవహరించింది. ఈ క్రమంలో అరవై వేలకుపైగా అభిప్రాయాలు సేకరించింది. వాటన్నింటినీ క్షుణ్నంగా అధ్యయనం చేసింది. శ్రీకృష్ణ కమిటీ అధ్యయన క్రమంలో.. సాధారణ ప్రజానీకం, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు.. ఇలా అన్ని వర్గాలతో వేర్వేరుగా సంప్రదింపులు జరిపింది. దళిత సంఘాలు, చర్మకార, ఇతర వృత్తులకు చెందిన వ్యక్తులు మొదలు న్యాయవాదులు, రాజకీయ పార్టీలు, జర్నలిస్ట్‌లు, ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయశాఖ సిబ్బంది, ఆయా సంఘాలు–వాటికి సంబంధించి ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీలతో చర్చించి తెలంగాణ ఆకాంక్ష గురించి ప్రత్యేకంగా తెలుసుకునే యత్నం చేసింది. తెలంగాణ రాష్ట్ర సమితి, తెలుగుదేశం, ప్రజారాజ్యం, కాంగ్రెస్‌పార్టీ, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం.. ఇలా అన్ని రాజకీయ పార్టీలతో వేర్వేరుగా సంప్రదింపులు జరిపి వారి నుంచి అభిప్రాయాలను సేకరించింది.

జేఏసీలతో సంప్రదింపులు

తెలంగాణ ప్రత్యేక ఉద్యమం నేపథ్యంలో ఏర్పాటైన ఆయా రంగాలు, వృత్తులకు సంబంధించిన జాయింట్ యాక్షన్ కమిటీలతోనూ ప్రత్యేకంగా వేర్వేరుగా శ్రీకృష్ణ కమిటీ చర్చించింది. స్టూడెంట్ జేఏసీలు మొదలు; పొలిటికల్ జేఏసీ వరకు తెలంగాణలో ఉన్న అన్ని జేఏసీల అభిప్రాయాలు స్వీకరించేందుకు కృషి చేసింది. తెలంగాణ ప్రాంత వర్గాల నుంచే కాకుండా సీమాంధ్ర ప్రాంత వర్గాల నుంచి కూడా అభిప్రాయాలు స్వీకరించింది. ఈ క్రమంలోనే సీమాంధ్రకు చెందిన వారి అభిప్రాయాలకు కమిటీ నివేదికలో పెద్దపీట లభించిందనే ఆరోపణ ఉంది. అలాగే ఈ కమిటీ చేసిన నివేదికలు తెలంగాణ ఆకాంక్షకు వ్యతిరేకంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – తెలుగు ప్రాంతాలకు సంబంధించి చేసిన ఆరు సిఫార్సుల్లో ఒక్కటి కూడా తెలంగాణకు ఆమోదయోగ్యంగా లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం.. సిఫార్సులు ఎలా ఉన్నప్పటికీ.. తెలంగాణలోని వాస్తవ పరిస్థితులను, వెనుకబాటుతనాన్ని నివేదికలో పొందుపర్చి శ్రీకృష్ణ కమిటీ ఈ ప్రాంత సమస్యలను వెలుగులోకి తెచ్చిందన్నది వాస్తవం. ఉదాహరణకు హైదరాబాద్‌ను మినహాయిస్తే తెలంగాణలోని మిగతా తొమ్మిది జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రణాళిక సంఘం గుర్తించిన వైనాన్ని.. అదే విధంగా ఈ తొమ్మిది జిల్లాల్లో 87 శాతం ప్రజలు వెనుకబాటుతనంతో ఉన్నారని ప్లానింగ్ కమిషన్ పేర్కొన్న విషయాన్ని శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో ఉటంకించింది. అదే విధంగా 610 జీవో ఉల్లంఘనను సైతం ప్రస్తావించింది. 1975 నుంచి 2005 మధ్య కాలంలో 610 జీవో నిబంధనల అమలు తీరు, తెలంగాణ ప్రాంత ఉద్యోగులు వివక్షకు గురైనట్లు పేర్కొంది. శ్రీకృష్ణ కమిటీ వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అభిప్రాయాలను సేకరించి 2010 డిసెంబర్ 30న నివేదికను సమర్పించింది. శ్రీకృష్ణ కమిటీ తెలంగాణ విషయంలో ఆరు రకాల ప్రత్యామ్నాయాలను ముందుకు తెచ్చింది. అవి..



1. రాష్ట్రాన్ని విభజించకుండా ఉంచుతూ, తెలంగాణ ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం, రాజకీయ సాధికారత కోసం రాజ్యాంగబద్ధమైన తెలంగాణ రీజనల్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేయడం
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నది ఉన్నట్లుగా యథాతథ స్థితి కొనసాగింపు.
3. ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణ; రాయలసీమకోస్తాంధ్రాలుగా రెండు రాష్ట్రాలుగా విభజించడం; హైదరాబాద్‌ను ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతం చేయడం. దీనికి నల్లగొండ జిల్లా ఆగ్నేయంగా కోస్తా ఆంధ్రలోని గుంటూరుకు, మహబూబ్‌నగర్ జిల్లా ద్వారా దక్షిణంవైపు రాయలసీమలోని కర్నూలుకు భౌగోళిక అనుసంధానం చేయడం.
4. ఆంధ్రప్రదేశ్‌ను.. రాయలసీమ తెలంగాణ ప్రాంతాలు కలిపి రాయల తెలంగాణగా, కోస్తా ఆంధ్రాగా విభజించడం, హైదరాబాద్‌ను రాయల తెలంగాణాలో అంతర్భాగం చేయడం.
5. తెలంగాణ, రాయలసీమ–ఆంధ్రా ప్రాంతాలను రెండు రాష్ట్రాలుగా విభజించడం, విస్తరించిన హైదరాబాద్‌ను ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం.
6. తెలంగాణ, రాయలసీమ–కోస్తాంధ్రలను ప్రస్తుతమున్న జిల్లా సరిహద్దులను దృష్టిలో ఉంచుకొని రెండు రాష్ట్రాలుగా విడగొట్టి, హైదరాబాద్‌ను తెలంగాణకు రాజధానిగా ప్రకటించడం; మిగిలిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధాని ఏర్పాటు చేయడం.

❖ ఇక కమిటీ స్వయంగా చేసిన వ్యాఖ్య ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను తెలుపుతుంది. అది.. In view of the complex background of the situation and the rather serious and sensitive emotional aspects involved, the committee is of the unanimous view that it would not be practical to simply maintain the status quo in respect of the situation.

అంటే.. సున్నితమైన, భావోద్వేగాలతో కూడిన క్లిష్టమైన అంశాలు ఉన్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో యథాతథస్థితిని కొనసాగించడం ఆచరణలో సులభ సాధ్యం కాదని కమిటీ ఏకగ్రీవ అభిప్రాయంగా స్పష్టం చేసింది. ఇలా.. తుది నివేదికలో ఎలాంటి సిఫార్సులు చేసినా.. ఎనిమిదో చాప్టర్ విషయంలో వివాదాస్పదమైనప్పటికీ శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదిక, అందులోని సిఫార్సులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను జాతీయ స్థాయిలో ప్రతిబింబించాయి.

ఆంటోని కమిటీ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష, ఏర్పాటు క్రమంలో మరో ముఖ్యమైన కమిటీ.. ఎ.కె. ఆంటోని కమిటీ. శ్రీ కృష్ణ కమిటీ నివేదిక తర్వాత పరిణామ క్రమంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఎ.కె. ఆంటోని నేతృత్వంలో నలుగురు సభ్యుల కమిటీని నియమించింది. ఎ.కె. ఆంటోనితోపాటు అప్పటి కేంద్ర మంత్రులు వీరప్ప మొయిలీ, దిగ్విజయ్ సింగ్, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్‌లు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ కూడా తెలంగాణ, సీమాంధ్ర ప్రాంత నాయకుల అభిప్రాయాలు సేకరించి నివేదిక అందించింది.

ప్రజాస్వామ్య భావాలు ప్రస్ఫుటం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కమిటీలు, నివేదికలను మినహాయిస్తే అత్యంత ప్రధానంగా గమనించాల్సిన అంశం ప్రజాస్వామ్య భావాలు ప్రస్ఫుటమైన విధానాలు. భావ స్వేచ్ఛ, వ్యక్తి స్వేచ్ఛ, ప్రాంతీయ స్వేచ్ఛ వంటి ప్రజాస్వామ్య భావాలు బలంగా కనిపించాయి. ఇందుకు జాయింట్ యాక్షన్ కమిటీలే ఉదాహరణలు.

పార్టీలను నడిపించిన జేఏసీలు

ఒక విధంగా తెలంగాణ ఉద్యమ క్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీలే పార్టీలను నడిపించాయని చెప్పొచ్చు. వాస్తవంగా రాజకీయ పార్టీలతో తెలంగాణ ఉద్యమం ఆరంభమైనప్పటికీ.. తర్వాత క్రమంలో ఏర్పడిన జేఏసీలు ఆ రాజకీయ పార్టీల ఉనికికి ఎంతో తోడ్పడ్డాయి. ఒక విధంగా మార్గనిర్దేశం చేశాయి. జేఏసీల మద్దతు లేకుండా పార్టీలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు సైతం ఏర్పడ్డాయి. తెలంగాణ ఏర్పాటులో జేఏసీల పాత్ర ప్రశంసనీయం!!.

What is the code name for 'WINDOWS 95'?

Computer Network

A computer network consists of two or more autonomous computers that are connected together in order to share resources(files, printers, modem etc), share application, allow electronic communication etc.

A computer network includes the network operating system in the client and server machines, the cables, which connect different computers and all supporting hardware in between such as bridges, routers & switches. In wireless system, antennas and towers are also part of the network.

Types of Computer Network: Computer network are generally classified according to their structure and the area.

Local Area Network (LAN)

In LAN, computers are connected locally within a room, building or in a small area. LAN can range from simple (two computers) to complex (hundred of computers and peripherals). LANs connect workstations and personal computers. User can share data as well as devices like printers, fax etc and can use LAN to communicate with each other, by sending e-mail or chatting.

Examples of LAN Technology: Ethernet, Token Ring, and Fiber Distributed Data Interconnect (FDDI).

Characteristics of LAN are:

- Configured to small area i.e. it connects several devices over a distance of 5 to 10 KM.
  - High Speed
  - Low error rates
  - Data and hardware sharing between users.
  - Operates at speed ranging from 10 Mbps to 100 Mbps. Now a day's 1000 Mbps are available.

Network Topology

Topology is physical arrangement of computer system in a network. Or refers to the shape of networks. Some of the most common network topologies are

Bus topology

In bus topology, all devices are connected to a central cable, called the bus or backbone. The bus topology connects workstations using a single cable. Each workstation is connected to the next workstation in a point to point fashion. All workstation connect to the same cable. An extension to the bus topology is tree topology.



BANK EXAMS

COMPUTER AWARENESS

Advantage of Bus topology: Installation is easy and cheap. Connections are simple and easy to use. Data can be transmitted from the both sides.

Disadvantage of Bus topology: A single fault in the cable stops all transmission. Fault identification is difficult.

Ring topology

In ring topology, all devices are connected to one another in the shape of a closed loop; so that each device is connected directly to each other i.e. the ring topology connects workstations in a closed loop. Data is transmitted around the ring in one direction only. Each station passing on the data to the next station till it reaches its destination. The common implementation of this topology is token ring.

Advantage of Ring topology: Easy to install and modify the network and fault isolation is simplified.

Disadvantage of Ring Topology: Adding or removing computer disrupts the entire network. A break in the ring can stop the transmission in the entire network. Finding fault is difficult.

Star Topology

Star topology uses a central hub through which, all components are connected. A central hub is the host computer and at the end of each connection is a terminal. Communication on the connecting links between the stations and the central station of star topology can be bi-directional and are point to point.

Advantage of Star Topology: Expansion or modification is easy. Single computer failure does not affect the network.

Disadvantage of Star Topology: Failure in the central hub brings the entire network to halt.

Tree topology

Tree topology is LAN topology in which only one route exists between any two nodes on the network. It is similar to the star topology but the nodes are connected to the secondary hub, which in turn is connected to the central hub.

Advantage of Tree Topology: Installation and configuration of tree network is easy. Less expensive when compared to mesh topology.

Disadvantage of tree Topology:

Failure in central hub brings the entire network to a halt. More cabling is required when compared to bus topology.

Mesh topology

Devices are connected with many redundant interconnections between network nodes. In a well connected topology, every node has a connection to every other node in the network. Mesh topology are used in critical connection of host computers [typically telephone exchange]. Alternate path allow each computer to balance the load to other computer systems in the network by using more than one connection path available.

Advantage of Mesh topology:

Failure in one of the computers does not affect the entire network. Privacy between computers is maintained as messages travel along dedicated path.

Disadvantage of Mesh Topology:

Amount of caballing required is high. A large number of I/O ports are required

MODEL BITS

1. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is ____.
   1) Generalization
   2) Inheritance
   3) Encapsulation
   4) Information hiding
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting ____.
   1) Primary keys and their relationships
   2) Primary keys and their relationships to instances
   3) Entity classes and their relationships
   4) Entity classes and their relationships to primary keys
   5) None of these
3. ____ is a primary key of one file that also appears in another file.
   1) Physical key 2) Primary key
   3) Foreign key
   4) Logical key
   5) None of these
4. SMTP, FTP and DNS are applications of the ____ layer.
   1) Data link 2) Network
   3) Transport 4) Application
   5) None of these
5. Which of the following is the smallest and fastest computer imitating human brain working?
   1) Supercomputer
   2) Quantum Computer
   3) Param-10,000 4) IBM chips
   5) None of these
6. Which of the following statement is wrong?
   1) Windows XP is an operating system
   2) Linux is owned and sold by Microsoft
   3) Photoshop is a graphical design tool by Adobe
   4) Linux is free and open source software
   5) None of these
7. What is the full form of SDRM?
   1) Shift Dynamic random access memory
   2) Synchronous Dynamics random access memory
   3) System Dynamic random access memory
   4) Serial Dynamic random access memory
   5) Synchronous Dynamic random access memory
8. First microprocessor was used in which of the following?
   1) Computer 2) Calculator
   3) Telephones 4) Printers
   5) None of these
9. Which of the following transforms input data into output data?
   1) Peripherals 2) RAM
   3) ROM
   4) CPU 5) None of these
10. BSNL, Reliance, Shaw cable, AOL, Tata Indicom all can be kept in which one of the following groups?
    1) ISDN 2) IRC 3) ISP
    4) ICONS
    5) None of these
11. In windows XP, which shortcut is used you lock the computer?
    1) Ctrl + L 2) Windows Key + k
    3) Ctrl + K 4) Scroll Lock key
    5) Windows Key + L
12. What is a 'tuple'?
    1) Another name for a table in an RDBMS.
    2) Another name for the key linking different tables in a database.
    3) Initial seed value of field.
    4) A row or record in a database table.
    5) An attribute attached to a record
13. A spooler is a (n):
    1) Location in memory that maintains the contents of a document until it prints out
    2) Print job
    3) Program that coordinates the print jobs that are waiting to print
    4) Message sent from the printer to the operating system when a print job is completed
    5) None of these
14. A scientific institution performing intensive mathematical operations for a complex model that required extremely powerful computing capabilities will most likely use a (n):
    1) Supercomputer 2) PC
    3) Mainframe 4) ISP
    5) None of these
15. The process ___ involves automated study of consumer buying patterns in order to support marketing, inventory replenishment and pricing decisions.
    1) Transaction processing
    2) Data mining
    3) Simulation
    4) Information processing
    5) None of these
16. Press the ___ button to have the window fill the entire screen.
    1) Close
    2) Maximize
    3) Minimize
    4) All of the above
    5) None of these
17. What is the code name for 'WINDOWS 95'?
    1) Snowball 2) Chicago
    3) Win ball 4) Sparta
    5) None of these
18. Which is not a language processor?
    1) Compiler 2) Interpreter
    3) Processor 4) Assembler
    5) None of these
19. The first part of a complete URL is the needed to access the web resource.
    1) Address 2) Name
    3) Location 4) Protocol
    5) None of these
20. ____ is known as POS scanner.
    1) Bar code reader
    2) Magnetic stripe reader
    3) MICR 4) OCR
    5) None of these

KEY

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 5	8) 2	9) 4	10) 3
11) 5	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 2	18) 3	19) 4	20) 1